

‘ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 91

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇంగ్లండ్ 209/3

హెడింగ్లీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 471 పరుగులకు ఆలౌట్ అయింది... రిషభ్ పంత్ సెంచరీతో చెలరేగాడు.

- వివరాలు 14లో



ఎనీ ఎమర్జెన్సీ.. డయల్ 112

అగ్ని ప్రమాదమైనా.. రోడ్డు ప్రమాదమైనా.. వ్యక్తిగత భద్రతకు భంగం వాటిల్లినా.. ఒక్కటే తారక మంత్రం.. అదే డయల్ 112.

- వివరాలు 16లో



డబ్బుల్లేవు.. కొత్త పథకాలెట్లా?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వ వర్గాల్లో చర్చ
ప్రస్తుత పథకాల అమలుకే నానా కష్టాలు..
రూపాయి రూపాయి పోగేయాల్సి వస్తున్న వైనం

- కొత్త పథకాలు ఇప్పట్లో సాధ్యం కానట్టే అంటున్న ఆర్థిక శాఖ వర్గాలు
- నిధుల లేమితోనే రాజీవ్ యువ వికాసం నిలుపుదల?
- పింఛన్ల పెంపులాంటి నిర్ణయాలకూ వెనుకంజ అందుకే..
- ప్రతినెలా ఖజానాకు వచ్చే రాబడిని మించి ఖర్చవుతున్న వైనం
- రాబడి రూ. 16,473 కోట్లు.. ఖర్చు రూ. 17 వేల కోట్లకు పైనే..
- భూముల అమ్మకాలు జరిగితేనే అదనపు ఆదాయం!
- ‘నియోపొలిస్’, హెచ్ఎండీఏ భూములపై సర్కారు ఆశలు
- 18 నెలల్లో రూ. 15వేల కోట్లు రాబట్టుకునే యోచన

సాక్షి, హైదరాబాద్

ప్రస్తుతం అమల్లో ఉన్న పథకాలకే నానా కష్టాలు పడుతూ డబ్బులు సమకూర్చుకుంటున్న నేపథ్యంలో..ఇక కొత్త సంక్షేమ పథకాల అమలు ఇప్పట్లో సాధ్యం కాదనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. ఆర్థిక కటకట నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలు నిలిపివేయాలంటూ మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రతి నెలా ఖజానాకు వస్తున్న ఆదాయంతో అనివార్యంగా చేయాల్సిన ఖర్చుల సర్దుబాటు మాత్రమే జరుగుతోందని, ఇక ప్రస్తుతం అమల్లో ఉన్న పథకాలకు పెద్ద మొత్తంలో నిధులు అవసరమైనప్పుడు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని గుర్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఆసరా పింఛన్లను పెంచి ఎన్నికలకు వెళ్లాలనుకున్నా సాధ్యం కాలేదని, రైతు భరోసా నిధులు జమ చేసేందుకు మాత్రమే వెసులుబాటు దొరికిందని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు ఆదాయం కావాలంటే భూముల అమ్మకమే శరణ్యమని స్పష్టం చేస్తున్నాయి.

ఆదాయం అంతంత మాత్రమే..

ఖజానా లెక్కలు పరిశీలిస్తే.. రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రతి నెలా ప్రభుత్వ సొంత రాబడులు రూ.12 వేల కోట్లకు మించడం లేదు. గత రెండేళ్ల గణాంకాలు పరిశీలించినా ఇదే విషయం స్పష్టమవుతోంది. తాజాగా కాగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2025 ఏప్రిల్ నెలలో రూ.10,916 కోట్లు మాత్రమే పన్ను ఆదాయం వచ్చింది. ఇందులో జీఎస్టీ కింద రూ.4 వేల కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1,126 కోట్లు, అమ్మకపు పన్ను రూపంలో రూ.2,700 కోట్లు, ఎక్సైజ్ ద్వారా రూ.1,300 కోట్లు, కేంద్ర పన్నుల రూపంలో రూ.1,100 కోట్లు వచ్చాయి. వీటితో పాటు అప్పులు, పన్నేతర ఆదాయం, కేంద్రం ఇచ్చే గ్రాంట్లు కలిపినా

మిగతా 15వ పేజీలో ▶

విశాఖపట్నంలో జరిగిన ‘యోగాంధ్ర అభియాన్’లో ఆసనాలు వేస్తున్న మోదీ



ప్రపంచాన్ని యోగా ఏకం చేసింది

జీవన విధానంలో యోగా ఓ అంతర్భాగం

‘యోగాంధ్ర అభియాన్’లో ప్రధాని నరేంద్ర మోదీ

12లో

ఆరోగ్య జీవనానికి ఆరోగ్య జీవనశైలి



- అందరూ అలవర్చుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు
- జీఎంసీ బాలయోగి స్టేడియంలో యోగా దినోత్సవం
- ఐదు లక్షలమందికి అవగాహన: మంత్రి రాజనర్సింహ

2లో

ఇస్ఫహాన్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్ భీకర దాడులు



- ఖుద్స్ ఫోర్స్ కమాండర్ ఇజాదీ సహా ముగ్గురు ఇరాన్ సీనియర్ కమాండర్లు అంతం
- టెల్‌అవీవ్‌లో మొస్సాద్ ఆఫీస్‌లపై ఇరాన్ క్షిపణుల హోరు
- అమెరికా జోక్యం చేసుకుంటే పరిణామాలు దారుణంగా ఉంటాయని హెచ్చరిక
- చర్చల కోసం తుర్కియే వెళ్లిన ఇరాన్ విదేశాంగ మంత్రి
- 2 వారాల్లో తేల్చుకుంటే నేనేం చేస్తానో నాకే తెలీదన్న ట్రంప్
- గ్వామ్ దీవి దిశగా బయల్దేరిన స్టెల్త్ బాంబర్ విమానం

6లో

జంట భూకంపాలా? అణుపరీక్షలా?

- వారం రోజుల వ్యవధిలో ఇరాన్‌లో రెండుసార్లు భూప్రకంపనలు
- అణుపరీక్ష వల్లే అణుకేంద్రాలు ధ్వంసమయ్యాయా?
- తెరమీదకు కొత్త అనుమానాలు, విశ్లేషణలు

6లో

ఇరాన్ నుంచి భారత్‌కు 827 మంది

బీఆర్ఎస్‌కు టచ్‌లో ఉన్న ఇంజనీర్లపై నిఘా..!

- బీఆర్ఎస్ ముఖ్యనేతలకు సమాచారం ఇస్తున్నారని అనుమానం
- నిఘా విభాగం నివేదించడంతో సర్కారు చర్యలు.. ఏసీబీ దాడులు, విజిలెన్స్ షోకాజ్ నోటీసులతో హడల్
- తమ నేతలే టార్గెట్‌గా ఇంజనీర్లపై చర్యలు తీసుకున్నారన్న బీఆర్ఎస్ వర్గాలు

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో పలువురు ఇంజనీర్లు గత సర్కారులోని పెద్దలతో ఇంకా టచ్‌లోనే ఉంటున్నారని ప్రభుత్వం అనుమానిస్తోంది. సర్కారు తీసుకునే ప్రతీ నిర్ణయంపై వారికి వెంటనే సమాచారం చేరవేస్తున్నారని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. అలాంటి ఇంజనీర్లపై నిఘా పెట్టాలని ఆదేశాలిచ్చినట్లు చెబుతున్నారు. అందులో భాగంగానే ఇటీవల ఏసీబీ దాడులు కూడా జరిగినట్లు నీటిపారుదల శాఖలో ప్రచారం

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



లంచం తీసుకుంటుంటే ఉద్యోగంలోంచి తీసేశారు. లంచం ఇచ్చి మళ్లీ చేరాను!



కౌశిక్‌రెడ్డి అరెస్టు.. బెయిల్

- క్వారీ యజమానిని బెదిరించిన కేసులో అరెస్టు చేసిన వరంగల్ పోలీసులు
- కాజీపేట రైల్వేకోర్టులో హాజరు
- బెయిల్ మంజూరు చేసిన జడ్జి

2లో



ఓటీటీ రిలీజ్.. సూపర్‌హిట్

- నేరుగా సినిమాలు, వెబ్‌సిరీస్‌లు
- సగటున ఏటా 350 ఒరిజినల్స్
- అగ్ర స్థానంలో హిందీ, తర్వాత బెంగాలీ
- మూడో స్థానంలో తెలుగు హవా

3లో

వచ్చేదే అరకొర. పొదుపుగా వాడుకోవాలి. అందులోనే దాచుకోవాలి. అనుకోని ఖర్చులు ఎదురైతే ఎలా అని వెంటాడే ఆలోచనలు.. ఇదీ పైసా పైసా లెక్కబెట్టే ఓ సగటు దిగువ మధ్య తరగతి 'జీవి'తం. దేశంలో దిగువ మధ్య తరగతికి చెందిన వ్యక్తుల సగటు ఆదాయం నెలకు రూ. 33,000. ఖర్చులు రూ. 20,000 వరకు ఉంటున్నాయి. మిగిలిన రూ.13 వేలల్లోనే వారి కలలు, ఆకాంక్షలు, నిర్ణయాలు అన్నీ ముడిపడి ఉంటున్నాయని 'హోమ్ క్రెడిట్' సంస్థ నివేదిక చెబుతోంది. గతేడాదితో పోలిస్తే ఆయా విభాగాల్లో నెలవారీ సగటు వ్యయాలూ పెరిగాయని వెల్లడించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



అన్నీ ఆ 13,000 రూపాయల్లోనే!

దిగువ మధ్యతరగతి సగటు ఆదాయం రూ.33 వేలు

దేశవ్యాప్తంగా 1.8 కోట్ల మంది కస్టమర్లున్న బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ 'హోమ్ క్రెడిట్ ఇండియా' విడుదల చేసిన 'ద గ్రేట్ ఇండియన్ వాలెట్-2025' నివేదిక ప్రకారం నెలవారీ వ్యయాలు పోను తమ ఆదాయంలో కొంత మొత్తాన్ని పొదుపు చేస్తున్న వారు 50% మంది మాత్రమే. ఖర్చులతోనూ వెళ్లదీస్తూ, ఆదా చేయలేకపోతున్నవారు 38% మంది ఉన్నారు. 12% మంది నెలవారీ అవసరాల కోసం అప్పు చేస్తున్నారు. ప్రాంతాలు, తరాల వారీగా ఆదాయాల్లో వ్యత్యాసం, కొనుగోళ్ల తీరు వేరుగా ఉందని ఈ నివేదిక తెలిపింది.

ఆదాయం రూ.5 లక్షలలోపు..

వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉన్న కుటుంబాల ఆదాయాలు, ఖర్చులు, పొదుపుల ఆధారంగా 17 నగరాలలోని 18–55 ఏళ్ల వయసున్న వ్యక్తుల నుంచి సేకరించిన సమాచారంతో ఈ నివేదిక రూపొందించారు. వీరిలో పురుషులు 84%, స్త్రీలు 16% ఉన్నారు. జెన్-జడ్ (13–28 ఏళ్లు) 19%, మిలీనియల్స్ (29–44 ఏళ్లు) 53, జెన్-ఎక్స్ (44–59 ఏళ్లు) 28% ఉన్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో కార్మికులు 42 %, వ్యాపారులు 29, వేతన జీవులు 22, స్వయం ఉపాధి పొందుతున్నవారు 7% ఉన్నారు.

పొదుపులో జెన్-జడ్

జెన్-జడ్ తరంలో అత్యధికంగా 56% మంది పొదుపు చేస్తుండడం ఆసక్తి కలిగిస్తోంది. మిలీనియల్స్‌లో ఇది 53%. వీరితో పోలిస్తే జెన్-ఎక్స్‌లో తక్కువగా 41% మంది మాత్రమే సేవింగ్స్‌కు మొగ్గు చూపుతున్నారు. వ్యాపారం ప్రారంభించాలన్న ఆలోచన ఉన్నవారిలో జెన్-జడ్ తరం నుంచి 33% ఉన్నారు. లక్ష్యాలను చేరుకోవడానికి ఆర్థిక మార్గదర్శకులు కావాలని 58% మంది భావిస్తున్నారు. జెన్-జడ్ విషయంలో ఈ సంఖ్య 65%, మిలీనియల్స్‌లో 59% ఉన్నారు. ఇక భారత్‌లో దక్షిణాది రాష్ట్రాలు అత్యధిక సగటు ఆదాయం రూ.38,600 నమోదు చేయగా, ఉత్తరాది, తూర్పున ఇది సగటున రూ.30,300గా ఉంది. బెంగళూరు రూ.45,700తో తొలి స్థానంలో నిలిచింది. రూ.39,200తో హైదరాబాద్, రూ.35,800తో ముంబై ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఆకాంక్షలతోపాటు ఆందోళనలు..

వచ్చే అయిదేళ్లలో వ్యాపారం ప్రారంభించడం, విస్తరించాలని 23% మంది లక్ష్యంగా చేసుకున్నారు. ఇల్లు కొనుక్కోవాలని 23% ఆకాంక్షించారు. పిల్లల విద్యకు పొదుపు చేయాలని 15% మంది, రుణాల చెల్లింపు 11%, కారు కొనుగోలు 11%, విదేశీ టూర్ వెళ్లాలని 7% మంది భావిస్తున్నారు. దాదాపు 60% మంది తమ ఆర్థిక భవిష్యత్తు గురించి ఆందోళనగా ఉన్నారు. పిల్లల చదువులకు ఖర్చులు సరిపోవడం లేదని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే తగినంత పొదుపు లేదని, రుణాలు తిరిగి చెల్లించలేకపోతున్నామని, ఉద్యోగం లేదా ఆదాయ వనరు కోల్పోయామని, పదవీ విరమణకు సరిపడా డబ్బు లేవని ఆవేదన చెందుతున్నారు.

దుకాణాలకు వెళ్లి..

దుస్తులు, ఫ్యాషన్, మొబైల్ ఫోన్స్, గృహోపకరణాలు, సరుకులు, మందులు.. ఈ విభాగాల్లో కస్టమర్లు ప్రత్యక్షంగా దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. మొత్తం కొనుగోళ్లలో ఏకంగా 83–85% ఆఫ్‌లైన్‌లోనే నమోదు కావడం గమనార్హం. బస్సు, రైలు టికెట్ బుకింగ్స్, ఫుడ్ ఆర్డర్స్‌లో ఆఫ్‌లైన్ వాటా 58–59%గా ఉంది. రుణాల చెల్లింపుల్లో 50%, బిల్ పేమెంట్స్‌లో 54% ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

నెలవారీ వ్యయాలు పోను కొంత పొదుపు చేస్తున్నాను	50%
ఖర్చులకే సరిపోతుంది, ఆదా చేయలేకపోతున్నాను	38%
నెలవారీ అవసరాల కోసం అప్పు చేయాల్సి వస్తోంది	12%

గతేడాదితో పోలిస్తే విభాగాల వారీగా నెలవారీ సగటు ఖర్చుల వ్యత్యాసం ఇలా..

సరుకులు	రూ.9,230	+12
పిల్లల చదువు	రూ.5,875	+34
అద్దె	రూ.5,741	-6
ప్రయాణ ఖర్చులు	రూ.4,686	+17
వైద్యం	రూ.2,486	+11
యుటిలిటీ బిల్స్	రూ.1,722	-5
వంట గ్యాస్	రూ.1,041	-9

రూ.20వేల వరకు ఖర్చులకే సరిపోతోంది

పొదుపు చేయగలుగుతున్న వారు 50% మంది	భారీగా పెరిగిన పిల్లల చదువు వ్యయం	గతేడాదితో పోలిస్తే 34% పెరుగుదల
దుకాణాలకు వెళ్లి కొంటున్నారు		కొనుగోళ్లలో సుమారు 85% ఆఫ్‌లైన్‌లోనే

'ద గ్రేట్ ఇండియన్ వాలెట్-2025' నివేదిక

నెలవారీ సగటు ఆదాయం, వ్యయాలు రూ. వేలల్లో..

	ఆదాయం	ఖర్చులు
మొత్తం	33	20
పురుషులు	34	21
స్త్రీలు	30	20
జెన్-జడ్	27	17
మిలీనియల్	33	21
జెన్-ఎక్స్	37	22
మెట్రో	36	23
ప్రథమ శ్రేణి నగరం	31	19
ద్వితీయ శ్రేణి నగరం	30	17

2024లో పొదుపు చేసినవారు (శాతాల్లో)

మొత్తం	50
పురుషులు	52
స్త్రీలు	43
జెన్-జడ్	56
మిలీనియల్స్	53
జెన్-ఎక్స్	41
మెట్రో	45
ప్రథమ శ్రేణి నగరాలు	55
ద్వితీయ శ్రేణి నగరాలు	48

పొదుపు ఎలా చేస్తున్నారంటే.. (శాతాల్లో)

నగదు రూపంలో	38
బ్యాంకులో పొదుపు	24
జీవిత బీమా (ఎల్‌ఐసీ లాంటివి)	8
ప్లాట్/ప్రాపర్టీ	7
బంగారం	4
ఎఫ్‌డీ/ఆర్‌డీ	4
పోస్టాఫీస్ సేవింగ్స్	3
మ్యూచువల్ ఫండ్స్/ఎస్‌ఐపీ/యూలిప్	3
స్టాక్ మార్కెట్	2

---

25 నుంచి బీసీ చేతివృత్తిదారుల వస్తు ప్రదర్శన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు బీసీ చేతి వృత్తిదారులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయాలు నిర్వహించనున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్దనున్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్దేశించిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. వివిధ బీసీ వృత్తిదారులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి గలవారు వచ్చి వస్తువులను కొనుగోలు చేయవచ్చని సూచించారు.

మంత్రివర్గంలో అవకాశం కల్పించండి

ఖర్గేకు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు విజయం సాధించిన తనకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను.. పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో ఖర్గేతో రామ్మోహన్ రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ ఏర్పడ్డాక 2014, 2023 ఎన్నికల్లో రెండు పర్యాయాలు విజయం సాధించానని ఆయన వివరించారు.

రెడ్డి కార్పొరేషన్‌కు పూర్తి స్థాయి పాలకవర్గం

రెడ్డి సంఘం తెలంగాణ వినతి

సాక్షి, హైదరాబాద్: రెడ్డి కార్పొరేషన్‌కు పూర్తి స్థాయిలో పాలకవర్గం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని రెడ్డి సంఘం తెలంగాణ కోరింది. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి.. రెడ్డి సంఘం తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపు జైపాల్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి వినతి పత్రం సమర్పించారు. పద్దెనిమిది నెలలైనా.. రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించలేదని, తక్షణమే రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరారు.

ఆరోగ్య జీవనానికి ఆరోగ్య జీవనశైలి

అందరూ అలవర్చుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు

- జీఎంసీ బాలయోగి స్టేడియంలో యోగా దినోత్సవం
- ఐదు లక్షలమందికి అవగాహన: మంత్రి రాజనర్సింహ



శనివారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆసనాలు వేస్తున్న మంత్రులు దామోదర, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణారావు తదితరులు. (ఇన్‌సెట్)లో కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

చందానగర్: ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు అనారోగ్యం బారినపడకుండా ఆరోగ్య జీవనశైలిని అలవర్చుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. యోగాకు నిత్య జీవితంలో ఉన్న ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. యోగా అనేది అద్భుతమైన సాధన అని, వ్యాయామం కూడా జీవన విధానంలో భాగం కావాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం విశాఖపట్నంలో నిర్వహించిన యోగా వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని చిత్రప్రదర్శన ద్వారా మంత్రులు, అధికారులతో కలిసి జిష్ణుదేవ్ వర్మ తిలకించారు. శనివారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబసంక్షేమ, ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజ నర్సింహ, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఐదు లక్షలమందికి అవగాహన

ప్రజల ఆరోగ్యం మరింత మెరుగుపర్చాలనే యోచనతో గత ఏడాది 600 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రంలో మరో 300 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించాల ప్రభుత్వం యోచిస్తోందన్నారు. గత ఏడాది 600 మంది ఇన్‌స్ట్రక్టర్లతో 5 లక్షల మందికి యోగా సాధన, ఆరోగ్యంపై అవగాహన కల్పించామని చెప్పారు. అన్నింట్లోకెల్లా గొప్ప సాధననే యోగా సాధన అని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో ప్రజలందరికీ యోగా సాధన వారి జీవితంలో భాగం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

5 నిమిషాల్లో ఎంతో రిలాక్స్ అయ్యా: మంత్రి వాకిటి

వైద్యులు, మందులతో పనిలేకుండా ఉండాలంటే యోగా ప్రతి ఒక్కరూ చేయాల్సిందేనని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. యోగాను ప్రపంచానికి గుర్తు చేసిన ఘనత భారతదేశానిదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఔషధ మొక్కలు, వాటి ప్రాముఖ్యత, లాభాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రజలందరినీ ఆలోచింప చేసింది. ఇదిలాఉండగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు రావడంతో టోకన్లు ఇచ్చే చోట కొంత గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా కొందరు కింద పడిపోయి మళ్లీ సర్దుకున్నారు.


డయాలసిస్ రోగులకు రూ.2,016 పింఛన్

మంత్రి సీతక్క వెల్లడి



సాక్షి, హైదరాబాద్: డయాలసిస్ పేషెంట్లను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గత ప్రభుత్వం 4,011 మంది డయాలసిస్ రోగులకు పింఛన్లు ఇవ్వగా.. ప్రజాప్రభుత్వం కేవలం నెలరోజుల వ్యవధిలో కొత్తగా 4,021 మందిని గుర్తించి ఎంపిక చేసిందని సీతక్క వెల్లడించారు. డయాలసిస్ పేషెంట్లు పూర్తిస్థాయిలో పనిచేయలేరని, వారు ప్రతినెలా ఆస్పత్రిలో చికిత్స చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వారి కష్టాలను గుర్తించిన ప్రభుత్వం వారికి పెన్షన్లను మంజూరు చేసిందని చెప్పారు. వీరితో పాటు త్వరలో హెచ్ఐవీ బాధితులు 13 వేల మందికి కూడా పింఛన్లు అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి ప్రతినెలా రూ.993 కోట్లు ఖర్చు చేస్తోందని, కొత్త పెన్షన్ దారుల గుర్తింపు ప్రక్రియ పూర్తయితే బడ్జెట్ మరింత పెరుగుతుందని సీతక్క తెలిపారు.

కూరగాయల సాగు పెంచేందుకు ప్రభుత్వానికి సహకరించండి: కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి యాచారం మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కాశిమల్ల వెంకటరామయ్య సహకరించాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కోరారు. ఇటీవల రైతునేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కూరగాయల సాగు ప్రాధాన్యాన్ని తెలియజేసిన వెంకటరామయ్యను రైతు కమిషన్ కార్యాలయానికి పిలిపించారు. కూరగాయల సాగులో మిగతా రైతులకు ఆదర్శంగా నిలవడం పట్ల వెంకట రామయ్యను అభినందించారు. యాచారం మండలంలో మూడు గ్రామాలను ఉద్యానవన శాఖ పైలట్ ప్రాజెక్టు కింద తీసుకొని కూరగాయల సాగు విస్తీర్ణం పెంచుతోందని తెలిపారు. యాచారం మండలంలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టుకు వెంకట రామయ్య సహకరించాలని, మిగతా రైతులకు సలహాలు, సూచనలివ్వాలని కోరారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు.. బెయిల్

క్వారీ యజమానిని బెదిరించిన కేసులో అరెస్టు చేసిన వరంగల్ పోలీసులు

- దుబాయ్‌కి వెళ్లే క్రమంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి..
- హనుమకొండకు తరలింపు.. కాజీపేట రైల్వేకోర్టులో హాజరు
- రిమాండ్ తిరస్కరించి బెయిల్ మంజూరు చేసిన జడ్జి

సాక్షి ప్రతినిధి, వరంగల్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రిమాండ్‌ను హనుమకొండ రెండో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి, కాజీపేట రైల్వే కోర్టు జడ్జి నాగ సుస్మిత తిరస్కరించారు. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ శనివారం రాత్రి తీర్పునిచ్చారు. సొంత పూచీకత్తుతో పాటు రూ.25 వేల చొప్పున ఇద్దరి జమానత్‌లపై విడుదల చేయాలని తెలిపారు. సొంత పూచీకత్తు, జమానత్ పత్రాలను ఈ నెల 25వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. వివరాలు ఇలా ఉన్నాయి..

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడులో గ్రానైట్ క్వారీ యజమాని కట్టా మనోజ్‌రెడ్డి భార్య ఉమాదేవి.. కౌశిక్‌రెడ్డి తమను బెదిరించారంటూ ఏప్రిల్ 21న సుబేదారి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డిపై బీఎన్ఎస్ 308(2), 308(4), 308(5) 352 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆ తర్వాత సరిగ్గా 2 నెలలకు, దుబాయ్‌కు వెళ్లేందుకు సిద్ధమైన కౌశిక్‌రెడ్డిని శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో వరంగల్ కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో సుబేదారి పోలీసుస్టేషన్‌కు తరలించారు. శనివారం మధ్యాహ్నం వైద్య పరీక్షల అనంతరం హనుమకొండ రెండో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి సిరిసిల్ల ప్రియాంక సెలవులో ఉండటంతో.. ఇన్‌చార్జి జడ్జి నాగ సుస్మిత ముందు హాజరు పరిచారు. కౌశిక్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ జడ్జి తీర్పు ప్రకటించారు.



బెయిల్ రావడంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని భుజాలపై ఎత్తుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

రూ..50 లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నారంటూ ఫిర్యాదు

కమలాపూర్ మండలం గుండేడు–వంగపల్లి శివారులో రేణుక రాక్స్ పేరిట కట్టా మనోజ్‌రెడ్డి గ్రానైట్ క్వారీ నడుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే కౌశిక్‌రెడ్డిపై ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మనోజ్‌రెడ్డిని బెదిరించిన ఎమ్మెల్యే గతంలోనే రూ.25 లక్షలు రూపాయలు తీసుకున్నారని.. ఇప్పుడు మళ్లీ రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డితో తన భర్తకు, కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని ఆరోపించారు.

ఉద్రిక్తత.. హైడ్రామా

అరెస్టు విషయం తెలిసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులకు వ్యతిరేకంగా, సీఎం రేవంత్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని పలువురిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్, దాస్యం వినయభాస్కర్, చల్లా ధర్మారెడ్డి, మర్రి యాదవరెడ్డి, కౌశిక్‌రెడ్డి భార్య శాలినీరెడ్డి తదితరులు కౌశిక్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. ఉద్రిక్తత, హైడ్రామా నడుమ కౌశిక్‌రెడ్డికి ఎంజీఎంలో వైద్య పరీక్షల అనంతరం జడ్జి ఎదుట హాజరుపరిచారు.

సీఎం, మంత్రి బినామీలే అక్రమ మైనింగ్ చేస్తున్నారు: కౌశిక్‌రెడ్డి

శంషాబాద్/కాజీపేట రూరల్: రేవంత్‌రెడ్డి పెట్టే అక్రమ కేసులు.. చేసే అక్రమ అరెస్టులకు భయపడేది లేదని కౌశిక్‌రెడ్డి అన్నారు. శంషాబాద్‌లో అరెస్టు సందర్భంగా ఆయన పోలీసులతో కాసేపు వాగ్వాదానికి దిగారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. గుండేడులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, కడియం శ్రీహరి, ఎమ్మెల్యే నాగరాజుల బినామీలు అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బెయిల్ వచ్చిన తర్వాత రైల్వే కోర్టు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. వారి అక్రమాలు పూర్తి ఆధారాలతో సహా ఆదివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి బయటపెడతానని అన్నారు.

'ఎన్నికల నగదుకు' హవాలా రంగు!

- ప్రతిపక్ష నేతలు, మద్దతుదారులపై నిరంతరం నిఘా
- వారి నగదు రవాణాపై స్థానిక పోలీసులకు సమాచారం
- సిట్ విచారణలో అంగీకరించిన ప్రణీత్‌రావు




సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావును సిట్ అధికారులు శనివారం మరోసారి ప్రశ్నించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు వాంగ్మూలంలోని కొన్ని అంశాలతోపాటు ఎన్నికల సమయంలో పట్టుబడిన నగదుకు హవాలా రంగు పూయడంపైనా 6 గంటలపాటు ప్రశ్నలు సంధించారు. త్వరలోనే మరోసారి ప్రభాకర్‌రావుతో కలిపి ప్రణీత్‌ను విచారించే అవకాశం ఉంది. 2023 ఎన్నికల సమయంలో అనేక మంది ఫోన్లు ట్యాప్ చేసిన ప్రణీత్‌రావు ఆధ్వర్యంలోని స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ప్రధానంగా నగదు రవాణాపై దృష్టి పెట్టింది. ట్యాపింగ్ సహా వివిధ రకాలుగా ఎస్ఓటీ నిఘాలో ఉన్న వారిలో ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులతోపాటు వారికి ఆర్థిక సహాయం చేస్తున్న వ్యాపారులు, ఫైనాన్షియర్లు కూడా ఉన్నారు. సీడీఆర్‌లు, ఐపీడీఆర్‌లతో పాటు పోలీసు యాప్‌లు తదితరాలు వినియోగిస్తూ వారి కదలికల్ని ప్రణీత్‌రావు బృందం పసిగట్టింది. ఆ సమాచారాన్ని ఆయా కమిషనరేట్లు, జిల్లాలకు చెందిన పోలీసులకు అందించేది. అక్కడి పోలీసులు దాడులు చేసి రవాణా చేస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే ప్రణీత్‌రావు బృందం ఈ నగదుకు, ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి సంబంధం లేదంటూ హవాలా రంగు పూసింది. అప్పట్లో ఎవరిపై నిఘా ఉంచాలి, ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయాలి తదితర వివరాలు ప్రభాకర్‌రావు నుంచి ప్రణీత్‌కు అందేవని పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించి సిట్ అధికారులు ప్రణీత్‌ను ప్రశ్నించారు. అప్పట్లో ట్యాప్ అయిన ఫోన్లలో కొందరు ప్రభుత్వ అధికారులతోపాటు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు చెందినవీ ఉన్నట్లు సిట్ గుర్తించింది. దీనికి సంబంధించీ ప్రణీత్‌ను కొన్ని ప్రశ్నలు వేసింది. ఆ నంబర్లు ఎంపిక చేసింది ఎవరు? ట్యాప్ చేయమని చెప్పింది ఎవరు? అనే అంశాలను అడిగింది. బీఆర్ఎస్‌లోని అసమ్మతి నేతలు, అసంతృప్తులతోపాటు ప్రతిపక్షాలపై నిఘా పెట్టడం కోసం అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడటమే ప్రధాన విధిగా ఎస్ఓటీ పని చేసిందని సిట్ చెప్తోంది. అక్రమ నిఘా, ఆపరేషన్ల కోసం నిఘా విభాగంలోనూ కొందరితో కలిసి ప్రణీత్‌రావు పని చేశారని గుర్తించిన సిట్ ఆయా అధికారుల వివరాలను ప్రణీత్‌రావు నుంచి తెలుసుకుంది. త్వరలో వారి నుంచీ వాంగ్మూలాలు తీసుకునే అవకాశం ఉంది.

సీబీఐ అయితే ఎప్పుడో తేల్చేది

ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకివ్వటంలేదు?


కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్న



యోగాడేలో పాల్గొన్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్: ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చాక ఎందుకు ఆ పని చేయడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. సీబీఐ నేరుగా విచారణ జరిపే అవకాశముంటే ఈ కేసును ఎప్పుడో తేల్చేవాళ్లమని అన్నారు. ప్రభాకర్‌రావు, కేసీఆర్, కేటీఆర్ వంటివాళ్లను జైల్లో వేసేవాళ్లమని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శనివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌పై మొట్టమొదట మాట్లాడిందే తాను అని తెలిపారు. హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, దీనివెనుక ఎవరున్నారో ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాతే ప్రభాకర్ రావు విదేశాలకు పారిపోయాడని గుర్తుచేశారు. అందుకే ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ కోరాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ నుంచి ఫోన్ కాల్ వచ్చిన మాట నిజమేనని... విచారణకు సహకరిస్తానని చెప్పారు.

కౌశిక్‌పై పెట్టిన అక్రమ కేసు వెంటనే ఉపసంహరించుకోవాలి: మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న కౌశిక్‌రెడ్డిని రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఆయనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టిందని, శని, ఆదివారాలు కోర్టులకు సెలవు రోజులను చూసి అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులను న్యాయ పోరాటం ద్వారా ఎదుర్కొంటామని మధుసూదనాచారి చెప్పారు.

క్లుప్తంగా...

27న కృష్ణా బోర్డు ప్రత్యేక సమావేశం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు 20వ ప్రత్యేక సమావేశం ఈనెల 27న హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. కృష్ణా బోర్డు ఉద్యోగులందరికీ మూలవేతనంపై 25 శాతం వేతనాన్ని అధికంగా చెల్లించాలని గతంలో బోర్డు నిర్ణయం తీసుకోగా, కేంద్ర జలశక్తి శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. అధిక వేతనం చెల్లింపులను నిలుపుదల చేయడంతో పాటు ఇప్పటికే జరిపిన చెల్లింపులను రికవరీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చర్యలకు ఉపక్రమించగా, కొందరు ఉద్యోగులు రాష్ట్ర హైకోర్టులో సవాలు చేశారు. అధిక వేతనం చెల్లింపు అంశం పాలసీ నిర్ణయం కావడంతో దాని జోలికి వెళ్లమని, రికవరీలు మాత్రం జరపరాదని ఆదేశిస్తూ ఇటీవల తీర్పు వచ్చింది. కోర్టు తీర్పు మేరకు రికవరీలు చేయరాదని తీర్మానం చేసేందుకు తాజా సమావేశాన్ని కృష్ణా బోర్డు నిర్వహించ తలపెట్టింది. దీంతో సమావేశం ఎజెండాలో ఈ ఒక్క అంశమే ఉంది.

బాగోతం బయటపడటంతోనే హరీశ్ బుకాయింపు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: గోదావరిలో మిగులు జలాలు ఎవరు వాడుకున్నా తమకు అభ్యంతరం లేదని అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ప్రయోజనాల విషయంలో కేసీఆర్, హరీశ్‌రావు రాజీ పడ్డారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. వారిచ్చిన రూట్ మ్యాప్‌తోనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని, బనకచర్ల విషయంలో బాగోతం బయటపడినందుకే హరీశ్‌రావు బుకాయింపు మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్, హరీశ్‌రావు తెలంగాణకు చేసిన జలద్రోహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బయటపెట్టారని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఇప్పటికే సీఎం, నీటిపారుదల మంత్రి కేంద్రానికి ఫిర్యాదు చేశారని చెప్పారు. తెలంగాణ, ఏపీల మధ్య చర్చలు జరిగి సమస్య పరిష్కారమైతే తన రాజకీయ పబ్బం గడవదనే భయం హరీశ్‌రావుకు ఉందన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఓ విధంగా, ఆ పార్టీ నేతలు మరోరకంగా మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే ముందే జలశక్తి మంత్రిని కిషన్‌రెడ్డి కలిశారని ఆయన ఏమన్నారో కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు చెప్పాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి వెయ్యి టీఎంసీలు చాలనడానికి మీరెవరు?

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రానికి వెయ్యి టీఎంసీలు చాలు అనడానికి నీ తాత జాగీరా?' అని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విరుచుకుపడ్డారు. పచ్చి అబద్ధాలకు, చిల్లర మాటలకు రేవంత్‌రెడ్డి చిరునామాగా మారారన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు జి.దేవీప్రసాద్, చిరుమళ్ల రాకేశ్ కుమార్, రాంచంద్ర నాయక్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మోదీని నొప్పియొద్దు, చంద్రబాబును మెప్పించాలనే ధోరణిలో రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారన్నారు. చంద్రబాబు గురించి గోదావరి, కృష్ణా జలాలను పణంగా పెడితే మాత్రం రేవంత్ రెడ్డికి కర్రు కాల్చి వాత పెడుతామని దాసోజు హెచ్చరించారు. కేసీఆర్‌కు నీళ్లపై శ్రద్ధ లేకుంటే తెలంగాణ ఇంత సస్య శ్యామలం అయ్యేదా? అని ప్రశ్నించారు. అపెక్స్ కౌన్సిల్‌లో కేసీఆర్ చేసిన వాదనలు రేవంత్ రెడ్డి తప్పుగా ప్రచారం చేస్తున్నారని, ఎజెండా నెంబర్ 5ను ఉద్దేశపూర్వకంగా రేవంత్ విస్మరించి ఎజెండా 1 గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023లో హరీశ్ రావు కేంద్రానికి రాసిన లేఖను కళ్లు పెద్దవి చేసుకుని చూస్తే వాస్తవాలు తెలుస్తాయని, దమ్ముంటే హరీశ్‌రావుతో రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని దాసోజు సవాల్ విసిరారు.

ముందు హంద్రీనీవా, వంశధార పూర్తి చేయాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టు కంటే ముందు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా, వంశధార లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పర అభ్యంతరాలు లేకుండా ప్రాజెక్టులు కట్టుకుంటే మంచిదని శనివారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో తెలిపారు. కేంద్రంతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. వెనకబడిన ప్రాంతాలకు నీరు అందేలా రెండు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్రం సహాయం తీసుకోవాలన్న రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు నారాయణ చెప్పారు.

ఓటీటీ రిలీజ్.. సూపర్ హిట్!

ఓవర్ ద టాప్.. సంక్షిప్తంగా ఓటీటీ. వినోద రంగాన్ని సమూలంగా మార్చి కొత్త రికార్డులకు వేదికవుతోంది. దేశవ్యాప్తంగా ఓటీటీ వీక్షకుల సంఖ్య 2024 నాటికి 55 కోట్లకు చేరిందంటే దీని స్పీడును అర్థం చేసుకోవచ్చు. టెలికం కంపెనీల దూకుడు పుణ్యమాని నగరాలే కాదు పల్లెలకూ ఆన్‌లైన్‌లో వీడియో స్ట్రీమింగ్ సంస్కృతి పాకింది. ఈ స్థాయిలో ప్రాచుర్యంలోకి వచ్చింది కాబట్టే నేరుగా ఓటీటీల్లో (ఒరిజినల్స్) రిలీజయ్యే సినిమాలు, వెబ్ సిరీస్, షోల సంఖ్య మన దేశంలో భారీగా పెరిగాయి. దేశంలో సగటున రోజుకో ఓటీటీ ఒరిజినల్ విడుదలై వీక్షకులకు వినోదాన్ని పంచుతోంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



యూట్యూబ్ మినహా ప్రధాన ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో విడుదలైన ఒరిజినల్స్

సంవత్సరం	మొత్తం	వెబ్ సిరీస్	సినిమాలు
		(శాతాల్లో)	
2018	114	59	20
2019	234	70	19
2020	294	59	33
2021	337	40	53
2022	368	69	23
2023	383	71	16
2024	315	68	18

2024లో అత్యధికంగా వీక్షించిన వెబ్ సిరీస్, మూవీ, షో, వీక్షకుల సంఖ్య


హిందీ వెబ్ సిరీస్	మీర్జాపూర్ సీజన్ 3	3 కోట్లు
ఇండియన్ అన్‌స్క్రిప్టెడ్ కంటెంట్	బిగ్ బాస్ ఓటీటీ సీజన్-3	1.78 కోట్లు
హిందీ సినిమా	దో పత్తీ	1.51 కోట్లు
తెలుగు షో	సేవ్ ద టైగర్స్ సీజన్-2	50 లక్షలు
ఇంటర్నేషనల్ షో	స్క్విడ్ గేమ్ సీజన్-2	1.96 కోట్లు
ఇంటర్నేషనల్ ఫిల్మ్స్	రోడ్ హౌజ్	60 లక్షలు

2021లో మొత్తం ఓటీటీ ఒరిజినల్స్‌లో సినిమాల వాటా ఏకంగా 53 శాతం నమోదై రికార్డు సృష్టించింది. మహమ్మారి సమయంలో థియేటర్లు చాలా కాలం పాటు మూతపడ్డాయి. థియేటర్లో రిలీజ్ కావాల్సిన ఈ సినిమాలు మరో మార్గం లేక ఓటీటీ బాట పట్టాయి. అయితే 2022 నుండి వెబ్ సిరీస్‌ల ఆధిపత్యం కొనసాగుతోంది. గడిచిన మూడేళ్లలో వెబ్ సిరీస్‌ల వాటా ఏటా 68–71 శాతం ఉంది. 2024లో రిలీజైన 315 ఒరిజినల్స్‌లో 214 వెబ్ సిరీస్‌లే. 2023లో ఈ సంఖ్య 272గా ఉంది. మొత్తం ఓటీటీ వీక్షకుల్లో 27.5 శాతం (15 కోట్లు) మంది పెయిడ్ కంటెంట్‌ను ఆస్వాదిస్తున్నారు. మిగిలిన 72.5 శాతం మంది ఉచితంగా అందుబాటులో ఉన్న కంటెంట్‌ను వీక్షిస్తున్నారు.

ప్రాంతీయ భాషలపై ఫోకస్

2021 నుంచి చూస్తే.. మొత్తం ఒరిజినల్స్‌లో మూడింట రెండొంతులు హిందీ కంటెంట్ కైవసం చేసుకుంది. దేశంలో గత ఏడాది ఓటీటీల్లో ప్రత్యక్షమైన ఒరిజినల్స్‌లో 65% వాటాతో హిందీ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. హొయిచొయి, క్లిక్, అడ్డాటైమ్స్ వంటి ఓటీటీ యాప్స్ దూకుడుతో బెంగాలీ 2వ స్థానాన్ని సంపాదించింది. దాదాపు 9 శాతం వాటాతో తెలుగు మూడో స్థానంలో ఉంది. తెలుగులో 'ఆహా' యాప్ 27 లక్షల మంది చందాదారులతో దూసుకుపోతోంది. ఇతర భాషలతో పోలిస్తే హిందీతోపాటు బెంగాలీ, తెలుగు, తమిళం, మలయాళంలో సృజనాత్మకత మెరుగ్గా ఉంది. దీంతో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, ఇతర పెద్ద ప్లాట్‌ఫామ్‌లు ఈ ప్రాంతీయ భాషలపై దృష్టి సారించాయి. దక్షిణాదిన ఓటీటీ వినియోగాన్ని సినిమాలే నడిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పెద్ద హిట్స్‌లో దాదాపు 70 శాతం నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్‌లలోనివే. మిగిలినవి జియో హాట్‌స్టార్, సోనీ లివ్‌లో ప్రసారం అయ్యాయి.

నేరుగా సినిమాలు, వెబ్‌సిరీస్‌లు
సగటున ఏటా **350** ఒరిజినల్స్
చందా తీసుకుని మరీ వీక్షణ
అగ్ర స్థానంలో హిందీ, తర్వాత బెంగాలీ
మూడో స్థానంలో తెలుగు హవా



భాష	2021	2022	2023	2024
హిందీ	187	225	231	204
బెంగాలీ	52	33	65	42
తెలుగు	40	28	43	28
తమిళం	27	41	26	21
కన్నడ	2	13	4	5
మలయాళం	15	19	7	5
మరాఠీ	14	9	7	10

ముగిసిన భూభారతి సదస్సులు

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఈ సదస్సులు రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో నూతన శకం
- 3 విడతల్లో భూ సమస్యలపై 8.58 లక్షల దరఖాస్తులు
- అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేల దరఖాస్తులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూభారతి సదస్సులు ముగిసినట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. దశాబ్ద కాలం పాటు బీఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని, భూభారతి సదస్సులు రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో నూతన శకమని ఆయన పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని 32 జిల్లాల్లో నిర్వహించిన భూభారతి సదస్సులపై శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. నాటి ప్రభుత్వం హడావుడిగా తీసుకువచ్చిన ఆర్ఓఆర్ చట్టం-2020ని తిరగరాసి, పారదర్శక పాలనకు పెద్ద పీట వేస్తూ రైతుల కష్టాలు తీర్చడమే ధ్యేయంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని వివరించారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో తెచ్చిన ఈ చట్టం అమల్లోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని అన్నారు. పదేళ్లలో రైతులు పడిన కష్టాలు, బాధలకు ఇటీవల నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీన భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత మూడు దశల్లో నిర్వహించిన భూభారతి సదస్సుల్లో మూడు విడతలకు గాను 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. తొలి విడతలో భాగంగా 4 మండలాల్లో 72 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 12వేల దరఖాస్తులు, రెండవ దశలో భాగంగా 28 మండలాల్లో నిర్వహించిన 414 సదస్సుల్లో 46 వేల దరఖాస్తులు వచ్చాయని, సాదాబైనామాలు మినహా ఈ దరఖాస్తుల్లో 60 శాతం పైగా సమస్యలకు పరిష్కారం చూపామని చెప్పారు. ఈనెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడో విడతలో రాష్ట్రంలోని 561 మండలాల్లో 10,239 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 8 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, మూడు విడతలకు గాను 593 మండలాల్లో 10,725 సదస్సుల్లో 8.58 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు వెల్లడించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేలు, భద్రాద్రి కొత్తగూడెం 61 వేలు, వరంగల్ 54 వేలు, జయశంకర్ భూపాలపల్లి 48 వేలు, నల్లగొండలో 42 వేల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. వీటిలో ఇప్పటివరకు 3.27లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

ఆగస్టు 15 లోపు పరిష్కారం చూపాలి

భూభారతి దరఖాస్తుల పరిష్కారం కోసం రెవెన్యూ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆగస్టు 15వ తేదీలోపు రాష్ట్రంలోని భూసమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ఎజెండా

- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్
- సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన మంత్రి

సాక్షి, హైదరాబాద్: పేద ప్రజల సంక్షేమమే ప్రజాప్రభుత్వ ప్రధాన ఎజెండా అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఇటీవల మంత్రిగా నియమితులైన ఆయన శనివారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంత్రి.. ఎస్సీ విద్యార్థుల విదేశీ విద్యానిధి పథకం కింద లబ్ధిదారుల సంఖ్యను 210 నుంచి 500 పెంచే ఫైలుపై తొలి సంతకం చేశారు. అదేవిధంగా దివ్యాంగుల సంక్షేమం కింద స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రూ.5 కోట్లను మంజూరు చేస్తూ మరో ఫైలుపై సంతకం చేశారు. అలాగే దివ్యాంగులకు మోటారు వాహనాలు, ఇతర పరికరాల కొనుగోలుకు సంబంధించి రూ.50 కోట్లు విడుదల చేసే ఫైలుపై సంతకం చేశారు.

రోజుకొక శాఖతో సమావేశం...

అనంతరం లక్ష్మణ్‌కుమార్ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇతర అధికారులతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. తనకు ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం కృషి చేస్తానని చెప్పారు. ప్రతీరోజు ఒక శాఖతో సమావేశం నిర్వహిస్తానని, వారంలోగా అన్ని శాఖలపై సమీక్షలు నిర్వహించిన తర్వాత వ్యూహాత్మక కార్యాచరణతో ముందుకెళ్తానని తెలిపారు.

హెల్త్‌కేర్ క్యాపిటల్ తెలంగాణే!

- దేశంలోని హెల్త్‌కేర్ స్టార్టప్‌లన్నీ తెలంగాణవే
- ఏఐ ఇన్ హెల్త్‌కేర్ సదస్సులో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆరోగ్య రాజధానిగా హైదరాబాద్‌ను చూడాలనుకుంటున్నామని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం హైటెక్‌సిటీ యశోద ఆస్పత్రిలో 'ఏఐ ఇన్ హెల్త్ కేర్'అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని ఏఐ హెల్త్‌కేర్ స్టార్టప్స్ అన్నీ తెలంగాణకు చెందినవేనని తెలిపారు. సుమారు 900 స్టార్టప్స్ ఉన్నాయని వెల్లడించారు. తెలంగాణలో గ్లోబల్ ఏఐ సిటీని నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 230 కంటే ఎక్కువ ఫార్మా కంపెనీలు యూఎస్ ఎఫ్‌డీఏ అనుమతి పొందాయని, దేశంలో మరెక్కడా ఇన్ని కంపెనీలకు ఎఫ్‌డీఏ గుర్తింపు లేదని తెలిపారు. ప్రపంచంలోని టాప్ 5 హెల్త్‌కేర్ కేంద్ర కార్యాలయాలు హైదరాబాద్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. ప్రపంచానికి మూడోవంతు ఫార్మా ఔట్‌పుట్ మనమే ఇస్తున్నామని, 40 శాత బల్క్ డ్రగ్స్ అందిస్తున్నామని వెల్లడించారు. లైఫ్‌సైన్సెస్ టాప్ పది పరిశ్రమల్లో 8 ఇక్కడి నుంచే నిర్వహిస్తున్నారని, మనవద్ద 2 లక్షల మంది డీప్ టాలెంటెడ్ ఏఐ ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. గుండె శస్త్ర చికిత్సలు, జాయింట్ రీప్లేస్‌మెంట్, ఇతర ఆరోగ్య సంరక్షణలో యశోద, గాంధీ, ఉస్మానియా వంటి ఆస్పత్రులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని ప్రశంసించారు. రాష్ట్రంలో పబ్లిక్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. హెల్త్‌కేర్ రంగంలో యశోద ఆస్పత్రి ఒక హారం లాంటిదని కొనియాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు ఉండాలని, మనదగ్గర ప్రతి 834 మందికి ఒక వైద్యుడు ఉన్నాడని శ్రీధర్‌బాబు తెలిపారు.

హెల్త్‌కేర్‌లో ఏఐ విప్లవం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తెస్తుందని హైటెక్ సిటీ యశోద ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్ చినబాబు అన్నారు. క్లినికల్ ప్రాక్టీస్‌లోనూ ఏఐ అద్భుతాలు సృష్టిస్తుందని చెప్పారు. గూగుల్ ఉపాధ్యక్షుడు చందు మాట్లాడుతూ.. వ్యాధులు వచ్చిన తరువాత కాకుండా ముందుగానే గుర్తించే పద్ధతులు అందబాటులోకి రానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, గూగుల్ చీఫ్ క్లినికల్ డైరెక్టర్ మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మౌలిక సదుపాయాలపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన నలుగురు మంత్రులతో సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మౌలిక సదుపాయాల పనులకు నిధుల అవసరాలపై అధ్యయనం జరిపి నిధుల సమర్థ వినియోగంపై ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆదివారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో సమావేశమై చర్చించనుంది. భట్టి అధ్యక్షతన నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి డి.శ్రీధర్ బాబు, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలతో ఈ మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ గత నెల 31న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్ల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకి సంబంధించిన పెండింగ్ పనులను మంత్రివర్గ ఉపసంఘం సమీక్షించనుంది. వెంటనే, స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే ఆయా ప్రాజెక్టులను మూడు కేటగిరీలుగా విభజించనుంది. ఇప్పటికే పనులు మంజూరైనా టెండర్లు పిలవకపోతే ప్రాధాన్యాల ఆధారంగా ఆ పనులను సమీక్షించి టెండర్లు జరపాలా? వద్దా? అనే అంశంపై నిర్ణయం తీసుకుంటుంది. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులపై ప్రణాళికను సిద్ధం చేస్తుంది. వ్యూహాత్మక ప్రాజెక్టుల్లో జరుగుతున్న జాప్యాన్ని సమీక్షించి దిద్దుబాటు చర్యలను సూచిస్తుంది. అవసరం లేని ప్రాజెక్టుల రద్దు, ఆయా ప్రాజెక్టుల అవశ్యకతను పునః సమీక్ష, ప్రాజెక్టుల్లో మార్పుచేర్పులకు అవకాశాల పరిశీలన వంటి చర్యలను తీసుకోనుంది. వచ్చే రెండేళ్లలో జరగనున్న ప్రాజెక్టుల పనులపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం జరిపి నెల రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది.

విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ

- లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సదస్సులో కేటీఆర్



ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే తెలంగాణ విజయవంతమైన స్టార్టప్ స్టేట్‌గా నిలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.తెలంగాణ సాధించిన విజయాన్ని కేవలం అంకెలతో కాకుండా ఆత్మగౌరవం, పట్టుదలకు ప్రతిరూపంగా చూడాలని పేర్కొన్నారు. లక్షలాది మంది భారతీయులకు భవిష్యత్తుపై భరోసా కల్పించిన విజయగాథ తెలంగాణ సొంతమని తెలిపారు. లండన్‌లో భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుఝామున జరిగిన ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో కేటీఆర్ ప్రసంగించారు. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు పదవిలో ఉంటే సాధించే విజయాలకు తెలంగాణే నిదర్శనమని చెప్పారు. ప్రపంచానికి భారతదేశమే భవిష్యత్తు అని కేటీఆర్ స్పష్టంచేశారు. 'శిథిలాల నుంచి కొత్త రాష్ట్రంగా తెలంగాణ గెలుపు సౌధాలను నిర్మించింది. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో కొత్త రాష్ట్రంగా నూతన ప్రయాణాన్ని మొదలుపెట్టాం. తెలంగాణ విజయాన్ని అంకెలతో మాత్రమే చెప్పుకుంటే సరిపోదు. 70 వేల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.75 వేల కోట్లు జమచేసిన ఏకైక నాయకుడు స్వతంత్ర భారతచరిత్రలో కేసీఆర్ ఒక్కడే. ఇంటింటికి తాగునీరు, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం, టీ హబ్‌తోపాటు అతిపెద్ద టెక్ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. ఐటీ ఉద్యోగాల కల్పన, పరిశ్రమలకు అనుమతులు, వ్యవసాయం తదితర రంగాల్లో మేము వ్యక్తుల కంటే వ్యవస్థలకే ప్రాధాన్యత ఇచ్చాం. తెలంగాణకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని నేను బలంగా నమ్ముతున్నాను' అని కేటీఆర్ పేర్కొన్నారు.

సీఎం అవినీతిని ప్రశ్నించినందుకే కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేశారు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టును కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతల అవినీతి, దుర్మార్గాలను ప్రశ్నిస్తున్నందునే కౌశిక్‌రెడ్డిపై కక్షతో అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయన లండన్ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి చిల్లర చేష్టలు బీఆర్ఎస్ నేతల సంకల్పాన్ని, మనోధైర్యాన్ని ఎప్పటికీ దెబ్బతీయలేవని స్పష్టంచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామంలో గిరిజన మహిళలపై అటవీ అధికారులు చేసిన దాడిని కేటీఆర్ ఖండించారు. గిరిజనల మహిళలను వివస్త్రలను చేసి హింసించిన అధికారులను సస్పెండ్ చేయాడంతో పాటు వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

'ఆకాంక్షి-2' గ్రేడ్‌లోనే తెలంగాణ

- 2023–24 పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2.0లో వెల్లడి
- పాఠశాల విద్యలో మూడేళ్లుగా ఇదే గ్రేడ్‌కే పరిమితం

సాక్షి, న్యూఢిల్లీ: పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) 2.0 ప్రకారం 2023–24లో తెలంగాణ రాష్ట్రం ఆకాంక్షి-2 గ్రేడ్‌కు పరిమితమైంది. తెలంగాణ 511.9 పాయింట్లతో ఆకాంక్షి-2 గ్రేడ్‌లో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 562.2 పాయింట్లతో ఆకాంక్షి-1 గ్రేడ్‌లో ఉంది. తెలంగాణ స్కోర్ 2021–22లో 479.9 పాయింట్లు, 2022–23లో 489.3 పాయింట్లు సాధించింది. ఇప్పుడు మునుపటి కంటే 22.6 పాయింట్లు పెరిగినప్పటికీ గ్రేడ్ మాత్రం ఆకాంక్షి-2కే పరిమితమైంది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పీజీఐ-2.0 ప్రకారం ఏ రాష్ట్రమూ అగ్రశ్రేణి గ్రేడ్‌లను చేరుకోలేదు. చండీగఢ్ అత్యధిక స్కోరుతో ముందుండగా.. పంజాబ్, ఢిల్లీ, గుజరాత్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం 1,000 స్కోరుకు 703 స్కోరుతో చండీగఢ్ ప్రచేష్ఠ-1 గ్రేడ్ సాధించగా... చాలా రాష్ట్రాలు దిగువ శ్రేణిలోనే ఉన్నాయి. ఈ నివేదిక ఇది రాష్ట్రాల వారీగా పాఠశాల విద్య పురోగతిని సూచిస్తుంది. విద్యార్థుల ఫలితాలు, తరగతి నిర్వహణ, పాఠశాల మౌలిక వసతులు, సమానత్వం, పాలన చర్యలు, ఉపాధ్యాయ విద్య - శిక్షణ వంటి ఆరు డొమైన్లలో స్కోర్‌ను కేటాయించి గ్రేడ్‌లను ఇస్తారు.

25 జిల్లాలు ప్రచేష్ఠ-2 గ్రేడ్‌లో.. : తెలంగాణ విషయానికొస్తే విద్యార్థుల ఫలితాలు (ఆకాంక్షి-2), తరగతి నిర్వహణ (ఉత్కర్ష్), పాఠశాల మౌలిక వసతులు (ప్రచేష్ఠ-3), సమానత్వం (ఉత్కర్ష్), పాలన చర్యలు (ప్రచేష్ఠ-3), ఉపాధ్యాయ విద్య-శిక్షణ (ఉత్తమ్) గ్రేడ్‌లను సాధించింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్యార్థుల ఫలితాలు (ఆకాంక్షి-2), తరగతి నిర్వహణ (ఉత్కర్ష్), పాఠశాల మౌలిక వసతులు (ప్రచేష్ఠ-1), సమానత్వం (ఉత్కర్ష్), పాలన చర్యలు (ప్రచేష్ఠ-3), ఉపాధ్యాయ విద్య-శిక్షణ (ఉత్తమ్) గ్రేడ్‌లను సాధించింది. జిల్లాల విషయానికొస్తే.. పనితీరు గ్రేడింగ్‌లో 25 జిల్లాలు ప్రచేష్ఠ-2కే పరిమితం కాగా, మిగిలిన 8 జిల్లాలు ప్రచేష్ఠ-3 గ్రేడ్ సాధించాయి. ఉత్తమ్/ఉత్కర్ష్ గ్రేడ్‌లో ఒక్క జిల్లా కూడా చోటు దక్కించుకోలేదు. మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్, సిద్దిపేట, హన్మకొండ జిల్లాలు రాష్ట్రంలో టాప్-5లో ఉన్నాయి. ఈ జిల్లాలు గవర్నెన్స్, డిజిటల్ లెర్నింగ్, హాజరు పర్యవేక్షణ వ్యవస్థల్లో మంచి పనితీరు ప్రదర్శించాయి. నారాయణపేట, నిర్మల్, నాగర్‌కర్నూల్, వనపర్తి, ములుగు, మహబూబాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు ప్రచేష్ఠ-3 గ్రేడ్ సాధించి జాబితాలో అట్టడుగు స్థానంలో ఉన్నాయి.



వర్షంలో వేదికపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఇల్లెందు సభకు వర్షంతో అంతరాయం

వానలోనే అభివాదం చేసి వెనుదిరిగిన మంత్రి పొంగులేటి

ఇల్లెందు: స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులను సమాయత్తం చేసేలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో శనివారం సాయంత్రం బహిరంగ సభ ఏర్పాటుచేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రసంగించాల్సి ఉంది. ఈమేరకు ఐదు మండలాల నుంచి జన సమీకరణ చేయగా.. మంత్రి బయ్యారం పర్యటన అనంతరం ఇల్లెందు బయలుదేరారు. ఇంతలోనే వర్షం మొదలై జోరందుకోవడంతో కార్యకర్తలు చెట్ల కిందకు వెళ్లి వర్షం తగ్గగానే మళ్లీ వచ్చారు. ఆ తర్వాత మరోసారి భారీ వర్షం మొదలుకావడంతో జనం చెల్లాచెదురు కాగా, వానలోనే మంత్రి పొంగులేటి వేదికపైకి చేరుకుని అభివాదం చేస్తూ దిగి వెళ్లిపోయారు. దీంతో సభ అర్ధంతరంగా ముగిసింది.



"ఎడతెరిపి లేకుండ సమస్తము జరుగుచున్నది; మనుష్యులు దాని వివరింప జాలరు; చూచుటచేత కన్ను తృప్తి పొందకున్నది, వినుటచేత చెవికి తృప్తి కలుగుట లేదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఉత్తరాయనం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం;
తిథి: బ.ద్వాదశి రా.11.14 వరకు,
తదుపరి త్రయోదశి;
నక్షత్రం: భరణి ప.3.58 వరకు,
తదుపరి కృత్తిక;
వర్జ్యం: రా.3.09 నుండి 4.39 వరకు
దుర్ముహూర్తం: సా.4.46 నుండి 5.38 వరకు
అమృత ఘడియలు: ఉ.11.22 నుండి 12.51 వరకు

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.33
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

అయతొల్లా ఖమేనీ (ఇరాన్ సుప్రీం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అహంకారం మంచి విషయం.

కానీ, ఎవరు అహంకరిస్తున్నారు అనే దానిని బట్టి అది మంచి విషయం అవునా కాదా అనేది ఉంటుంది!

అహంకారం, జాతి రక్షకుడికి దేవుని అనుజ్ఞ. అదే అహంకారం, జాతులను తుడిచి పెట్టేందుకు సైతాను ఆజ్ఞ.

"ఖమేనీ ఎక్కడున్నాడో మాకు తెలుసు. అతడిని కాపాడటం కూడా మా చేతుల్లోనే ఉంది..." అంటోంది అమెరికా!

ఎంత అహంకారం?!

ఎవర్ని ఎవరు కాపాడతారన్నది యుద్ధం చేతుల్లో ఉంటుందా? సర్వశక్తి సంపన్నుడైన అల్లాహ్ తలంపులో ఉంటుందా?

ఎవరి దారిన వాళ్లుండేవాళ్లను నొప్పించే పనులే జరిగాయి ఈ లోకంలో ఇంతవరకు! ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. ముస్లిం ప్రపంచం ప్రతి దేశంలోనూ గాయపడి ఉంది. ముస్లిములను షియాలుగా, సున్నీలుగా; ముస్లింలను అరబ్బులుగా, అరబ్బులు కానివారిగా వేరు చేసి, ఐక్యతను చెడగొట్టి యావత్



ముస్లిం జాతినే తుడిచిపెట్టేందుకు అగ్రరాజ్య సైతాన్, జెరూసలేంలో తిష్ఠవేసుకుని ఉన్న 'జియోనిస్టు పిల్ల సైతాను'తో కలిసి ముస్లిం దేశాల మీదమీదకు వస్తోంది.

పాలస్తీనా, లెబనాన్, యెమెన్, సిరియాలలో ఇరాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తోందనీ, ఆ ఉగ్రవాదుల నుంచి ప్రపంచాన్ని రక్షించే బాధ్యతను తన మీద వేసుకున్నాననీ అమెరికా చెబుతోంది!

అసలు ఎవరి నుండి రక్షించుకోవడానికి ఇరాన్ ఈ 'ఉగ్రవాద' కవచాలను ఏర్పరచుకోవలసి వచ్చిందో, ముందు అది చెప్పాలి అమెరికా. అంతకన్నా ముందు, 'ఉగ్రవాదులు' అనటం మాని 'ధర్మయుద్ధ సైనికులు' అనటం అమెరికా నేర్చుకోవాలి.

ఖమేనీ ఆధునిక హిట్లర్ అంటోంది జియోనిస్ట్ పిల్ల సైతాన్! తన పెదనాన్న పెద్ద సైతాన్‌ను మించిన హిట్లర్ ఎవరున్నారు? గ్వాంటనామో, అబుగ్రైబ్ జైళ్లలో అమెరికా చేసిన నేరాలెన్ని! అక్కడి ఖైదీలకు చూపిన నరకాలెన్ని? స్వతంత్రంగా ఉన్న ఏ దేశాన్ని చూసినా బుసకొట్టకుండా ఉందా ఈ పెద్ద సైతాన్?! సిరియా అంతర్యుద్ధం మొదలైందీ, అంతం కాకుండా ఉన్నదీ ఎవరి వల్ల? ఈ రెండు సైతాన్‌ల వల్లనే కదా!

"తగాదా తీర్చటానికి తాను సిద్ధంగా ఉన్నాను" అని రష్యా అంటోంది!

మిత్రులైన వాళ్లు కూడా సర్దుబాటు చేయటానికే చూస్తారేమిటి?! రష్యా పూర్తిగా ఇరాన్ వైపు ఉండలేదా, బహిరంగంగా.

అయినా, దేవుడితో సైతాను తగాదా పడుతున్నప్పుడు అది దేవుడికి, సైతానుకు మధ్య తగాదా ఎలా అవుతుంది? సైతానును కదా రష్యా హెచ్చరించాలి. "నువ్వు నోరు తెరవకు. దేవుడితో ఘర్షణ పడితే నెత్తిపై ఒక్కటి పడుతుంది..." అని!

పిల్ల సైతాను తల పైన కర్రతో కొట్టకుండా ఇరాన్‌కు నచ్చచెబుతాననీ, ఆత్మరక్షణకు తప్ప మరి దేనికీ కర్రలను దగ్గర పెట్టుకోకుండా ఇరాన్‌ను ఒప్పిస్తాననీ రష్యా అనటం మధ్యవర్తిత్వం అవుతుంది కానీ, స్నేహం అవుతుందా?

చైనా రహస్యంగా కొన్ని ఆయుధాలు పంపింది. ఒకరికి సహాయం చేస్తే తెలియకూడదని అంటారు. స్నేహం కూడా ఎవరికీ తెలియకుండా చేయాలా? ఏమైనా, ఇరాన్ ఒంటరి పోరాటమే చేయాలి.

వికారమైన ఆ పిల్ల సైతాన్‌ని ఈ భూమి మీద లేకుండా చేసేంతవరకు అన్ని ఇస్లాం దేశాల తరఫున, అల్లాహ్ పేరిట ఇరాన్ పోరాటం చేస్తూనే ఉంటుంది. ఆఖరి ఆయుధం వరకు, ఆఖరి ఆయుధం తర్వాత కూడా!

బంకర్‌కు దగ్గర్లో భూమి బద్దలైనట్లుగా పెద్ద చప్పుడు! అమెరికా తన దుర్మార్గమైన యుద్ధాన్ని మొదలు పెట్టినట్లే ఉంది!

సర్వజ్ఞుడైన అల్లాహ్‌కు సత్యమేమిటో తెలుసు. నా ప్రియమైన ఇరాన్‌కు అల్లాహ్ రక్షణ తప్పక ఉంటుంది.

ఆయన ఇరాన్ చేయి విడువడు. నా ఆత్మ ఇరాన్‌ను వీడదు.

అంతులేని యోగ సంపద!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

'**అం**తులేని కథ' అనే ఒక సినిమా ఉంది. బాలచందర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా '70వ దశకంలో సంచలన చిత్రం. ఓ కుటుంబ యజమాని తన బాధ్యతల్ని వదిలేసి పారిపోతాడు. పెళ్లీడొచ్చిన పెద్ద కూతురు ఆ భారాన్ని తన భుజాల మీదేసుకుని బండి నడిపిస్తుంది. అనేక సంవత్సరాలు గడిచిన తర్వాత పారిపోయిన పెద్దమనిషి ఇంటికి ఉత్తరం రాస్తాడు. ఇన్నేళ్లూ తాను కష్టపడి సంపాదించిన అంతులేని సంపదతో తిరిగొస్తున్నానని ఆ ఉత్తరంలో చెబుతాడు. ఇల్లంతా పండుగ వాతావరణం. ఆ రోజు రానే వచ్చింది. ఆయన దిగనే దిగాడు. కాకపోతే కాషాయ దుస్తుల్లో, సన్యాసి వేషంలో! షాక్ తిన్న కుటుంబ సభ్యుల్ని ఉద్దేశించి తన ఉత్తరంలో రాసిన సారాంశాన్ని వివరిస్తాడు. తన ఉద్దేశంలో సంపద అంటే భక్తి సంపద, జ్ఞాన సంపద, తపః సంపద, మోక్ష సంపద... ఇవి దండిగా సంపాదించానని చెబుతాడు.

❖ ❖ ❖

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఈ సందర్భాన్ని ఒక గొప్ప ఈవెంట్‌గా మలుచుకునేందుకు 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' అక్కరకొచ్చింది. ప్రధానిని పిలుచుకున్నారు. 3 లక్షల మందితో విశాఖ తీరంలో ఆసనాలు వేయించి, గిన్నిస్ బుక్ సంస్థ నుంచి ప్రపంచ రికార్డు పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుకుంది. గతంలో ఎవరూ చేయని ఘనమైన కార్యాన్నే గిన్నిస్ బుక్ వాళ్ళు రికార్డులోకి ఎక్కిస్తారు. ఆ మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని తాపేశ్వరం స్వీట్ షాప్ వాళ్లు 29,465 కిలోల బరువు ఉన్న లడ్డూను తయారు చేసినందుకు షాపు యజమాని పోలిశెట్టి మల్లిబాబుకు గిన్నిస్ బుక్‌లో చోటు దొరికింది. రామ్ సింగ్ అనే జైపూర్ వాసి నాలుగున్నర మీటర్ల పొడవైన మీసాలు పెంచి ఈ ఘనత సాధించాడు. ఆంటోనీ విక్టర్ అనే మరో భారతీయుడు చెవుల మీద ఏడు ఇంచుల పొడవైన వెంట్రుకల్ని పెంచాడు. ఇదేమీ చిన్న ఫీట్ కాదు కదా! అందుకే గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది.

అట్లాగే చేతి వేళ్లకు ఉన్న గోళ్ళను ఎనిమిదిన్నర మీటర్లు పెంచి ఒకరు, తలకాయతో 46 టాయిలెట్ సీట్లను పగలగొట్టి మరొకరు, 459 స్ట్రాలను ఒకేసారి నోట్లో కుక్కి ఇంకొకరు ఈ ఘనతను సాధించిన వారిలో ఉన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ఈ విశిష్ట ఘనతలు ఆంధ్రప్రదేశ్‌కు రెండు లభించాయి. ఒకే ప్రదేశంలో మూడు లక్షల మందికి పైగా యోగా చేసినందుకు ఒకటి, 22,000 మంది గిరిజన విద్యార్థులు సూర్య నమస్కారాలు చేసినందుకు మరొకటి! గిన్నిస్ రికార్డుల కోసం ఎక్కువ మందితో ఒకే చోట డాన్సులు చేయించడం, డ్రమ్స్ వాయించడం, పాటలు పాడించడం వంటి కార్యక్రమాలను సాధారణంగా పెద్ద పెద్ద ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీల వాళ్ళు చేస్తుంటారు. ఇది మరీ పెద్ద రికార్డు కనుక స్వయంగా ప్రభుత్వమే తన భుజాల మీదకు ఎత్తుకుంది. డ్వాక్రా మహిళలు, పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా వెళ్లాలని తాఖీదులు వెళ్లాయి. స్వచ్ఛంద సంస్థలని బలవంతంగా రంగంలోకి దింపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులందరూ హాజరయ్యే బాధ్యతను ప్రభుత్వ అధికారులకు అప్పగించారు. వేలాది బస్సులను ఏర్పాటు చేశారు. టీ షర్టులను, మ్యాట్లను ఉచితంగా అందజేశారు. ఐదు లక్షలు టార్గెట్‌గా పెట్టుకుంటే, అటెండెన్స్ మూడు లక్షల మార్కు దాటింది.

కార్యక్రమం విజయవంతం కావడం, ఒకేసారి రాష్ట్రానికి విశిష్టమైన రెండు గిన్నిస్ రికార్డులు లభించటం సహజంగానే ముఖ్యమంత్రిని మిక్కిలి సంతోషపరిచింది. కార్యక్రమం ముగిసిన తర్వాత జరిగిన మీడియా సమావేశంలో అది కొట్టొచ్చినట్టు కనిపించింది. విశాఖపట్నం అంటే తనకెంతో ఇష్టం కనుక ఈ ఘనత విశాఖకు లభించేలా చేశానని అర్థం వచ్చేలా మాట్లాడారు. హుద్‌హుద్ తుఫాను వచ్చినప్పుడు తను విశాఖలోనే బస్సులో కూర్చుని అజమాయిషీ చేసిన సంగతిని గుర్తు చేశారు. ముంబయ్‌ని మించి, విశాఖలో అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమం సందర్భంగా ప్రధాని సమక్షంలో ఆయనను చరిత్ర సృష్టించిన వ్యక్తిగా పొగిడిన బాబు – మీడియా సమావేశంలో ఆయనకు మరిన్ని పొగడ్తలు తగిలించారు. ఒక ప్రభుత్వం ఏడాది పరిపాలనా కాలాన్ని పూర్తి చేసుకున్నప్పుడు సహజంగా ఫోకస్ కావాల్సిన అంశాలు, చర్చనీయాంశాలు కావలసిన సంగతుల స్థానాన్ని ఇటువంటి మెగా ఈవెంట్ ఆక్రమించడం కూడా బాబు ఆనందానికి ఇంకో కారణం కావచ్చు. సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డును తెచ్చిపెట్టిన గిరిజన బాలలు విశాఖలో ఆకలితో అలమటించారని, పడుకునేందుకు, కనీస అవసరాలకు చోటు దొరక్క అగచాట్ల పాలయ్యారని వస్తున్న వార్తలు, తన ఆనందానికి భంగం కలిగించడం ఆయనకు ఇష్టంలేదు. అందుకే ఆ ఘటనపై విచారమూ లేదు... విచారణా లేదు.

ప్రభుత్వం ఏడాది పాలనా కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చనీయాంశం కావలసిన అంశాలను ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి మొన్న జనం ముందుకు, ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చారు. అన్ని రంగాల్లో ప్రభుత్వం ఏ విధంగా విఫలమైందో గణాంకాల సహితంగా నిరూపించారు. ఆయన సొంత గణాంకాలు కావవి! ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల గణాంకాలతోనే జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టారు. ఏడాది కాలంలోనే లక్షా అరవై వేల కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నించారు. ఏడాదిగా 'అమ్మ ఒడి' పథకాన్ని నిలిపివేయడంపై నిలదీశారు. ప్రభుత్వ బడుల్లో అందుతున్న నాణ్యమైన విద్యకు బ్రేకులు వేయడంలోని ఔచిత్యం ఏమిటని అడిగారు. 'ఫీజు రీయింబర్స్‌మెంట్', 'ఆరోగ్యశ్రీ' బకాయిల ఎగవేతపై, రైతాంగాన్ని కష్టాల కడలిలో ముంచడంపై తూర్పారబట్టారు. అన్నింటినీ మించి "ఎన్నికల బాండ్లపై ప్రభుత్వాన్ని నిలదీయండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో ఎన్నికలకు ముందు తెలుగుదేశం కూటమి ఇంటింటికీ ప్రమాణ పత్రాలను పంపిణీ చేసింది. "చంద్రబాబు నాయుడు – పవన్ కల్యాణ్ అను మేము రాష్ట్ర ప్రజలు మా మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని త్రికరణ శుద్ధిగా ప్రమాణం చేస్తున్నాం. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ష్యూరిటీ పత్రంలో పేర్కొన్న హామీలను అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము" అని పేర్కొంటూ వారిద్దరూ ఆ పత్రాలపై సంతకాలు చేశారు. ఆ పత్రంలో కుటుంబ యజమాని పేరు, తండ్రి పేరు, వయసుతో పాటు కుటుంబ సభ్యుల సంఖ్యను, తాము హామీ ఇస్తున్న పథకాల్లో ఆ కుటుంబానికి వర్తించే వాటిని పేర్కొన్నారు. ఆ పథకాల కింద వారికి మొదటి ఏడాది జరిగే లబ్ధిని, ఐదేళ్లలో జరిగే లబ్ధిని కూడా పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డులు ఉన్న కోటీ నలభై లక్షల కుటుంబాలకు ఈ ప్రమాణ పత్రాలను పంపిణీ చేసినట్టు సమాచారం. జూన్ 2024 నుంచి ఈ హామీలు వర్తింపచేస్తామని కూడా ఈ పత్రంలో స్పష్టంగా రాశారు. ఆ లెక్కన ప్రమాణ పత్రాల సాక్షిగా ఏపీ ప్రజలకు ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం 81 వేల కోట్ల రూపాయలకు పైగా బకాయి పడిందని అంచనా.

ప్రతిపక్ష నాయకుడు ఆరోపణలు చేసినప్పుడు బాధ్యత గల ప్రభుత్వాలు దానికి సమాధానాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తాయి. సమాధానం ఇవ్వకపోగా ప్రతిపక్ష నేత పిలుపునిచ్చినట్టుగా ఎవరైనా నిలదీస్తే తాట తీస్తామని సాక్షాత్తూ ముఖ్యమంత్రి ప్రకటించడం ఒక విడ్డూరం. పైగా అసలు కథను వదిలేసి 'రప్పా రప్పా' అనే ఓ పిట్ట కథను పట్టుకొని జగన్ మోహన్ రెడ్డి అనని మాటల్ని ఆయనకు ఆపాదించి మీడియాలో తెలుగుదేశం పార్టీ వీరంగం వేసింది. ఆ మీడియాలోనే చదివిన వాళ్లకు, చూసిన వాళ్లకు ఏం అర్థమవుతుంది? రెండున్నర గంటల మీడియా సమావేశంలో జగన్ మోహన్ రెడ్డి 'రప్పా రప్పా' అనే అంశం పైన మాత్రమే మాట్లాడారని అనుకుంటారు కదా! ఇదే తెలుగుదేశం పార్టీకి కావలసింది. ప్రతిపక్ష నేత లేవనెత్తిన అంశాలు జనంలోకి వెళ్ళకూడదు, చర్చ జరగకూడదు.

ఒకవేళ కూటమి పెద్దల ఖర్మ కాలి, ఈ ప్రమాణ పత్రాలను తీసుకుని కోటి కుటుంబాల వారు తమకు బకాయిలు ఇప్పించాలని కోర్టుల మెట్లెక్కితే? కోర్టులు ఎలా స్పందిస్తాయనేది పక్కన పెడదాం. ప్రభుత్వం మోసం చేసిందంటూ కోటి కాదు, పది లక్షల కుటుంబాల వారు ఒకేసారి ఫిర్యాదులు చేసినా అదే పెద్ద రికార్డు! దాని ముందు గిన్నిస్ రికార్డులు, పిన్నిస్ రికార్డులు అన్నీ బద్దలు కావాల్సిందే! ఇదిగో జనం నుంచి ఇటువంటి సామూహిక ఫిర్యాదులు రాకుండా వారి ఆలోచనలను హైజాక్ చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని, గిన్నిస్ బుక్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకున్నది. యోగా అనేది సర్వరోగాలకూ, సకల సమస్యలకూ ఏకైక దివ్యౌషధం అన్నట్టుగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

'రోజు ఒక గంట యోగా చేయండి. అదే పదివేలు' అని ముఖ్యమంత్రి పిలుపునిస్తున్నారు. యోగాపై విశాఖ డిక్లరేషన్ కూడా త్వరలో విడుదల చేస్తారట! బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పని చేస్తున్నామని, యోగా–నేచురోపతి గేమ్ ఛేంజర్లుగా మారబోతున్నాయని ఆయన ప్రకటించారు. ఇక అల్లోపతి అటకెక్కినట్టేనా? యోగాభ్యాసాల్లో చేయించే ఎక్సర్‌సైజుల్లో చాలా స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్‌లు గతంలో పాఠశాలల్లో ఉన్న డ్రిల్ పీరియడ్లలో నేర్పించినవే. ఇప్పుడు మైదానాలు, స్పోర్ట్స్ టీచర్లు, స్పోర్ట్స్ పీరియడ్లను ఎత్తేశారు కాబట్టి, ఎవరింటి దగ్గర వాళ్లు గంటసేపు యోగా చేయమంటున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులైన కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ దివంగతులైన రోజు జూన్ 21. అదే రోజును 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా ప్రకటించడం కేవలం కాకతాళీయమే కావచ్చు.

కానీ, ఈ ప్రకటన తర్వాత యోగా గురువులు తామరతంపరగా పుట్టుకొస్తున్నారు. యూట్యూబ్‌ల ద్వారా పాఠాలు చెబుతున్నారు. అందులో రోగాల స్పెషలిస్టులు కూడా బయలుదేరారు.

ఒక ప్రభుత్వం ఏడాది పరిపాలనా కాలాన్ని పూర్తి చేసుకున్నప్పుడు సహజంగా ఫోకస్ కావాల్సిన అంశాలు, చర్చనీయాంశాలు కావలసిన సంగతుల స్థానాన్ని ఇటువంటి మెగా ఈవెంట్ ఆక్రమించడం కూడా చంద్రబాబు ఆనందానికి ఇంకో కారణం కావచ్చు. సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డును తెచ్చిపెట్టిన గిరిజన బాలలు విశాఖలో ఆకలితో అలమటించారని, పడుకునేందుకు, కనీస అవసరాలకు చోటు దొరక్క అగచాట్ల పాలయ్యారని వస్తున్న వార్తలు, తన ఆనందానికి భంగం కలిగించడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే ఆ ఘటనపై విచారమూ లేదు... విచారణా లేదు. ప్రభుత్వం ఏడాది పాలనా కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చనీయాంశం కావలసిన అంశాలను ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి మొన్న జనం ముందుకు, ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చారు. అన్ని రంగాల్లో ప్రభుత్వం ఏ విధంగా విఫలమైందో గణాంకాల సహితంగా నిరూపించారు. ఆయన సొంత గణాంకాలు కావవి! ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల గణాంకాలతోనే జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టారు. ఏడాది కాలంలోనే లక్షా అరవై వేల కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నించారు. ఏడాదిగా 'అమ్మ ఒడి' పథకాన్ని నిలిపివేయడంపై నిలదీశారు.

నడుము నొప్పికి సేతుబంధాసనమట! సంతానం కలగాలంటే భుజంగాసనమట! ఇలానే కడుపునొప్పికి, గ్యాస్ మంటకు, దగ్గుకు, ఆయాసానికీ చివరికి ఎయిడ్స్‌కు, క్యాన్సర్‌కు కూడా యోగా చిట్కాలు చెప్పే గురువులు తయారయ్యారు. వీటన్నిటినీ వైద్యశాస్త్రం ఆమోదిస్తుందా, వీళ్ళందరికీ శరీర నిర్మాణ శాస్త్రంపై అవగాహన ఉన్నదా అనేవి ప్రశ్నార్థకాలు. ఆమధ్య 'టెలిగ్రాఫ్ ఇండియా' ఒక పరిశీలనాత్మక వ్యాసం రాసింది. అందులో 'అష్టాంగ యోగా'ను ఆచరిస్తున్న వారిలో 62% మంది మోకాలి నొప్పులు, పిక్క కండరాల సమస్యలను ఎదుర్కొంటున్నారట! ఏ వయసు వారు ఎటువంటి ఆసనాలు వేయవచ్చు? ఆసనాలు వేసే సరైన పద్ధతి ఏమిటనే అవగాహన శాస్త్రీయంగా కల్పించకపోతే సమస్యలు ఎదురవుతాయి. యూట్యూబ్ సందేశాలు విని, పునర్ యవ్వనం ప్రాప్తిస్తుందని నమ్మి ముసలాళ్లు కూడా వజ్రాసనం వేసి కూర్చుంటే మోకాలి చిప్పలు దెబ్బతినవా? ఈ వేలం వెర్రిని నియంత్రించుకోకుంటే దుష్ఫలితాలు కూడా ఉంటాయని గ్రహించాలి.

పిల్లలు పాఠశాల మైదానాల్లో నేర్చుకునే జిమ్నాస్టిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడలకు, ఇంటి దగ్గర ఇరుకు గదుల్లో అభ్యసించే యోగా సరైన ప్రత్యామ్నాయమేనా అనేది కూడా ఆలోచించాలి. యోగాభ్యాసం ద్వారా శారీరక చురుకుదనం, మానసిక పరిపక్వత దేదీప్యమానమవుతుందనే అభిప్రాయం నిజమైతే దీన్ని ప్రమోట్ చేసే పద్ధతి గిన్నిస్ బుక్ ప్రదర్శనల ద్వారా కాదు. యోగాభ్యాసం ఫలితంగా ఫలానా అథ్లెట్ ఫలానా కప్పు గెలుచుకొచ్చారని, ఫలానా క్రీడా జట్టు ఫలానా టోర్నమెంట్ గెలిచిందని ఉదాహరించాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఫలానా వ్యక్తులు ఫలానా ఆవిష్కరణలు చేశారని, నోబెల్ బహుమతి గెలిచిన వారి మేధ వెనుక యోగాభ్యాసం ఉన్నదనేటటువంటి పాఠాలు ఎక్కువ మోటివేట్ చేస్తాయి. కాకపోతే అటువంటి ఉదాహరణల కోసం కాస్త కష్టపడి శోధించాలి.

❖ ❖ ❖

'సకల సమస్యలకు యోగానే మందు' అనే ప్రచారాన్ని ముందుకు తెస్తున్న చంద్రబాబు లాంటి వాళ్లు "ప్రభుత్వ బడుల్లో టోఫెల్ పాఠాలెందుకు, సీబీఎస్ఈ ఎందుకు, ఐబి ఎందుకు, ఇంగ్లీష్ మీడియం ఎందుకు? యోగా ఉందిగా! 'ఆరోగ్యశ్రీ' ఎందుకు, 'ఫ్యామిలీ డాక్టర్' ఎందుకు? యోగా చేయండి చాలు!" అనే ప్రచారాన్ని ముమ్మరం చేసే అవకాశం ఉన్నది. 'అంతులేని కథ'లో సదరు సన్యాసిరావు సంభాషించిన జ్ఞాన సంపద, భక్తి సంపద, తపః సంపద మాదిరిగానే! ఇక ఆంధ్ర దేశంలో యోగ సంపద కూడా దినదిన ప్రవర్ధమానం కావచ్చు.

vardhelli1959@gmail.com

ఉత్తరాంధ్ర కాదు... కళింగాంధ్ర!

అభిప్రాయం



గార రంగనాథం

కళింగం ఆకుపచ్చని దుర్గమారణ్యాలు, కొండలూ, కోనలూ, నదులూ కలిగి నీలి చీరంచులా పొడవైన తూర్పు సముద్రంతో గోదావరీ– మహానదుల మధ్యన ఒప్పారిన దేశం. సముద్రం మీద వివిధ దేశాలతో వాణిజ్య సంబంధాలు కలిగి, శత్రు దుర్భేద్యమైన ప్రదేశం. కళింగం ఆంధ్ర కంటే ప్రాచీనమైన దేశం. దీనిని వశపరచుకోవడానికి అశోకుడి ముందరా, ఆ తరువాతా ఎందరో రాజులూ, చక్రవర్తులూ ఉత్తరాది నుండి దాడులు చేశారు. ఇంకొక పక్క దక్షిణాది నుండి శాతవాహనులు, మాఠరులు తదితర వంశాల రాజులు దండయాత్రలు చేసి ఆక్రమించడం వలన ఈ నేల ఉత్తర భాగం ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ గాను; దక్షిణ భాగం కళింగాంధ్రగాను విడివడిపోయింది. కళింగాంధ్రనే ఉత్తర కోస్తా, ఉత్తరాంధ్ర అని పిలుస్తున్నారు. ఈ ప్రాంతంలో పైపైన ఆంధ్ర సంస్కృతి కనిపిస్తున్నా, సమాజ పొరల్ని విప్పి చూస్తే కళింగ సంస్కృతి అంతర్లీనంగా ద్యోతకమౌతుంది.

అశోకుడికి ముందర ఈ ప్రాంతం అంతా ఆదివాసీలు, దళితులతోనే నిండి ఉండేది. అప్పట్లో అవైదికాలయిన జైన, బౌద్ధమతాలు ఇక్కడ వేళ్ళూనుకొని ఉండేవని ప్రాచీన దేవాలయాలు, సాలిహుండం, బొజ్జన్నకొండ వంటి చారిత్రక ప్రదేశాలు తెలియజేస్తుంటాయి. అందుకే ఈ కళింగంలో అడుగు పెట్టి తిరిగి వెళ్ళిన తరువాత వైదికులు అగ్నిష్టోమం, పునస్తోమం అనే ప్రాయశ్చిత్త కర్మలు చేయించుకునేవారు.

కళింగాంధ్రకే ప్రత్యేకమైన దేవీశక్తులు: అసిరమ్మ, మొయ్యమ్మ, నీలమ్మ, కంచెమ్మ. వీరు గ్రామ సరిహద్దులో ఉంటూ గ్రామాన్ని కాపాడే దేవతలు. ప్రతి గ్రామంలో ఇద్దరు ముగ్గురు వంతున వందలాది పేర్లతో అన్ని గ్రామాలలోనూ పూజలందుకుంటున్నారు. వీరు బహుజన దేవతలు. బహుజనులే పూజార్లు. ఏ వైదిక దేవతల ఉత్సవాలకూ రానంతమంది ఈ అమ్మవారి యాత్రలకు వస్తారు. పసుపు కుంకుమ, వేప కొమ్మలతో అలంకరించిన ఘటాన్ని అమ్మవారిగా వీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాలకు విజయనగరం ప్రాంతంలో 'సిరిమాను' ఊరేగింపు తప్పనిసరి. జంతుబలులు సాధారణం. కొన్ని గ్రామాలలో అమ్మవార్ల పండుగల్లో దున్నను బలిచ్చే ఆచారం కూడా ఉంది.



వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు చిన్ననాడే స్నేహాన్ని ప్రారంభిస్తారు. సంప్రదాయంగా పెద్దలు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని 'నేస్తరికం' అంటారు. ఒకసారి నేస్తరికం కడితే వారి మధ్య అది జీవితాంతం కొనసాగవలసిందే!

అలాంటివే గావు పండుగలు, గ్రామపండుగలు. సాధారణంగా గ్రామంలోని గొల్లలంతా కలిసి చేస్తుంటారు. ఈ పండుగలో వంశపెద్ద మేకగొంతు కొరికి దేవుడికి సమర్పిస్తాడు. వంశానికి ఒక మేకను ఇలా బలి ఇస్తారు. గొంతు కొరికేటప్పుడు ఆ గావుమేక పెట్టే హృదయవిదారకమైన కేకను 'గావు కేక' అంటారు. ఆంధ్రబ్రాహ్మణులు, ఆర్యవైశ్యులు, పట్టుసాలీలు తప్ప కళింగంలోని ఇతర సామాజిక వర్గాలన్నీ మాంసాహారాన్ని తింటాయి. తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం దీపావళి, నాగులచవితి, భోగి, ఉగాది పర్వదినాల్లో కూడా ఇక్కడివారు మత్స్యమాంసాదులు తింటారు.

కళింగంలో ఒకే గోడను ఆన్చి ఇటు ఒకటి, అటు ఒకటిగా రెండిళ్ళు కట్టుకుంటారు. ఒకదానిని అనుసరించి మరొకటి వరసగా చాలా ఇళ్ళు కట్టుకుంటారు. ఇలా వాసపూసుకుంటూ నిర్మించుకున్నదానినే 'వాస' అంటారు. పూరిళ్ళతోనే ఇలాంటి వాసలు నిర్మించుకొనేవారు. అలాంటి రెండు వాసలు ఎదురెదురుగా ఉన్నదానిని 'వీధి' అంటారు. వాస పదప్రయోగం కళింగాంధ్రలోనే ఉంది. వరుసగా, వాసలుగా కట్టుకున్న ఇళ్ళు కళింగానికి అద్దం పడుతుంటాయి. కళింగేతర ప్రాంతాలలో పేద అయినా విడిగా ఇల్లు, దానికి చుట్టూ దడి నిర్మించుకుంటాడు.

వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు చిన్ననాడే స్నేహాన్ని ప్రారంభిస్తారు. ఆడపిల్లలు ఆడపిల్లలతోను, మగపిల్లలు మగ పిల్లలతోను ఈ స్నేహం ఉంటుంది. సంప్రదాయంగా పెద్దలు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని 'నేస్తరికం' అంటారు. ఒకసారి నేస్తరికం కడితే వారి మధ్య అది జీవితాంతం కొనసాగవలసిందే! శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ఇవి అధికం. నేస్తరికాలు ఒరిస్సాలోనూ ఉన్నట్టు చాగంటి తులసి రాసిన 'యాత్ర' నవలలో చదవవచ్చు. నేస్తరికాలకు విడాకులుండవు. మాది విజయనగరం జిల్లా రాజాం ప్రాంతం. మా వంశంలో జరుగుతున్న కార్యక్రమాలకు ప్రక్కగ్రామానికి చెందిన వేరే సామాజిక వర్గానికి చెందిన ఒక వంశంవారు బియ్యం, కొత్త బట్టలు వగైరా కావిడలో పెట్టి పంపించేవారు. వారి ఇళ్ళలో జరిగిన సంబరాలకు కావిడ పెట్టి పంపించేవాళ్ళం. దీనిని 'కావిడ పెట్టడం' అని పిలిచేవారు. ఈ సంప్రదాయం ఇరువంశాలకు చెందింది కాగా... అర్ధశతాబ్ది కిందటివరకూ కొనసాగింది. సామాజిక మార్పుల ప్రభావంతో మా మధ్య ఇది కనుమరుగైంది.

ఇక్కడి ఆడవారి చీరకట్టు కూడా ప్రత్యేకమైనది. కుడిపైట, వెనక కుచ్చు గుండారతో ప్రత్యేకంగా కనపడేవారు. ముఖానికి దట్టంగా పసుపు రాసుకొని, రూపాయి బిళ్ళంత కుంకుమ బొట్టు పెట్టుకొనేవారు. జాకెట్టు లేని ఆహార్యం వీరిది. కాళ్ళకు వెండి అందెలు, కడియాలు, బంగారు కొనచెవులు, ముక్కుకు కమ్మి ఇలా వీరి ఆభరణాలు కూడా ఆంధ్ర ఆడవారితో స్పష్టంగా విభేదించేవి. ఆడా, మగా చుట్ట కాల్చేవారు. చుట్ట కాలుతున్న వైపు నోట్లో పెట్టుకొని పీల్చే 'అడ్డపాగ' కళింగానికే ప్రత్యేకం. ఇలాంటి ఆహార్యం, అలవాట్లు గల చివరితరం స్త్రీలు కళింగాంధ్రలో అరుదుగాను, ఒరిస్సాలో విరివిగాను నేడు కనిపిస్తారు. ఆధునిక ప్రసార సాధనాల ప్రభావం వలన ఇక్కడి మహిళలు ఆంధ్రా ఆహార్యానికి అలవాటుపడ్డారు.

పునాదిలో ఆంధ్రతో ఇలాంటి అనేక వైరుధ్యాలున్న ఈ ప్రాంతాన్ని ఉత్తరాంధ్ర, ఉత్తర కోస్తా అనడం అన్యాయం. కళింగాంధ్ర అనడమే సబబు.

వ్యాసకర్త కవి, రచయిత । 98857 58123

నిర్వికార సాక్షి

'**బంధం**' అనే కందెన ఇరుసులో ఉండి కదిలించకుండా, మనిషి బ్రతుకుబండి ఒక్కటంటే ఒక్క అడుగు కూడా ముందుకు కదలదు. ఎన్నో కష్టాలను పడతాడు. ఇక్కట్లను ఎదుర్కొంటాడు. భయపడతాడు. దుఃఖిస్తాడు. ఆ భయంలో, దుఃఖంలో భగవంతుడిని ప్రార్థిస్తాడు. మొక్కులు మొక్కుతాడు. ఇలా ఎన్నెన్నో చేస్తాడు. ఎన్ని చేసినా 'బంధం'లోనే కొనసాగడానికి ఇష్టపడతాడుగానీ, ఆ గిరిని దాటి బయటపడదామనే ఆలోచన చేయడు. 'బంధం' నుంచి పూర్తిగా ముక్తి పొందాలని సాధారణంగా కోరుకోడు.

మొదలెక్కడో, తుది ఎక్కడో తెలియని 'కాలం' అనే మహాప్రవాహంలో సాగే నూరేళ్ళ బ్రతుకు మనిషిది! ఈ నూరేండ్ల కాలమూ ఎన్నో బాధలు పడాల్సిందే మరి! ఇంత కష్టం అనుభవిస్తూ తాపత్రయమూ, విషయలోలత్వమూ వదలకపోవడం ఎందుకు? వివేకవంతమైన పనిగా అది కనిపించదు కదా! – అని విజ్ఞులు అంటారు. 'ఇతడు నాకు కావలసినవాడు, స్నేహితుడు; ఇతడలా కాదు, అమిత్రుడు అనగా శత్రువు' అనే ఆలోచన చేసే మనిషి దృష్టి చాలా సంకుచితమైనదని చెబుతారు. ఉదారచిత్తుడైన మనిషికి ప్రపంచమంతా తన బంధువర్గంలోని మనుషులకు వలెనే కనపడతారు అంటారు. ఆలోచనలో ఆ స్థితిని ఊహించుకోవడమే చాలా కష్టమైన పని. ఇక ఆచరణలో పెట్టడం అంటేనూ, ఆ స్థితిని చేరుకోవడం అంటేనూ, చాలా స్థిర చిత్తమూ, వాంఛా విముఖత్వమూ, పరిత్యాగ బుద్ధీ తప్పనిసరిగా కావలసి ఉంటుంది.

ఉ॥ అరయ సర్వభూతసముడై పరిబోధమయాత్ముడై యహం
కారవికారభావనల గ్రాగక యుల్లము చల్లనై తమో
దూరుడు రాగరోషరహితుండునై భువన ప్రవృత్తికిన్
వారక సాక్షివోలె మనువానికి జీవిత మొప్పు నెప్పుడున్.

దృష్టిలో 'సర్వభూత సమత్వం' కనబరిచే పరిపూర్ణత కలిగి ఉండి, అత్యుత్తమమైన జ్ఞాన సంబంధ పరిజ్ఞానం కలిగియుండి, చిత్తాన్ని అహంకారము–వికారము అనే భావనలకు లొంగే బేలతనానికి దూరం చేసి, క్రోధాన్ని విడనాడి, చల్లనైన మనసుతో సర్వాన్నీ ఆలోకిస్తూ, లోకంలో సంగతులను నడిపే అభిలషణీయ, అనభిలషణీయ ప్రవృత్తులకు కందక, కుందక సమచిత్తంతో ఒక నిర్వికార సాక్షివలె వీక్షిస్తూ కాలాన్ని గడిపే వ్యక్తి మాత్రమే, ఈ జీవితాన్ని అనుభవించడానికి అర్హత కలిగిన వాడై ఉంటాడు అని మడికి సింగన రచించిన 'వాసిష్ఠ రామాయణం' చతుర్థాశ్వాసంలోని పై పద్యం వివరించి చెప్పింది.

– భట్టు వెంకటరావు



చి'వరి' ఆశ!

ఎడగారి పంటగా రెండు ఎకరాలు వరి నాటు పెట్టాను. వర్షాలు కురవక పోవడంతో.. వరి పొలం నెర్రెలుబారింది. దున్నకం, ఎరువులు,

రూ.60 వేల పెట్టుబడి పెట్టా



కూలీలకు సుమారు రూ.60 వేలు పెట్టుబడి పెట్టాను. వర్షాలు కురిస్తే చేను బతకొచ్చని ఆశతో ఉన్నా.
– ఎలిమినేటి ముత్యంరెడ్డి, రైతు, ముశిపట్ల

మోత్కూరు: ముందస్తు వర్షాలు పడతాయనే ఆశతో ఎడగారి పంట వరి నాట్లు వేశారు. నెల రోజుల క్రితం వేసిన వరి పొలం నెర్రెలిస్తుంటే రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామంలో రైతు ఎలిమినేటి ముత్యంరెడ్డి.. తనకున్న రెండెకరాల వరి పొలంలో బోరుతో చేనుకు పారిస్తున్నాడు. పక్షం రోజులకు పైగా వర్షం చినుకులు లేక.. బోరు వట్టిపోతూ అంతంత మాత్రమే పోస్తోంది. మరో పక్క తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు విపరీతంగా ఉన్నాయి. దీంతో కొద్దిపాటి పొలం తడారిపోతూ.. నాటు కీలక దశలో నీరందక ఆగి పోయింది. వరి పొలం అంతా నెర్రెలు బారింది. వరుణ దేవుడు కరుణిస్తే తన వరి చేను బతుకుతుందేమోనన్న ఆశతో ఆ రైతు నిరీక్షిస్తున్నాడు.



'బెడ్' విధానంలో గుడ్

వర్షాభావ పరిస్థితులతో పత్తి పంట సాగులో రైతులకు ఎదురవుతున్న నష్టాలను అధిగమించేలా నూతన విధానంలో సాగుకు జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రూపకల్పన చేశారు. నీళ్లు నిలిచి ఉండే భూముల్లో పత్తి పంట నష్టపోకుండా ఉండేలా.. బెడ్ విధానంలో పత్తి సాగు విధానంపై అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ విధానం ప్రయోజనకరంగా ఉండటంతో రైతులు ఆదిశగా దృష్టి సారిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామానికి చెందిన మశ్చేందర్ రెడ్డి అనే రైతు.. తన పొలంలో బెడ్ విధానంలో పత్తిని సాగు చేస్తున్నాడు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బోర్డు తిప్పేసిన చిట్‌ఫండ్ కంపెనీ

- చిట్లు కట్టిన వారికి సమాధానం చెప్పలేక ఏజెంట్ ఆత్మహత్య



శ్రీనివాస్

భద్రాచలం అర్బన్: చిట్‌ఫండ్ కంపెనీ చేసిన మోసానికి అందులో పనిచేసిన ఏజెంట్ బలయ్యాడు. కంపెనీ బోర్డు తిప్పేయడంతో చిట్టీలు కట్టిన వారు నిలదీస్తుండడంతో సమాధానం చెప్పలేక.. డబ్బు చెల్లించే మార్గం లేక ఆ ఏజెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భద్రాచలం రిక్షా కాలనీకి చెందిన గోర్స శ్రీనివాస్ (34) కనకదుర్గ ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేసేవాడు. విధినిర్వహణలో పలువురితో చిట్లు వేయించాడు. అయితే ఇటీవల చిట్‌ఫండ్ యాజమాన్యం చేతులెత్తేయడంతో డబ్బుల కోసం చిట్లు కట్టిన వారంతా శ్రీనివాస్‌పై ఒత్తిడి చేయసాగారు. వారి ఒత్తిడి తీవ్రం కావడంతో డబ్బు చెల్లించే మార్గం లేక శ్రీనివాస్ శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఊరు వెళ్లానని పిల్లలకు చెప్పండి..

ఆత్మహత్యకు ముందు తన ఆవేదనపై శ్రీనివాస్ సూసైడ్ నోట్ రాశాడు. డబ్బు కోసం చిట్టిలు కట్టిన వారు ఒత్తిడి తీసుకురావడమే కాక ఐదు రోజుల్లో చెల్లించాలని పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి బెదిరించారని అందులో రాశాడు. 'కష్టమర్ల ఒత్తిడి తట్టుకోలేక ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. నిన్ను ఒంటరిగా వదిలేసి వెళ్లడం బాధగానే ఉంది, కానీ తప్పడం లేదు. పిల్లలను మంచిగా చూసుకో, నన్ను అపార్థం చేసుకోకు'అని భార్య ప్రవల్లికను కోరాడు. 'మన ఇద్దరు బాబులు అడిగితే నాన్న ఊరు వెళ్లాడని చెప్పు, ఎందుకంటే నేను లేకుండా వారు ఉండలేరు'అని శ్రీనివాస్ సూసైడ్ నోట్‌లో రాశాడు. కాగా, ఈ ఘటనలో బాధ్యులపై చర్య తీసుకోవాలని శ్రీనివాస్ భార్య ప్రవల్లిక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ స్వప్న తెలిపారు.

కళ్లలో కారం చల్లి.. కాళ్లు, చేతులు కట్టేసి..

- వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని యువకుడిపై దాడి
- చెట్టుకు కట్టేసి కొట్టిన మహిళ కుటుంబ సభ్యులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి



జానయ్య

నకిరేకల్: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కారణంతో మహిళ భర్త, ఆయన కుటుంబ సభ్యులు ఓ యువకుడిని చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టారు. దీంతో ఆ యువకుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నోముల గ్రామానికి చెందిన నర్సింగ్ జానయ్య(35)కు ఇంకా వివాహం కాలేదు. జానయ్యకు అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళతో పరిచయం ఏర్పడి.. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. గతేడాది ఇదే విషయమై ఆ మహిళ కుటుంబ సభ్యులకు, జానయ్యకు మధ్య గొడవలు జరిగాయి. పలుమార్లు పెద్దమనుషుల మధ్య పంచాయితీలు కూడా నడిచాయి. ఇదే విషయంపై జానయ్యపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టడంతో అతడు జైలుకు వెళ్లి వచ్చాడు. జైలు నుంచి వచ్చాక కూడా జానయ్య ఆమెతో సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలిసి జానయ్యను అంతమొందించాలని ఆ మహిళ భర్త నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తన భార్యతోనే జానయ్యను శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి పిలిపించాడు. ఇంటికి వచ్చిన జానయ్య కళ్లలో కారం చల్లి.. కాళ్లు, చేతులు కట్టేసి ఆ మహిళతోపాటు ఆమె భర్త కర్రలతో చితకబాదారు. అనంతరం మరికొందరితో కలసి ఇంటి పక్కన ఉన్న వీధిలో చెట్టుకు జానయ్యను తాళ్లతో కట్టేసి అతడి తల, కాళ్లు, చేతులు, మర్మాంగాలపై విచక్షణారహితంగా కొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన జానయ్య అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. చుట్టుపక్కల వారు గమనించి జానయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి జానయ్యను నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై జానయ్య తల్లి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

రిజర్వ్‌ల బయటా పులుల రక్షణ



టైగర్స్ ఔట్‌సైడ్ టైగర్ రిజర్వ్స్ ప్రాజెక్టు చేపట్టనున్న కేంద్రం
వచ్చే మూడేళ్లలో 17 రాష్ట్రాల్లో రూ.88 కోట్లతో రక్షణ చర్యలు
తెలంగాణలోని అమ్రాబాద్, కవ్వాల్ రిజర్వ్‌లలో అమలు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా పట్టణీకరణ పెరుగుతుండటంతో అడవుల విస్తీర్ణం వేగంగా తగ్గిపోతోంది. దాంతో ఆ అడవులనే ఆవాసంగా చేసుకొని బ్రతికే జంతువులు జనావాసాల్లోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో మనిషికి- వన్యప్రాణులకు మధ్య ఘర్షణ అనివార్యమవుతోంది. ముఖ్యంగా పులుల ఆవాసాలు తగ్గిపోవటంతో అవి గ్రామాల్లోకి వచ్చి మనుషులు, పెంపుడు జంతువులపై దాడులకు తెగబడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆధ్వర్యంలో త్వరలోనే 'టైగర్స్ ఔట్‌సైడ్ టైగర్ రిజర్వ్స్'అనే కొత్త ప్రాజెక్టును ప్రారంభించబోతోంది. ఈ సమస్య అధికంగా ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర తదితర 17 రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టు ద్వారా పులులు సంచరిస్తున్న టైగర్ రిజర్వ్‌లకు బయట ఉన్న 80 ఫారెస్ట్ డివిజన్లపై దృష్టి సారించనున్నారు. ఆయా డివిజన్లలో కెమెరా ట్రాపులు, కృత్రిమ మేధ ఆధారిత ఎర్లీ వార్నింగ్ సిస్టమ్‌లు ఏర్పాటుచేస్తారు. వీటి ద్వారా పులుల కదలికలను గుర్తించి హెచ్చరికల జారీచేయటం, డేటా కలెక్షన్, పెట్రోలింగ్ చేపడుతారు. ఆ పనులు స్థానిక యువతకు అప్పగించి, వారికి ఉపాధి కల్పిస్తారు. వన్యప్రాణులతో ఘర్షణలు ఎదురైతే వెంటనే రంగంలోకి దిగేలా 'ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్'లను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్టును 2025–26 నుంచి 2027–28 దాకా రూ.88.7 కోట్ల అంచనా వ్యయంతో అమలు చేయనున్నారు.

తెలంగాణలో పెరుగుతున్న సమస్య

తెలంగాణలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్) పేరుతో ముఖ్యమైన పులుల సంరక్షణ ప్రాంతాలు ఉన్నాయి. ఏటీఆర్‌లో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరగటం, అవి వేటాడే జింకలు, ఇతర జంతువుల సంఖ్య తక్కువగా ఉండడంతో పులులకు ఆహార సమస్య పెరిగినట్టు ఇటీవల ఓ నివేదిక తేల్చింది. కేటీఆర్‌లో మాత్రం ఒక్క పులి కూడా ఆవాసం ఏర్పరుచుకోలేదు. మహారాష్ట్ర టైగర్ రిజర్వ్‌లలో పులుల సంఖ్య పెరగటంతో అక్కడి నుంచి మహారాష్ట్ర–తెలంగాణ (ఆదిలాబాద్ జిల్లా) టైగర్ కారిడార్, చుట్టుపక్కల ప్రాంతాలకు వలస వస్తున్నాయి. ఆ సమయంలో మనుషులతో వాటికి ఘర్షణ తప్పటం లేదు. 2016–2025 మధ్య ఆదిలాబాద్ ప్రాంతంలోనే మానవ చర్యల వల్ల 10 పులుల దాకా చనిపోయాయి. ఈ నేపథ్యంలో కేటీఆర్ లోపల, బయట పెద్ద పులులు శాశ్వత నివాసం ఏర్పరుచుకునేందుకు.. ఏటీఆర్ లోపల, వెలుపల వాటి సంఖ్య వృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

టైగర్స్ ఔట్‌సైడ్ టైగర్ రిజర్వ్స్ ప్రాజెక్టు ఆవశ్యకత..

- దేశంలో సుమారు 30% పులులు (దేశంలోని మొత్తం 3,682 పులుల్లో) టైగర్ రిజర్వ్‌ల వెలుపల జీవిస్తున్నాయి. దీంతో వాటికి మనుషులతో ఘర్షణలు రోజురోజుకు పెరుగుతున్నాయి.
- రక్షిత ప్రాంతాలకు బయట సంచరిస్తున్న పులుల కోసం సహాయక వ్యవస్థలు ఏర్పాటుచేస్తారు.
- ప్రజలకు అవగాహన కల్పించి వారి భాగస్వామ్యంతోనే పులుల పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతారు.
- రైతుల జీవనోపాధి కాపాడడమే కాకుండా పులులపై ప్రతీకార చర్యల నివారణకు కృషి చేస్తారు.
- పులుల సంచార మార్గాలను గుర్తించి, వాటికి భద్రత కల్పించేందుకు ముందుగానే చర్యలు చేపడుతారు.

యాదగిరిగుట్టలో భక్తులకు అభిషేక తీర్థ జలంతో ప్రోక్షణ



భక్తులపై అభిషేక తీర్థ జలాన్ని చల్లి ప్రోక్షణ చేస్తున్న ప్రధానార్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో నూతనంగా సనాతన పూజకు అర్చకులు శ్రీకారం చుట్టారు. శ్రీస్వామివారిని అభిషేకించిన తీర్థ జలాలను భక్తులపై చల్లుతూ ప్రోక్షణ వేడుకను అర్చకులు శనివారం పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం ప్రారంభించారు. ప్రత్యేక దర్శనం, ధర్మ దర్శనం క్యూలైన్లలో వచ్చే భక్తులకు ఆలయ ముఖ మండపంలోని హుండీల చెంత వారిపై తీర్థ జలం చల్లే ప్రోక్షణ వేడుకను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు ప్రారంభించారు. విష్ణు పుష్కరిణిలోని జలాలతో శ్రీస్వామి వారికి అభిషేకించి, ఆ నీటితో భక్తులకు ప్రోక్షణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని, భక్తుల శరీరం పవిత్రం అవుతుందని అర్చకులు పేర్కొన్నారు. అలాగే గర్భాలయం వద్ద భక్తులకు అఖండ హారతి ఇచ్చే కార్యక్రమాన్ని అర్చకులు ప్రారంభించారు. ఆవు నెయ్యితో చేసిన దీపారాధనను హారతి ఇవ్వడం వల్ల భక్తులకు మంచి జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, అధికారులు జూశెట్టి కృష్ణ, రాజన్‌బాబు, గజివెల్లి రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదం తయారీకి నూతన బాయిలర్లు

- యాదగిరిగుట్ట క్షేత్రంలో ఏర్పాటు



అభిషేకం లడ్డూ నాణ్యతను పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రసాద విక్రయశాల, తయారీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు బాయిలర్లకు ఆలయ ఈవో వెంకట్రావు శనివారం పూజలు చేశారు. ఒక్కొక్క బాయిలర్‌కు 40 నిమిషాలకు 102 కిలోల ప్రసాదం తయారు చేసే సామర్థ్యం ఉంటుందని ఈవో చెప్పారు. భక్తులకు ఆలయంలో నిరంతర ప్రసాద వితరణ చేస్తున్న నేపథ్యంలో.. ఈ బాయిలర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రసాదం తయారీలో లడ్డూ, పులిహోర ప్రసాదాల నాణ్యతను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అఖండ దీపారాధన ప్రదేశంలో నూతనంగా భక్తులకు లడ్డు, పులిహోర (అమ్మకం) టికెట్ కౌంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఈవో భాస్కర్‌శర్మ ఉన్నారు.

500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్

- ప్రభుత్వ ఆదేశంతో రాష్ట్రంలో తొలిసారి వినూత్న విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు
- డీపీఆర్ తయారీ బాధ్యత వ్యాప్కోస్‌కు అప్పగింత
- మూతపడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని నీటి సంపు ఆధారంగా ప్లాంట్ నిర్మాణం
- సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థ థర్మల్, సోలార్ పవర్ ప్లాంట్‌లతోపాటు కొత్తగా పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు నడుం బిగించింది. కేవలం బొగ్గు ఆధారంగా సింగరేణి మనుగడ కష్ట సాధ్యమని భావించిన సంస్థ యాజమాన్యం, ఇప్పటికే విద్యుత్ ఉత్పాదన రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తొలిసారిగా 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం మేరకు సింగరేణి సంస్థ ఈ ప్లాంట్ నిర్మాణానికి సిద్ధమైంది. దీనికి సంబంధించి ప్రాథమిక అధ్యయనాలు పూర్తిచేసిన కంపెనీ, సంపూర్ణ ప్రాజెక్టు రిపోర్ట్ రూపొందించడానికి వ్యాప్కోస్ లిమిటెడ్ అనే ప్రభుత్వ రంగ సంస్థకు బాధ్యతలను అప్పగిస్తూ లెటర్ ఆఫ్ అవార్డును (ఎల్‌ఓఏ)ను ఇచ్చినట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. శనివారం సంస్థ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో దీనిపై చర్చించారు. ఈ తరహా ప్రాజెక్టు రాష్ట్రంలో ఇప్పటి వరకు లేదని, సింగరేణి సంస్థ దీనిని ప్రయోగాత్మకంగా చేపట్టడమే కాక విజయవంతంగా నిర్వహిస్తుందన్న నమ్మకం తమకుందని ఆయన చెప్పారు. ప్లాంటును ఏర్పాటు చేయనున్న రామగుండం ప్రాంతంలోని మేడిపల్లి ఓపెన్ కాస్ట్ సంపును, నిర్మాణ ప్రాంతాన్ని డిప్యూటీ సీఎం సందర్శించారని, ఈ వినూత్న ప్రాజెక్టును చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

157 మీటర్ల లోతున భారీ నీటి సంపు..

వ్యాప్కోస్ లిమిటెడ్ సంస్థ జియోలాజికల్, జియోటెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలతో పాటు సివిల్ డిజైన్లు, ఉత్పత్తి సామర్థ్య అంశాలు, మెకానికల్, ఎలక్ట్రికల్ డిజైన్లు, పర్యావరణ సంబంధ అంశాలు, రక్షణ చర్యలు వంటి విషయాలపై సమగ్ర అధ్యయనాన్ని జరిపి డీపీఆర్‌ను రూపొందిస్తుందని బలరామ్ వివరించారు. అలాగే ప్లాంట్ నిర్మాణానికి పట్టే సమయం, నిర్మాణపు ఖర్చు, ప్లాంట్ పూర్తయిన తర్వాత ఉత్పత్తి అయ్యే విద్యుత్ అమ్మకాలకు గల అవకాశాలు.. తదితర అనేక విషయాలను డీపీఆర్‌లో పొందుపరచి నివేదిక ఇస్తుందని తెలిపారు. ప్రస్తుతం మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని సుమారు 157 మీటర్ల లోతున భారీ నీటి సంపుగా ఏర్పడి, ఏడాది పొడుగునా భారీ పరిమాణంలో నీటి నిలువతో ఉంటుందని చెప్పారు. ఈ నీటిని ఉపరితలంపై నిర్మించనున్న దాదాపు ఇదే పరిమాణం గల మరో భారీ నీటి రిజర్వాయర్ లోనికి పగటిపూట సోలార్ విద్యుత్ ద్వారా పంపింగ్ జరిపి, ఆ నీటిని రాత్రివేళ కిందికి పంపిస్తూ.. ఆ జల శక్తితో మధ్యలో ఏర్పాటు చేసిన టర్బైన్లను తిప్పడం వల్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని వివరించారు.

ఉపరితలంపై 2,350 మీటర్ల పొడవుతో రిజర్వాయర్

ఉపరితలంపై నీటి నిల్వ కోసం సుమారు 2,350 మీటర్ల పొడవుతో 23 మీటర్ల లోతు గల రిజర్వాయర్ డ్యామ్‌ను నిర్మిస్తామని బలరామ్ వెల్లడించారు. ఈ రిజర్వాయర్‌లో 9.64 మిలియన్ క్యూబిక్ మీటర్ల పరిమాణం గల నీటిని నిలువ చేసి దీనిలో నుంచి పంపింగ్ కోసం 8 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని వినియోగిస్తారన్నారు. ప్రాజెక్టు వ్య యం సుమారు రూ.3,000 కోట్ల వరకు ఉండొచ్చని అంచ నా వేస్తున్నామని తెలిపారు. వ్యాప్కోస్ సంస్థ డీపీఆర్ సిద్ధం చేయగానే నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచే అవకాశం ఉందని చెప్పారు.

పొలం రిజిస్ట్రేషన్‌కు డబ్బులు డిమాండ్

- తహసీల్దార్‌కు లంచం ఇస్తూ వీడియో తీసిన రైతు



డబ్బులు తీసుకుంటున్న తహసీల్దార్ రాజారావు

అశ్వాపురం: పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న పొలాన్ని తన అవసరం నిమిత్తం ఓ రైతు అమ్మేందుకు స్లాట్ బుక్ చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా.. రిజిస్ట్రేషన్‌కు తహసీల్దార్ డబ్బు డిమాండ్ చేశాడు. దీంతో ఆ రైతు తహసీల్దార్‌కు డబ్బులు ఇస్తూ వీడియో తీయగా, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం నెల్లిపాక గ్రామానికి చెందిన ఓ రైతు తన అవసరం నిమిత్తం మరో రైతుకు 20 గుంటల పొలం అమ్మాడు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేశాక రిజిస్ట్రేషన్‌కు కోసం వెళ్లగా ఇద్దరు రైతులను కలిపి తహసీల్దార్ రాజారావు రూ.15 వేలు డిమాండ్ చేశాడు. వారు అవాక్కయి పాస్ బుక్ ఉందని, రిజిస్ట్రేషన్‌కు డబ్బులు ఎందుకని ప్రశ్నించగా ఫార్మాలిటీ ఇవ్వాల్సిందే అన్నాడు. కానీ వారు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ రోజు రిజిస్ట్రేషన్ చేయలేదు. మరునాడు పొలం అమ్మిన రైతు రూ.5 వేలు ఇస్తానని చెప్పడంతో తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశాడు. ఆపరేటర్‌కు రూ.1,000 ఇచ్చాడు. అయితే తహసీల్దార్‌కు రూ.5 వేలు ఇస్తూ రైతు తన మొబైల్‌లో వీడియో తీశాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుండటంతో రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తహసీల్దార్‌పై బదిలీ వేటు: తహసీల్దార్ రాజారావును బదిలీ చేస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. రైతు నుంచి ఆయన నగదు తీసుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పోస్టింగ్ ఇవ్వకుండా కలెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించగా, అశ్వాపురం డీటీ ఎస్‌కే రషీద్‌ను తహసీల్దార్‌గా (ఎఫ్‌ఏసీ) నియమించారు.

ఇద్దరు బాలికల బలవన్మరణం

- తల్లిదండ్రులు మందలించారని ఉరేసుకున్న అక్కాచెల్లెళ్లు



వెనీల, అఖిల

పహాడీషరీఫ్: తల్లిదండ్రులు మందలిస్తున్నారనే కారణంతో అక్కాచెల్లెళ్లు బలవన్మరణానికి పాల్పడ్డారు. శనివారం బాలాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ కథనం ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన వెంకటేశ్, రమణమ్మ దంపతులు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో స్థిరపడ్డారు. వీరికి వెనీల (17), అఖిల(16) సంతానం. వీరు ఇంటర్ ద్వితీయ, ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. డిఫెన్స్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసే వెంకటేశ్‌ను మూడు నెలల కోసం బాలాపూర్ ఆర్‌సీఐకి బదిలీ చేశారు. దీంతో వారు మూడు వారాల క్రితం కుటుంబంతో సహా వచ్చి మల్లాపూర్‌లోని శుభోదయ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా కుమార్తెలు అప్పుడప్పుడు ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్తుండడంతో తల్లిదండ్రులు మందలించేవారు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం వెంకటేశ్ డ్యూటీకి, అతని భార్య కిరాణా దుకాణానికి వెళ్లిన సమయంలో ఇద్దరు కుమార్తెలు వెంటిలేటర్ గ్రిల్స్‌కు చున్నీలతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కాసేపటికి ఇంటికి వచ్చి చూసిన రమణమ్మ ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహేశ్వరం ఏసీపీ జానకీ రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. గతంలో వెనీల బెంగళూరులో అదృశ్యం కావడంతో వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ప్రేమ వ్యవహారాల కారణంగానే తల్లిదండ్రులు మందలించినట్లుగా విశ్వసనీయ సమాచారం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

'పెన్షనర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి మార్చుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: పెన్షనర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరి మార్చుకోవాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌నారాయణ, నర్సరాజు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాబోయే పీఆర్సీలో పెన్షనర్లకు తీవ్ర అన్యాయం చేసే పద్ధతిలో చట్టం అమలులోకి తెస్తోందని, ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 23 అన్ని జిల్లా కలెక్టర్లకు లేఖతో నిరసన చేస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌కు టచ్‌లో ఉన్న ఇంజనీర్లపై నిఘా..!

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతోంది. బీఆర్‌ఎస్ నేతలతో సన్నిహితంగా ఉన్నారని భావిస్తున్న వారిని కీలక స్థానాల నుంచి తప్పించాలని ఆదేశించినట్టు, ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన వారిపైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్టు అధికారవర్గాల సమాచారం. కాళేశ్వరం పరిధిలోని నిర్మాణాల్లో అవకతవకలు జరిగినట్టు భావిస్తున్న వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా ఆ వర్గాలు చెబుతున్నాయి. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లా విజిలెన్స్ అధికారులు నీటిపారుదల శాఖలోని ఇంజనీర్లకు ఇటీవల నోటీసులు జారీ చేసిన అంశాన్ని గుర్తు చేస్తున్నారు. కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు ఏసీబీ దాడుల్లో పట్టుపడుతున్న ఇంజనీర్లు వందల కోట్ల మేర అక్రమ ఆస్తులను అందుకు ఉదాహరణగా చూపుతున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేసింది. దీనితో ఆ పార్టీ ముఖ్యనేతలతో కొందరు ఇంజనీర్లకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఈ అనుమానాలను ధ్రువీకరిస్తూ ఇటీవల ప్రభుత్వానికి నిఘా వర్గాలు నివేదిక ఇచ్చినట్టు సమాచారం. దీని మేరకు కొందరు ఇంజనీర్లపై అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ)తో దాడులు జరిపించడంతోపాటు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సిఫారసుల ఆధారంగా మరికొందరిపై చర్యలకు శ్రీకారం చుట్టారని చర్చ జరుగుతోంది. విజిలెన్స్ సిఫారసుల ఆధారంగా ఏకంగా 38 మంది ఇంజనీర్లు, మాజీ ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు జారీకావడం శాఖలో ప్రకంపనలు సృష్టించింది.

సర్కారుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారనీ...

ఏసీబీ కాళేశ్వరం ప్రాజెక్టు గజ్వేల్ ఈఎన్‌సీతోపాటు కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా రెండు హోదాల్లో కీలకంగా కొనసాగిన బి.హరిరామ్‌ను తొలుత ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గత ఏప్రిల్ 26న అరెస్టు చేసింది. అలాగే, వేరే చోటికి బదిలీ చేసినా ఏడాదికాలంగా ఎస్సారెస్పీ డివిజన్–8 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కొనసాగుతున్న నూనె శ్రీధర్‌ను సైతం ఏసీబీ ఈ నెల 11న అరెస్టు చేసింది. తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడైనప్పటికీ ప్రభుత్వం ఆయన్ను ఏసీబీ కేసులో అరెస్టు చేయడం గమనార్హం. ప్రభుత్వం మారినా బీఆర్‌ఎస్ ముఖ్యులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్టు నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదించడంతోనే వీరిపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించినట్టు సమాచారం. సాగునీటి రంగంలో గత ప్రభుత్వ నిర్ణయాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా తప్పుబడుతుండగా, కొందరు అధికారులు గత ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తూ రావడం ప్రభుత్వ పెద్దల దృష్టికి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన ఫైళ్ల కాపీలు ప్రతిపక్ష నేతలకు వెళ్లడంతోనే ప్రభుత్వం సీరియస్ అయినట్టు సమాచారం.

నివేదిక రెండు నెలలు కోల్డ్ స్టోరేజీలో..

కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావును విచారించింది. వీరిని కమిషన్ ప్రశ్నించనున్నట్టు సమాచారం రాగానే ప్రభుత్వం వ్యూహాత్మకంగా కొందరు ఇంజనీర్లపై ఏసీబీ దాడులు చేయించినట్టు బీఆర్‌ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో 38 మంది ఇంజనీర్లు అవకతవకలకు పాల్పడినట్టు విజిలెన్స్ విభాగం గుర్తించిందని, వీరిపై చర్యలు తీసుకోవాలంటూ గత మార్చి 18న విజిలెన్స్ కమిషన్ సిఫారసు చేసింది. రెండు నెలల పాటు కోల్డ్ స్టోరేజీలో ఉన్న ఈ సిఫారసుల లేఖను సరిగ్గా కేసీఆర్ విచారణ కమిషన్ ఎదుట హాజరు కావడానికి ముందు ప్రభుత్వం బయట పెట్టినట్టు బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కమిషన్ సమన్ల ప్రకారం ఈ నెల 5న కేసీఆర్ విచారణకు హాజరు కావాల్సి ఉండగా, 2న విజిలెన్స్ కమిషన్ లేఖను ప్రభుత్వం మీడియాకు లీక్ చేసినట్టు గుర్తు చేస్తున్నారు.

జంట భూకంపాలా? అణుపరీక్షలా?

వారం రోజుల వ్యవధిలో ఇరాన్‌లో రెండుసార్లు భూప్రకంపనలు

- అణుపరీక్ష వల్లే అణుకేంద్రాలు ధ్వంసమయ్యాయా?
- తెరమీదకు కొత్త అనుమానాలు, విశ్లేషణలు

ఇజ్రాయెల్ విశ్రాంతి లేకుండా విరుచుకుపడుతుంటే ఇరాన్ ఓవైపు ప్రతిదాడి చేస్తూనే మరోవైపు అణుపరీక్షలు జరిపిందన్న వార్తలు ఒక్కసారిగా సంచలనం సృష్టించాయి. అయితే ఈ వార్తల్లో నిజమెంత? అనే ప్రశ్న వెంటనే తలెత్తింది. ఈ వార్తల్లో వాస్తవముందని వాదించే వాళ్లు రెండు అంశాలను తెరమీదకు తెచ్చారు. ఈ వారం మొదట్లో ఇరాన్‌లో రిక్టర్ స్కేల్‌పై 2.5 తీవ్రతతో ఒకసారి భూకంపం వచ్చింది. తాజాగా శుక్రవారం 5.1 తీవ్రతతో మరోసారి భూకంపం సంభవించింది. భీకరపోరు చేస్తున్న దేశంలో వెంటవెంటనే భూకంపాలు రావడం, అదికూడా అంతరిక్ష కేంద్రం, క్షిపణి ఉత్పత్తి కర్మాగారాలు ఉన్న సెమ్నాన్ ప్రావిన్సులోనే సంభవించడంతో ఈ అనుమానాలు బలపడుతున్నాయి. ఓవైపు అణుబాంబును తయారుచేసే స్థాయికి యురేనియంను ఇరాన్ ఇంకా శుద్ధిచేయలేదన్న వార్తలొస్తుండగా అణుపరీక్షల వేళ అణుబాంబు పేల్చడం వల్లే భూమి కంపించి అది రిక్టర్ స్కేల్‌పై నమోదైందని మరికొందరు వాదిస్తున్నారు. వీటిల్లో నిజమెంత అనే దానిపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. అవి భూకంపనాలు కాదు, అణుబాంబు పేలేనని నిర్ధారణ అయితేగనక ప్రపంచంలో పదో అణ్వస్త్రదేశంగా ఇరాన్ అవతరించిందని భావించాల్సి ఉంటుంది. అప్పుడు అణ్వస్త్రదేశంపై దాడులను కొనసాగించడంపై ఇజ్రాయెల్, దానికి మద్దతు పలకడంపై అమెరికా పునరాలోచన చేయడం ఖాయం.

తొలుత ఫోర్డోలో.. తర్వాత సెమ్నాన్‌లో..

ఇజ్రాయెల్ క్షిపణిదాడుల తర్వాతే ఫోర్డోలో 2.5 తీవ్రతతో అదే రోజు భూకంపం సంభవించింది. ఇది జరిగిన ఐదు రోజులకు అంటే జూన్ 20వ తేదీ రాత్రి 9.19 గంటలకు ఉత్తర ఇరాన్‌లో 5.1 తీవ్రతతో మరోసారి భూమి కంపించింది. సెమ్నాన్‌కు ఆగ్నేయంగా 36 కిలోమీటర్ల దూరంలో భూఉపరితలానికి 10 కి.మీ.ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ భూకంపం ధాటికి ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా సమీప ప్రాంతాల్లో భూమి బాగా కంపించింది. ఇదే సమయంలో నటాంజ్, ఫోర్డో యురేనియం శుద్ధి కర్మాగారాలపై ఇజ్రాయెల్ బాంబులవర్షం కురిపించింది. దీంతో ఈ అణుకేంద్రాలు దెబ్బతిన్నాయి. ప్రైవేట్ ఉపగ్రహ చిత్రాల్లో చూస్తే అణుకేంద్రాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోందిగానీ వినాశనానికి కారణం బాంబు దాడులా, అణుబాంబు పేలుళ్ల అనేది ఎవరికీ తెలీడం లేదు.

అవి నిజమైన భూకంపాలంటూ మరో వాదన

తాజా భూప్రకంపనలు కేవలం భూకంపాల కారణంగా సంభవించాయని, అణుపరీక్షలు జరగలేదని కొందరు వాదిస్తున్నారు. దీనికి చారిత్రక నేపథ్యం ఉంది. ఇరాన్ భౌగోళికంగా భూకంపాలు తరచూ సంభవించే ప్రాంతంలో ఉంది. ఆల్పైన్-హిమాలయన్ భూకంప పట్టీలో ఇరాన్ ఉంది. ఇక్కడ ఏటా సూక్ష్మస్థాయిలో ఏకంగా 2,000 భూకంపాలు వస్తాయి. రిక్టర్ స్కేల్‌పై 5 అంతకంటే ఎక్కువ తీవ్రతతో డజనుకుపైగా భూకంపాలు నమోదవుతాయి. 2006 నుంచి 2015 ఏడాదిదాకా గణాంకాలను పరిశీలిస్తే ఇరాన్‌లో 96,000 సార్లు భూకంపాలు వచ్చాయి. సాధారణంగా భూగర్భంలో అణుపరీక్షలు జరిపితే భూమి పైపై పొరలపై ఒత్తిడి కల్గి స్వల్పస్థాయిలో భూమి కంపిస్తుందని యూఎస్ జియోలాజికల్ సర్వే(యూఎస్‌జీఎస్) పేర్కొంది. అణుబాంబు పేలిన కారణంగా మొదలయ్యే భూకంపం తీవ్రత కొంతదూరానికే పరిమితమవుతుంది. అణుబాంబు పేలితే కేవలం పీ-బ్యాండ్ తరంగాలే ఉద్భవిస్తాయి. నిజంగా భూకంపం వస్తే పీ-బ్యాండ్‌తోపాటు ఎస్-బ్యాండ్ తరంగాలు కూడా వస్తాయి. ఎస్-బ్యాండ్ తరంగాలు తమ కేంద్రస్థానం నుంచి వెదజల్లబడి సూక్ష్మస్థాయిలో తిరిగి కేంద్రాన్ని చేరతాయి. పలు రకాల పరికరాల ద్వారా భూకంప శాస్త్రవేత్తలు దీనిని గుర్తించగలరు. ఈ లెక్కన 2.5 తీవ్రతతో వచ్చిన భూప్రకంపనలకు సహజ భూకంపమే కారణమని నిపుణులు నిర్ధారించారు. అయితే భూకంపం వచ్చిన అదే సమయానికి అదే ప్రాంతంలో ఇజ్రాయెల్ దాడులు చేయడం గమనార్హం

ఆపరేషన్ సిందూర్ వేళ..

మే నెలలో నాలుగురోజులపాటు పాకిస్తాన్‌పై భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' భీకర దాడుల వేళ సైతం పాకిస్తాన్‌లో భూకంపాలు సంభవించాయి. దీంతో పాకిస్తాన్‌లో అణుపరీక్షలు జరిగాయనే వాదన వినిపించింది. అయితే ఆ వాదన తప్పు అని తర్వాత తేలింది. సమగ్ర అణ్వస్త్ర వ్యాప్తినిరోధక ఒప్పందం(సీటీబీటీఓ), యూఎస్‌జీఎస్, స్వతంత్ర్య భూగోళశాస్త్ర అధ్యయనకారుల వాదన ప్రకారం ఒకవేళ భూప్రకంపనలు నమోదైతే, వాటి కేంద్రాన్ని 10 కి.మీ.ల లోతులో గుర్తిస్తే అది ఖచ్చితంగా సహజ భూకంపమే. ఎందుకంటే పది కిలోమీటర్ల లోతుకు భూమిని తవ్వి అక్కడ అణుబాంబును పేల్చడం అసాధ్యం. శుక్రవారం నమోదైన భూకంపం సంబంధ నాభి స్థానాన్ని 10 కి.మీ.ల లోతులో గుర్తించారు. ఈ లెక్కన ఇరాన్‌లో అణుపరీక్షలు జరగలేదనే వాదన తాజాగా బలపడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్




ఇజ్రాయెల్ తీర నగరం నెతన్యా వైపు దూసుకెళ్తున్న ఇరాన్ రాకెట్

ఇస్ఫహాన్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ భీకర దాడులు

ఖుద్స్ ఫోర్స్ కమాండర్ ఇజాదీ సహా ముగ్గురు సీనియర్ కమాండర్లు అంతం

- టెల్‌అవీవ్‌లో మొస్సాద్ ఆఫీస్‌లపై ఇరాన్ క్షిపణుల హోరు
- అమెరికా జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించిన ఇరాన్
- చర్చల కోసం తుర్కియే వెళ్లిన ఇరాన్ విదేశాంగ మంత్రి
- 2 వారాల్లో తేల్చుకుంటే నేనేం చేస్తానో నాకే తెలియదన్న ట్రంప్
- గ్వామ్ దీవి దిశగా బయల్దేరిన స్టెల్త్ బాంబర్ విమానం



టెల్‌అవీవ్‌పైకి వచ్చిన క్షిపణులను అడ్డుకుంటున్న ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు

టెహ్రాన్/టెల్ అవీవ్/దుబాయ్/న్యూఢిల్లీ/వాషింగ్టన్: ఇరాన్ అణుబాంబు తయారీ క్రతువును కట్టడిచేసేందుకు కంకణం కట్టుకునిమరీ కదనరంగంలోకి దూకిన ఇజ్రాయెల్ అదే పనిలో బిజీగా మారింది. ఇరాన్‌లోని ప్రముఖ ఇస్ఫహాన్ అణుకేంద్రంపై శనివారం తెల్లవారుజామున ముప్పేట దాడికి తెగించింది. దీంతో న్యూక్లియర్ ప్లాంట్ పాడైపోయింది. అయితే అణుకేంద్రం నుంచి రేడియోధార్మికత, విష వాయువులు వెలువడలేదని వార్తలొచ్చాయి. వారం క్రితం సైతం యుద్ధం మొదలైన వెంటనే ఇదే ప్లాంట్‌పై ఇజ్రాయెల్ స్వల్పస్థాయిలో దాడిచేసింది. ప్లాంట్‌లో ఇంకా కొన్ని అణుబాంబు తయారీకి పనికొచ్చే కీలక పరికరాలు భద్రంగా ఉన్నాయనే అనుమానంతో శనివారం ఇలా మరోసారి దాడిచేసింది. ఇరాన్ సుప్రీంనేత అయతొల్లా అలీ ఖమేనీ సృష్టించిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ)లో విదేశీ విభాగమైన ఖుద్స్ ఫోర్స్‌లో సీనియర్ కమాండర్లను దాడుల్లో ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. వీరిలో కమాండర్ సయీద్ ఇజాదీ సైతం ఉన్నారు. ఖ్వామ్ సిటీలో జరిగిన దాడిలో ఇజాదీ మరణించారని ఇరాన్ సైతం ధ్రువీకరించింది. 2023అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి చేసిన హమాస్‌కు అన్నిరకాలుగా సాయంచేసిన కమాండర్ సయీదేనని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఖుద్స్ ఫోర్స్‌లో ఆయుధాల తరలింపు యూనిట్ కమాండర్ అయిన బెహ్నామ్ షాహ్రియారీని పశ్చిమ ఇరాన్‌లో కారులో ప్రయాణిస్తుండగా దాడి చేసి హతమార్చారు. గురువారం అర్ధరాత్రి తర్వాత జరిగిన దాడిలో ఇరాన్ డ్రోన్ విభాగ కమాండర్‌ను సైతం ఇజ్రాయెల్ చంపేసింది. ఖుద్స్ ఫోర్స్ అనేది విదేశాల్లో సైనిక, నిఘా కార్యకలాపాల బాధ్యతలు చూసుకుంటుంది. మహ్వాజ్‌లోని క్షిపణి లాంఛర్ల స్టోరేజీ, సైనికస్థావరాలపైనా తమ యుద్ధవిమానాలు 50 సార్లు దాడిచేశాయని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్(ఐడీఎఫ్) తెలిపింది. దాడుల్లో మరణించిన తమ అణుశాస్త్రవేత్తల సంఖ్య 10కి పెరిగిందని ఇరాన్ ఒప్పుకుంది. గతవారం జరిగిన దాడిలో న్యూక్లియర్ సైంటిస్ట్ ఇసార్ తబాతబీ ఘోమ్మే చనిపోయారని పేర్కొంది. ఖుజెస్తాన్ ప్రావిన్సులో చాలా చోట్ల బాంబుపేలుళ్ల శబ్దాలు వినిపించాయి. హూవేజే సిటీలోని ఎమర్జెన్సీ సెంటర్, అహ్వాజ్ వైద్య విశ్వవిద్యాలయం పైనా క్షిపణి దాడి చేశారు. దాడుల్లో పశ్చిమ ఇరాన్‌లోని సుమార్‌లో ఐదుగురు ఇరాన్ సైనికులు చనిపోయారు. ఇంటర్నెట్ సేవలు దాదాపు నిలిచిపోవడంతో అసలు దేశంలో ఏం జరుగుతుందో తెలీక ఇరానీలు మరింత భయపడిపోతున్నారు. దేశం నుంచి పారిపోతున్న వారి సంఖ్య పెరిగింది. సరిహద్దులకు దారితీసే రహదారులపై జనం పెద్దసంఖ్యలో కనిపిస్తున్నారు.

ప్రతిదాడులు చేసిన ఇరాన్

ఏకబిగిన క్షిపణులను ఎక్కుపెడుతున్న ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ సైతం బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ముఖ్యంగా నిఘా సంస్థ మొస్సాద్‌కు చెందిన కార్యాలయాలపై దాడులను తీవ్రతరంచేసింది. పెద్దసంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది. కొన్నింటిని నేలకూల్చామని ఇజ్రాయెల్ బలగాలు తెలిపాయి. అయితే ఇజ్రాయెల్ గగనతల రక్షణవ్యవస్థలను ఛేధించిమరీ డ్రోన్లు లక్ష్యాలను ఢీకొట్టాయి. ఇజ్రాయెల్ నగరాలైన బాట్ యామ్, టెల్ అవీవ్‌లలో దాడుల భయంతో జనం వీధుల్లోకి రావడం మానేశారు. దీంతో చాలా వరకు వీధులు నిర్మానుష్యంగా తయారయ్యాయి.

ఇరాన్ అధ్యక్షుడితో మేక్రాన్ ఫోన్ మంతనాలు

స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో యూరప్ దేశాల విదేశాంగ మంత్రులతో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ శుక్రవారం జరిపిన మధ్యవర్తిత్వ చర్చలు ఎటూ తేలకపోవడంతో ఈసారి వేదికను తుర్కియేకు మార్చారు. ఇస్తాంబుల్‌లో చర్చలు శనివారం రాత్రే మొదలవుతాయని తొలుత వార్తలొచ్చాయి. ఈ యుద్ధంలో అమెరికా జోక్యంచేసుకుంటే పరిణామాలు అత్యంత దారుణంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. అమెరికా జోక్యం చేసుకుంటే ఎర్రసముద్రంలో అమెరికా రవాణా నౌకలపై దాడులుచేస్తామని యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు శనివారం ప్రకటించారు. 'అణు'చర్చలు జరగకూడదనే దురుద్దేశంతోనే ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ అన్నారు. మరోవైపు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఫోన్‌లో మంతనాలు జరిపారు. ఇస్తాంబుల్‌లో మధ్యవర్తిత్వ చర్చలు సఫలీకృతం అయ్యేలా కృషిచేస్తానని మసూద్‌కు మాటిచ్చానని మేక్రాన్ చెప్పారు.

ప్రాణాలతో బయటపడిన మాజీ సలహాదారు

జూన్ 13నాటి దాడుల నుంచి ఇరాన్ సుప్రీంనేత ఖమేనీ సలహాదారు, మాజీ సెక్యూరిటీ చీఫ్ అలీ షామ్‌ఖానీ గాయాలతో తప్పించుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో కోలుకుంటున్నారు.

మాటమార్చిన ట్రంప్

మరికొద్దివారాల్లో అణుబాంబును ఇరాన్ తయారుచేసే ప్రమాదం ముంచుకురావడంతోనే ఇజ్రాయెల్ దాడులను మొదలెట్టిందని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌కు అంతటి సామర్థ్యంలేదని మీ నిఘా విభాగమే తేల్చిచెప్పిందని మీడియా ఆయనను ప్రశ్నించగా ట్రంప్ కోపగించుకున్నారు. ''ఆ మాట ఎవరన్నారు?'అని ఎదురు ప్రశ్నించారు. నేషనల్ ఇంటెలిజెన్స్ మహిళా డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ మార్చినెలలో కాంగ్రెస్ ఎదుట ఇదే విషయం చెప్పారని మీడియా గుర్తుచేసింది. దీంతో ట్రంప్ వెంటనే ''ఆమె అబద్ధం చెప్పారు. నేను చెప్పిందే నిజం. త్వరలో ఇరాన్ అణుబాంబు సిద్ధమవుతోంది. అందుకే అప్రమత్తమయ్యాం''అని దాడులను సమర్థించారు. ట్రంప్ వ్యాఖ్యల తర్వాత శుక్రవారం తులసీ తన 'ఎక్స్'ఖాతాలో ఒక ట్వీట్‌చేశారు. ''వారాల్లో లేదా నెలల్లో ఇరాన్ అణుబాంబు తయారుచేయబోతోందని మాకు సమాచారం అందింది. బాంబుగనక బిగిస్తే ఇక అంతే. అయితే పరిస్థితి అంతదాకా రాకుండా ట్రంప్ అడ్డుకుంటారని నాకు తెలుసు''అని ఆమె ట్వీట్‌చేశారు. అంతకుముందు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరిస్తూ మాట్లాడారు. ''ఇరాన్‌కు రెండు వారాల గడువు ఇచ్చా. ఆలోపు ఒప్పందం కుదుర్చుకోకుంటే ఎలాంటి నిర్ణయం తీసుకుంటానో నాకే తెలీదు''అని అన్నారు. ఈయన మాటలకు తగ్గట్లు వేల కేజీల బంకర్ బస్టర్ బాంబును జారవిడిచే బీ2 స్టెల్త్ విమానాలు గ్వామ్ దీవి దిశగా బయల్దేరినట్లు వార్తాలొచ్చాయి. ఫోర్డో భూగర్భ అణుశుద్ధికర్మాగారాన్ని భూస్థాపితం చేయాలంటే ఈ విమానం నుంచి మాత్రమే జీబీయూ-57 మ్యాసివ్ ఆర్డ్‌నెన్స్ పెనిట్రేటర్ బాంబును పడేయడం సాధ్యమవుతుంది.

ట్రంప్‌కు 'నోబెల్ శాంతి' ఇవ్వాలి

ఆయన పేరు ప్రతిపాదించాలని నిర్ణయించాం ● పాకిస్తాన్ ప్రభుత్వం వెల్లడి

ఇస్లామాబాద్/న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వచ్చే ఏడాది నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని కోరుతూ ఆయన పేరును అధికారికంగా ప్రతిపాదించాలని నిర్ణయించినట్లు పాకిస్తాన్ ప్రభుత్వం శనివారం వెల్లడించింది. ఇటీవల నిర్ణయాత్మక దౌత్యపరమైన జోక్యంతో భారత్-పాకిస్తాన్ ఘర్షణ ఆగేలా ట్రంప్ కృషి చేశారని, అందుకు నోబెల్ శాంతి బహుమతికి ఆయన అర్హుడేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేసింది. మూడు రోజుల క్రితం ట్రంప్ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు వైట్‌హౌస్‌లో విందు ఇచ్చిన సంగతి తెలిసిందే. ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఆ సమయంలో అసిమ్ మునీర్ విజ్ఞప్తి చేశారు. తాజాగా పాక్ ప్రభుత్వం అధికారికంగా దీనిపై ప్రకటన చేసింది. భారత్-పాక్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సమయంలో డొనాల్డ్ ట్రంప్ వ్యూహాత్మకంగా వ్యవహరించారని, ఇరు దేశాలతో మాట్లాడి శాంతికోసం కృషి చేశారని పేర్కొంది. అణ్వస్త్రాలు కలిగిన రెండు దేశాల మధ్య యుద్ధం జరగకుండా నివారించారని కొనియాడింది. భారత్-పాక్ మధ్య అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణకు ట్రంప్ చొరవే కారణమని స్పష్టంచేసింది.

రక్త పిపాసులకా!

నోబెల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు ప్రతిపాదించాలని పాకిస్తాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఇంటా బయటా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పాక్ సర్కారు తీరును పలువురు తప్పుపట్టారు. పాక్ పౌరులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, రచయితలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ నిపుణులు కూడా వీరిలో ఉన్నారు. ఒకవైపు గాజాలో మారణహోమం సృష్టిస్తూ, మరోవైపు ఇరాన్‌లో రక్తం పారిస్తున్న ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్నందుకు ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలా? అని మండిపడ్డారు. హింసాకాండను సమర్థిస్తున్న వ్యక్తి ఈ బహుమతికి ఎలా అర్హుడో చెప్పాలని నిలదీశారు. పాక్ ప్రభుత్వం ఆత్మగౌరవం అనేది లేకుండా ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మారిందని సామాజిక కార్యకర్తలు ధ్వజమెత్తారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శాంతి, న్యాయం కోసం నిజాయతీగా కృషి చేసినవారికే నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని, అమాయక ప్రజల రక్తంతాగే వారికి కాదని తేల్చిచెప్పారు. పాక్ సర్కారు నిర్ణయానికి ప్రజల ఆమోదం లేదని స్పష్టంచేశారు. నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నాకు నోబెల్ శాంతి బహుమతి దక్కదేమో

డొనాల్డ్ ట్రంప్ నిర్వేదం



భారత్-పాకిస్తాన్ యుద్ధాన్ని ఆపేసినందుకు లేదా రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణలు నివారించేందుకు కృషి చేస్తున్నందుకు తనకు నోబెల్ శాంతి బహుమతి దక్కదేమోనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఈ ప్రతిష్టాత్మక బహుమతి తనకు రాసిపెట్టి లేదేమోనని నిర్వేదం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తాను ఎన్ని మంచి పనులు చేసినా నోబెల్ శాంతి బహుమతి రాదన్నారు. దశాబ్దాలుగా యుద్ధ రంగంలో తలపడుతున్న కాంగో, రువాండా మధ్య శాంతికి చొరవ తీసుకుంటున్నానని, అందుకు చాలా సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. సోమవారం ఇరు దేశాల మధ్య ఒప్పందం జరగబోతోందని, ఆఫ్రికాతోపాటు ప్రపంచానికి అదొక గొప్ప రోజు కాబోతోందని వివరించారు. సెర్బియా, కొసావో మధ్య ఘర్షణలకు చరమగీతం పాడేశానని, ఈజిప్ట్, ఇథియోపియా మధ్య శాంతిని కొనసాగిస్తున్నానని తెలిపారు. అయినప్పటికీ తనకు నోబెల్ శాంతి బహుమతి లభించే అవకాశం లేదని ట్రంప్ నిరాశకు లోనయ్యారు.



ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో యోగా సెషన్‌లో రాష్ట్రపతి ముర్ము..



తాజ్ కనిపిస్తుండగా.. ఆగ్రాలోని తమ భవనంపై ఓ యువతి యోగా..



ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారి..

వెల్లివిరిసిన యోగా ఉత్సాహం

ప్రపంచవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవం

న్యూయార్క్/బీజింగ్/ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రకరకాల యోగాసనాలు ఆచరించిన ఔత్సాహికులతో ప్రధాన నగరాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. పార్కులు, మైదానాలు కిక్కిరిసిపోయాయి. ఎటుచూసినా యోగాభ్యాసకులే కనిపించారు. భారత ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినంగా 2014 డిసెంబర్‌లో ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సంగతి తెలిసిందే. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో రచయిత, ఆరోగ్య నిపుణుడు దీపక్ చోప్రా నేతృత్వంలో యోగా వేడుకలు జరిగాయి. 1,200 మందికిపైగా దౌత్యవేత్తలు, అధికారులు, ప్రవాస భారతీయులు, అమెరికన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యూయార్క్‌లో ఇండియన్ కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ వద్ద యోగాసనాలు వేశారు. యునైటెడ్ కింగ్‌డమ్, చైనా, సింగపూర్, నేపాల్, జపాన్, మలేషియా, శ్రీలంక, థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యతను నిపుణులు వివరించారు.

కులమతాలతో సంబంధం లేదు: ముర్ము

భారత్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో యోగాభ్యాసకులు ఉత్సాహం పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాలుపంచుకున్నారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము యోగాసనాలు వేశారు. యోగాకు కులమతాలు, జాతులతో సంబంధం లేదని ఆమె చెప్పారు. భారతీయ శక్తికి యోగా ఒక ప్రతీక అని వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఒక సాధనంగా తోడ్పడుతుందని సూచించారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఇండిగో విమానంలో నిండుకున్న ఇంధనం

బెంగళూరులో అత్యవసర ల్యాండింగ్

బెంగళూరు: గువాహటి-చెన్నై ఇండిగో విమానానికి గురువారం పెను ప్రమాదం తప్పింది. రాత్రి 7.45 గంటల సమయంలో చెన్నై విమానాశ్రయంలో రద్దీ కారణంగా ఎయిర్ ట్రాఫిక్ అధికారులు ల్యాండయ్యేందుకు అనుమతించలేదు. దాంతో గాల్లోనే చక్కర్లు కొడుతూ వేచి ఉండాల్సి వచ్చింది. అయితే, క్లియరెన్స్ ఇచ్చేదాకా ఎదురుచూసేందుకు అవసరమైన ఇంధనం లేదని పైలట్ గ్రహించారు. దీంతో, విమానాన్ని దారి మళ్లించారు. అధికారుల అనుమతితో బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 8.20 గంటలకు సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరినీ కిందికి దించేసి, వారికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈలోగా విమానంలో ఇంధనం నింపారు. రాత్రి 10.30 గంటల సమయంలో విమానం తిరిగి చెన్నైకి టేకాఫ్ తీసుకుంది. విమానం చెన్నైలో సురక్షితంగా ల్యాండయ్యిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) దర్యాప్తు చేపట్టింది.

హాట్‌ఎయిర్ బెలూన్‌లో మంటలు

8 మంది దుర్మరణం



శాంటా కాటరినా(బ్రెజిల్): హాట్ ఎయిర్ బెలూన్‌లో సరదాగా ఆకాశంలో విహరిస్తున్న వారిని అనుకోని ప్రమాదం వెంటాడింది. బెలూన్‌లో మంటలు చెలరేగి 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయాలపాలయ్యారు. ఈ విషాదం బ్రెజిల్‌లోని శాంటా కాటరినా రాష్ట్రంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. రంగురంగుల బెలూన్‌కు మంటలు అంటుకుని నేల మీదికి దూసుకు వస్తున్నట్లుగా ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మంటలు చెలరేగిన బెలూన్‌లోని ఒక వ్యక్తి నేలపైకి దూకేయడం, బెలూన్ బాస్కెట్ నేలపైకి దూసుకువస్తుండగా 'ఓ మైగాడ్'అంటూ ప్రత్యక్ష సాక్షి ఒకరు ఆశ్చర్యం వ్యక్తం చేయడం ఆ వీడియోలో రికార్డయ్యాయి. శాంటా కాటరినా రాష్ట్ర రాజధాని ఫ్లోరియానోపోలిస్‌కు 170 మైళ్ల దూరంలోని 'బ్రెజిలియన్ కప్పడోసియా'అనే పేరున్న ప్రముఖ పర్యాటక ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన అందరినీ విషాదంలో ముంచింది. విషాదంపై శాంటా కాటరినా గవర్నర్ జోర్గిన్హో మెల్లో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక బృందాలను ఘటనా స్థలికి హుటాహుటిన తరలించామన్నారు. 'ఘటన జరిగినప్పుడు ఆ బెలూన్‌లో 21 మంది ఉన్నారు. వీరిలో 8 మంది చనిపోగా, 13 మంది ప్రమాదం నుంచి బయటపడ్డారు' అని తెలిపారు. అయితే, ఆ బెలూన్‌లో 22 మంది వరకు ఉన్నట్లు మరికొన్ని వార్తా సంస్థలు అంటున్నాయి. బెలూన్‌లో మంటలు చెలరేగగానే అందులోని వారు మంటలను తప్పించుకునేందుకు విపరీతంగా ప్రయత్నించారని, ఈ క్రమంలో కొందరు బయటకు దూకేశారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. 'బెలూన్ బాస్కెట్‌లో ఉన్న టార్చ్ వల్లే మంటలు చెలరేగినట్లు ప్రమాదం నుంచి బయటపడిన బెలూన్ పైలట్ చెప్పారు.

ఇరాన్ నుంచి స్వదేశానికి 827 మంది

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య సంక్షోభం తీవ్రరూపం దాల్చడం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్‌లోని 827 మంది భారత పౌరులను ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి తీసుకొచ్చామని శనివారం విదేశాంగ శాఖ తెలిపింది. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి 11.40 గంటలకు 290 మంది విద్యార్థులతో కూడిన మొదటి విమానం ఢిల్లీలో ల్యాండయ్యింది. శనివారం ఉదయం మహాన్ ఎయిర్ విమానంలో మరో 310 మంది విద్యార్థులు ఢిల్లీకి చేరుకున్నారు. వీరిలో అత్యధికులు కశ్మీరీలు. భారత విద్యార్థులతో కూడిన మరో విమానం శనివారం అర్ధరాత్రి సమయంలో ఇరాన్ నుంచి ఢిల్లీకి చేరుకోనుందని అధికారులు తెలిపారు. ఇరాన్‌లో ఉన్న మొత్తం వెయ్యి మంది విద్యార్థులనూ వెనక్కి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నేపాల్, శ్రీలంకకు చెందినవారిని కూడా ఇరాన్ నుంచి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.

పోలింగ్ వీడియోలు బహిర్గతం చేయం

డేటా ఇవ్వాలన్న డిమాండ్లపై ఈసీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఎన్నికల ప్రక్రియ సంబంధ వీడియో ఫుటేజీని బహిర్గతంచేయాలంటూ వస్తున్న డిమాండ్లను ఈసీ తోసిపుచ్చింది. ఫుటేజీ బహిర్గతమైతే నిర్దేశిత పోలింగ్ కేంద్రంలో ఓటేసిన ఓటరు గోప్యతకు భంగం వాటిల్లుతుందని ఈసీ స్పష్టంచేసింది. వాళ్లు ఎవరికి ఓటేశారు? ఏ అభ్యర్థికి ఓటు వేయలేదు అనేది తెల్సిపోయి సంబంధిత ఓటర్ల భద్రతకు సైతం ముప్పు వాటిల్లేందుకు ఆస్కారముందని ఈసీ ఉన్నతాధికారులు శనివారం చెప్పారు. ''డిమాండ్లు చేస్తున్న వాళ్ల దృష్టికోణంలో అది సహేతుకంగా అనిపిస్తుంది. కానీ ఓటర్ల ప్రయోజనాలు, రక్షణ విషయానికొచ్చేసరికి ఈ డిమాండ్లు ప్రజాస్వామ్యయుతంగా లేవని అర్థమవుతుంది. ఉదాహరణకు ఒక పోలింగ్ బూత్‌లో ఓటింగ్ జరిగినప్పటి సీసీటీవీ వీడియో ఒక రాజకీయ పార్టీ నేతలకు అందితే అక్కడ ఎవరు ఓటేశారు, ఎవరు ఓటేయలేదో తెల్సిపోతుంది. ఓటర్ల జాబితాలో సరిపోల్చి ఓటేయని వాళ్లను ఒత్తిడి, వివక్ష, బెదిరింపులకు గురిచేసే ప్రమాదముంది. ఈ లెక్కన ఓటర్ల గోప్యత, భద్రతకు భంగం వాటిల్లుతుంది. ఓటర్ల గోప్యతతోపాటు భద్రతకు పెద్దపీట వేయాలని ప్రజాప్రతినిధుల చట్టం 1950, 1951లు, సుప్రీంకోర్టు గత తీర్పులు సూచిస్తున్నాయి''అని ఈసీ అధికారులు చెప్పారు.

కేవలం అంతర్గత సాధనమే

''చట్టంలోలేకపోయినా పోలింగ్ కేంద్రాల వద్ద రికార్డ్ చేసే సీసీటీవీ ఫుటేజీ, వెబ్‌క్యాస్టింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అనేవి బహిర్గతం చేసేందుకు ఉద్దేశించినవి కాదు. కేవలం అంతర్గత నిర్వహణ సాధనాలే. 45 రోజుల తర్వాత కూడా ఈ సమాచారాన్ని దాచిపెట్టాలనే నిబంధన ఎక్కడా లేదు. 45 రోజుల్లోపు సంబంధిత హైకోర్టులో పిటిషన్ దాఖలైతే డేటాను ధ్వంసంచేయడానికి బదులు న్యాయస్థానానికి ఇస్తాం. గోప్యత, రహస్యాల విషయంలో ఈసీతో సంప్రదింపులకు ఎవరికీ అవకాశం ఉండదు''అని ఉన్నతాధికారులు చెప్పారు.



మెట్రో-2బి డీపీఆర్‌లు కేంద్రానికి..
హైదరాబాద్ మెట్రో రెండో దశ 'బి' ఇక పట్టాలు ఎక్కనుంది. ఈ విభాగం కింద ప్రతిపాదించిన మూడు కారిడార్ల డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)లను శనివారం కేంద్రానికి సమర్పించారు. -10లో



ఆసనం.. ఓ ఔషధం..
యోగాను ఒకప్పుడు ఆధ్యాత్మిక, మానసిక ప్రశాంతత కోసం ఒక మార్గంగా పరిగణించేవారు. ప్రస్తుతం ఇది అనారోగ్యానికి చికిత్సా మార్గంగానూ మారింది. -సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 35.0/24.0

వాతావరణం
నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వాన చినుకులు పడే అవకాశముంది. గరిష్టంగా 35, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



విలాసవంతమైన వసతిగా హెలీప్యాడ్

- ఆకాశహర్మ్యం పైకప్పుపై ఏర్పాటు
- ఇప్పటివరకు ఐదు ప్రాజెక్ట్‌లకు హెలీప్యాడ్స్ ఏర్పాటుకు అనుమతి
- కోకాపేట, నానక్‌రాంగూడ, కూకట్‌పల్లి, మాదాపూర్‌లలో ఏర్పాటు
- వసతితో పాటు అత్యవసర సమయాల్లో బాగా ఉపయోగపడే అవకాశం..

హైరైజ్.. హెలీప్యాడ్



గ్రేటర్‌లో హైరైజ్ బిల్డింగ్స్ అంతకంతకూ పెరుగుతున్నాయి. నగరం చుట్టూ పెద్దపెద్ద వెంచర్లు మొదలవుతున్నాయి. కస్టమర్లలోనూ హైరైజ్ నివాసాలపై ఆసక్తి పెరిగింది. దీంతో నిర్మాణ సంస్థలు పోటాపోటీగా హైరైజ్ అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నాయి. ఇక వీటిల్లో వసతులు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన వసతులతో కస్టమర్లను ఆకర్షించేందుకు పలు నిర్మాణ సంస్థలు ముందుకు వస్తున్నాయి. అందులో భాగంగా ఇప్పుడు హైరైజ్ భవనాలపైన హెలీకాప్టర్‌లు ల్యాండ్ అయ్యేందుకు అవసరమైన హెలీప్యాడ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు ఇది నగరంలో లగ్జరీ ట్రెండ్‌గా మారింది.

సాక్షి, సిటీబ్యూరో:

హైరైజ్ భవన నిర్మాణాలకు కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తుండటంతో వాటిల్లో విలాసవంతమైన వసతులు పెరుగుతున్నాయి. గతంలో కస్టమర్లు స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి వసతులనే లగ్జరీగా భావించేవారు. కానీ, ప్రస్తుతం మాత్రం విదేశాల్లో మాదిరిగా అంతర్జాతీయ స్థాయి వసతులను కోరుకుంటున్నారు. దీంతో గోల్ఫ్ కోర్ట్, హెలీప్యాడ్, స్కైవాక్ వంటి విలాసవంతమైన వసతులను సైతం నిర్మాణ సంస్థలు అందిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో హైదరాబాద్‌లో ఆకాశహర్మ్యం పైకప్పులపై హెలీప్యాడ్ల నిర్మాణానికి డెవలపపర్లు ఆసక్తి చూపిస్తున్నారు.

- ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలలో లగ్జరీ అపార్ట్‌మెంట్లు, హోటళ్ల పైకప్పులపై హెలీప్యాడ్‌లు సర్వసాధారణమైపోయాయి. లగ్జరీ, హోదా చిహ్నంగా ఇవి ఉన్నప్పటికీ..అగ్ని ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల సమయంలో నివాసితులను తరలించేందుకు ఇవి ఎంతో ఉపయుక్తం. మన నగరంలో కోకాపేట, నానక్‌రాంగూడ, తెల్లాపూర్, పుప్పాలగూడ, మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి వంటి పశ్చిమ హైదరాబాద్‌లోనే హెలీప్యాడ్ భవన నిర్మాణాలు ఎక్కువగా వస్తున్నాయి.

60 మీటర్ల కంటే ఎత్తయితే..

జాతీయ భవన నిర్మాణ నియమావళి (ఎన్‌బీసీ) నిబంధనల ప్రకారం 60 మీటర్ల కంటే ఎత్తయిన భవన నిర్మాణాలకు హెలిప్యాడ్‌లు తప్పనిసరి. 1999లో ఈ నిబంధన అమలులోకి వచ్చినప్పటికీ హైదరాబాద్‌లో 60 మీటర్ల కంటే ఎత్తయిన భవనాలు పెద్దగా లేవు. 2007 నుంచి 60 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తయిన ప్రాజెక్టులు వస్తుండటంతో హెలీ ప్యాడ్ల ఏర్పాటు తప్పనిసరిగా మారింది. పౌర విమానయాన శాఖ (డీజీసీఏ) నియమాలు, నిబంధనల ప్రకారమే నిర్మాణ సంస్థలు హెలీ ప్యాడ్‌లను నిర్మించాల్సి ఉంటుంది.

ఇప్పటివరకు ఐదు ప్రాజెక్టులు..

హైరైజ్ బిల్డింగులపై హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటి వరకు ఐదు సంస్థలు జీహెచ్ఎంసీకి దరఖాస్తు చేశాయి. వీటికి అనుమతి లభించింది. జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్, టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్, హెచ్ఎండీఏ చీఫ్ సిటీ ప్లానర్, రోడ్లు భవనాల విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్‌లతో కూడిన నలుగురు సభ్యుల కమిటీ హెలిప్యాడ్ కోసం నిర్మాణ సంస్థల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నిర్ణయం తీసుకుంటుంది. ఇప్పటివరకు కూకట్‌పల్లి, నానక్‌రాంగూడ, నియోపోలిస్ ప్రాంతాలలోని పలు లగ్జరీ అపార్ట్‌మెంట్లు, మాదాపూర్‌లోని ఓ హోటల్ పైకప్పుపై హెలీప్యాడ్ నిర్మాణానికి అనుమతులు జారీ అయ్యాయి. లోధా, ఎల్‌అండ్‌టీ-ఫోనిక్స్, మంజీరా, మంత్రి, జీహెచ్‌ఆర్ వంటి సంస్థలు ఈ విలాసవంతమైన సౌకర్యాన్ని అందిస్తున్నాయి.

హైటెక్స్‌లో యోగా విత్ జుంబా ఈవెంట్‌లో...





ఆనంద యోగం..

అంతర్జాతీయ యోగా డే సందర్భంగా శనివారం నగరవ్యాప్తంగా పలు ఈవెంట్లు నిర్వహించారు. మంచి ఆరోగ్యానికి యోగా ఉపయోగాలను వివరిస్తూ పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. యోగా గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయగా..యువతీ యువకుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, గవర్నర్, ఇతర వీఐపీలు పాల్గొన్నారు. అలాగే పలు సంస్థల్లోనూ ఉద్యోగులు, సిబ్బంది యోగా డే సందర్భంగా యోగాసనాలు వేసి ప్రత్యేకతను చాటారు. – సాక్షి, సిటీబ్యూరో



గచ్చిబౌలి స్టేడియంలో యోగా డే...

గచ్చిబౌలి స్టేడియంలో తొక్కిసలాట

నర్సింగ్ విద్యార్థినికి అస్వస్థత



నర్సింగ్ విద్యార్థిని నజీమాను పరామర్శిస్తున్న రాష్ట్ర వైద్య విధానపరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

గచ్చిబౌలి: గచ్చిబౌలి స్టేడియంలో అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అల్పాహారం వద్ద తొక్కిసలాట చోటు చేసుకుంది. కింద పడిపోయిన నర్సింగ్ విద్యార్థిని అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో యోగా డే నిర్వహించారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. టోకెన్లు ఉన్న వారు టిఫిన్ కోసం వెళ్లగా అప్పటికే అయిపోయింది. మళ్లీ ట్రాలీ ఆటోలో టిఫిన్ తెప్పించడంతో టోకెన్లు ఉన్న వారు ఒక్కసారిగా ఎగబడ్డారు. గాంధీ ఆస్పత్రిలో నర్సింగ్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్న నజీమా(19) కింద పడిపోయి అస్వస్థతకు గురైంది.

వెంటనే అంబులెన్స్‌లో కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించా రు. వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి ఆమెను పరామర్శించి విషయాలను అడి గి తెలుసుకున్నారు. డ్యూటీ డాక్టర్‌తో పాటు అంబులెన్స్‌లో ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించామని, అక్కడ సీటీ స్కాన్ చేస్తే ఏదైనా ఇబ్బంది ఉంటే తెలిసే అవకాశం ఉందని డాక్టర్లు తెలిపారు. సరైన ఏర్పాట్లు చేయకపోవడంతోనే తొక్కిసలాట చోటుచేసుకుందని పలువురు విమర్శించారు.

టౌన్‌ప్లానింగ్‌లో భారీ బదిలీలు

27 మందికి స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో భారీ బదిలీలు చోటు చేసుకున్నాయి. మొత్తం 27 మందిని బదిలీ చేయగా, వీరిలో 13 మంది ఏసీపీలు, ఇన్‌ఛార్జి ఏసీపీలు కాగా, మిగతా 14 మందిలో టీపీఎస్, టీపీబీఓ, డీఎంలు ఉన్నారు. వారు పనిచేస్తున్న చోటు నుంచి ఇతర స్థానాలకు బదిలీ చేశారు. పలువురు అధికారులపై అవినీతి ఆరోపణలు రావడంతోపాటు కొందరు ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో భారీగా బదిలీలు చేశారనే ప్రచారం జరుగుతున్నా, గతంలోనూ ఇవే ప్రచారాలు జరిగాయి. అయినప్పటికీ, ఎక్కడా అవినీతి ఆగింది లేదు. ఇదే అంశాన్ని ఇప్పుడు స్వయానా జీహెచ్ఎంసీ వర్గాలే ప్రస్తావిస్తున్నాయి. సీటు మారినంత మాత్రాన బుద్ధి మారుతుందా? అని బాహాటంగానే అంటున్నారు. ఎన్ని పర్యాయాలు..ఎన్ని దాడుల్లో ఎందరు అవినీతిపరులు చిక్కినా జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో అవినీతి ఆగక పోవడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. ఒక్క టౌన్‌ప్లానింగ్ అనే కాదు, ట్యాక్స్ సెక్షన్, యూబీడీ విభాగం, ఇంజినీరింగ్..ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విభాగాల్లో అవినీతి నిరాటంకంగా కొనసాగుతూనే ఉందని చెబుతున్నారు. రూ.లక్షల్లో జీతాలున్న వారు సైతం పదే పదే ఏసీబీ వలలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతుండటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు, ఎంబీ బుక్స్‌లో తప్పుడు వివరాలు రాసేందుకు, ఆస్తిపన్ను తక్కువగా చూపేందుకు, వేయని రోడ్లు వేసినట్లు చూపేందుకు, ఇలా ఎన్నో విధాలుగా జరుగుతున్న అవినీతి.. బదిలీలతో ఆగుతుందా? అనేది వేచి చూడాలి.

'మహంకాళి' డీఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

వజ్రాల వ్యాపారి నుంచి వసూళ్ల కేసులో...

రాంగోపాల్‌పేట్: వజ్రాల వ్యాపారిని భయపెట్టి రూ.6 లక్షలు వసూళ్లు చేసిన కేసులో మహంకాళి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇద్దరు క్రైం కానిస్టేబుళ్లను నగర పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు. వివరాలలోకి వెళితే...డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ప్రసాద్, క్రైమ్ కానిస్టేబుళ్లు శ్యాం, మహేష్‌లు గత నెల 31వ తేదీన కడపకు చెందిన ఓ వజ్రాల వ్యాపారి నుంచి జనరల్‌బజార్‌లో కోటి రూపాయల విలువ చేసే వజ్రాలను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యాపారి వజ్రాలను తీసుకుని వచ్చి నగరంలోని వివిధ వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. ఈ మేరకు వజ్రాలకు సంబంధించిన అన్ని బిల్లులు చూపించినప్పటికీ వినకుండా కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి బెదిరింపులకు పాల్పడ్డారు. చివరకు ఈ కేసుకు సంబంధించి రూ.6 లక్షలు ఇస్తానని సదరు వ్యాపారి పోలీసులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. వెంటనే వ్యాపారి అకౌంట్ నుంచి డీఐకి చెందిన స్నేహితుడి ఖాతాకు రూ.6 లక్షలు జమ అయ్యాయి. అయితే పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లిన వ్యాపారి వెంటనే తన అకౌంట్ నుంచి తన ప్రమేయం లేకుండా రూ.6 లక్షలు డ్రా అయ్యాయని బ్యాంకులో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పోలీసు ఉన్నతాధికారులకు దీని గురించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పూర్తిగా ఆధారాలు సేకరించిన అనంతరం డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వైకే ప్రసాద్, క్రైం కానిస్టేబుళ్లు శ్యాం, మహేష్‌లను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇదే డీఐ ప్రసాద్ తాను పని చేసే చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కొద్ది నెలల క్రితం ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో సస్పెండ్ అయ్యాడు. ఈ కేసు విచారణ అనంతరం మహంకాళి పోలీస్‌స్టేషన్‌కు ఆయనను అటాచ్ చేశారు.

'మాన్సూన్'కు మస్తు నిధులు

గతంలో ఎన్నడూలేని విధంగా రూ.150 కోట్లతో ప్రత్యేక బడ్జెట్

- జోన్‌కు రూ.29 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో వానా కాలంలో చేపట్టాల్సిన అత్యవసర పనుల నిమిత్తం జీహెచ్ఎంసీ భారీగా నిధులు ఖర్చు చేస్తోంది. ఈమేరకు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.150 కోట్లతో మాన్సూన్ పనులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించింది. ఒక్కో జోన్‌కు రూ.29 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు అవకాశం కల్పించింది. వచ్చే మాన్సూన్ సీజన్ వరకు ప్రస్తుత పాలకమండలి ఉండకపోవడం వల్లనో..లేక పాలకమండలి గడువు ముగిసే సంవత్సరంలో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తకుండా ఉండేందుకోగానీ..మొత్తానికి నిధులు వరద పారుతోందని చెప్పవచ్చు. ఇతర ఇంజినీరింగ్ పనులతోపాటు మాన్సూన్ పనులకు వాడుకునేందుకు ఇదివరకే జోన్‌కు రూ.4 కోట్ల వంతున కేటాయించగా, కేవలం మాన్సూన్ పనుల కోసమేనంటూ ప్రత్యేక బడ్జెట్‌గా జోన్‌కు రూ.25 కోట్ల వంతున కేటాయించింది. అంటే, ఒక్కో జోన్ గతంలోని రూ.4 కోట్లతో కలిపి మొత్తం రూ.29 కోట్ల వరకు మాన్సూన్ ముగిసే అక్టోబర్ వరకు వినియోగించుకోవచ్చు. వెరసి మొత్తం రూ.179 కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం లభించింది. గతంలో ఎప్పుడూ కూడా మాన్సూన్ పనుల కోసమే నంటూ ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది లేదు. ఈ సంవత్సరం మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ పనిచేసేందుకు అవసరమైన వాహనాల కోసం ఆహ్వానించిన టెండర్లు కొందరికే ప్రయోజనం కలిగేలా ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తడంతోపాటు జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. దీంతో మాన్సూన్ పనులను జీహెచ్ఎంసీ నుంచి రద్దు చేసి హైడ్రాకు అప్పగించడం తెలిసిందే. సదరు వాహనాలను హైడ్రా సమకూర్చుకుంటుండగా, జీహెచ్ఎంసీ తాను పిలిచిన వాహనాల టెండర్లను రద్దు చేసింది. ఆ రకంగా కోల్పోయిన అవకాశాన్ని కల్పించాలనుకున్నారో, లేక నిజంగానే వానాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పనులు చేయాలనుకున్నారో కానీ, ఈసారి మాన్సూన్ పేరిట భారీ నిధులు కేటాయించడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నిధుల్ని వానాకాలంలో తలెత్తే సమస్యల పరిష్కారం కోసమే తప్ప రోడ్లు, సీసీరోడ్లు, విద్యుత్ పనులు, తాత్కాలిక లైటింగ్, ఇతరత్రా రొటీన్ పనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని స్పష్టం చేశారు. ఒక వేళ ఈ నిధులు మాన్సూన్ పనులకే ఖర్చుకాని పక్షంలో, జోన్‌కు రూ.3 కోట్ల చొప్పున వీధిదీపాల నిర్వహణకు, ఇంకా మిగులు నిధులుంటే అత్యవసర పనులకు వాడుకోవచ్చునని కమిషనర్ సూచించారు. మైనర్ రోడ్ల మరమ్మతులు, పాట్‌హోల్స్ పూడ్చివేత, క్యాచ్‌పిట్స్ మరమ్మతులు, క్యాచ్‌పిట్స్ మూతల వంటి పనులకు వాడుకోవచ్చని తెలిపారు. అంతే తప్ప కొత్తగా రోడ్లు వేస్తామన్నా, సీసీ రోడ్లు కావాలన్నా, తాత్కాలిక లైటింగ్ కోసమైనా కుదరదని స్పష్టం చేశారు. జోనల్ కమిషనర్లు, ఫైనాన్షియల్ అడ్వైజర్లు వీటిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మాన్సూన్ బడ్జెట్ నిధుల్ని ఇతర పనులకు డీవియేట్ చేసినా, దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధికారిపై చర్యలేవీ ?

కొందరికే ప్రయోజనం కలిగేలా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌కు అవసరమైన వాహనాల టెండర్లను ఆహ్వానించిన అధికారిపై తగిన చర్యలు తీసుకుంటారని ప్రచారం జరుగుతున్నా..ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అంతేకాదు, సదరు అధికారి ఎంతోకాలంగా మూడు పోస్టుల్లో కొనసాగుతుండటాన్ని జీహెచ్ఎంసీ వర్గాలు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నాయి.



అద్దె బస్సులకే ఆర్టీసీ డిపోలు

- ఆర్టీసీ డీజిల్ బస్సులన్నీ జిల్లాలకు తరలింపు
- పీఎం -ఈ డ్రైవ్ కింద ఎలక్ట్రిక్ బస్సులు
- ప్రశ్నార్థకంగా ఐదు వేల మంది ఆర్టీసీ డ్రైవర్ల భవితవ్యం

చార్జింగ్, పార్కింగ్ కేంద్రాలుగా వినియోగం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లోని ఆర్టీసీ డిపోలు ఇక ప్రైవేట్ అద్దె బస్సులకే దారాదత్తం కానున్నాయి. ప్రధాని-ఈ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా నగరంలో డీజిల్ బస్సులను తొలగించి వాటి స్థానంలో అద్దె ప్రాతిపదికన పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఈ బస్సుల నిర్వహణ పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల నియంత్రణలోనే ఉంటుంది. కానీ వాటికి విద్యుత్ చార్జింగ్, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించవలసిన బాధ్యత మాత్రం ఆర్టీసీ పరిధిలో ఉండనుంది. దీంతో ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల కోసం వినియోగించిన డిపోలన్నీ క్రమంగా ప్రైవేట్ బస్సులకు పార్కింగ్ అడ్డాలుగా, చార్జింగ్ కేంద్రాలుగా మారనున్నాయి. అదే సమయంలో అద్దె బస్సులను నడిపేందుకు వాటి యజమానులే డ్రైవర్లను నియమిస్తారు. దీంతో ప్రస్తుతం నగరంలోని 25 డిపోల్లో పని చేస్తున్న సుమారు 5 వేల మంది డ్రైవర్ల భవితవ్యం ప్రశార్థకంగా మారనుంది. దశలవారీగా ఎలక్ట్రిక్ అద్దె బస్సులను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు.



దశలవారీగా డిపోల కేటాయింపు..

కేంద్ర ప్రభుత్వం పీఎం-ఈ డ్రైవ్ కింద ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చునేందుకు ఆర్టీసీకి అవకాశం కల్పించింది. కానీ ఈ బస్సులను సొంతంగా కొనుగోలు చేసేందుకు అవకాశం లేదు. అద్దె ప్రాతిపదకన మాత్రం ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. సుమారు రూ.కోటి విలువైన ఎలక్ట్రిక్ బస్సుకు రూ.35 లక్షల వరకు సబ్సిడీ రూపంలో కేంద్రం భరించనుంది. ఈ పథకం లక్ష్యంగా బాగానే ఉన్నప్పటికీ ఆర్టీసీ మనుగడకు అది ప్రమాదకరంగా మారనుందని కార్మిక, ఉద్యోగసంఘాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మొత్తం 2800 ఎలక్ట్రిక్ బస్సులను నగరంలో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం 254 బస్సులు అద్దె ప్రాతిపదికపైనే నడుస్తున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి ఎలక్ట్రిక్ బస్సులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే నగరంలోని పలు డిపోలు పూర్తిగా విద్యుత్ బస్సులకే కేటాయించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిపోలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులే ఉన్నాయి. కంటోన్మెంట్, హయత్‌నగర్, తదితర డిపోల్లో డీజిల్ బస్సుల కంటే ఎలక్ట్రిక్ బస్సులే ఎక్కువగా ఉన్నాయి. రానున్న రోజుల్లో మొత్తం 25 డిపోలను ఇదేవిధంగా ప్రైవేట్ అద్దె బస్సులతో నింపనున్నారు.

భారీగా సిబ్బంది కుదింపు..

ఎలక్ట్రిక్ బస్సుల వల్ల మొదట ఆర్టీసీ డ్రైవర్‌లపైన వేటు పడే అవకాశం ఉంది.నగరంలోని 25 డిపోల్లో 5 వేల మందికి పైగా పని చేస్తున్నారు. అలాగే మెకానిక్‌లు, శ్రామిక్‌లు, తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులు సైతం వేల సంఖ్యలో ఉన్నారు. అద్దె బస్సుల నిర్వహణ పూర్తిగా ప్రైవేట్ సంస్థల పరిధిలోనే ఉండనుంది. దీంతో ఆర్టీసీకి ప్రత్యేకంగా డ్రైవర్లు, మెకానిక్‌లు, శ్రామిక్‌ల అవసరం ఉండదు.

రిట్రోఫిట్‌మెంట్‌పై పునరాలోచించాలి...

డిపోలను దారాదత్తం చేయడంతో పాటు సిబ్బంది కుదింపు వంటి పరిణామాలపై ఉద్యోగసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలతో నడిచే ఆటోరిక్షాలను రిట్రోఫిట్‌మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకొనేందుకు అవకాశం కల్పించినట్లుగానే ఆర్టీసీ డీజిల్ బస్సులను కూడా రిట్రోఫిట్‌మెంట్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చవచ్చునని ఉద్యోగసంఘాల నాయకులు చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాలని, అందుకోసం ఆర్థిక తోడ్పాటును అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటి వరకు వివిధ రకాల పనులు చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అవసరం కూడా గణనీయంగా తగ్గనుంది. కేవలం కండక్టర్లు మాత్రమే విధులు నిర్వహిస్తారు. 'డిపోల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులను కూడా కుదించే అవకాశం ఉంది. పీఎం-ఈ డ్రైవ్ పథకం వల్ల ఆర్టీసీ నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొంది.' అని కార్మికసంఘం ప్రతినిధి ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆర్టీసీ సొంత బస్సులతో పాటు డ్రైవర్‌లను సైతం హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడం ఒక సవాల్‌గా మారింది' అని ఒక అధికారి విస్మయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెండు, మూడేళ్లలో పదవీకాలం ముగియనున్న సిబ్బందిని స్వచ్ఛంద పదవీ విరమణ దిశగా ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం.

రూ.15 లక్షల విలువైన హర్యానా మద్యం పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: హర్యానా నుంచి హైదరాబాద్‌కు ఖరీదైన మద్యం బాటిళ్లను వాహనంలో తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ సిబ్బందితో కలిసి ముత్తంగి టోల్ ప్లాజా వద్ద కాపు కాసి అక్రమ మద్యం రవాణా వాహనాన్ని సీజ్ చేశారు. ఈ వాహనంలో 18 రెడ్ లేబుల్, 13 బ్లాక్ లేబుల్, ఒకటి జేమ్స్, రెండు శివాస్ రీగల్ మద్యం పెట్టెలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మద్యం విలువ రూ.15 లక్షలు ఉంటుందని మెదక్ డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్ తెలిపారు. ఈ కేసులో సామల నవీన్ కుమార్, ఎదులావత్ టికియా నాయక్‌లను అరెస్ట్ చేశారు. అలాగే కత్లావత్ రవీందర్ నాయక్‌పైన కేసు నమోదు చేశారు. మద్యంతో పాటు రూ 5 లక్షల విలువచేసే వాహనాన్ని కూడా సీజ్ చేశారు.

ఈఎన్‌టీ వైద్యుల అత్యాధునిక చికిత్స

కంట్లో గుచ్చుకున్న కత్తిని తొలగించిన డాక్టర్లు

సుల్తాన్‌బజార్: ఓ వ్యక్తి కంట్లో గుచ్చుకున్న కత్తిని ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక పద్ధతుల్లో శస్త్ర చికిత్సలు నిర్వహించి కత్తిని విజయవంతంగా తొలగించారు. శనివారం కోఠి ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్య శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోలే గ్రామంలో రాజేందర్ కుటుంబం నివాసముంటోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 10న గుర్తుతెలియని ఇంట్లోకి చొరబడి రాజేందర్ కంట్లో కత్తిని గుచ్చాడు. వెంటనే కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు సరోజినీదేవి కంటి ఆసుపత్రికి పంపించారు. రాజేందర్‌ను పరీక్షించిన సరోజినీదేవి వైద్యులు కత్తి కంట్లో నుంచి ముక్కులోకి దిగిందని గుర్తించి ఈఎన్‌టీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ నెల 18న రాజేందర్‌ను కోఠిలోని ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. రాజేందర్‌ను పరీక్షించిన వైద్యులు 19వ తేదీన ఈఎన్‌టీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్య నేతృత్వంలో అధునాతన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించి కత్తిని తొలగించి రాజేందర్ ప్రాణాలు కాపాడారు. అనంతరం అతడిని సరోజినీదేవి కంటి ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఆపరేషన్‌లో ఈఎన్‌టీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్యతో పాటు సరోజినీదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని, అనస్థీషియా వైద్యులు డాక్టర్ రవి, డాక్టర్ ఉమా, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ స్వామి, డాక్టర్ నిఖిల, డాక్టర్ సౌజన్య, డాక్టర్ నిహారిక, నర్సింగ్ ఆఫీసర్ అంజలి, టెక్నీషియన్స్ అమీర్, బాలరాజ్, పీజీ వైద్యులు పాల్గొన్నారు.





ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో ఇద్దరి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా ద్వారా పెట్టుబడుల పేరుతో ఎర వేసి, టోలిచౌకి ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి రూ.74.36 లక్షలు కాజేసిన కేసులో ఇద్దరు నిందితులను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్ర పోలీసులు ఈ ద్వయాన్ని పట్టుకుని నగరానికి తీసుకువచ్చి శనివారం జైలుకు పంపారు. పుణేకు చెందిన రిషికేష్ జయవంత్ కాంబ్లే, మహ్మద్ సుల్తాన్ షేక్ వివిధ పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిచారు. వీటిని సైబర్ నేరాలు చేసే సూత్రధారులకు అందించి కమీషన్లు తీసుకుంటున్నారు. తమ యాప్ ద్వారా పెట్టుబడులు పెడితే భారీ లాభాలు ఉంటాయంటూ ఎర వేసి, దేశవ్యాప్తంగా నేరాలు చేస్తున్న సూత్రధారులు బాధితుల నుంచి నగదును ఈ ఖాతాల్లోకే డిపాజిట్ చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరిపై నగరంలో మూడు కేసులతో పాటు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్‌ల్లో 35 కేసులు నమోదయ్యాయి. టోలిచౌకి బాధితుడి కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ ఎస్.దిలీప్ నేతృత్వంలోని బృందం పుణే ద్వయం పాత్ర గుర్తించి అరెస్టు చేసి తీసుకువచ్చింది.

స్కూల్ బస్ ఢీకొని బాలుడి మృతి



జైసిత్ చౌహాన్ (ఫైల్)

జగద్గిరిగుట్ట: స్కూల్ బస్ ఢీకొనడంతో బాలుడు మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..షిరిడి హిల్స్ చెందిన ఏసి టెక్నీషియన్ ముఖేష్ చౌహాన్‌కు ఓ కుమారుడు జైసిత్ చౌహాన్ (10), కూతురు ఉన్నారు. శుక్రవారం షిరిడిహిల్స్ సమీపంలోని తులసి నగర్ చౌరస్తా వద్ద జైసిద్ చౌహాన్ మరో బాలుడు సైకిల్ తొక్కుతూ వెళ్తున్న సమయంలో సైకిల్ అదుపుతప్పి జైసిట్ కిందపడ్డాడు. అదే సమయంలో ఆ వైపు వస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు జైసిత్ చౌహాన్ పైనుంచి వెళ్లడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చుట్టూ ఉన్నవారు సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా చికిత్స చేస్తున్న సమయంలో శుక్రవారం రాత్రి జైసిట్ చౌహాన్ మరణించాడు. పోలీసులు బస్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని, బస్సును సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నగదు చోరీ ఘటనలో నిందితుల రిమాండ్

కుత్బుల్లాపూర్: ఓ దుకాణదారుడిని బొమ్మ పిస్తోల్‌తో బెదిరించి రూ.4 లక్షలు నగదు కాజేసిన నలుగురు నిందితులను పేట్‌బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శనివారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ బాలగంగిరెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. షాపూర్‌నగర్‌కు చెందిన దీపక్‌అశోక్‌పవార్(24), ఎర్రగడ్డకు చెందిన రుస్తం ఖాన్(25), చింతల్ రోడామేస్త్రీనగర్‌కు చెందిన మహేందర్‌ఖాన్(27), గాగిల్లాపూర్‌కు చెందిన రాహుల్‌ఖాన్(24) లు సులభంగా డబ్బు సంపాదించాలని చోరీలకు పాల్పడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 11న రాత్రి 10.30 గంటల సమయంలో కొంపల్లిలోని శ్రీలక్ష్మీ కిరాణా జనరల్ స్టోర్‌ను మూసేందుకు తాళం వేస్తుండగా హెల్మెట్, మాస్క్ ధరించిన ఓ వ్యక్తి పోస్టల్ రూపంలో లైటర్‌తో దుకాణ యజమానిని బెదిరించి అతని చేతిలో ఉన్న రూ.4 లక్షల క్యాష్ బాగ్ లాక్కున్నాడు. దుకాణంలో పనిచేసే వర్కర్ దుండగుడిని అడ్డుకునే ప్రయత్నం చేసినా అక్కడే బైక్‌పై వేచి ఉన్న మరో వ్యక్తి సహాయంతో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదులో కేసు నమోదు చేసిన పోలీసులు స్పెషల్ టీమ్‌గా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. పలు ప్రదేశాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న దీపక్‌అశోక్‌పవార్, రుస్తంఖాన్, మహేందర్‌ఖాన్, రాహుల్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించారు. నిందితుల నుండి రెండు యాక్టీవా బైక్‌లు, లైటర్ పిస్తోల్, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.71,180 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని ఏసీపీ బాలగంగిరెడ్డి అభినందించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బాలగంగిరెడ్డి

డెంగీ వ్యాధితో రైల్వే ఉద్యోగి మృతి

అడ్డగుట్ట: డెంగీ వ్యాధితో రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైల్వే లోకో పైలెట్ సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగి రైల్వే ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయాడని తోటి రైల్వే లోకో పైలెట్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సనత్‌నగర్ జింకలవాడకు చెందిన మోనో కుమార్ (29) భార్య, రెండేళ్ల కూతురు ఉన్నారు. గత వారం రోజు నుంచి స్వల్ప జ్వరంతో బాధపడుతున్న మోనో కుమార్ ఈనెల 19వ తేదీన సికింద్రాబాద్ చిలకలగూడలో ఉన్న లోకల్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు. 20వ తేదీన డెంగీ వచ్చిందని మెడికల్ రిపోర్టులో రావడంతో ఆయన 21న సికింద్రాబాద్ లాలాగూడలోని కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. ఇతని ఆరోగ్య పరిస్థితి బాగాలేదని బావించి వైద్యులు మోనోకుమార్‌ను ఇతర కార్పొరేట్‌ఆస్పత్రికి తరలించాలని భావించి నిర్లక్ష్యం చేయడంతో అక్కడే చనిపోయారు. దీంతో తోటి ఉద్యోగులు, లోకో పైలట్లు ఆస్పత్రి ముందు ఆందోళన నిర్వహించారు. దీంతో కొద్దిసేపు ఆస్పత్రి ముందు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

ఔటర్‌పై వ్యాన్ బోల్తా..ఒకరిమృతి



రవి మృతదేహం

ఘట్‌కేసర్: దుండిగల్ గండిమైసమ్మ నుంచి సరూర్‌నగర్‌కు అద్దాల లోడుతో వెళుతున్న ఓ వ్యాన్ ఘట్‌కేసర్ ఓఆర్‌ఆర్ టోల్‌ప్లాజా సమీపంలో శనివారం బోల్తా పడటంతో ఓ కూలీ మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన మేరకు.. దుండిగల్ గండిమైసమ్మ నుంచి ఎల్‌బీనగర్‌కు మ్యాక్స్ ట్రక్ (టీఎస్ 08టీ-8943)లో అద్దాలు లోడుచేసుకొని సరూర్‌నగర్‌లో దింపడానికి ఐదుగురు బయలుదేరారు. ఘట్‌కేసర్ టోల్ ప్లాజా సమీపంలోకి రాగానే వ్యాన్ వెనక టైరు పేలి బోల్తాకొట్టింది. దీంతో వ్యాన్‌లోని అద్దాలు వారిపై పడడంతో దుండిగల్‌లో ఉండే ఒరిస్సాకు చెందిన రవి (25) అక్కడికక్కడే మృతిచెందగా మరొక కూలీ పాశ్వాన్‌కుమార్ చేయి విరిగిపోయింది. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, గాయాలైన వారిని వైద్యం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ మంటల్లో ఆత్మాహుతి

పోచారం: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి గ్యాస్ సిలిండర్ మంటలకు ఆత్మాహుతి చేసుకున్న సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటాపూర్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉంటున్న చింతకుంట్ల కిషోర్ (38) కొన్నేళ్లుగా వివాహ వేదికల వద్ద డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతిగా మద్యం సేవించడం వల్ల లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో వారం రోజులుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో అతని భార్య, కొడుకు బెడ్‌రూమ్‌లో నిద్రపోతుండగా బయటి నుండి గదికి తాళం వేశాడు. వంట గదిలోని గ్యాస్ సిలిండర్ పైపును బయటకు తీసి నిప్పంటించాడు. మంటల్లో కాల్చుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఒళ్లు కాలడంతో తట్టుకోలేక అరవడంతో భార్య, కొడుకు మేలుకొని బెడ్‌రూమ్ తాళం తీయమని అడిగినా తీయలేదు. తలుపు తీయకపోతే అందరం చనిపోతామని వేడుకోవడంతో తాళం తీశాడు. వెంటనే చుట్టుపక్కలవారి సాయంతో కిషోర్‌ను అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యంతో మానసికంగా కుంగిపోవడం వల్లే కిషోర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎంసీఈఎంఈలోకి చొరబడ్డ వ్యక్తి అరెస్ట్

మిగతా ముగ్గురికి నోటీసులు

బొల్లారం : తిరుమలగిరిలోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎంసీఈఎంఈ) ఆవరణలోకి చొరబడిన నలుగురిలో ఒకరిని తిరుమలగిరి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. రాకేశ్, ఆశిష్‌లతో పాటు ఇద్దరు మహిళలు ఆలియా, నగ్మాబానులు గురువారం సాయంత్రం ఎంసీఈఎంఈ ఆవరణలోకి చొరబడ్డారు. వీరిని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది, తిరుమలగిరి పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. బిహార్‌కు చెందిన ఆశిష్ అదే రాష్ట్రానికి చెందిన రాకేశ్‌తో పాటు మధ్యప్రదేశ్‌కు చెందిన ఆలియా, నగ్మాబానులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఎంసీఈఎంలోకి తీసుకెళ్లాడు. ఆశిష్, ఇదివరకే జితేందర్ అనే వ్యక్తికి ఎంసీఈఎంఈలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మరి కొందరు ఉద్యోగార్థులను జితేందర్ ద్వారా ఎంసీఈఎంఈ ఆవరణలోకి తీసుకెళ్లాడు. ఎయిర్‌ఫోర్స్ దుస్తుల్లో ఉన్న ఆశిష్ కదలికలపై అనుమానం వచ్చిన ఎంసీఈఎంఈ సిబ్బంది అతనిపాటు మిగతా ముగ్గురిని ప్రశ్నించారు. ఆశిష్ ఐడీకార్డు నకిలీదని అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరిని విచారించిన పోలీసులు ఆశిష్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించి, మిగతా ముగ్గురికి నోటీసులు జారీ చేశారు. వీరి కుటుంబ నేపథ్యంలో ఇతరత్రా అంశాలపై ప్రత్యేక బృందాలతో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ నలుగురు వ్యక్తులు ఉద్యోగాల పేరిటే వచ్చారా? లేక ఏదైనా కుట్ర కోణం ఉందోననే అనుమానంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆశిష్ కుమార్ తో వచ్చిన వారు ఫోటోలు, వీడియోలు తీయడం పై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారుడిగా శృతికాంత్ భారతి



శృతికాంత్ భారతిని సన్మానిస్తున్న గైబువల్లి

హిమాయత్‌నగర్: కేంద్ర బొగ్గుగనుల మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారుడిగా హిందీ ప్రచార సభ హైదరాబాద్ విశేష అధికారి, మిలంద్ ప్రకాశన్ అధినేత శృతికాంత్ భారతి ఎంపిక య్యారు. దీనికి సంబంధించి భారత ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా హిందీ ప్రచారసభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి ఆధ్వర్యంలో శనివారం శృతికాంత్ భారతిని ఘనంగా సన్మానించారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఏబీఎస్ నుంచి హకీంబాబా దర్గాకు వెళ్లే రోడ్డు నెంబర్–86లో రూ.21 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను శనివారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ డీఈ హరేరామ్‌తో కలిసి రోడ్డు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత లోపించవద్దని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల క్యాడర్ విభజనకు జీవో హర్షణీయం

పంజగుట్ట: మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 2018 క్యాడర్ విభజన కోసం జీవో 317 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజుజాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమాజిగూడలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. మోడల్ స్కూల్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు 12 ఏళ్ల నుంచి పదోన్నతులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తమ యూనియన్ ఆధ్వర్యంలో ఎందరో మంత్రులు ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామని గుర్తుచేశారు. జీవో విడుదలకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, విద్యాశాఖ సెక్రటరీ యోగిత రాణాకు ధన్యవాదాలు తెలిపారు.

దోమలపై డ్రోన్లతో దండయాత్ర

- చెరువులు, నాలాల్లో మందు పిచికారి చేస్తున్న సిబ్బంది
- జూబ్లీహిల్స్ సర్కిల్‌లో మంచి ఫలితాలు





చెరువుల్లో దోమల నివారణ మందును డ్రోన్లతో పిచికారి చేస్తున్న జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది

బంజారాహిల్స్: దోమల నివారణ కోసం జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది రోజూ లార్వా నివారణ పిచికారితో పాటు ఫాగింగ్ చేస్తున్నా పెద్దగా ఉపయోగం ఉండటం లేదు. ముఖ్యంగా చెరువులు, నాలాలు, వరదనీరు భారీగా నిలిచే ప్రాంతాల్లో దోమల బెడద తీవ్ర రూపం దాలుస్తుండగా అక్కడ పూర్తిస్థాయిలో దోమల నివారణ మందు పిచికారి చేయడంలో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చెరువులు, నాలాల్లోకి సిబ్బంది వెళ్లలేని పరిస్థితులు ఉంటున్నాయి. ఫలితంగా సిబ్బంది తూతూమంత్రంగా దోమల నివారణ మందును పిచికారి చేస్తూ జారుకుంటుండగా దోమల వృద్ధి అంతకంతకూ పెరుగుతోంది. దోమల బెడద కూడా తీవ్రరూపం దాలుస్తోంది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో డ్రోన్ల ద్వారా దోమల నివారణ మందును పిచికారి చేస్తున్నారు. ఈ ఏడాది మొదటిసారిగా సంబంధిత ఎంటమాలజిస్టులు డ్రోన్లను వినియోగిస్తూ దోమల మందును చల్లుతున్నారు. చెరువులు, నాలాల్లో ఈ డ్రోన్ల ద్వారా దోమల మందును పూర్తిస్థాయిలో జల్లుతున్నారు. దీంతో కొంతమేర లార్వా దశలోనే దోమల వృద్ధి ఆగిపోతోంది. చాలాసార్లు సిబ్బంది దోమల నివారణ మందు చల్లుతుండగా అది కొంత మేర మాత్రమే ప్రభావం చూపుతూ మిగతా ప్రాంతాల్లో దోమల వృద్ధి పెరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో చెరువులు, కుంటలు, నాలాల్లో విస్తృతంగా డ్రోన్ల ద్వారానే దోమల మందు పిచికారి చేస్తున్నారు.

నాలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం

కొన్ని రోజుల నుంచి డ్రోన్ల ద్వారా చెరువులు, కుంటల్లో దోమల నివారణ మందును పిచికారి చేస్తున్నాం. ఇది మంచి ఫలితాలు ఇస్తోంది. ఇప్పటికే సర్కిల్ పరిధిలో ఉన్న చాలా చెరువుల్లో మందు చల్లాం. నిత్యం ఒక్కో చెరువు, కుంటను ఎంపిక చేసుకుంటూ మందు చల్లుతున్నాం. అయితే దోమల వృద్ధి నాలాల ద్వారా భారీగా జరుగుతోంది. ఫిలింనగర్, షేక్‌పేట ప్రాంతాల్లో ఉన్న బుల్కాపూర్ నాలా మొత్తం దోమల బెడద తీవ్రంగా ఉండటంతో ఇక్కడ సిబ్బంది వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. దీంతో నాలాల్లో కూడా డ్రోన్ల ద్వారానే మందును పిచికారి చేస్తున్నాం. అన్ని నాలాల్లోనూ దోమల మందును డ్రోన్ల ద్వారానే చల్లాలని నిర్ణయించాం. ఈ మేరకు ఎంటమాలజీ సిబ్బందితో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం.

– సమ్మయ్య, డీసీ, జూబ్లీహిల్స్ సర్కిల్

విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ



స్కూల్ బ్యాగులు, నోటుబుక్స్ పంపిణీ చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు

ఖైరతాబాద్: సేవాభావంతో ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగుల పంపిణీ చేస్తున్న శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ కొనియాడారు. ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు శనివారం ఉచితంగా నోట్‌బుక్స్, స్కూలు బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లు పాల్గొని ట్రస్ట్ చైర్మన్ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్, స్థానిక నాయకులు లక్ష్మణ్ యాదవ్, మహేందర్ బాబు, సుధాకర్ యాదవ్, పృథ్వీరాజ్, కె.రాజు, ఖైరతాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడు కె.కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఈఓ సుధాకర్

వెంగళరావునగర్: సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని దేవాదాయ ధర్మాదాయశాఖ జీటీఎస్ టెంపుల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుమ్మడిదల సుధాకర్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్, ప్రధాన రహదారిలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని వన మహోత్సవం ఏర్పాటు చేశారు. ఆయన పలురకాల మొక్కలను ఆలయ ప్రాంగణంలో రోడ్డు పక్కన నాటారు.

ధ్యానం చేయడంలో కొత్త ఒరవడి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇంజనీర్లు

వెంగళరావునగర్: నిరంతరం సమస్యలతో సతమతమయ్యే ఉద్యోగులు కనీసం గంటపాటైనా యోగా చేస్తే మంచి రిలీఫ్ లభిస్తుందని ఇరిగేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జె.సూర్యప్రకాశ్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జెన్‌కో ఆడిటోరియంలో శనివారం 'ది ఇన్‌స్టెంట్ సక్సెస్' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ది ఇన్‌స్టెంట్ సక్సెస్ పుస్తకంలో ధ్యానం చేయడంలో కొత్త ఒరవడిని తెలియజేస్తుందన్నారు. ఇది పనిలో నాణ్యతను పెంచుకోవడానికి ఆయుధంలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జి.నర్సింగరావు, గ్రిడ్ ఆపరేషన్ డైరెక్టర్ బి.నర్సింగరావు తదితర ఇంజనీర్లు, వివిధ శాఖల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌బీటీనగర్ స్కూల్‌లో అదనపు గదుల భవనం ప్రారంభం



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో కలిసి పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.1.16 కోట్లతో నిర్మించిన అదనపు గదుల సముదాయాన్ని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ శనివారం ప్రారంభించారు. రెండు నెలల క్రితం మన బస్తీ–మన బడి పథకం కింద ప్రారంభించిన ఈ భవన నిర్మాణానికి అప్పటి రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు రూ.20 లక్షల ఎంపీ లాడ్స్ నిధులను, మన బస్తీ–మన బడి పథకం కింద రూ.48.45 లక్షలు, సర్వశిక్షా అభియాన్ కింద రూ.26 లక్షలు, అమ్మ ఆదర్శ పాఠశాల స్కీం కింద రూ.22.40 లక్షలు మంజూరు కాగా ఈ మొత్తం నిధులతో స్కూల్ భవనాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న గదులకు అదనంగా రెండు గదులతో పాటు విద్యార్థుల కోసం డైనింగ్ హాల్ తదితర వసతులను ఈ కొత్త భవనంలో కల్పించినట్లు మేయర్ తెలిపారు. పాఠశాల భవనాన్ని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో కలిసి ప్రారంభించిన ఆమె త్వరలోనే ఎన్‌బీటీనగర్‌లో ఇంటర్మీడియెట్ కోసం భవనాన్ని నిర్మిస్తామన్నారు. తన ఎమ్మెల్సీ ఫండ్స్ నుంచి విద్యార్థుల కోసం ఇంటర్మీడియెట్ భవన నిర్మాణానికి సహకరిస్తానని అద్దంకి దయాకర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపోలో రోడ్లపై ఆక్రమణల తొలగింపు



అపోలో ఆస్పత్రి రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రి రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలను జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శనివారం తొలగించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు ఇరు వైపులా ఫుట్‌పాత్‌లతో పాటు దుకాణాల ముందు, రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన తోపుడుబండ్లు, ఇతర సామాగ్రిని సీజ్ చేశారు. రెండు నెలల క్రితం ఈ రోడ్డంతా ఆపరేషన్ రోప్ నిర్వహించి ఫుట్‌పాత్‌లను పాదచారులకు అందుబాటులోకి తీసుకురాగా, రెండు వారాల నుంచి మళ్లీ ఫుట్‌పాత్ ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసుల నిర్వాకంతో అపోలో రోడ్డు మరోసారి ఫుట్‌పాత్ ఆక్రమణలతో నిండిపోయి ట్రాఫిక్ ఏసీపీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆక్రమణలు తొలగించారు. మరోసారి ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని ఏసీపీ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్‌ఐ అశోక్ కూడా పాల్గొన్నారు.

పెవిలియన్ రెస్టారెంట్ సీజ్



పెవిలియన్ రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ సొసైటీ రోడ్డు నంబర్–51 ప్లాట్‌నెంబర్ 1014సీలో ఉన్న పెవిలియన్ రెస్టారెంట్ పేరుతో నడుస్తున్న అనధికార నిర్మాణాన్ని శనివారం జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. ఈ నిర్మాణంపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు అందడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో 2025 మార్చి 13, ఏప్రిల్ 16న ఉప కమిషనర్ ఆధ్వర్యంలో విచారణలు కూడా నిర్వహించారు. దీంతో పాటు సంబంధిత భూమి యజమాని సతీష్ పోలంరెడ్డి నుంచి వివరణలు అందినప్పటికీ రెస్టారెంట్ నడిపేందుకు ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకపోవడం, నివాస ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు జరపడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టంచేశారు. ఈ మేరకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీల్ వేశారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, బీఈడీ తదితర వృత్తి విద్యా కోర్సుల విద్యార్థుల బోధన, ఉపకారవేతన ఫీజు బకాయిలను సత్వరమే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నేతలు ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, మాజీద్ అలీఖాన్, హేమంత్, మహమూద్, విశాల్, నితిన్, కీర్తన, మృణాళిని, సీమ, రమ్య తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు

7న ఒంగోలులో మాదిగ మహా మేళా



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య

హిమాయత్‌నగర్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 7వ తేదీన ఒంగోలు మున్సిపల్ గ్రౌండ్‌లో 'మాదిగ మహా మేళా' నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గురుపాటి బ్రహ్మయ్య పేర్కొన్నారు. మాదిగ అమర వీరుల త్యాగాల ఫలితంగానే వర్గీకరణ వచ్చిందని స్పష్టం చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక రాజుమాదిగ, విజయ్ కుమార్ మాదిగతో కలిసి ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల క్రితం ఈదుమూడి గ్రామంలో ఆవిర్భవించిందని తెలిపారు. 7వ తేదీన ఆ గ్రామంలో మాదిగ అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తామని చెప్పారు. ఈ స్థూపం వద్దకు మంద కృష్ణమాదిగ వస్తే ఆహ్వానిస్తామని లేకపోతే మాదిగల ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరించారు.

ఆరోగ్య సమతుల్యతకు యోగాసనాలు



కేబీఆర్ పార్కులో యోగా చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన



నిమ్స్ వెల్‌నెస్ సెంటర్‌లో ఆసనాలు వేస్తూ..



మధురానగర్‌లో యోగా దినోత్సవంలో కార్పొరేటర్ దేదీప్య, కాలనీ నేతలు

మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: ప్రకృతిని ఆస్వాదిస్తూ ఎలాంటి వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో యోగాను భాగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం డీఈఓ, డీఎంహెచ్ఓ, ఆశావర్కర్ల ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ జాతీయ ఉద్యానవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన యోగాసనాలు వేశారు. ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు జీవనశైలిలో సమతుల్యతకు యోగా ఎంతగానో దోహ ద పడుతుందన్నారు. దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయా కర్, జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ జి.ముకుందరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, డీఈఓ రోహిణి, ఆర్డీఓ సాయిరాం, ఆశావర్కర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో యోగా డే వేడుకలు

యోగా దినచర్యలో భాగం కావాలి

మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద

లక్డీకాపూల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగా చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిమ్స్ వెల్‌నెస్ సెంటర్‌లో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో శనివారం యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ డాక్టర్ పెరుగు శ్రీకాంత్ బాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో యోగా ఆసనాల పట్ల అవగాహన కల్పించారు. వైద్యులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు. నిమ్స్ మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, ఆయుష్ విభాగం వైద్యులు డాక్టర్ టి.శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ జె.దీప, డాక్టర్ రాధికా, నిమ్స్ ఆర్‌ఎంఓలు రేణుపూజిత, డాక్టర్ అయేషా, డాక్టర్ సుప్రజ పాల్గొన్నారు.

యాడ్ లైఫ్‌లో యోగాసనాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి యాడ్‌లైఫ్ ప్రత్యామ్నాయ వైద్య విభాగంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ట్రస్ట్ బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్, యాడ్‌లైఫ్‌కు చెందిన డాక్టర్ ఉదయ్ కుమార్, యోగాచార్య, శివప్రసాద్‌తో పాటు నర్సులు, వైద్యులు, వైద్యేతర సిబ్బంది, రోగులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. మనస్సును ప్రశాంతంగా ఉండడానికి శారీరిక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ దేదీప్య విజయ్, కాలనీ మహిళా నేతలు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. యూసఫ్‌గూడ ప్రాంతాల్లో సమయం దాటిన తర్వాత అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు శుక్రవారం అర్ధరాత్రి సమాచారం అందింది. దాంతో ఎస్ఐ రంజిత్‌నాయక్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా యూసుఫ్‌గూడ మెయిన్ రోడ్డు వద్ద వి.రాములు అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి వద్దకు వెళ్లగా పారిపోవడానికి ప్రయత్నించాడు. అతడిని పట్టుకుని విచారించగా మద్యం విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్టు

రహమత్‌నగర్: రహస్యంగా గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను బోరబండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్పీఆర్‌హిల్స్ గోరఖ్‌నాథ్ శివాలయం వద్ద కార్మికనగర్‌కు చెందిన మహ్మద్ హైదర్, యూసుఫ్ శివాలయం వద్ద గంజాయి సేవిస్తుండటంతో శుక్రవారం రాత్రి అడ్మిన్ ఎస్సై నాగూల్ మీరా సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సినిమా షూటింగ్‌లో పనిచేస్తూ.. జల్సాల కోసం బైకుల చోరీ

- 13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఇద్దరు దొంగల రిమాండ్

బంజారాహిల్స్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ముఠాను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి 13 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సినిమా షూటింగ్‌లలో పనిచేస్తూ శ్రీకృష్ణానగర్ ఉంటున్న నిమ్మతి శ్రీకాంత్(32), నవీన్(22)లు జల్సాలకు అలవాటుపడి ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతూ బైక్‌లు చోరీ చేస్తున్నారు. వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్ చోరీలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు దొంగలు పట్టుబడ్డారు. వీరి నుంచి 13 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, జూబ్లీహిల్స్‌లో 1, బేగంపేటలో 3, గోపాలపురంలో 1, బోరబండలో 1, మేడ్చల్‌లో 1, పేట్‌బషీరాబాద్‌లో 1 కేసు నమోదై ఉన్నాయి. ప్రధాన నిందితుడు నిమ్మతి శ్రీకాంత్ తరచూ బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. పాతుకపల్లి, శామీర్‌పేట, రాంగోపాల్‌పేట, సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్లలో శ్రీకాంత్‌పై కేసులు నమోదై ఉన్నట్లు తేలింది. వీరు బైక్‌లు దొంగతనాలు చేసి షేక్ ఖలీం అనే వ్యక్తికి విక్రయిస్తున్నట్లుగా నిర్ధారించారు. వారిని రిమాండ్‌కు తరలించారు. క్రైమ్ పోలీసులను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపిస్తున్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

నగరంలో నేడు

- మాదాపూర్‌లో హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ నోవొటెల్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట వేసవికాలం, వివాహ ప్రత్యేక కలెక్షన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణా ఎదురుగా ఉన్న బంజారా హాల్‌లో బిగ్ పటోలా శారీస్ సేల్ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఉదయ సాహితి సంయుక్త ఆధ్వర్యంలో కవి మౌనశ్రీ మల్లిక్ రచించిన 'చలన కాంక్ష'కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో జరుగుతుంది.
- జర్నలిస్ట్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ప్రారంభోత్సవ వేడుక ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మెట్రో-2బి డీపీఆర్‌లు కేంద్రానికి అందజేత

మూడు కారిడార్లకు రూ.19,579 కోట్లు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనులు
- రూ.43,848 కోట్లతో 232 కి.మీ. మెట్రో నిర్మాణం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో రెండో దశ 'బి'ఇక పట్టాలు ఎక్కనుంది. ఈ విభాగం కింద ప్రతిపాదించిన మూడు కారిడార్ల డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)లను శనివారం కేంద్రానికి సమర్పించినట్లు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఆర్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. కొద్దిరోజుల క్రితమే ఈ కారిడార్‌లకు కేబినెట్ ఆమోదం లభించిన సంగతి తెలిసిందే. ఇటీవల పరిపాలన అనుమతులు కూడా లభించాయి. దీంతో మూడు కారిడార్ల సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించారు. 'బి'కింద రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ. కారిడార్ నిర్మాణానికి రూ.7,168 కోట్లతో అంచనాలు రూపొందించారు. జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ.లకు రూ.6,946 కోట్లు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ.లకు రూ.5,464 కోట్ల చొప్పున ఈ మూడు కారిడార్ల నిర్మాణానికి మొత్తం రూ.19,579 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టనున్న ప్రాజెక్టు. దీంతో ఈ వ్యయంలో 30 శాతం.. అంటే రూ.5,874 కోట్లు రాష్ట్రం వాటా కాగా, కేంద్రం రూ.3,524 కోట్లు (18 శాతం) వెచ్చించనుంది. మరో 48 శాతం నిధులు.. అంటే రూ.9,398 కోట్లను అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాల రూపంలో సేకరించనున్నారు. రూ.783 కోట్ల(4 శాతం)ను పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతి (పీపీపీ)లో వెచ్చించనట్లు ఎన్వీఎస్ తెలిపారు. మెట్రోరెండో దశ 'ఏ'విభాగం కింద ప్రతిపాదించిన 76.4 కి.మీ.లకు సుమారు రూ.24,269 కోట్లతో ఇప్పటికే డీపీఆర్‌లను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి అందజేసిన సంగతి తెలిసిందే. పలు సాంకేతిక అంశాలపై తలెత్తిన సందేహాలను సైతం మెట్రో అధికారులు కొద్ది రోజుల క్రితం నివృత్తి చేశారు. 'ఏ'విభాగం కింద ఐదు కారిడార్‌లలో నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 36.8 కి.మీ., రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపొలిస్ వరకు 11.6 కి.మీ., ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5.కి.మీ., మియాపూర్-పటాన్‌చెరు 13.4 కి.మీ., ఎల్‌బీనగర్-హయత్‌నగర్ 7.1.కి.మీ. మేర ఆయా మార్గాలను నిర్మించనున్నారు. మెట్రో రెండో దశలో 'ఏ', 'బి'విభాగాల కింద మొత్తం 232 కి.మీ. నిర్మించేందుకు డీపీఆర్‌లను రూపొందించారు. ఇందుకోసం రూ.43,848 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా.

ఇదీ హైదరాబాద్ మెట్రో..

- మెట్రో రెండో దశ 'ఏ'విభాగంలో 5 కారిడార్లు 76.4 కి.మీ. వ్యయం అంచనా రూ.24,269 కోట్లు
- రెండోదశ 'బి'విభాగంలో 3 కారిడార్లు 86.1 కి.మీ. వ్యయం అంచనా రూ.19,579 కోట్లు

రుణాలిచ్చే ముందే సరిచూసుకోండి

బ్యాంకర్లకు హైడ్రా కమిషనర్ సూచనలు



సాక్షి, సిటీబ్యూరో: 'సొంత ఇంటి కలను సాకారం చేయడంలో మీ పాత్ర ఎంతో కీలకమైనది. అయితే ఇళ్ల కొనుగోలుకు రుణాలిచ్చే ముందుగా అన్ని విధాలా సరి చూసుకోవాలి'అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బ్యాంకర్లకు సూచించారు. ఇనిస్టిట్యూషన్ ఆఫ్ వాల్యూయర్స్ (ఐఓవీ) రిజిస్టర్డ్ వాల్యూయర్స్ ఫౌండేషన్, నగరశాఖ ఆధ్వర్యంలో 'ట్రాన్స్‌ఫర్మేటివ్ ఎరాలో వాల్యుయేషన్'అనే అంశంపై బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రంగనాథ్ మాట్లాడుతూ గత ఏడాది జులై 19న హైడ్రా ఏర్పడిందని, అంతకు ముందువి, అనుమతులు పొంది నిర్మాణ దశలో ఉన్న వాటి జోలికి తాము వెళ్లడంలేదని స్పష్టం చేశారు. మోసాలకు ఆస్కారం లేకుండా సొంతింటి కలను సాకారం చేయడంలో రియల్ ఎస్టేట్ సంస్థలతోపాటు రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలు కూడా బాధ్యత వహించాలని సూచించారు. ఒక సర్వే నంబరు చూపించి.. వేరే చోట ఇళ్ల నిర్మాణం చేపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి వరద ముప్పు లేని నగరంగా హైదరాబాద్‌ని తీర్చిదిద్దాలనేది హైడ్రా లక్ష్యమని పేర్కొన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో వెయ్యికి పైగా ఉన్న చెరువుల పునరుద్ధరణ జరిగి పార్కులన్నీ పచ్చగా మారితే పర్యావరణ సమతుల్యత సాధించగలమన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, సర్వే ఆఫ్ ఇండియా, గ్రామ, రెవెన్యూ రికార్డుల ఆధారంగా చెరువుల హద్దులను పూర్తి స్థాయిలో నిర్ధారించి ఆ సమాచారం చిటికెలో తెలిసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.రఘు, క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు జి. రామిరెడ్డి, ఐవోవీ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.పటేల్, ఐవోవీ ప్రతినిధులు పి.మధు. కె.చిరంజీవితోపాటు వాల్యుయేషన్, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పీజేఆర్ ఫ్లై ఓవర్.. రూ.11 కోట్ల ఇంధనం ఆదా

సాక్షి,సిటీబ్యూరో: పీజేఆర్ (శిల్పా లేఔట్ ఫేజ్-2) ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ రూ.178 కోట్లు ఖర్చు చేసింది. దీని వల్ల కొండాపూర్- ఓఆర్ఆర్ అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు ప్రయాణించేవారికి రోజుకు దాదాపు 3,007 లీటర్ల ఇంధనం ఆదా అవుతుంది. తద్వారా నగర ప్రజలకు ఏటా దాదాపు రూ.11 కోట్ల మేర ఇంధన వ్యయం తగ్గుతుంది. ఈ లెక్కలు చెప్పింది జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్. శనివారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న ఈ ఫ్లైఓవర్ వల్ల ఐటీ కారిడార్-ఓఆర్ఆర్ మార్గంలో ప్రయాణాలు చేసే వారికి ఎంతో సౌలభ్యం కలుగుతుందన్నారు. ఈ ఫ్లైఓవర్ పొడవు 1.2 కిలోమీటర్లు కాగా, నిత్యం దాదాపు 50 వేల వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ప్రస్తుతం ఈ దూరం ప్రయాణించడానికి 12 నిమిషాల 25 సెకన్ల సమయం పడుతుండగా, ఫ్లై ఓవర్ వల్ల కేవలం 2 నిమిషాల 25 సెకన్లు మాత్రమే పట్టనుందన్నారు. కేబీఆర్ పార్కు వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్ పనితీరును పరిశీలించి, రాబోయే రోజుల్లో మరో మూడు పార్కుల్లో అలాంటి మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. ఇందిరా పార్కు, జలగం వెంగళరావు పార్కుతోపాటు మరో పార్కులో ఈ ఏర్పాట్లు చేస్తామన్నారు.

గురుకులాల్లో మంత్రి లక్ష్మణ్ తనిఖీ



గౌలిదొడ్డి గురుకులంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అడ్లూరి, అధికారులు

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల/బాలుర కళాశాలలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. అక్కడ బోధన, ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల సాధన కోసం ఇచ్చే శిక్షణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల/పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, తరగతి గదులు, భోజన శాల, విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార పదార్థాల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే తపనతో చేస్తున్న కృషికి ఇలాంటి కళాశాలలు నిదర్శనంగా నిలవాలన్నారు. విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించి వారికి మంచి భవిష్యత్తును కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు, ఉద్యోగులు మరింత సమిష్టిగా పని చేసి వారికి పూర్తి న్యాయం చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గరుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి, సంయుక్త కార్యదర్శి సక్రూనాయక్, డిప్యూటీ సెక్రటరీ రంజని, రాష్ట్ర అధికారి భీమయ్య, జోనల్ ఆఫీసర్ నిర్మల, రెండు కళాశాలల ప్రిన్సిపల్స్ కల్పన, అంజయ్య, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి.. స్కూల్ బస్సు నడిపి..



స్కూల్ బస్ డ్రైవర్ ను పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు

ఫిలింనగర్: మద్యం మత్తులో స్కూల్ బస్సు నడుపుతూ ఒక కార్పొరేట్ స్కూల్ బస్సు డ్రైవర్ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. శనివారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా స్కూల్ బస్సుల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా జూబ్లీహిల్స్‌లోని ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూల్ డ్రైవర్ మోతాదుకు మించి మద్యం సేవించి బస్సు నడుపుతూ పట్టుబడ్డాడు. నాగిరెడ్డి అనే డ్రైవర్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా, ఆయన రక్తంలో మద్యం మోతాదు 153 ఎంజీ ఉన్నట్టు తేలింది. ఈ మేరకు బస్సును సీజ్ చేశారు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రాజేందర్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద వందలాది మంది భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలనెలా సక్రమంగా వేతనాలు రావడం లేదని, అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఐకార్ పరిశోధన సంస్థలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు రూ. పది వేల నుంచి రూ. 25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అనేక తీర్పులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదని విమర్శించారు. వెంటనే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, విద్యార్థి సంఘం కన్వీనర్ మోది రాందేవ్, బాలస్వామి, భూపేష్ సాగర్, రాజు నేత, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌వాసి మృతి

- ఏపీలోని చింతూరులో ఘటన


చింతూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని రింగల వద్ద జాతీయ రహదారి-30పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న రవిరాజు(25) అనే యువకుడు మృతి చెందాడు. వీకెండ్ కావడంతో స్నేహితులతో కలసి కారులో హైదరాబాద్ నుంచి మారేడుమిల్లి వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. చింతూరు మండలం రింగల వద్ద కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో రవిరాజు తలకు తీవ్ర గాయాలు కావడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులోని అతని స్నేహితులకు స్వల్ప గాయాలయ్యాయి.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా



లక్డీకాపూల్: అగ్ని ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబ సభ్యులకు రూ. 6 లక్షల ఎక్స్‌గ్రేషియా ను నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అందజేశారు. కుషాయిగూడ సాయినగర్ కాలనీలో కట్టెల మండిలో 2023 ఏప్రిల్ 16న అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో కట్టెలమండి పక్కనే నివాసం ఉంటున్న రేట్నేని నరేష్, ఆయన భార్య సుమ, కుమారుడు జోషిత్ మరణించిన విషయం విదితమే. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తన పుట్టిన రోజు సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యుడు రేట్నేని చెన్నయ్యకు రూ. 6 లక్షలను చెక్ రూపంలో అందజేశారు.

అరుణోదయ అనితకు డాక్టరేట్ ప్రదానం



సాక్షి, సిటీబ్యూరో: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉపాధ్యక్షురాలు అనితకుమారి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు.'మిత్ర కవిత్వం – సమగ్ర పరిశీలన'అనే అంశంపై ఆమె ప్రొఫెసర్ చింతకింది కాశీం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. 25 సంవత్సరాలపాటు అజ్ఞాత జీవితం గడిపిన మిత్ర కవిత్వాన్ని సమూలంగా విభజించి విశ్లేషిస్తూ ఆయనను 'విప్లవకవిగా' తమ పరిశోధన ద్వారా నిరూపించిన సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. అనిత కృషిని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క అభినందించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ బొమ్రాసిపేట్ మండలం రేగడి మైలారం గ్రామానికి చెందిన అనిత అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రోత్సాహంతోనే డిగ్రీ, పీజీ పూర్తి చేశారు. ఈ క్రమంలోనే ఆమె మిత్ర కవిత్వంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందడంపట్ల పలువురు కళాకారులు ఆమెను అభినందించారు.

42 శాతం రిజర్వేషన్ల బాధ్యత జాతీయ పార్టీలదే..

ఓయూ సత్యాగ్రహ దీక్షలో బీసీ నేత జాజుల



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బాధ్యత జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లదేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏఐఓబీసీఎస్ఏ ఆధ్వర్యంలో జరిగిన బీసీ సత్యాగ్రహ దీక్షలో ఆయన ప్రసంగించారు. దేశంలో అధిక జనాభా గల బీసీలపై జాతీయ పార్టీల నేతల చిన్నచూపు తగదన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత రెండు జాతీయ పార్టీలు చేపట్టాలని, లేని పక్షంలో పార్టీలకు అతీతంగా బీసీలు ఏకమై రెండు పార్టీలను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఓబీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ అవ్వారు వేణుగోపాల్ మాట్లాడుతూ రిజర్వేషన్ల బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు వందేళ్ల బహుజన సమానత్వ పోరాటానికి దక్కిన ఫలితమని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. కార్యక్రమానికి అఖిల భారత ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) జాతీయ కార్యదర్శి మహేష్‌గౌడ్ అధ్యక్షత వహించగా రిటైర్డ్ డీజీపీ డా.పూర్ణచందర్ రావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు పిడికిలి రాజు, కొండల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులుకు ఎమర్జింగ్ ప్రిన్సిపాల్ అవార్డు



మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ నర్సింహులుకు సీఎస్ఐ ఎమర్జింగ్ ప్రిన్సిపాల్ అవార్డు దక్కింది. భువనగిరిలోని అనురాగ్ యూనివర్సిటీలో జరిగిన ప్రతిష్టాత్మక ఏపీఎస్సీసీ- 2025, సీఎస్ఐ రీజినల్ కన్వెన్షన్ వేడుకల్లో ఆయన శనివారం మైక్రోసాఫ్ట్ సీనియర్ డైరెక్టర్ పి.భరత్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. సీబీఐటీ అభివృద్ధిలో నాయకత్వం వహించటంతోపాటు కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించినందుకు ఈ పురస్కారం దక్కిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, రాబోయే రోజుల్లో విద్యాసంస్థ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.

జీవన వైవిధ్యాల సమ్మేళనమే 'మిక్షర్ పొట్లం'

సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



మిక్షర్ పొట్లం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ, బాలాచారి తదితరులు

లక్డీకాపూల్: 'మిక్షర్ పొట్లం' కవితా సంపుటిలోని వచన కవిత్వం జీవితమంత వైవిధ్యభరితంగా ఉందని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. శనివారం రవీంద్రభారతిలోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో డాక్టర్ ప్రేమ్ సాయి రవికుమార్ రచించిన 'మిక్షర్ పొట్లం' కవితల సంపుటిని జి.పుల్లారెడ్డి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మాధవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపుటి స్వీకర్త అశోక్ తేజ మాట్లాడుతూ పుస్తకం రాయడం కన్నా రాసిన తర్వాత అచ్చువేయడం ఒక యజ్ఞం వంటిదన్నారు. 'మా నాన్న సుద్దాల హనుమంతును మీ చివరి కోరిక ఏమిటని అప్పట్లో అడిగితే నా పుస్తకాన్ని అచ్చురూపంలో చూసుకోవాలనుందనేవారు. కానీ, ఆయన తన చివరి కోరిక తీరకుండానే కన్నుమూశారు'అని అన్నారు. జీవితానుభవాల నుంచి వచ్చేదే నిజమైన కవిత్వమని పేర్కొన్నారు. మాటలలోని పాటదనమే గేయ కవిత్వ లక్షణమని చెప్పారు. తెలియని విషయాన్ని చెప్పడం కవిత్వం కాదని, తెలిసిన విషయాన్నే కొత్తగా చెప్పడమే కవిత్వమని అన్నారు. ప్రేమ్ సాయి రవికుమార్ తన మొదటి కవితా సంపుటితోనే మంచి వచన కవితా రచయితగా అక్షరాలను మలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథులు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, ఉపాధ్యక్షుడు అనంతోజు మోహనకృష్ణ, పుస్తక పరిచయకర్త సర్ఫరాజ్ అన్వర్, సీనియర్ జర్నలిస్ట్ మైల కుమార్, సినీ కో డైరెక్టర్ కె.రాంగోపాల్ చౌదరి, సోమశిల తిరుపాల్, పలువురు సినీ పరిశ్రమ ప్రముఖులు పాల్గొన్నారు.

కవితకు త్రైత సిద్ధాంత భగవద్గీత అందజేత



బంజారాహిల్స్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్ కమిటీ తరఫున శాఖ సభ్యులు మంతటి వెంకటయ్య తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని వెంకటేశ్వర కాలనీలోని ఆమె నివాసంలో కలిసి ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాన్ని అందజేశారు.

నాలా ఆక్రమణల తొలగింపునకు చర్యలు

- హైడ్రాతో కలిసి పరిశీలించిన బోర్డు అధికారులు



జేబీఎస్ సమీపంలోని పికెట్ నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, కంటోన్మెంట్ అధికారులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో నాలాల ఆక్రమణలపై అధికారులు దూకుడు పెంచారు. ఇటీవలే హైడ్రాతో కలిసి ప్యాట్నీ నాలా ఆక్రమణలు తొలగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కంటోన్మెంట్ పరిధిలోని ప్యాట్నీ, పికెట్ నాలాల వెంబడి ఉన్న ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదులు అందడంతో స్పందించారు. శనివారం బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ ఆధ్వర్యంలో పలు ఆక్రమణలను పరిశీలించారు. ఆరో వార్డు పరిధిలోని దివ్యాంగ్జన్ నాలాను ఆక్రమించి నిర్మించిన ఓ ప్రైవేటు స్కూలు భవనాన్ని పరిశీలించారు. అనంతరం పార్క్ వ్యూ కాలనీకి ఎదురుగా నాలాపై వెలిసిన అక్రమ దుకాణాలు, ఇతరత్రా ఆక్రమణలను అధికారులు గుర్తించారు. అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి జేబీఎస్ సమీపంలోని పికెట్ నాలాను పరిశీలించారు. నాలా వెంబడి వెలిసిన అక్రమ నిర్మాణాల తొలగింపునకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. వచ్చే వారంలో వాటిని తొలగించాలని నిర్ణయించారు. నాలాలు, రోడ్లు, పార్కుల ఆక్రమణలకు సంబంధించి ప్రజలు బోర్డు కార్యాలయంలో ఫిర్యాదు చేయాల్సిందిగా అధికారులు సూచించారు. ప్యాట్నీ నాలా వెంబడి ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని కొందరు ఆక్రమణదారులు అడ్డుకునేందుకు యత్నించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అడ్డుపడితే చర్యలు తీసుకుంటామని వారికి హెచ్చరించారు.

కేబీఆర్ పార్కుకు జయశంకర్ పేరు పెట్టాలి

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



కేబీఆర్ పార్కు వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కాసు బ్రహ్మనందరెడ్డి నేషనల్ పార్కు పేరు మార్చి తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం కేబీఆర్ పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ కేబీఆర్ పార్కు పేరును ప్రొఫెసర్ జయశంకర్ నేషనల్ పార్కుగా ఈ రోజు నుంచి తామే మారుస్తున్నామని, ప్రభుత్వం మార్చినా, మార్చకున్నా ఇప్పటి నుంచి ఈ పార్కు పేరు జయశంకర్ నేషనల్ పార్కుగానే వ్యవహరిస్తామని వెల్లడించారు. ఇక్కడ ఉన్న కాసు బ్రహ్మనందరెడ్డి విగ్రహాన్ని కూడా తొలగించి ఆ స్థానంలో జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కేబీఆర్ విగ్రహం తొలగించకపోతే 2028లో బీసీ ప్రభుత్వం వచ్చాక పడగొట్టి జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్‌కు బెల్లి లలిత పేరు పెట్టాలని, కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాధవరెడ్డి ఫ్లైఓవర్‌కు కూడా శ్రీకాంతాచారి పేరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ పొలిటిలికల్ జేఏసీ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సూదగాని హరిశంకర్‌గౌడ్, విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహనచారి, జేఏసీ నేతలు బందారపు నర్సయ్య, రాళ్లబండి విష్ణుచారి, తిరుమణి నాగరాజు, బిక్షపతిచారి, వెంకటేశ్వర్లుయాదవ్, సీతాయాదగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో వేధింపులు.. యువకుడి అరెస్ట్

ఫిలింనగర్: ప్రేమపేరుతో మాజీ ప్రేయసిని వేధిస్తున్న ఓ యువకుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని ఓ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న యువతి(25)కి ఇన్‌స్టాగామ్‌లో 2019లో భద్రాచలం ప్రాంతానికి చెందిన రత్నాకర్(25) అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారడంతోపాటు 2023 దాకా కొనసాగింది. అనంతరం వారిద్దరి మధ్య విభేదాలు రావడంతో బ్రేకప్ చెప్పుకున్నారు. బ్రేకప్ తర్వాత కూడా యువతికి ఫోన్లు చేస్తూ రత్నాకర్ వేధిస్తుండటంతో ఫోన్ నెంబర్లు మార్చింది. ఇటీవల యువతి స్నేహితుల వద్ద నుంచి ఫోన్ నెంబర్ తీసుకున్న రత్నాకర్ ఆమె పనిచేస్తున్న ఆస్పత్రి వద్దకు వచ్చి వేధింపులకు దిగాడు. ఆమెను వెంబడిస్తూ ప్రేమించాలని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో విసిగిపోయిన బాధిత యువతి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మేయర్‌కు బర్త్ డే విషెస్



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఆమెను కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. - లక్డీకాపూల్

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 22, జూన్, 2025

ఇస్మార్ట్.. రోబో..



సాక్షి, సిటీబ్యూరో : హైటెక్స్‌లో జరుగుతున్న ప్రాపర్టీ షోలో ఏఐ ఆధారిత రోబో సందర్శకులను ఆకట్టుకుంటోంది. రాధే గ్రూప్ ఆధ్వర్యంలోని పెవిలియన్‌లో సందడి చేస్తున్న ఈ రోబో సందర్శకుల ప్రశ్నలకు స్మార్ట్‌గా సమాధానాలు సైతం చెబుతుండడం విశేషం.



అలరించిన సూఫీ ఖవ్వాలి

చార్మినార్: నిజామీ సోదరులు ఆలపించిన ఆధునిక సంప్రదాయ సూఫీ ఖవ్వాలి పాత బస్తీ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. చౌమహల్లా ప్యాలెస్ ప్రాంగణంలో దేదీప్య మానంగా వెలుగుతున్న షాండిలియర్స్, ఆకట్టుకునే విద్యుత్ దీప కాంతుల నడుమ నిజామీ బ్రదర్స్ వినిపించిన ఖవ్వాలి ప్రేక్షకులను అలరించింది. వరల్డ్ మ్యూజిక్ డే సందర్భంగా శనివారం రాత్రి ఏక్ శామ్ ఖుస్రో కే నామ్.. అనే పేరుతో సూఫీ ఖవ్వాలి సాంస్కృతిక నిర్వహించారు. ప్యాలెస్ డైరెక్టర్ కిషన్ రావు, అక్బర్ నిజామీ, గుఫ్రాన్ నిజామీ అనే ఇద్దరు నిజాం సోదరులు ఆద్యంతం తమ ఖవ్వాలి పాటలతో ప్రేక్షకులను మైమరిపించారు.

ఆసనం.. ఓ ఔషధం..

ఆరోగ్యంతో పాటు.. చికిత్సా విధానంగా యోగా

ఒకప్పుడు ఆధ్యాత్మిక, మానసిక ప్రశాంతత కోసం మాత్రమే యోగాని ఒక మార్గంగా పరిగణించేవారు. ప్రస్తుతం అనారోగ్యానికి చికిత్సా మార్గంగా మారింది. దీంతో ఆధునిక వైద్యంలో అనేక దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడంలో యోగాసనాల ప్రాముఖ్యత పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఒక్కో వ్యాధికీ ఒక్కో రకం మందు లాగా వ్యాధికి తగిన యోగాసనం ఉండటం విశేషం. దినచర్యలో ఈ ఆసనాలను చేర్చడం ద్వారా ఒక్కోసారి మందులు లేకుండానే లేదా మందులతో పాటు అనుసరించి శరీరాన్ని ఆరోగ్యకరంగా మార్చుకోవచ్చు. రానున్న ఆరోగ్య సమస్యల నివారణకు మాత్రమే కాదు, చికిత్సకు కూడా ఒక బలమైన సాధనంగా అవతరిస్తోంది. కేవలం మందులపైనే ఆధారపడే పలువురు బాధితులకు యోగా చికిత్సగా మారుతోంది. అనారోగ్య సమస్యను బట్టి ఆసనాన్ని సూచించే విధానం స్థిరపడుతోంది.

- సాక్షి, సిటీబ్యూరో





* వ్యాధుల నుంచి కోలుకోడానికి ఆసనాలే ఔషధాలు
* రోగులకు మందుల ప్రిస్క్రిప్షన్స్‌తో పాటు సూచనలు
* ఒక్కో అనారోగ్యానికి ఒక్కో రకం యోగాసనం
* దీర్ఘకాలిక సమస్యలకు మెరుగైన ఫలితాలు
* అధ్యయనాల్లోనూ గణనీయమైన మెరుగుదల నమోదు

నగర జీవనశైలిలో ఎంత వేగం పెరిగినప్పటికీ ఆరోగ్యం కూడా అంతే వేగంగా దెబ్బతింటోంది. ఒత్తిడితో కూడిన జీవన శైలి కారణంగా శారీరక, మానసిక ఒత్తిడులు, జీవనశైలిలో మార్పుల కారణంగా అనేక రకాల దీర్ఘకాలిక రోగాలు నగరవాసులను ఇబ్బంది పెడుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రాచీన భారతీయత అందించిన వారసత్వ సంపదగా యోగా, గతంలో వ్యాధుల నివారణకు మాత్రమే అన్నట్టుగా ఉండగా, ఇప్పుడు వాటి చికిత్సకు కూడా ఉపయుక్తంగా మారుతోంది.

నివారణకు ఇలా...

యోగా సాధన ద్వారా శరీరానికి కావాల్సిన స్థితిస్థాపక శక్తి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నాడీ వ్యవస్థ, రక్తప్రసరణ, జీర్ణవ్యవస్థ ద్వారా కొత్తగా వ్యాధులు వచ్చే అవకాశాన్ని తగ్గిస్తుంది. అదే సమయంలో ఇప్పటికే ఉన్న రోగాలను నియంత్రించేందుకు యోగా ఒక సహాయక పద్ధతిగా మారుతోంది. ప్రాణాయామం, ధ్యానం, ఆసనాల ద్వారా వ్యాధుల నుంచి త్వరగా కోలుకునేలా చేసి దెబ్బతిన్న ఆరోగ్యాన్ని తిరిగి పొందవచ్చు. దీని కోసం అనారోగ్యాన్ని బట్టి వైద్యులు పలు ఆసనాలు సూచిస్తున్నారు..

అధ్యయనాలు చెబుతోందిదే..



దీర్ఘకాలిక తక్కువ వెన్నునొప్పికి ప్రారంభ నాన్ ఫార్మాస్యూటికల్ చికిత్సలో భాగంగా యోగాను అమెరికన్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ సిఫార్సు చేస్తోంది. యోగాభ్యాసం గుండె జబ్బుల కారకాలను తగ్గించగలదని వృద్ధుల్లో అంతర్గత అవయవాల పనితీరు మెరుగు.. జీవన నాణ్యతలో గణనీయమైన మెరుగుదలను అందిస్తుందని అధ్యయనంలో వెల్లడైంది. నొప్పులను నియంత్రించడంలో యోగా ప్రభావవంతంగా పనిచేస్తోందని, తలనొప్పి, ఆస్టియో ఆర్థరైటిస్, మెడనొప్పి, నడుమునొప్పి వంటి ఇబ్బందులను యోగా తొలగిస్తుందని పరిశోధనలు నిరూపిస్తున్నాయి. ఎనిమిది వారాల యోగా సాధనతో మోచేయి, మోకాలి కండరాల బలాన్ని 10%-30% మెరుగుపరుస్తుందని పరిశోధకులు తేల్చారు. చీలమండ, భుజం, తుంటి, కీళ్ల ఫ్లెక్సిబిలిటీ 13%-188% పెరిగిందని గుర్తించారు. ఎనిమిది నుంచి 12 వారాల సాధారణ అభ్యాసన ఆందోళన, నిరాశ నిస్పృహలను తగ్గిస్తుందని, ఒత్తిడి నిర్వహణలో సహాయపడుతుందని పరిశోధనలు తేల్చాయి.





అస్తమా (ఉపశ్వాసక సమస్యలు): శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడేవారి ఊపిరితిత్తులకు శక్తినిచ్చి, ఆమ్లజని సరఫరా మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. దీని కోసం భస్త్రిక ప్రాణాయామం, ధనురాసనం వంటి ఆసనాలను వైద్యులు సూచిస్తున్నారు.

డయాబెటిస్ (షుగర్): నగరంలో అనేక మందికి దీర్ఘకాలికంగా ఇబ్బందులు పెడుతున్నాయి. వాటిలో ముఖ్యమైనది డయాబెటిస్. దీనికి నిరంతరం ఇన్సులిన్, మందుల వాడకం తప్పడం లేదు. అయితే ఈ వ్యాధి నుంచి కోలుకోడానికి వాడుతున్న మందులు మరింత సమర్థవంతంగా పనిచేయడానికి పవనముక్తాసనం, అర్ధ మత్స్యేంద్రాసనం, సూర్య నమస్కారాలు వంటివి ఉపకరిస్తాయని చెబుతున్నారు. ముఖ్యంగా క్లోమగ్రంధి పనితీరును మెరుగుపరచడంలో ఆసనాల పాత్ర కీలకమని, రోజూ 15-20 నిమిషాల పాటు సాధన వల్ల రక్తంలో షుగర్ స్థాయిని నియంత్రించవచ్చని అంటున్నారు.

బీపీ (అధిక రక్తపోటు): వయసులకు అతీతంగా ఇబ్బంది పెడుతున్న ఆరోగ్య సమస్యల్లో హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) కూడా ఒకటి. దీని చికిత్సలో శవాసనం, వజ్రాసనం, నాడీ శోధన ప్రాణాయామం సహకరిస్తాయని వైద్యుల సూచన. ఈ ఆసనాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరిగి హృదయ స్పందనలు సరైన విధంగా నియంత్రించవచ్చు.



అత్యున్నత పరిష్కారం..



యోగాసనాలు కేవలం శరీర అవయవాలను కదలించే వ్యాయామం మాత్రమే కాదు.. వ్యాధులను తగ్గించే ఔషధం. ఆరోగ్య సమస్యల నుంచి కోలుకోడంలో యోగాసనాల ప్రభావం అధికంగా ఉంటుంది. దీనిపై నగరవాసులకు మరింత అవగాహన అవసరం. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు అత్యున్నత పరిష్కారం. శ్రద్ధతో సాధన చేస్తే అద్భుత ఫలితాలు పొందవచ్చు. దీనిపై సోషల్ మీడియా సహా విభిన్న మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నా.

– డా.జయప్రకాశ్ సాయి, వైద్యులు



జీర్ణ సమస్యలు (గ్యాస్ట్రో): వేళాపాళా లేని ఆహారపు అలవాట్ల కారణంగా నగరవాసుల్లో జీర్ణకోశ వ్యాధులు సర్వసాధారణంగా మారాయి. వీటి నుంచి కోలుకునే క్రమంలో పశ్చిమోత్తానాసనం, వజ్రాసనం అనుసరించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆహారం తీసుకున్న తర్వాత, భోజనానంతరం వజ్రాసనంలో కూర్చోవడం జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. వాయువు, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఊబకాయం (ఒబెసిటీ) : నగరంలో చిన్నా పెద్దా తేడా లేకుండా వేధిస్తున్న సమస్య ఓవర్‌వెయిట్, ఒబెసిటీ(స్థూలకాయం). దీని నుంచి బయటపడేందుకు సూర్య నమస్కారాలు, నవక్రియాసనాలు, త్రికోణాసనం సాధన చేయాలి. ఇవి శరీరానికి తగిన రక్తప్రసరణ, చక్కటి వ్యాయామం అందించటంతో పాటు శరీరంలో అధిక క్యాలరీలను ఖర్చు చేయిస్తాయి.

మైగ్రేన్ (పార్శ్వపు నొప్పి): ఇటీవల తలనొప్పి అదే విధంగా మైగ్రేన్ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి. వీటికి మందులతో పాటు శశాంకాసనం, పద్మాసనం, భ్రమ్మరి ప్రాణాయామం వంటివి చికిత్సగా పనిచేస్తాయి. ఈ ఆసనాలు నాడీ తంత్రానికి విశ్రాంతిని అందిస్తాయి. మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు మైగ్రేన్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

డిప్రెషన్, ఆందోళన : పని ఒత్తిడితోపాటు అనేక రకాల మానసిక సమస్యలతో నిత్యం పోరాటం చేస్తున్నారు. వీటిని తగ్గించుకునే క్రమంలో ధ్యానం, అనులోమవిలోమ ప్రాణాయామం వంటివి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సాధనాలు. ఇవి మెదడులో సెరటోనిన్ వంటి 'హ్యాపీ హార్మోన్ల'ను విడుదల చేస్తాయి. అయితే యోగా ఏ ఒక్క రోజులో ఫలితమివ్వదు. దినచర్యలో భాగంగా దీన్ని కొనసాగిస్తేనే దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి' అంటున్నారు ప్రముఖ యోగా నిపుణురాలు డా.మంజురెడ్డి. ముందస్తుగా శరీర పరిస్థితిని తెలుసుకుని నిపుణుల శిక్షణలో ప్రారంభించాలని సూచిస్తున్నారు.

మెట్రో స్టేషన్.. మ్యూజిక్ ఎమోషన్..

* ఆకట్టుకున్న జెంబే సర్కిల్
* 65 రకాల విభిన్న కార్యక్రమాలు
* సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకూ నిర్వహణ



జెంబే సర్కిల్‌తో ప్రారంభం..



సాక్షి, సిటీబ్యూరో : నగరంలోని మెట్రో రైలు స్టేషన్లు సంగీత సంబరాల సందడికి వేదికలుగా మారాయి. ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో మెట్రో మెడ్లీ పేరిట ప్రారంభమైన మ్యూజికల్ ఈవెంట్స్ కొనసాగుతున్నాయి. గోథే-జెంత్రం, జార్జ్ హల్ కలెక్టివ్, అలయన్స్ ఫ్రాంకైజ్, డార్క్ వైట్ సొసైటీ సహకారంతో నగరంలోని ఏడు మెట్రో స్టేషన్లలో ఇవి జరుగుతున్నాయి. మొత్తం 65 రకాల విభిన్న కార్యక్రమాలను సమర్పిస్తుండగా, దాదాపు 200 మందికి పైగా సంగీత కళాకారులు పాల్గొంటున్నారు.

తొలి ప్రదర్శనగా అమీర్‌పేట్‌లో ది జెంబే సర్కిల్ నిర్వహించిన డ్రమ్స్ షో ఆకట్టుకుంది. ఆయా ప్రత్యక్ష ప్రదర్శనలను అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, దుర్గం చెరువు, కూకట్‌పల్లి, ఎంజీబీఎస్, పరేడ్ గ్రౌండ్, ఉప్పల్ మెట్రో స్టేషన్‌లలో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకూ ప్రయాణీకులు వీక్షించవచ్చు. సంగీత సాధన చేస్తున్న విద్యార్థుల నుంచి 68 ఏళ్ల జానపద కథకుల వరకు, కర్ణాటక, జాజ్, డ్రాగ్ ఆర్టిస్ట్రీ, ఇండీ, బుర్రకథ తదితర ప్రయోగాత్మక శైలిని ఆస్వాదించవచ్చు. జూన్ 24న ఫిల్మ్ నగర్‌లో గ్రాండ్ ఫినాలేతో మెట్రో మెడ్లీ ముగియనుంది.



కోకాపేటలో లా గ్రూప్ కార్యాలయం

సాక్షి, సిటీ బ్యూరో: కొత్త అధ్యక్షుడు వచ్చిన తర్వాత అమెరికాలో భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ న్యాయపోరాటం సత్ఫలితాన్ని ఇస్తోందని నగరానికి చెందిన లా గ్రూప్ నిర్వాహకులు సోమిరెడ్డి తెలిపారు. నగరంలోని కోకాపేటలో ఏర్పాటు చేసిన అత్యాధునిక లా గ్రూప్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. నగరంలో ఇలాంటి సకల న్యాయ సేవలు అందించే అత్యాధునిక కార్యాలయం ఇదే మొదటిదని, వృత్తిపరమైన విలువలు అనుసరిస్తూ క్లైంట్‌దారులకు సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ బీ.ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.








మినర్వా హోల్స్ వేదికగా జాతీయ స్థాయి కార్యక్రమం

మిల్లెట్ ఉద్యమి భారత్ -2025..

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మినర్వా హోల్స్‌లో 'మిల్లెట్ ఉద్యమి భారత్-2025' పేరుతో ఐదు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. www. millets. news మిల్లెట్స్ నేషనల్ మీడియా పోర్టల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీనికి దేశం నలుమూలల నుంచి 25 రాష్ట్రాలకు చెందిన 140 మంది హాజరౌతున్నారు. దీని ద్వారా మిల్లెట్ వ్యవసాయం నేర్చుకునే రైతులు, ఉత్పత్తులు తయారు చేయాలనుకునే వ్యాపారులు, ఆరోగ్యానికి మిల్లెట్లు ఎలా సహాయపడతాయి అనే అంశాలపై ఆరోగ్య ప్రేమికులందరికీ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఒడిశా వ్యవసాయశాఖ అధికారి తపస్ చంద్ర రాయ్ రైతులకు మిల్లెట్ సాగుపై శాస్త్రీయ శిక్షణ ఇస్తున్నారు. జైపూర్‌కు చెందిన జగన్నాథ్ చిన్నారి మిల్లెట్ ప్రాసెసింగ్, ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. వెయ్యికిపైగా ఆరోగ్య సంబంధిత ప్రశ్నలు-సమాధానాలు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని సంస్థకు చెందిన పోర్టల్ ఛైర్మన్ ప్రసన్న శ్రీనివాస్ శరకడం తెలిపారు. మిల్లెట్స్‌లో నిపుణులుగా మారాలనుకునే ఎవరైనా తమను సంప్రదించవచ్చన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) నుంచి న్యూట్రీహబ్ సీఈఓ డా.స్టాన్లీ, మిల్లెట్ ఇన్నోవేషన్ నిపుణురాలు అభితా ఉపాధ్యాయ్ రెండు రోజులపాటు శిక్షణ ఇస్తారని వివరించారు. హెచ్‌ఎస్‌పీ కౌన్సిల్ సభ్యులు డా.మోనికా శ్రావంతి ఆరోగ్య శిక్షణనిస్తారు. దేశంలోని ప్రతి రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన నలుగురు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. రైతులు, తయారీదారులు, డైటీషియన్‌లు, ఆరోగ్య కార్యకర్తలు దీనిలో భాగస్వామ్యం కానున్నారు.

ప్రపంచమంతటా యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఉక్రెయిన్ - రష్యా, ఇరాన్ - ఇజ్రాయెల్.. దాడులు, ప్రతిదాడులతో అట్టుడుకిపోతున్నాయి. ఇజ్రాయెల్ గగనతలంపై తాము పట్టు సాధించినట్టు ఇరాన్ ప్రకటిస్తే.. ఇరాన్ గగనతలంపై తాము సంపూర్ణ ఆధిపత్యం సాధించామని ఇజ్రాయెల్ చెబుతోంది. రష్యా యుద్ధానికి వస్తే.. ఒకసారి డ్రోన్ల దాడులతో ఉక్రెయిన్ విరుచుకుపడితే.. మరోసారి రష్యాది పైచేయి అవుతోంది. ఈ పరిణామాల్లో గగనతలం, అంతరిక్ష నిఘా వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తున్నాయి. నిజానికి ఈ అవసరాన్ని మనదేశం ఎప్పుడో గుర్తించింది. అందుకే, భారత్‌ను లక్ష్యంగా చేసుకుని చేపట్టే నిఘా ప్రయత్నాలను పర్యవేక్షించి, చెక్ పెట్టేందుకు ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా ఉపగ్రహాల సమూహాన్ని ప్రయోగించడానికి రక్షణ మంత్రిత్వ శాఖ నడుం బిగించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



అంతరిక్షంలో నిఘా.. రక్షణ కవచంగా..

'భారతదేశం, దేశంలోని ప్రజల రక్షణ కోసం గగనతలంలో కనీసం 10 ఉపగ్రహాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయంటూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చైర్మన్ వి.నారాయణన్ మే నెలలో ప్రకటించారు. పహల్గాం ఉగ్ర దాడి, అందుకు ప్రతీకారంగా పాక్ పీచమణచిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. నిజానికి మన అంతరిక్ష నిఘా వ్యవస్థ అప్పటికే పటిష్టంగా ఉంది. దాన్ని మరింత అత్యాధునికంగా, అగ్రదేశాల స్థాయికి తీసుకెళ్లేందుకు భారత ప్రభుత్వం ఎప్పుడో చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జరిగిందే అత్యంత అధునాతనమైన నిఘా ఉపగ్రహం ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్-09) ప్రయోగం. ఇది ఐదేళ్లపాటు సేవలందిస్తుందని ఇస్రో తెలియజేసింది. అయితే మే 18న జరిగిన ఈ ప్రయోగంలో.. ఈఓఎస్-09ను నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టడంలో రాకెట్ విఫలమైంది. నిజానికి భారత ప్రభుత్వం చేపట్టిన 'అంతరిక్ష ఆధారిత నిఘా (ఎస్‌బీఎస్)' అనే భారీ ప్రాజెక్టులో ఇదో చిన్న అడుగు మాత్రమే. ఇలా ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 50కిపైగా శాటిలైట్లను అంతరిక్షంలో నిలపాలన్నది ప్రభుత్వ ప్రణాళిక.

అంతరిక్ష భద్రతపై దృష్టి

అంతరిక్ష శిథిలాలు, గ్రహశకలాలు, ఉల్కలు వంటి సహజ వస్తువులు; వివిధ అంతరిక్ష పర్యావరణ ప్రమాదాల నుండి మన అంతరిక్ష ఆస్తులను రక్షించడానికి ఇస్రో అంతరిక్ష పరిస్థితుల అవగాహన (ఎస్ఎస్ఏ) కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఎస్ఎస్ఏను మరింత బలోపేతం చేసేందుకు అంతరిక్ష వస్తువుల గుర్తింపు, విశ్లేషణ యంత్రాంగం (నేత్ర)ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. నిజానికి దీనికంటే ముందే.. ఉపగ్రహాలపై కన్నేసే ఉపగ్రహాలు, విదేశీ నిఘాను గుర్తించే లక్ష్యంతో కొత్త ఉపగ్రహ ప్రాజెక్టుతో భారత్ తన అంతరిక్ష ఆధారిత రక్షణ సామర్థ్యాలను పెంచుకునే పనిలో నిమగ్నమైంది. భూ కక్ష్యలో ఎన్నో ఉపగ్రహాలు ఉంటాయి. వీటిని పర్యవేక్షించే ఉపగ్రహాల కూటమిని ఏర్పాటు చేయాలని రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అంటే నిఘా ఉపగ్రహాలపై ఓ కన్నేసి ఉంచే ఉపగ్రహాలన్నమాట. ఇందులో భాగంగా ఎస్‌బీఎస్-3 ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది కేంద్ర ప్రభుత్వం. దీని మొత్తం విలువ సుమారు రూ.27,000 కోట్లు. ఇందులో భాగంగా 52 శాటిలైట్లను అంతరిక్షంలోకి ప్రయోగించనున్నారు. వీటిలో 21 ఇస్రో తయారుచేస్తే.. మిగతా 31 ప్రైవేటు సంస్థలు రూపొందించనున్నాయి. అంతరిక్ష సేవల కోసం మొట్టమొదటిసారి ప్రైవేటు సంస్థలను, వారి నైపుణ్యాలను భారీ ఎత్తున వినియోగించుకోనున్నారు. ఇందులో బెంగళూరుకు చెందిన స్పేస్ స్టార్టప్ 'దిగంతర' ఒకటి.

రక్షణ నిఘా కోసం..


ఇతర దేశాలు భారత్‌కు వ్యతిరేకంగా చేపట్టే అంతరిక్ష నిఘా ప్రయత్నాలను ముందస్తుగా గుర్తించడంలో ఈ ప్రాజెక్ట్ సహాయపడుతుంది. ఇస్రో 'నేత్ర' ప్రధానంగా అంతరిక్ష శిథిలాలు, ఉపగ్రహ స్థానాలను పర్యవేక్షించడంపై దృష్టి సారిస్తోంది. నేత్రకు సంబంధించి ఏర్పాటుచేసిన, చేస్తున్న మౌలిక సదుపాయాలు.. శ్రీహరికోటలోని రాడార్లు; లేహ్, మౌంట్ అబు, పొన్‌ముడిలలోని ఆప్టికల్ టెలిస్కోపులు, అస్సాంలో త్వరలో అందుబాటులోకి రానున్న అంతరిక్ష శిథిలాల పర్యవేక్షణ రాడార్.. ఇవే మన అంతరిక్ష బలాలు. ఇవి భూకక్ష్యలో 3,400 కి.మీ. వరకు.. 10 సెంటీమీటర్ల అతి చిన్న వస్తువునైనా గుర్తించగలిగే దేగకళ్లు. మన సరిహద్దుల్లోని ఇతర దేశాల నిఘా ఉపగ్రహాలన్నింటి మీదా ఇవి కన్నేసి ఉంచుతాయి. కొత్త శాటిలైట్ సముదాయం ప్రత్యేకంగా రక్షణ నిఘా కోసమే రూపొందింది.

సరిహద్దులపై ఓ కన్నేసి...

దట్టమైన మేఘాలు కమ్ముకున్నా, తుపాన్ల వంటి సందర్భాల్లోనూ చాలా ఉపగ్రహాలు పనిచేయవు. కానీ ఎస్‌బీఎస్-3 ఉపగ్రహాలు అలా కాదు. ఇటీవల ప్రయోగించిన ఈఓఎస్-09 అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పని చేస్తుంది. సాధారణ ఆప్టికల్ శాటిలైట్లకు అడ్డుగోడలుగా నిలిచే మేఘాలు, వర్షాలు, దుమ్మూధూళి, పొగమంచు వంటివాటి గుండా కూడా భూమిని అత్యంత స్పష్టంగా చూడగలుగుతుంది. ఒక మీటర్ పరిధిలోని వస్తువులను కూడా కచ్చితత్వంతో ఫొటోలు తీస్తుంది. చట్టవ్యతిరేక కార్యకలాపాలను, తీవ్రవాదుల ఉనికిని గుర్తించగలదు. వాహనాల కదలికలను కూడా అత్యంత స్పష్టంగా, కచ్చితంగా చిత్రించడం దీని ప్రత్యేకత. దీని డేగకళ్లు పాక్ నుంచి చైనా దాకా మన 15 వేల కి.మీ. విస్తారమైన సరిహద్దులను, 7,500 కి.మీ. పొడవైన సముద్రతీరాన్ని అణువణువూ కాపు కాస్తాయి.

నిఘా శాటిలైట్లపైనే నిఘా
- రూ.27వేల కోట్ల ప్రతిష్టాత్మక ప్రాజెక్టు
- గగనవీధిలో 52 ఉపగ్రహ నేత్రాలు
- 21 శాటిలైట్లను తయారు చేయనున్న ఇస్రో
- మిగతావి ప్రైవేటు సంస్థలకు అప్పగింత
- శత్రువుల కదలికలు ఇట్టే తెలిసిపోతాయి

అంతరిక్ష ఆధారిత నిఘాతో ప్రయోజనాలు
- విదేశీ సైన్యం కదలికలను పసిగట్టొచ్చు
- మిస్సైల్స్ ఏవైనా ప్రయోగిస్తే గుర్తించవచ్చు
- సరిహద్దుల్లో జరిగే కార్యకలాపాలపై నిఘా
- వాతావరణ సమాచార సేకరణ
- కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం




ఇందులో ఉపయోగించే శాటిలైట్లు నిర్వహించే కార్యకలాపాలు
- చిత్రాలు తీయడం, మ్యాపింగ్ చేయడం, భూమిపై జరిగే కార్యకలాపాలను పర్యవేక్షించడం
- ఎలక్ట్రానిక్ సిగ్నళ్లను, కమ్యూనికేషన్లను అడ్డుకుని శత్రుదేశాల వ్యూహాన్ని దెబ్బతీయడం
- రేడియో, రాడార్, సిగ్నల్ ఆధారిత సమాచారాన్ని సేకరించడం
- మిస్సైళ్లు, అణ్వస్త్ర ప్రయోగాలను గుర్తించడం
- జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్, లక్ష్యాలను గుర్తించడం వంటి పనుల ద్వారా సైన్యానికి సాయపడటం

క్లుప్తంగా...

కల్తీ మద్యంతో జీవితాలు నాశనం

- విక్రయదారులపై దయ, జాలి చూపలేం: హైకోర్టు
- నిందితుడి భార్య వేసిన పిటిషన్ కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: కల్తీ మద్యంతో ప్రజల జీవితాలు నాశనమవుతాయని, దాన్ని విక్రయించిన వారిపై దయ, జాలి చూపలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఆరోగ్యంపై పెను ప్రభావం చూపే కల్తీ మద్యం నిరోధానికి చర్యలు చేపట్టడాన్ని అడ్డుకోలేమని తేల్చిచెప్పింది. ఇందులో కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు కనిపించడంలేదంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. వరంగల్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు తన భర్తను అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించడాన్ని సవాల్ చేస్తూ అదే జిల్లా మొగిలిచర్ల మండలం గీసుకొండకు చెందిన ధరావత్ లక్ష్మీ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. కలెక్టర్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. నిర్బంధంలోని వ్యక్తిపై ఉన్న కేసు వివరాలను డిటెన్యూ అథారిటీ పరిశీలించిందన్నారు. నిర్బంధంలోని వ్యక్తి శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించాడని, నిర్బంధ ఉత్తర్వు అమలు చేయకపోతే భవిష్యత్‌లో అతను అదేవిధంగా వ్యవహరించే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ప్రజారోగ్యానికి హాని కలిగించే కల్తీ మద్యం కలిగి ఉండటం, విక్రయించడం సమాజంపై కోలుకోలేని ప్రతికూల ప్రభావం ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదని వ్యాఖ్యానించింది. ఇలాంటి నేరాలను ఇలాగే వదిలేస్తే మరింత విస్తరించి ఎక్కువ మంది ప్రభావితమవుతారని.. కల్తీ మద్యం అమ్మకం పరోక్షంగా అనారోగ్యానికి దారి తీస్తుందని చెప్పింది. ఈ కేసులో కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వు చట్టబద్ధమేనని.. దర్యాప్తునకు సమయం పడుతున్న కారణంగా నిర్బంధాన్ని కొనసాగించకూడదనడం సరికాదని వెల్లడించింది. అయితే, డిసెంబర్ 31లోగా దర్యాప్తును ముగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

కాంగ్రెస్ పాలనపై ప్రజల హర్షం

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి,



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. అంతా మంచి జరుగుతోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టీజీఐఐసీ) చైర్మన్ టి.నిర్మలా జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజా వినియోగ కార్యక్రమంలో భాగంగా శనివారం గాంధీభవన్‌లో తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి ఆమె ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా వినియోగ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వారి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించామని చెప్పారు. వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపుతామన్నారు. వీలున్నంత త్వరగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. కాగా, గాంధీభవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో నిర్వహించిన ఉచిత దంతవైద్య శిబిరాన్ని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు.

ప్రపంచాన్ని యోగా ఏకం చేసింది

జీవన విధానంలో యోగా అంతర్భాగం
- అంతరిక్షంలోనూ యోగా చేయడం ఎంతో సంతోషానిచ్చింది
- ఆయుర్వేద వైద్యం, యోగాభ్యసనానికి ఈ-ఆయుష్ వీసా సౌకర్యం
- 'యోగాంధ్ర అభియాన్'లో ప్రధాని నరేంద్ర మోదీ



విశాఖ బీచ్ రోడ్‌లో యోగా ఆసనాలు వేస్తున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: 'ప్రపంచాన్ని యోగా ఏకం చేసింది. నేను అనే భావన నుంచి మనం అనే భావనను యోగా పెంపొందిస్తుంది'అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విశాఖలోని ఆర్‌కే బీచ్ వద్ద అంతర్జాతీయ యోగా డే వేడుకల సందర్భంగా నిర్వహించిన 'యోగాంధ్ర అభియాన్'కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి 45 నిమిషాల పాటు యోగాసనాలు వేసి.. వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'భారతీయుల జీవన విధానంలో యోగా అంతర్భాగం. దివ్యాంగులు బ్రెయిలీ లిపి ద్వారా యోగ సూత్రాలు చదవడం, శాస్త్రవేత్తలు అంతరిక్షంలో యోగా చేయడం, యోగా ఒలింపియాడ్‌లో గ్రామీణ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయి'అని పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రకటించాలని తాను చేసిన ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతు ఇచ్చాయని ప్రధాని గుర్తు చేశారు. చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే ఈ స్థాయిలో ప్రపంచ దేశాలు మద్దతు ఇచ్చాయని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఎక్కడైనా.. సిడ్నీ ఒపెరా హౌస్ మెట్లపై, ఎవరెస్ట్ శిఖరంపై, గగనతలంపై ఎక్కడైనా 'యోగా అందరికీ'అనే నినాదమే వినిపిస్తుందన్నారు. యోగాను వైద్య కళాశాలల్లో ప్రవేశపెట్టడంతో పాటు కామన్ యోగా ప్రోటోకాల్‌ను తయారు చేస్తున్నామన్నారు. వంటల్లో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించాలని సూచించారు. ప్రపంచాన్ని స్థూలకాయం అనే సమస్య వేధిస్తోందని.. యోగా చేయడంతో పాటు వంట నూనెల వాడకాన్ని తగ్గించడం ద్వారా స్థూలకాయ సమస్యను పరిష్కరించుకోవచ్చని స్పష్టం చేశారు.

చికిత్సలకు యోగా దోహదం

గుండె, నరాలకు సంబంధించిన వ్యాధుల చికిత్సతో పాటు మహిళల ఆరోగ్యాన్ని కాపాడటంలో యోగా ఎంతో దోహదపడుతుందని ఢిల్లీలోని ఎయిమ్స్ పరిశోధనలో తేలిందని ప్రధాని మోదీ చెప్పారు. భారతదేశంలోని ఆయుర్వేద వైద్యాన్ని, యోగా, యునాని వంటి ప్రాచీన వైద్య పద్ధతులను పొందేందుకు ప్రపంచ ప్రజల కోసం ప్రత్యేకంగా ఈ-ఆయుష్ వీసా కల్పిస్తామన్నారు. విశాఖ నగరం ప్రకృతికి, ప్రగతికి నిలయమైన నగరమని కొనియాడారు. ఈ సందర్భంగా యోగా స్మారక పోస్టల్ స్టాంపును ప్రధాని విడుదల చేశారు.

రెండు గిన్నిస్ రికార్డ్స్

విశాఖలోని ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకూ 26 కిలోమీటర్ల మేర జరిగిన ఈ కార్యక్రమంలో 3.03 లక్షల మంది పాల్గొనడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు లభించిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గతంలో సూరత్ వేదికగా 2023లో జరిగిన కార్యక్రమంలో 1.47 లక్షల మంది పాల్గొన్న కార్యక్రమం పేరిట ఇప్పటివరకు గిన్నిస్ రికార్డు ఉందని తెలిపాయి. మరోవైపు ఆంధ్రా యూనివర్సిటీలో ఈ నెల 20న (శుక్రవారం) 22,122 మంది విద్యార్థులు 108 సూర్య నమస్కారాల కార్యక్రమానికి కూడా గిన్నిస్ రికార్డు లభించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

వారిది దుష్ప్రచారమే...

- రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వృద్ధికి గణాంకాలే సాక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు
- టైమ్స్ హోమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభోత్సవం



ప్రాపర్టీషోను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

మాదాపూర్ (హైదరాబాద్): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందంటూ కొందరు కావాలనే పనిగట్టుకుని తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు. అలాంటి వారు ఒక్కసారి కళ్లు తెరచి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం రూ.80 వేల కోట్లు సమకూర్చిందన్నారు. తెలంగాణ సర్వీసెస్ ఎకానమీలో ఈ రంగం వాటా 24.9 శాతం ఉందని చెప్పారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో రెండు రోజులపాటు జరిగే టైమ్స్ హోమ్‌హంట్ ప్రాపర్టీ ఎక్స్‌పో 2025ను శనివారం శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 2024-25లో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో 15.4 శాతం వృద్ధి రేటు నమోదైందని, నిర్మాణరంగం 11.97% వృద్ధి చెందిందని వివరించారు. ప్రస్తుతం తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) వద్ద 9,744 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు రిజిస్టర్ అయ్యాయని చెప్పారు. తమ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం తగ్గిందన్న వారికి ఇది చెంపపెట్టులాంటిదని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్క హైదరాబాద్‌లోనే 5,900 ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు జరిగాయన్నారు. మొత్తం రిజిస్ట్రేషన్‌లలో రూ.కోటి అంతకంటే ఎక్కువ ధర గల వాటి వాటా 18 శాతంగా ఉందన్నారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ.. 'రెండు, మూడేళ్లలో అద్భుతమైన హైదరాబాద్‌ను చూస్తారు. రాష్ట్రంలో 'రెరా'నంబర్ ఉన్న ప్రాజెక్టులపై కొనుగోలుదారులు ధైర్యంగా పెట్టుబడులు పెట్టొచ్చు. హైడ్రా ప్రధానంగా చెరువులు, నాలాలను రక్షిస్తుంది. సిబ్బంది తక్కువగా ఉండడం వల్ల దశల వారీగా పరిష్కరిస్తున్నాం'అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, క్రెడాయ్ అధ్యక్షుడు జైదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కాదు.. బోగస్ ఆంధ్ర

- 2 కోట్ల మందికి పైగా యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ ఏపీ సర్కారు గొప్పలు.. డ్వాక్రా మహిళలందరి ఫోన్ నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసి తీరాలని సీఆర్‌పీలపై ఒత్తిడి
- విద్యార్థుల తల్లిదండ్రుల నంబర్లతోనూ రిజిస్ట్రేషన్లు చేయించాలని హెడ్మాస్టర్లు, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై బలవంతం
- చివరకు వామపక్షాల నేతలు, కార్యకర్తలు సైతం యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు వారి ఫోన్లకు మెసేజ్‌లు
- చివరకు మరణించిన వ్యక్తుల పేర్లతోనూ రిజిస్ట్రేషన్లు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రూ.100 కోట్లు దోచిన ఏవీ ఇన్‌ఫ్రాకాన్!

- ప్రీలాంచ్‌తో తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామని మోసం
- 200 మంది బాధితుల నుంచి రూ.100 కోట్లపైనే వసూలు
- పరారీలో ఏవీ ఇన్‌ఫ్రాకాన్ చైర్మన్ విజయ్

మాదాపూర్: హైదరాబాద్‌లో మరో ప్రీలాంచ్ మోసం బయటపడింది. ఇప్పటికే సాహితీ, జయగ్రూప్, భువనతేజ వంటి పలు నిర్మాణ సంస్థలు రూ.వందల కోట్ల మోసాలకు పాల్పడగా, తాజాగా ఏవీ ఇన్‌ఫ్రాకాన్ దాదాపు 200 మందిని నిలువునా దోచేసింది. మోసపోయిన బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. గోగుల విజయ్‌కుమార్ అనే వ్యక్తి హబ్సిగూడ, మాదాపూర్ ప్రాంతాలలో ఏవీ ఇన్‌ఫ్రాకాన్ పేరుతో రియల్‌ఎస్టేట్ సంస్థను ఏర్పాటు చేశాడు. నగర శివారు ప్రాంతాలలో రోడ్డుకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి, ఓపెన్ ప్లాట్ వెంచర్ చేస్తానని వాటి యజమానులను నమ్మించేవాడు. భూ యజమానికి కొంత సొమ్ము టోకెన్‌గా ఇచ్చి భూ పత్రాల జిరాక్స్ కాపీలను సేకరించేవాడు.

స్టార్ హోటళ్లలో విందులు..

తన సంస్థలో పెట్టుబడులు పెడితే రెండింతలు లాభాలు ఇస్తానని, రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే ఏడాదిలోనే రూ.15-20 లక్షల ఆదాయం వస్తుందంటూ మాయమాటలతో కస్టమర్లను ఆకర్షించేవాడు. ప్రీలాంచ్, బైబ్యాక్ ఆఫర్ల పేరిట ప్రచారం చేయించేవాడు. అతని మాటలు నమ్మిన కస్టమర్లు భారీగా అతడి కంపెనీలో పెట్టుబడులు పెట్టారు. కస్టమర్లను తీసుకొచ్చే మధ్యవర్తులకు స్టార్ హోటళ్లలో విందులు ఇచ్చేవాడు. బ్రోకర్లకు భారీ కమీషన్, విదేశీ టూర్ ఆఫర్లు ఇచ్చేవాడు. హబ్సిగూడ, బాచుపల్లి, దమ్మాయిగూడ, నారాయణ్‌ఖేడ్, యాదగిరిగుట్ట వంటి ప్రాంతాల్లో వెంచర్లు చేస్తున్నానని నమ్మించేవాడు. భూమికి సంబంధించిన జిరాక్స్ పత్రాలను చూపించేవాడు. ప్రీలాంచ్‌లో కొనుగోలు చేస్తే గజం రూ.3,500-4,000 చొప్పున విక్రయిస్తానని ఆకర్షించేవాడు. ఇలా సుమారు 200 మంది నుంచి రూ.30-40 లక్షల చొప్పున వసూలు చేశాడు. గత రెండుమూడేళ్లలో వంద కోట్ల పైనే వసూలు చేశాడు. 2022 నుంచి ఇప్పటివరకు కస్టమర్లకు స్థలాలు రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. గత మూడు నాలుగు నెలలుగా కస్టమర్లు కట్టిన డబ్బు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయటంతో రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసి పరారయ్యాడు. దీంతో బాధితులు మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు.

యోగా మన జీవితంలో భాగం కావాలి

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: యోగా మన జీవితంలో భాగం కావాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. 'యోగా అనేది మన శరీరం, ఆత్మ రెండింటిపైనా పని చేస్తుంది. ప్రశాంతతను పెంపొందించడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది. అలాంటి యోగాను మన జీవితంలో ఒక భాగంగా చేసుకుందాం'అని వైఎస్ జగన్ తన 'ఎక్స్'ఖాతాలో పోస్టు చేశారు.

సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- విద్యుత్ సిబ్బందికి డిప్యూటీ సీఎం భట్టి పిలుపు
- విద్యుత్ సిబ్బందికి 1.944 % డీఏ పెంపు



భట్టికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో పోటీ ప్రపంచంలో ప్రతి ఉత్పత్తికి విద్యుత్తు అనివార్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. భవిష్యత్తు డిమాండ్‌కు తగిన విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటి నుంచే అంచనాలు సిద్ధం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. తమ ప్రభుత్వం న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 తెచ్చిందని, 2029-30 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. శనివారం ప్రజాభవన్‌లో విద్యుత్ ఉద్యోగులకు డీఏ ప్రకటించిన అనంతరం భట్టి మాట్లాడారు. రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్ తీవ్రంగా పెరగనుందన్నారు. రాష్ట్రంలో 2029-30 నాటికి 26,299 మెగావాట్ల విద్యుత్ అవసరం కానుందని, 2034-35 నాటికి 33, 773 మెగావాట్ల డిమాండ్ ఏర్పడుతుందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదిక ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో పీక్ డిమాండ్ కంటే తమ హయాంలో 2000 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ అదనంగా వచ్చినప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సరఫరా చేశామని చెప్పారు.

ఆర్టిజన్స్‌కు కూడా పెంపు

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఇందులో భాగంగా విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు 1.944 శాతానికి డీఏ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి చెప్పారు. దీంతో రాష్ట్రంలోని 71,417 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ పెంచిన డీఏ ఆర్టిజన్స్‌కు కూడా వర్తిస్తుందని అన్నారు. గతంలో 14.074 శాతంగా ఉన్న డీఏను 16.018% శాతానికి పెంచామని, పెంచిన డీఏ ఈ ఏడాది జనవరి నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. దీంతో విద్యుత్ సంస్థపై ప్రతి నెలా రూ.11.193 కోట్ల భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధిక్కార స్వరాలుగా దాశరథి, ఆరుద్ర

- సాహితీమూర్తుల శతజయంతి జాతీయ సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, వేదికపై చక్రపాణి, అల్లం నారాయణ, గౌరీశంకర్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: సామాజిక పరిణామాలే కాక స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన మార్పులను తమ రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన దాశరథి, ఆరుద్ర ధిక్కార స్వరాలుగా నిలిచారని వక్తలు కొనియాడారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'శతజయంతి సాహితీమూర్తులు దాశరథి, ఆరుద్ర-జీవితం, సాహిత్యం'అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ఖమ్మానికి దాశరథికి విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన సాహిత్యం, పాటలు ఉత్తేజాన్నే కాక స్ఫూర్తిని కలిగించాయన్నారు. సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తన స్వీయ అనుభవాలు, సామాజిక పరిణామాలు దాశరథి ప్రతీ రచనలో కనిపిస్తాయని చెప్పారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ పూర్వ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ ఖమ్మంలో సదస్సును చరిత్ర పుటల్లో నిలిచేలా నిర్వహించారని కొనియాడారు. బీసీ కమిషన్ పూర్వ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ఈ తరం విద్యార్థులు దాశరథి, ఆరుద్ర సాహిత్యాన్ని జిజ్ఞాసతో అధ్యయనం చేయాలని సూచించారు. సదస్సులో సాహిత్య విశ్లేషకుడు ఎస్.వేణుగోపాల్, స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ఎస్.కిశోర్‌రెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ భూక్యా భాంగ్యా తదితరులు పాల్గొన్నారు.



● బడి గంట

చేతి రాతే భవిష్యత్తుకు బాట

చదువు బాగుండాలంటే రాత బాగుండాలి.
గతంలో ప్రతి స్కూల్లో
'కాపీ రైటింగ్' నోట్సులు పెట్టి
పిల్లల చేత చేతిరాత సాధన చేయించేవారు.
గుండ్రంగా అక్షరాలు రాయడంపై
టీచర్లకు పట్టింపు ఉండేది.
ఇప్పుడు 'స'కు, 'న'కు తేడా లేకుండా
'ఎస్'కు '8'కు తేడా తెలియకుండా
పిల్లలు రాస్తూ ఉంటే
సరి చేయాల్సిన అవసరం ఉంది.
మొక్కై ఒంగకపోతే మ్రానై ఒంగునా అనే మాట
చేతి రాత విషయంలో చాలా కరెక్ట్.
చేతి రాత సరి చేసి
భవిష్యత్‌కు బాట వేయండి.

సాధారణంగా ఇలా జరుగుతూ ఉంటుంది. అందమైన చేతి రాత ఉన్న పిల్లలు పరీక్షల్లో ఆన్సర్ తెలియకపోయినా గుండ్రంగా ఏదో ఒకటి రాస్తారు. ఆ రాత చూసి పోనీలే పాపం అని టీచర్లు ఒక మార్కయినా వేస్తారు. అదే చేతి రాత బాగా లేని పిల్లలు ఆన్సర్స్‌ను చాలా కరెక్ట్‌గా రాసినా దిద్దే మేష్టార్లకు అర్థంగాక, చిరాకు అనిపించి ఒక మార్కు తక్కువ వేస్తారు.

పిల్లలకు చేతి రాతే వ్యక్తీకరణ సాధనం, ఆయుధం. వాళ్ల క్లాస్‌రూమ్‌లో మాటల ద్వారా కనపరిచే తెలివితేటలు పరీక్షకు నిలవవు. చేతి రాత ద్వారా ఏదైతే రాస్తారో, రాసి మెప్పిస్తారో అదే నిలుస్తుంది. కాని దురదృష్టం ఏమిటంటే చేతిరాత గురించి పెద్దలు శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. స్కూల్లో టీచర్లు సరిదిద్దలేక పోతున్నారు.

రూపం కంటే స్పష్టత ముఖ్యం

చేతి రాత అందరిదీ ముత్యాల్లా ఉండదు. కొందరిది సహజంగా బాగుంటుంది. మరికొందరిది ప్రయత్నం మీద బాగుపడుతుంది. ఇంకొందరిది చాలా గందరగోళంగా ఉంటుంది. ఈ గందరగోళం పిల్లలు అందంగా రాయడం కంటే అర్థం అయ్యేలా రాయడంపై శ్రద్ధ పెడితే చాలామటుకు సమస్య ఉండదు. ఆ సంగతి వారికి చెప్పి రాతను బాగు చేయాలి.

రాత సరిగా ఉండకపోవడానికి కారణాలు

● వేళ్ల సామర్థ్యం బలంగా లేకపోవడం ● పెన్ను లేదా పెన్సిల్ తప్పుగా పట్టుకోవడం ● త్వరత్వరగా రాయడానికి ప్రయత్నించి కంగాళీ చేయడం ● నోట్స్‌లోని పేజీలైపోతాయేమోనని ఇరికించి రాయడం ● కొన్నిసార్లు దృష్టిలోపం వల్ల కూడా ఇలా జరగవచ్చు.

ఎక్కువ మంది పిల్లలు చేసే పొరపాటు పెన్ను తప్పుగా పట్టుకోవడం. పలక నుంచి పెన్సిల్‌కు మారేటప్పుడు ఈ పొరపాటు మొదలవుతుంది. కొందరు రెండు వేళ్లతో మరికొందరు మూడు వేళ్లతో పెన్సిల్‌ను పట్టుకుంటారు. కాని బొటన వేలు, చూపుడువేలు, మధ్యవేలు కలిపి పట్టుకుని రాయడం మంచి పద్ధతి అంటారు నిపుణులు. కొందరు ఘంటంలా పట్టుకుంటారు. దీనిని నివారించాలి.

కూర్చునే పద్ధతి సరి చేయాలి

రాయాలంటే కూర్చోవాలి. కింద కూర్చునే పద్ధతి ఒక రకంగా, స్కూల్ బెంచీ మీద మరోరకంగా ఉంటుంది. ఈ కూచుని రాసే పద్ధతిలో తేడా వల్ల కూడా రాత సరిగా ఉండదు. కొందరు పుస్తకాలపై పూర్తిగా వాలిపోయి రాస్తుంటారు. మరికొందరు మోచేతులపై పడుకొని రాస్తారు. చేతి రాత బాగుండాలంటే నిటారుగా కూచుని, కాళ్లు నేలకు తగిలేలా ఉంచి రాయాలి. ఇలా చేయడం వల్ల హ్యాండ్ రైటింగ్ స్కిల్స్ మెరుగుపడే అవకాశం ఉంటుంది.

ఎంత ఒత్తిడితో రాయాలి?

కొందరు పిల్లలు పెన్ను/పెన్సిల్‌పై ఎక్కువగా ఒత్తిడి పెట్టి రాస్తారు. మరికొందరు ఒత్తిడి పెట్టరు. ఒత్తిడి పెడితే రైటింగ్ స్పీడ్ తగ్గుతుంది. వేళ్లు కూడా నొప్పి పుడతాయి. దీంతో పిల్లలు అలసిపోతారు. కాబట్టి పెన్సిల్ లేదా పెన్నును తేలికగా పట్టుకునేలా చూడండి. ఇలా చేయడం వల్ల రైటింగ్ ఫ్లో మెరుగవుతుంది. కలర్స్ వేయడం, డ్రాయింగ్ చేయించడం వంటివి వేళ్లకు ఫ్లెక్సిబిలిటీని తీసుకొస్తాయి. పిల్లలకు మంచి పెన్ను, పెన్సిల్ ఇవ్వాలి. నాసిరకమైన పెన్సిల్స్, పెన్నులు వాడితే అవి విరిగిపోతుంటాయి. దీంతో పిల్లలు చేతిరాతపై దృష్టి పెట్టలేరు. రాసే మూడ్ పోతుంది.

చేతిరాత చదువు కోసమే కాదు నిత్య జీవితంలో కూడా ఎంతో అవసరం. మన చేతి నుంచి రాసే అక్షరం శుభ్రంగా ఉంటే ఉండే ఆత్మవిశ్వాసం వేరు. మంచి చేతి రాతతో రాసే ఉత్తరాలు, వినతులు, విజ్ఞాపన పత్రాలు వెంటనే ఇంప్రెస్ చేస్తాయి. తక్షణ ప్రభావం చూపుతాయి.

● టెక్నో ఉమన్

బహు భాషల బంధువు

యంత్రానికి అనువాదం చిక్కుతుందా?
చిక్కినట్లు అనిపించినా... ఇంకా
ఎన్నో చిక్కులు ఉండనే ఉన్నాయి.
ఆ చిక్కు ముడులు విప్పడానికి,
యంత్ర అనువాదంలో
సహజత్వాన్ని తీసుకురావడానికి,
ప్రాచుర్యం లేని భాషల్లోకి
అనువాదాలను తీసుకురావడానికి
నడుం కట్టారు మైక్రోసాఫ్ట్ రిసెర్చ్
ఇండియా సీనియర్ ప్రిన్సిపల్
రిసెర్చర్ కాళికా బాలి.



ఇంగ్లీష్ నుంచి ప్రాంతీయ భాషల్లోకి అనువాదం చేసే సైట్లు బోలెడు కనిపిస్తాయి. అయితే కొన్ని సందర్భాలలో ఆ అనువాదం అసలు అర్థానికి దూరంగా నవ్వు తెప్పించేలా ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కార మార్గం ఆలోచించాలనుకున్నారు కాళికా బాలి.

మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ ఇండియా సీనియర్ ప్రిన్సిపల్ రిసెర్చర్ అయిన బాలి లాంగ్వేజ్ మోడల్స్‌ను మరింత సమర్థంగా తీర్చిదిద్దడానికి తన బృందంతో కలిసి రంగంలోకి దిగారు.

ఢిల్లీ, జెఎన్‌యూలో, యూనివర్శిటీ ఆఫ్ న్యూయార్క్‌లో లింగ్విస్టిక్స్, అకూస్టిక్ ఫొనెటిక్స్ చదువుకున్న కాళికా బాలి ఏఐ ప్రపంచంలోకి రావడానికి ముందు స్పీచ్ టెక్నాలజీపై పని చేశారు. టెక్ట్స్–టు–స్పీచ్ సిస్టమ్‌లను నిర్మించారు.

లండన్‌కు చెందిన స్టార్టప్‌ల ఇంగ్లీష్ స్పీచ్ అప్లికేషన్‌లపై పనిచేశారు. 2002లో ఇండియాకు తిరిగివచ్చిన తరువాత బెంగుళూరులోని హెచ్‌పీ ల్యాబ్స్‌లో చేరారు. 2006లో కొత్తగా వచ్చిన మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ ల్యాబ్–ఇండియాలో చేరారు.

బాలి, ఆమె బృందం ఎన్‌ఎల్‌పీకి సంబంధించి సరికొత్త ప్రమాణాలను నెలకొల్పడంపై దృష్టి పెట్టారు.

'హిందీ అనువాదంపై చేసిన కొన్ని వర్క్స్ బింగ్‌తో పాటు, ఇతర ప్రాథమిక హిందీ–ఇంగ్లీష్ అనువాద వ్యవస్థలోకి వెళ్లాయి' అంటున్నారు కాళిక. కోడ్ మిక్సింగ్, కోడ్ స్విచ్చింగ్‌కు సంబంధించి ఆమె కృషి చేశారు.

ఆ రోజుల్లో ఎన్నో ఎన్‌ఎల్‌పీ సిస్టమ్స్ మోనోలింగ్వల్‌గా ఉన్నప్పుడు, తన బృందంతో కలిసి 'ప్రాజెక్ట్ మెలాంజ్' లాంచ్ చేశారు. ఇది కోడ్–మిక్స్‌డ్ ఎన్‌ఎల్‌పీ రూపొందించడానికి ఉపకరిస్తుంది.

తక్కువ వనరులు అందుబాటులో ఉండే 'గోండీ'లాంటి భాషలపై కూడా ఆమె పని చేశారు. 'హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలను గోండీలోకి అనువాదం చేయడానికి అవసరమైన పుస్తకాలు ఎన్నో ఉపయోగించుకున్నాం. ఇంగ్లీష్, హిందీ నుంచి తొలిసారిగా రెండు వందల గోండీ పుస్తకాలు తీసుకు వచ్చాం' అంటున్నారు బాలి.

బాలి బృందం ప్రస్తుతం స్కేల్డ్–అప్ వెర్షన్ 'సమీక్ష'ను అభివృద్ధి చేస్తోంది. ఇది రాజ్యాంగం గుర్తించిన 22 అధికారిక భారతీయ భాషలను కవర్ చేస్తుంది. ఉపాధ్యాయులకు ఉపయోగపడే ఏఐ అసిస్టెంట్ 'శిక్ష కోపైలట్' అభివృద్ధి చేయడంలో సహకారం అందించారు బాలి.

'మన దేశానికి సంబంధించి ఏఐ ఎకోసిస్టమ్‌ను తీర్చిదిద్దడంలో కాళిక కీలక పాత్ర పోషించారు. కమ్యూనిటీ–సెంటర్‌డ్ రిసెర్చ్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఆమెతో కలిసి పనిచేస్తున్నాను. నైతిక విలువలతోపాటు అరుదైన శాస్త్రజ్ఞానం ఆమెలో కనిపిస్తుంది. కాళిక నుంచి ఎంతో స్ఫూర్తి పొందాను' అంటున్నారు 'కార్య' సీఈవో మను చోప్రా. 'కార్య' అనేది పేద ప్రజలకు ఏఐ డిజిటల్ వర్క్ ద్వారా అదనపు ఆదాయ మార్గాన్ని చూపించే సంస్థ.

● సమ్‌థింగ్ స్పెషల్



తాజ్‌మహల్ ఇంట్లో...

తాజ్‌మహల్‌పై కవిత్వమైతే రాయవచ్చు కానీ, నిజంగా సృష్టించగలమా? మరో తాజ్‌మహల్ కాకపోయినా అచ్చం తాజ్‌మహల్‌లా కనిపించే ఇంటిని సృష్టించాడు మధ్యప్రదేశ్‌కు చెందిన ఆనంద్ ప్రకాశ్. తన భార్య మంజూషపై ప్రేమకు గుర్తుగా బుర్హాన్పూర్‌లో తాజ్‌మహల్‌ను పోలిన ఇంటిని నిర్మించాడు. ఈ తాజ్‌మహల్ ఇంటి నిర్మాణానికి మూడు సంవత్సరాలు పట్టింది. ఈ ఇంట్లో నాలుగు బెడ్‌రూమ్‌లు, కిచెన్, లైబ్రరీ, మెడిటేషన్ రూమ్ ఉన్నాయి. 'ఇన్‌సైడ్ ది హౌజ్' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇంటి ముఖచిత్రం తప్ప ఇంటి లోపల ఎలా ఉంటుందో ఇప్పటివరకూ పెద్దగా ఎవరికీ తెలియదు. ఈ వీడియో పుణ్యమా అని ఇంటిలోపలి అందాలను చూసే అవకాశం వచ్చింది. ఇంట్లో ప్రతి మూల, ప్రతివస్తువును పరిచయం చేస్తూ ఈ వీడియోలో కనిపిస్తాడు ఆనంద్ ప్రకాశ్.


హెల్త్

ధమనుల్లో క్యాల్షియం గోడ కూల్చేదెలా



గుండెకు రక్తాన్నిచ్చే ధమనుల్లో సిమెంటులాంటిది పేరుకుపోతుంది. క్యాల్షియమ్ రాయిలా మారడంతో వచ్చే అనర్థమది. అలా ధమనుల్లో క్యాల్షియమ్ రాయిలా పేరుకుపోవడం వల్ల వచ్చే పరిణామాలేమిటి, వాటిని ఎదుర్కోవడమెలా వంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

అందరికీ తెలిసిన అంశమేమిటంటే... గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోయి, గుండెకు రక్తమందించే ప్రక్రియకు అడ్డుపడితే అది గుండెపోటుకు దారితీసే ప్రమాదం ఉంటుందన్న విషయం చాలామందికి తెలిసిందే. కానీ చాలామందికి తెలియని విషయమేమిటంటే... ఇలాంటి ముప్పు క్యాల్షియమ్‌తోనూ ఉండవచ్చునని. అయితే ఈ క్యాల్షియమ్ పేరుకుపోవడమన్నది కొలెస్ట్రాల్‌తో పాటు సాగుతుంది. ఇలా కొలెస్ట్రాల్‌తో కలగలసి రక్తనాళాల్లోగానీ లేదా రక్తనాళపు గోడల్లోగానీ క్రమక్రమంగా క్యాల్షియమూ పేరుకుపోవడం వల్ల ఆ ధమనులు కాస్తా తమ మృదుత్వాన్ని(ఫ్లెక్సిబిలిటీని) కోల్పోయి గట్టిగా మారతాయి. వాటితో పాటు రక్తం ప్రవహించే మధ్యభాగం లో (ల్యూమెన్‌లో) క్యాల్షియమ్ డిపాజిట్స్ కాస్తా రాయిలా అడ్డుపడి రక్తప్రవాహాన్ని నిలిపివేస్తాయి. ఇదీ గుండెకు తీవ్రంగా ముప్పు తెచ్చిపెట్టే అంశమే. అంతేకాదు.. చికిత్సకూ అంత తేలిగ్గా లొంగని సమస్య అది.



అయితే ఇటీవల ఆధునిక వైద్య శాస్త్రంలో వచ్చిన మంచి పురోగతి వల్ల అలా క్యాల్షియమ్ పేరుకుపోయినప్పుడు దాన్ని మెత్తగా నలగ్గొట్టే చాలా ప్రభావ పూర్వకమైన ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా ఆ క్యాల్షియమ్ గడ్డలను ఛిద్రం చేసి గుండెకు రక్తాన్ని ప్రవహించేలా చేయడమిప్పుడు సాధ్యమే.

ధమనుల్లో కాల్షియం ఎలా పేరుకుపోతుందంటే..?

ధమనులు అంటే గుండెకు మంచి రక్తాన్ని చేరవేసే ఈ రక్తనాళాలు... వాస్తవానికి గుండెకు మాత్రమే కాకుండా దేహంలోని ప్రతి కణానికీ... ఆక్సిజన్‌నూ, పోషకాలను చేరవేసే ప్రధాన రహదారుల్లాంటివని చెప్పవచ్చు. అయితే గుండెకు రక్తాన్ని చేరవేసే అత్యంత ప్రధానమైన రక్తనాళాలను 'కరోనరీ ఆర్టరీస్' అంటారు. పుట్టినప్పుడు అత్యంత క్లీన్‌గా ఉండే ఈ కరొనరీ ఆర్టరీస్‌లో... కాలం గడుస్తున్న కొద్దీ పూడిక పేరుకుపోతూ ఉంటంది. అంటే కొవ్వు పదార్థాలూ, కొవ్వులాంటిదే అయిన కొలెస్ట్రాల్, ఇన్‌ఫ్లమేటరీ కణాలూ, పీచులాంటి కణాలూ (ఫైబ్రస్ టిష్యూ)... ఇవన్నీ కలగలసి... రక్తం ప్రవహించే రక్తనాళాల మధ్యభాగంలో అడ్డంకులుగానూ, పూడిక లాగా పేరుకుపోతూ ఉంటాయి.

ముప్పును పెంచే ఆరోగ్య సమస్యలు

కొందరిలో కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు ఇలా రక్తనాళాలు గట్టిబారడం, రక్తనాళం మధ్యన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఇంకా వేగవంతం కావచ్చు. ఉదాహరణకు మధుమేహం. దీర్ఘకాలిక మూత్రపిండాల సమస్య, వయోభారం... వంటి అంశాలన్నీ రక్తనాళాలు గట్టిబారడం, వాటి మధ్య పూడిక పేరడమనే సమస్యను మరింత వేగంగా జరిగేలా చేస్తాయి. రక్తనాళాల్లో ప్రవహిస్తున్న ఈ 'క్యాల్షియమ్' కాస్తా సిమెంట్‌లాగా పేరుకుపోతూ మెత్తటి మృదువైన రక్తనాళాన్ని కాస్తా ఓ లోహపు పైప్‌లా మరింత గట్టిబారుస్తూ పోతుంది. ఈ ప్రక్రియే ఈ సమస్యను మరింత కఠినతరం చేస్తూ, చికిత్సకు ఓ పట్టాన లొంగని అంశంలా మారుస్తుంది.

సమస్యగా ఎందుకు పరిణమిస్తుందంటే..?

● ఎటుపడితే అటు వంగిపోయేలా మృదువుగా ఉన్నప్పుడు హాయిగా విస్తరించగలిగే రక్తనాళం... గట్టిపడ్డ తర్వాత అదే తరహాలో విస్తరించదు లేదా సాగదు. అంతెందుకు రక్తనాళాన్ని విప్పారేలా చేయడానికి 'బెలూన్'ను లేదా 'స్టెంట్'ను పంపినప్పుడు కూడా అది ముందుకు వెళ్లదు.

● గట్టిబారిన / పూడిక పేరుకుపోయిన రక్తనాళంలోంచి రక్తం సాఫీగా ప్రవహించదు. ఫలితంగా ఛాతీనొప్పి (యాంజినా), ఊపిరి అందకపోవడం... ఒక్కోసారి హార్ట్ అటాక్ కూడా రావచ్చు.

● స్టెంట్ పంపాక కూడా రక్తనాళం విస్తరించకపోవడంతో చికిత్సా ఫలితాలు అంత బాగా లేకపోవడం లేదా ఒక్కోసారి మళ్లీ మళ్లీ అడ్డంకులు ఏర్పడటం, స్టెంట్ వేసిన చోట అటు ఇటు రక్తనాళాల్లో రక్తపు ఉండలు/ రక్తపు గడ్డలు పెరుగుతూ రక్తప్రవాహానికి అడ్డుపడవచ్చు. దాంతో రక్తనాళం లోపల మునపటిలాగే మూసుకుపోవచ్చు.



● ఇలా కాల్షియమ్ పేరుకుపోయినప్పుడు దాన్ని తొలగించేందుకూ... అలాగే రక్తప్రవాహాలకు అడ్డు తొలగించేందుకు చేసే యాంజియోప్లాస్టీ ప్రక్రియ సమయంలో అనుకోని ప్రమాదాలూ / ముప్పులూ / దుష్ప్రభావాలూ ఎదురుకావచ్చు.

పరిస్థితిని అర్థం చేసుకునేందుకు ఓ పోలిక...

మనకు తేలిగ్గా అర్థమయ్యేందుకు ఓ ఉదాహరణ ఇది. ఓ మృదువైన పైప్‌లోకి గట్టిగా ఉండే మరో పైప్‌ను ఎక్కిస్తున్నామనుకోండి. అది మృదువుగా ఉండటంతో లోపలికి పంపే మరో పైప్ చాలా తేలిగ్గా ముందుకు వెళ్తూ ఉంటుంది. అదే పైప్ గానీ ఎటుబడితే అటు ఒంగకుండా గట్టిగా ఉంటే లోపలికి ఎక్కించాల్సిన పైప్ తేలిగ్గా ముందుకు వెళ్లదు. అంతేకాదు... పైప్‌లో ఏవైనా సిమెంటు, రాళ్లు, ఇసుక ఉన్నాయనుకుందాం. అప్పుడు లోపలికి ఎక్కించే పైపు ముందుకే సాగదు. సరిగ్గా స్టెంట్ వేసే చికిత్స సమయంలోనూ ఇదే జరుగుతుంది.

ఈ క్యాల్షియమ్‌ను ఎలా ఛిద్రం చేస్తారంటే...

ఆధునిక ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ చికిత్స ప్రక్రియల్లో రక్తనాళం లోపల క్యాల్షియమ్‌తో రాయిలా పేరుకుపోయే అడ్డంకులను తొలగించి, ఆటు తర్వాత స్టెంట్ వేయడానికి డాక్టర్లు ఒక క్రమపద్ధతిని (స్టెప్ బై స్టెప్ మెథడ్‌ను) అవలంబిస్తుంటారు. ఈ ప్రక్రియనే వైద్య పరిభాషలో 'క్యాల్షియమ్ మాడిఫికేషన్' అని పిలుస్తారు. ఈ క్యాల్షియమ్ మాడిఫికేషన్‌లో అనేక పద్ధతులుంటాయి. డాక్టర్లు అనుసరించే కొన్ని పద్ధతులు..

● **హై ప్రెషర్ నాన్ కాంప్లయంట్ బెలూన్స్:** ఈ ప్రక్రియలో 'ఓపీఎన్ – ఎన్‌సీ బెలూన్స్' అనే వాటిని ఉపయోగిస్తారు. మామూలుగా మూసుకుపోయిన రక్తనాళాన్ని విప్పార్చేందుకు వాడే బెలూన్స్ కంటే ఇవి అధిక ఒత్తిడి కలిగిస్తూ రక్తనాళాన్ని తెరుస్తాయి. ఇవి దాదాపుగా 40 అట్మాస్ఫియరిక్ ప్రెషర్‌ను కలిగిస్తాయి. సాధారణ బెలూన్స్ కలిగించే ఒత్తిడి కంటే ఇది చాలా ఎక్కువ.

● **స్కోరింగ్ అండ్ కట్టింగ్ బెలూన్స్:** ఈ తరహా బెలూన్స్‌కు పైపొర మీద కొన్ని బ్లేడ్‌లూ, వైర్‌లూ అమరి ఉంటాయి.

● **రొటేషనల్ అథెరెక్టమీ:** ఒక డ్రిల్లింగ్ ఉపకరణం లాంటి దాని ముందు అమర్చిన గట్టి వజ్రపుముక్కను నిమిషానికి రెండు లక్షల సార్లు తిరిగేలా చేయడం వల్ల గట్టిబారిన క్యాల్షియమ్‌ను బలంగా గ్రైండింగ్ చేస్తున్నప్పుడు చిన్న చిన్న ముక్కలుగా ఛిద్రం చేస్తుంది.

● **ఆర్బిటల్ అథెరెక్టమీ:** పెన్సిల్ ములుకు లాంటి త్రికోణాకృతిలో ఉన్న గట్టి ములుకు ఓ డ్రిల్లింగ్ ఉపకరణం సహాయంతో రక్తనాళం మధ్యన డ్రిల్ చేస్తున్నట్టుగా తిరుగుతుండటం దీని ప్రత్యేకత.

● **ఇంట్రావాస్కులర్ లిథోట్రిప్సీ షాక్ వేవ్ థెరపీ:** ఇందులో షాక్‌వేవ్స్‌ను వెలువరించే ఓ ప్రత్యేకమైన బెలూన్‌ను (షాక్ వేవ్ సీ2 + లేదా లిథిక్స్ హెచ్‌సీ వంటివి) ఉపయోగిస్తారు. షాక్‌వేవ్స్ పుట్టించే తరంగాలు అక్కడ పేరుకున్న క్యాల్షియమ్‌ను పొడిపొడి చేస్తాయి.

● **లేసర్ అథెరెక్టమీ:** ఇది అత్యాధునికమైనదీ, ఉపయోగకరమైనది కూడా.

ఫలితాలు ఎలా ఉంటాయంటే...

● రక్తనాళాలు మళ్లీ మునపటిలా మృదువుగానూ క్రియాశీలంగానూ మారతాయి. ● స్టెంట్ వేసినప్పుడు అది గోడలకు సరిగ్గా అమరేలా విప్పారడంతో దాన్ని సరిగా అమర్చడంతో రక్తప్రవాహం సాఫీగా సజావుగా సాగుతుంది. దాంతో అప్పటివరకు కనిపిస్తున్న లక్షణాలు కనబడకపోవడంతో పాటు దీర్ఘకాలిక ఫలితాలు ఒనగూరే అవకాశాలెక్కువ.



డా॥ ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

అవి పురిటినొప్పులేనా?

గర్భిణులకు తొమ్మిది నెలలు నిండాక వచ్చే ప్రతి నొప్పులూ పురిటినొప్పుల్లాగానే అనిపిస్తుంటాయి. అలాంటి నొప్పులతో కొన్నిసార్లు ఆసుపత్రి వరకు వెళ్లాక కూడా అవి నిజమైన పురిటినొప్పులు కావంటూ... ఆ తర్వాత కొన్ని రోజుల తర్వాత ప్రసవం అయిన కేసులూ ఉంటాయి. ఈ నేపథ్యంలో నెలలు నిండాక వచ్చే నొప్పులు పురిటినొప్పులేనా అని తెలుసుకోడానికి తోడ్పడే అంశాలేమిటో చూద్దాం.



గర్భవతులకు నెలలు నిండాక గర్భసంచి కండరాల సంకోచ వ్యాకోచాల వల్ల నొప్పులు వస్తున్నట్లుగా అనిపిస్తాయి. నిజానికి గర్భవతుల్లోనే కాకుండా మామూలు మహిళల్లోనూ గర్భసంచికి సంకోచ వ్యాకోచాలు కలుగుతూనే ఉంటాయి.

బ్రాక్స్‌టన్ - హిక్స్ కంట్రాక్షన్స్?

ఇక గర్భవతుల్లోనైతే ప్రసవానికి చాలా రోజుల ముందు నుంచే గర్భసంచి కండరాల్లో సంకోచవ్యాకోచాలు ఒక తెర తర్వాత మరో తెర... ఇలా తెరలు తెరలుగా వస్తూ ఉంటాయి. వీటినే 'బ్రాక్స్‌టన్–హిక్స్ కంట్రాక్షన్స్' అంటారు. ఈ సంకోచ వ్యాకోచాలు తొమ్మిది నెలలపాటూ వస్తూనే ఉంటాయి. కాకపోతే నెలలు నిండేకొద్దీ ఇవి వచ్చే వ్యవధీ అలాగే ఫ్రీక్వెన్సీ పెరుగుతూ పూర్తిగా నెలలు నిండేనాటికి అవి పురిటినొప్పులుగా రూపాంతరం చెందుతాయి. ఈ సంకోచవ్యాకోచాల సమయంలో పొట్ట కండరాలు బిగుసుకుని, ఆ తర్వాత మెత్తబడుతూ ఉంటాయి.

ఏవి పురిటినొప్పులు?

గర్భసంచి కండరాల్లోని సంకోచ–వ్యాకోచాల్లో ఏవి పురిటి నొప్పులో గుర్తించడానికి ఒక కొండగుర్తు ఏమిటంటే... ఈ సంకోచ సమయంలో పొట్ట కండరాలు గట్టిబడటంతో పాటు నొప్పి కూడా వస్తుంటుంది. ఈ నొప్పి నడుము వెనక భాగం నుంచి మొదలై క్రమంగా ముందు భాగంలో తొడల వరకు వ్యాపిస్తూ ఉంటుంది. పురిటి నొప్పులు మొదలయ్యాక ఇక ఆ నొప్పులు వస్తూ తగ్గుతూ... ఉంటాయి. ఈ పురిటినొప్పులు గరిష్ఠ స్థాయిలో ప్రభావం చూపుతున్నప్పుడు గర్భసంచి పైభాగం ముడుచుకుంటూ, ముఖద్వార భాగం తెరచుకుంటూ ఉంటే అవి నిజమైన పురిటి నొప్పులని గ్రహించవచ్చు.

నిజమైన పురిటినొప్పులు వస్తున్నప్పుడు...

10 నిమిషాల వ్యవధిలో మూడుసార్లు కండరాల సంకోచాలు వస్తూ... ఒక్కో సంకోచ సమయం కనీసం 45 సెకన్ల పాటు కొనసాగుతూ, అదే టైమ్‌లో గర్భాశయ ముఖద్వారం తెరచుకుంటూ ఉంటే అది నిజమైన ప్రసవ సమయం (ట్రూ లేబర్) అని చెప్పవచ్చు.

డాక్టర్ దగ్గరకు ఎప్పుడు?

ఇక చాలామంది గర్భవతులకు ఒక డౌట్ వస్తుంటుంది. తాము నొప్పులను గుర్తించాక డాక్టర్ దగ్గరికి ఎప్పుడు వెళ్లడం మంచిదనే సందేహాన్ని వ్యక్తం చేస్తుంటారు. గర్భవతులకు భరించలేనంత నొప్పులు వస్తూ ఉన్నప్పుడుగాని; ఇలా పురిటినొప్పులు వస్తూ అదే టైమ్‌లో ఏదైనా రక్తస్రావం కనపడుతున్నా గాని; తమ ప్రమేయం లేకుండానే ఉమ్మనీరు పడిపోతున్నాగాని; లేదా కడుపులో బిడ్డ తిరిగినట్లు అనిపించకపోయినా గానీ... ఈ నాలుగు సందర్భాల్లో తప్పని సరిగా, అత్యవసరంగా డాక్టర్‌ను కలవాలి.

నిజానికి పురిటినొప్పులను గుర్తించడమన్నది కాబోయే తల్లి కంటే డాక్టర్లకే ఎక్కువగా తెలిసే అవకాశముంటుంది. కాబట్టి అవి ట్రూ లేబర్ పెయిన్స్ అయినా కాకపోయినా... నొప్పి వస్తున్నట్లు గుర్తించగానే అత్యవసరంగా డాక్టర్ దగ్గరికి వెళ్లాలి. ఒకవేళ అవి ట్రూ లేబర్ పెయిన్స్ అయితే డాక్టర్లు గర్భవతి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తీసుకుంటారు. దాంతో ప్రసవం సురక్షితంగా జరుగుతుంది.

ఒకవేళ అది హై–రిస్క్ ప్రెగ్నెన్సీ అయితే ముందుగానే వచ్చి హాస్పిటల్‌లో చేరాల్సిందిగా డాక్టర్లు సూచిస్తారు.



డా. సర్వేపల్లి శోభారాణి
సీనియర్ అబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్



మహేంద్ర సింగ్ ధోనిని దాటేసిన పంత్

టెస్టు క్రికెట్‌లో నిలకడ కొనసాగిస్తున్న భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్... మరో రికార్డు తన పేరిట రాసుకున్నాడు. విదేశాల్లో మెరుగైన ప్రదర్శన చేసే పంత్... ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో కెరీర్‌లో ఏడో సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఈ క్రమంలో భారత్ తరఫున సుదీర్ఘ **ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు సాధించిన కీపర్‌గా నిలిచాడు. 6 సెంచరీలు చేసిన మహేంద్ర సింగ్ ధోనిని ఈ మ్యాచ్ ద్వారా పంత్** అధిగమించాడు. వృద్ధిమాన్ సాహా మూడు శతకాలతో మూడో స్థానంలో ఉన్నాడు. సయ్యద్ కిర్మాణీ, ఫారుక్ ఇంజనీర్ రెండేసి సెంచరీలు చేశారు. కెరీర్‌లో 90 టెస్టులు ఆడిన ధోని 38.09 సగటుతో 4876 పరుగులు చేయగా... పంత్ తాజా మ్యాచ్ ద్వారానే 3 వేల పరుగుల మార్క్ దాటాడు. ఆస్ట్రేలియా పర్యటనలో పదే పదే చెత్త షాట్‌లు ఆడి వికెట్ విలువ తెలియకుండా ఔటయ్యాడని పంత్‌ను విమర్శించిన **సునీల్ గావస్కర్... శనివారం మ్యాచ్ వ్యాఖ్యానం సందర్భంగా 'అద్భుతం' అంటూ కొనియాడాడు.**

3 ఇంగ్లండ్ గడ్డపై పంత్‌కు ఇది మూడో సెంచరీ. మరే దేశ వికెట్‌కీపర్ ఇంగ్లండ్‌లో ఒక శతకానికి మించి నమోదు చేయలేదు. ఇంగ్లండ్ వికెట్ కీపర్ లెస్ ఏమ్స్ వెస్టిండీస్ గడ్డపై, జింబాబ్వే **కీపర్ ఆండీ** ఫ్లవర్ భారత్‌లో మూడేసి **సెంచరీలు** చేశారు.

ఇంగ్లండ్ దీటైన జవాబు

తొలి ఇన్నింగ్స్‌లో 209/3

జైస్వాల్, గిల్ వేసిన బాటలో... పంత్ చెలరేగిపోయి సెంచరీ బాదడంతో ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో టీమిండియా భారీ స్కోరు చేయగా... అదే స్థాయిలో రెచ్చిపోయిన ఇంగ్లండ్ దీటుగా బదులిస్తోంది. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా నిప్పులు చెరిగే బంతులతో విజృంభించినా... అతడికి మరో ఎండ్ నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఆతిథ్య ఇంగ్లండ్ బ్యాటర్లు స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. ప్రస్తుతానికి ఇరు జట్లు సమాన స్థితిలోనే ఉన్నా... మూడో రోజు తొలి సెషన్‌లో బుమ్రాను ఇంగ్లండ్ ఆటగాళ్లు ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే ఈ మ్యాచ్ గమనం ఆధారపడి ఉంది!

భారత్ తొలి ఇన్నింగ్స్ 471 ఆలౌట్

- రిషబ్ పంత్ సెంచరీ
- బెంబేలెత్తించిన బుమ్రా
- పోప్ అజేయ శతకం


బుమ్రా


పంత్


పోప్

లీడ్స్: బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై ఇరు జట్ల ఆటగాళ్లు భారీ స్కోర్లతో రెచ్చిపోవడంతో భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. బుమ్రా మినహా భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో... శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఒలీ పోప్ (131 బంతుల్లో 100 బ్యాటింగ్; 13 ఫోర్లు) 'శత'క్కొట్టగా... బెన్ డకెట్ (94 బంతుల్లో 62; 9 ఫోర్లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. ప్రస్తుతం చేతిలో 7 వికెట్లు ఉన్న ఇంగ్లండ్... టీమిండియా స్కోరుకు ఇంకా 262 పరుగులు వెనుకబడి ఉంది. పోప్‌తో పాటు బ్రూక్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 359/3తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 113 ఓవర్లలో 471 పరుగులు చేసి ఆలౌటైంది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (227 బంతుల్లో 147; 19 ఫోర్లు, 1 సిక్స్) టెస్టు కెరీర్‌లో అత్యధిక స్కోరు నమోదు చేసుకోగా... రిషభ్ పంత్ (178 బంతుల్లో 134; 12 ఫోర్లు, 6 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో స్టోక్స్, టంగ్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు.

బుమ్రా ఒంటరి పోరాటం...

సిరీస్ ఆరంభానికి ముందు అంతా ఊహించినట్లు... ఇరు జట్ల మధ్య ప్రధాన తేడా బుమ్రానే అని నిరూపించుకున్నాడు. పిచ్, పరిస్థితులతో సంబంధం లేకుండా అతడు ప్రతి బంతికి వికెట్ తీసేలా అత్యంత ప్రమాదకారిగా కనిపించాడు. వర్షం కారణంగా ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ఆలస్యంగా ప్రారంభం కాగా... తొలి ఓవర్‌లోనే ఓపెనర్ జాక్ క్రాలీ (4)ని పంత్ వెనక్కి పంపాడు. అదే తీవ్రత కొనసాగిస్తూ బుమ్రా రెచ్చిపోతుంటే... ఇంగ్లండ్ బ్యాటర్లు ప్రతీ బంతికీ బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీశారు. ఈ క్రమంలో ఎడ్జ్‌ల ద్వారా కాస్త పరుగులు రాగా... మనవాళ్ల పేలవ ఫీల్డింగ్ ప్రత్యర్థికి కలిసొచ్చింది. ఇంగ్లండ్ వంటి పేస్ పిచ్‌లపై స్లిప్స్‌లో దూసుకొచ్చే బంతులను అందుకోవడంలో యువ ఆటగాళ్ల అనుభవ రాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. బుమ్రా బౌలింగ్‌లోకు ఫీల్డర్ల మద్దతు లభించి ఉంటే ఈ పాటికి మ్యాచ్ మన చేతుల్లోకి వచ్చి ఉండేదే! కొన్ని ఉత్కంఠ క్షణాలను ఎదుర్కొన్న బెన్ డకెట్, పోప్ కుదురుకున్నాక చక్కటి షాట్‌లతో పరుగులు రాబట్టారు. బుమ్రా బౌలింగ్‌ను కాచుకున్న ఈ జంట... సిరాజ్, ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో స్వేచ్ఛగా ఆడింది. దీంతో ఏ దశలోనూ పరుగుల వేగం తగ్గలేదు. టీ విరామం అనంతరం మరోసారి బంతినందుకున్న బుమ్రా... డకెట్‌ను క్లీన్ బౌల్డ్ చేయగా... చివరి సెషన్‌లో పోప్ చెలరేగిపోయాడు. ఎడాపెడా షాట్లు ఆడుతూ... 125 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ మరుసటి బంతికే రూట్ (28)ను బుమ్రా బుట్టలో వేసుకోగా... ఇంగ్లండ్ మరో వికెట్ కోల్పోకుండా రోజును ముగించింది.

అదరగొట్టిన పంత్..

తొలి రోజు ఇంగ్లండ్ బౌలర్లను ఓ ఆటాడుకున్న భారత బ్యాటర్లు... రెండో రోజు తొలి సెషన్ ఆరంభంలోని దాన్ని కొనసాగించారు. ఓవర్‌నైట్ బ్యాటర్లు గిల్, పంత్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. గిల్ కాస్త సంయమనం పాటించగా... పంత్ మాత్రం భారీ షాట్లతో రెచ్చిపోయాడు. ఈ క్రమంలో పంత్ 146 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 99 పరుగుల వద్ద బషీర్ బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో మూడంకెల స్కోరు అందుకున్నాడు. అనంతరం తనదైన శైలిలో పల్టీలు కొడుతూ సంబరాలు జరుపుకున్నాడు. గతేడాది బంగ్లాదేశ్‌పై సెంచరీ అనంతరం పంత్‌కు ఇదే తొలి మూడంకెల స్కోరు. వన్డే తరహాలో ఆడిన ఈ జోడీ చకచకా పరుగులు రాబట్టింది. నాలుగో వికెట్‌కు 301 బంతుల్లో 209 పరుగులు జోడించిన అనంతరం గిల్ అవుటయ్యాడు. షోయబ్ బషీర్ బంతికి క్రీజు వదిల బయటకు వచ్చి భారీ షాట్‌కు యత్నించిన గిల్... బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్‌లో టంగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో 430 పరుగుల వద్ద భారత జట్టు నాలుగో వికెట్ కోల్పోయింది. అదే సమయంలో వాతావరణంలో స్వల్ప మార్పులతో మేఘావృతం కాగా... ఇంగ్లండ్ పేసర్లు రెచ్చిపోయారు. ఎనిమిదేళ్ల తర్వాత టెస్టు ఆడే అవకాశం దక్కించుకున్న కరుణ్ నాయర్ (0) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఎక్స్‌ట్రా కవర్స్‌లో పోప్ పట్టిన మెరుపు క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆ తర్వాత టంగ్ బౌలింగ్‌లో పంత్ వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోగా... పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ (1) అవకాశాన్ని వినియోగించుకోలేకపోయాడు. 454/7తో లంచ్‌కు వెళ్లిన భారత జట్టు ఆ తర్వాత మరో 17 పరుగులు జోడించి మిగిలిన మూడు వికెట్లు కోల్పోయింది. జడేజా (11) ధాటిగా ఆడే ప్రయత్నంలో అవుట్ కావడం దెబ్బకొట్టింది. ఓవరాల్‌గా టీమిండియా 41 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోయింది.

2 కెప్టెన్‌గా తొలి టెస్టులో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన భారత రెండో సారథిగా గిల్ నిలిచాడు. **తాజా** మ్యాచ్‌లో గిల్ 147 **పరుగులు చేయగా...** 1951లో ఇంగ్లండ్‌పై **విజయ్ హజారే** 164 పరుగులు చేశాడు.

5 విదేశీ గడ్డపై ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు భారత ఆటగాళ్లు సెంచరీలు చేయడం ఇది ఐదోసారి. చివరిసారిగా 2007 మిర్పూర్ టెస్టులో బంగ్లాదేశ్‌పై నలుగురు భారత బ్యాటర్లు శతకాలు నమోదు చేసుకున్నారు.

2 ఇంగ్లండ్‌లో ఒకే టెస్టులో ముగ్గురు భారత బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇది రెండోసారి. 2002లో హెడింగ్లీలోనే జరిగిన మ్యాచ్‌లో రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ సెంచరీలు చేశారు.

ఆ మూడు క్యాచ్‌లు పట్టుంటే...

బుమ్రా బౌలింగ్‌లో డకెట్ రెండు సార్లు బతికిపోయాడు. ఇన్నింగ్స్ ఐదో ఓవర్ ఐదో బంతికి డకెట్ ఇచ్చిన క్యాచ్‌ను గల్లీలో యశస్వి జారవిడవగా... భారత అత్యుత్తమ ఫీల్డర్‌లలో ఒకడైన జడేజా కూడా డకెట్ క్యాచ్ నేలపాలు చేశాడు. డకెట్ బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో ఇచ్చిన క్యాచ్‌ను అందుకోవడంలో జడ్డూ విఫలమయ్యాడు. బుమ్రా వేసిన 31వ ఓవర్‌లో పోప్ ఇచ్చిన క్యాచ్‌ను సైతం జైస్వాల్ నేలపాలు చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) స్టోక్స్ 101; రాహుల్ (సి) రూట్ (బి) కార్స్ 42; సాయి సుదర్శన్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0; గిల్ (సి) టంగ్ (బి) బషీర్ 147; పంత్ (ఎల్బీ) (బి) టంగ్ 134; కరుణ్ నాయర్ (సి) పోప్ (బి) స్టోక్స్ 0; జడేజా (బి) టంగ్ 11; శార్దుల్ (సి) జేమీ స్మిత్ (బి) స్టోక్స్ 1; బుమ్రా (సి) బ్రూక్ (బి) టంగ్ 0; సిరాజ్ (నాటౌట్) 3; ప్రసిధ్ కృష్ణ (బి) టంగ్ 1; ఎక్స్‌ట్రాలు 31; **మొత్తం (113 ఓవర్లలో ఆలౌట్)** 471. **వికెట్ల పతనం:** 1-91, 2-92, 3-221, 4-430, 5-447, 6-453, 7-454, 8-458, 9-469, 10-471. **బౌలింగ్:** వోక్స్ 24-4-103-0; కార్స్ 22-5-96-1; టంగ్ 20-0-86-4; స్టోక్స్ 20-2-66-4; బషీర్ 27-6-100-1.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: జాక్ క్రాలీ (సి) కరుణ్ నాయర్ (బి) బుమ్రా 4; డకెట్ (బి) బుమ్రా 62; పోప్ (బ్యాటింగ్) 100; రూట్ (సి) కరుణ్ నాయర్ (బి) బుమ్రా 28; బ్రూక్ (బ్యాటింగ్) 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (49 ఓవర్లలో 3 వికెట్లకు)** 209. **వికెట్ల పతనం:** 1-4, 2-126, 3-206. **బౌలింగ్:** బుమ్రా 13-2-48-3; సిరాజ్ 14-0-50-0; ప్రసిధ్ కృష్ణ 10-0-56-0; జడేజా 9-2-25-0; శార్దుల్ 3-0-23-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

కుబేరలో కథే హీరో

- అక్కినేని నాగార్జున


● నాగార్జున, శేఖర్ కమ్ముల

“మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మ కథ' వంటి సినిమాల్లో హీరో ఎవరని చెప్పలేం. అందులో కథే హీరో... అవన్నీ కూడా డైరెక్టర్ ఫిలిమ్స్. 'కుబేర' కూడా ఔట్ అండ్ ఔట్ శేఖర్ కమ్ములగారి మూవీ ఈ సినిమా కోసం తను ప్రాణం పోశారు. మా సినిమాని ఇంత పెద్ద బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు'' అని అక్కినేని నాగార్జున చెప్పారు. అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా శుక్రవారం (ఈ నెల 20న) తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ ప్రెస్‌మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ– ''శేఖర్ చెప్పిన 'కుబేర' కథ వినగానే నాది మెయిన్ క్యారెక్టర్ అనిపించింది. ఎందుకంటే ఈ సినిమాలోని ప్రతి పాత్ర నేను చేసిన దీపక్ క్యారెక్టర్ చుట్టూనే తిరుగుతుంది. నా పాత్రకి వచ్చిన స్పందన గొప్ప ఆనందాన్నిచ్చింది. నా అభిమానులు కూడా చాలా సంతోషంగా ఉన్నారు'' అని చెప్పారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ– ''ఇది సామాన్యమైన సినిమా కాదు. సరస్వతీ దేవి తల ఎత్తుకొని చూసే సినిమా అని ప్రీ రిలీజ్ ఈవెంట్లో చెప్పాను.. అది ఈ రోజు నిజమైంది'' అన్నారు. ''కుబేర' పెద్ద హిట్ అవుతుందని కథ విన్నప్పుడే చెప్పాను'' అని సునీల్ నారంగ్ పేర్కొన్నారు. ''మా సినిమాకి బ్లాక్ బస్టర్ రిపోర్ట్ వచ్చింది. నిర్మాతలుగా చాలా సంతోషంగా ఉన్నాం'' అని పుస్కూర్ రామ్మోహన్ రావు చెప్పారు.


● మాజీ ఎంపీ బాబూరావు, మధుబాల, విష్ణు, మోహన్‌బాబు, శరత్‌కుమార్, ముఖేష్ కుమార్

కన్నప్పలో అందరూ హీరోలే


- మంచు మోహన్‌బాబు

“కన్నప్ప' సినిమా ఆ భగవంతుని ఆశీస్సులు. మన చేతుల్లో ఏదీ ఉండదు అనడానికి ఉదాహరణే ఈ చిత్రం. రెండు సినిమాలు హిట్ అవగానే మనం గొప్పవాళ్లమని అనుకుంటాం. కానీ, మనం కేవలం వస్తువులమే. ఆ భగవంతుడు, తల్లిదండ్రుల ఆశీస్సులే ముందుకు నడిపిస్తాయి'' అని మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్. మంచు మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్‌కుమార్, మధుబాల తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'కన్నప్ప' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మోహన్‌బాబు మాట్లాడుతూ– ''కన్నప్ప'లో అందరూ హీరోలే. ఈ చిత్రంలో నటించిన నటీనటుల సహాయ, సహకారాలు మరువలేనివి. కన్నప్పగా తిన్నడు ఎలా మారాడు? పరమేశ్వరుడికి కళ్లు ఎలా ఇచ్చాడు? అన్నది ఈ చిత్రకథ. శ్రీ కాళహస్తీశ్వరుడి కరుణ, కటాక్షాలతో 'కన్నప్ప' సక్సెస్ అవ్వాలి. అందరూ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

మంచు విష్ణు మాట్లాడుతూ– ''ఇది నా సినిమా కాదు... కన్నప్ప సినిమా. ఎడిటింగ్‌లో సినిమా చూసినప్పుడు.. 'వావ్.. ఇంత పెద్ద సినిమానా? మేము చేయగలిగామా? నేను నటించానా?' అనిపించింది. ఈ సినిమాలో చాలామంది హీరోలున్నారు. నటించినవారు, డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్, ఎడిటర్... అందరూ హీరోలే. నేను పని చేసిన బెస్ట్ దర్శకుల్లో ముఖేష్ కుమార్‌గారు ఒకరు. శివుడి అనుగ్రహం వల్లే ఇంత పెద్ద సినిమా తీయగలిగానని శివ రాజ్‌కుమార్‌గారితో అన్నాను. 'కన్నప్ప' సినిమా చేయాల్సిన అవసరం ప్రభాస్‌కి లేదు. కానీ, నాన్నగారిపైన ఉన్న ప్రేమ, గౌరవంతోనే ఒప్పుకున్నారు. కొంచెం డబ్బు, పేరు రాగానే మనుషులు మారిపోతుంటారు. భారతదేశంలోనే కాదు ప్రపంచంలోని పెద్ద నటుల్లో ప్రభాస్ ఒకరు... కానీ, మేమిద్దరం కలిసిన మొదటి రోజు నుంచీ ఈరోజు వరకు కూడా అలాగే ఉన్నాం. నా జీవితంలో ప్రభాస్ కృష్ణుడు అయితే... తన జీవితంలో నేను కర్ణుడిని. ఈ సినిమాకి ఏది సాధ్యమైంది అన్నా అది నా దేవుడైన నాన్నగారి వల్లే. 'కన్నప్ప'ని ప్రేక్షకులు మన స్ఫూర్తిగా ఆదరించాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ– ''కన్నప్ప' సినిమాని ఆదరించండి... అభిమానించండి... అల్లరి మాత్రం చేయకండి. ఎందుకంటే శివుడు ప్రతి ఇంటా, ప్రతి గుండెలోకి, ప్రతివాళ్ల మనసులోకి చేరాలి'' అన్నారు.

ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ– ''మోహన్ బాబుగారు నన్ను నమ్మడం వల్లే ఈరోజు ఇక్కడ ఉన్నాను. తెలుగు భాష కూడా తెలియని నన్ను నమ్మి, టాలీవుడ్‌కి తీసుకురావడం, గొప్ప ప్రాజెక్ట్ ఇవ్వడమంటే ఆయన ధైర్యం, నమ్మకమే. నేను పని చేసిన నటుల్లో విష్ణు మంచు మోస్ట్ ప్రిపేర్డ్ యాక్టర్. ప్రభాస్‌గారు మీకు రెబల్‌స్టార్. కానీ, నాకు తెలిసి ఆయన హంబుల్ స్టార్. సింపుల్‌గా ఉంటారు'' అన్నారు.


● 'హరిహర వీరమల్లు' పోస్టర్

వీరమల్లు డేట్ ఫిక్స్

పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటించిన చారిత్రక చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఎ.ఎం. రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మించారు. కొన్ని కారణాల వల్ల ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడింది. తాజాగా కొత్త రిలీజ్ డేట్ ప్రకటించారు మేకర్స్. జూలై 24న 'హరిహర వీర మల్లు' ను రిలీజ్ చేస్తామని ఓ కొత్త పోస్టర్‌తో అధికారికంగా వెల్లడించారు. ''చారిత్రక నేపథ్యంలో, అద్భుతమైన నాటకీయత, ఉత్కంఠభరితమైన యాక్షన్‌తో రూపొందిన 'హరి హర వీరమల్లు' సినిమా ప్రేక్షకులను మెప్పించేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అయ్యో ఏమిరా ఈ జీవితం!

నటుడిగా, హాస్యనటుడిగా ప్రేక్షకుల్లో గుర్తింపు సొంతం చేసుకున్న ప్రవీణ్ హీరోగా నటించిన తొలి చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించారు. ఎస్‌జే మూవీస్‌పై లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. వికాస బడిస సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'అయ్యో ఏమిరా ఈ జీవితం' అంటూ సాగే లిరికల్ వీడియోను దర్శకుడు హరీష్ శంకర్ చేతుల మీదుగా రిలీజ్ చేయించారు. ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ– ''అయ్యో ఏమిరా ఈ జీవితం...' అన్నది యూత్‌ఫుల్ సాంగ్. వికాస బడిస స్వరాలు ఆకట్టుకునే విధంగా ఉంటాయి. రాహుల్ సిప్లిగంజ్ తన స్వరంతో ఈ పాటకు మరింత వన్నె తెచ్చారు. అతి త్వరలో మా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు.


● ప్రవీణ్


● రామ్ కిరణ్, బ్రహ్మానందం, మేఘా ఆకాశ్,


తెలుగింటి భోజనం

రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, రామ్ కిరణ్, మేఘా ఆకాశ్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'స:కుటుంబానాం'. ఉదయ్ శర్మ రచన, దర్శకత్వంలో హెచ్. మహదేవ గౌడ్ నిర్మించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా శనివారం టీజర్‌ని విడుదల చేశారు. ''ఫ్యామిలీ మేన్ అనిపించుకుంటున్న కథానాయకుడు ఫ్యామిలీని హేట్ చేయడం అనే నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు ఉదయ్ శర్మ. ఈ మధ్యకాలంలో కంటెంట్ ఉన్న సినిమాలు ఓ రేంజ్‌లో ప్రేక్షకులని ఆకట్టుకుంటున్నాయి. మా చిత్రం కూడా అలాంటి కోవలోకే వస్తుంది. మా 'స:కుటుంబానాం' ప్రేక్షకులకు చక్కటి తెలుగింటి భోజనం అందించనుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: మణిశర్మ, కెమెరా: మధు దాసరి.

సైలోరే...


● అనుష్క, విక్రమ్ ప్రభు

''పుట్టగానే బెమ్మ ముడిపెట్టిరో... వయసు తాకి జంట కట్టిరో... బతుకనంత తోడులోన చూసేరో... అడుగు అడుగు మొదలుపెట్టిరో...'' అంటూ సాగుతుంది 'ఘాటి' సినిమాలోని 'సైలోరే..' పాట. అనుష్కా శెట్టి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'ఘాటి'. ఈ చిత్రంలో విక్రమ్ ప్రభు మరో కీలక పాత్రలో నటించారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ చిత్రం జూలై 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'సైలోరే..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ పాటకు చిత్ర దర్శకుడు క్రిష్ సాహిత్యం అందించగా, లిప్సికా భాష్యంతో కలిసి ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ నాగవెల్లి విద్యా సాగర్ ఆలపించారు.


● 'షో టైం' పోస్టర్

షో టైం

నవీన్ చంద్ర, కామాక్షీ భాస్కర్ల జోడీగా నటించిన 'షో టైం' సినిమా విడుదల తేదీ ఖరారు అయింది. ఈ చిత్రాన్ని జూలై 4న విడుదల చేయనున్నట్లు హీరో అడవి శేష్ ద్వారా చిత్రయూనిట్ ప్రకటించింది. మదన్ దక్షిణామూర్తి దర్శకత్వంలో అనిల్ సుంకర సగర్వ సమర్పణలో కిశోర్ గరికిపాటి నిర్మించారు. ''అద్భుతమైన వినోదాత్మక చిత్రం 'షో టైం'. అన్ని వర్గాల ప్రేక్షకులను రంజింపజేసే కంటెంట్ మా సినిమాలో ఉంది. ఇందులోని సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. నవీన్ చంద్ర నటన ఆకట్టుకుంటుంది. కామాక్షి అద్భుతమైన పాత్రతో ప్రేక్షకులను అలరిస్తారు'' అని చిత్ర యూనిట్ తెలిపింది.

యాక్షన్... థ్రిల్


● ఆర్కే సాగర్

'మొగలి రేకులు' సీరియల్ ఫేమ్ ఆర్కే సాగర్ హీరోగా నటించిన చిత్రం 'ది 100'. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించారు. మిషా నారంగ్ కథానాయిక కాగా, ధన్యా బాలకృష్ణ కీలక పాత్ర చేశారు. రమేష్ కరుటూరి, వెంకీ పూషడపు, జె. తారక్ రామ్ నిర్మించారు. ఈ సినిమాని జూలై 11న విడుదల కానుంది. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'హే మేఘాలే...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. శ్రీ హర్ష ఎమ్మనీ సాహిత్యం అందించిన ఈ పాటని రేవంత్, సాహితీ చాగంటి పాడారు. ఆర్కే సాగర్ మాట్లాడుతూ– ''నేను టీవీ సీరియల్‌లో చేసిన ఆర్కే నాయుడు పాత్రని ఈ చిత్రంలో నేను చేసిన విక్రాంత్ ఐపీఎస్ రీప్లేస్ చేసేలా ఉంటుంది'' అన్నారు. ''మంచి కథతో రూపొందిన మా చిత్రాన్ని ఆదరించాలి'' అన్నారు రాఘవ్ ఓంకార్. ''ఒకప్పుడు సాగర్‌గారికి బుల్లితెర మెగాస్టార్ అనే పేరు ఉండేది. వెండితెర పైనా ఆయన సక్సెస్ కావాలి'' అని వెంకీ పూషడపు తెలిపారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/B.Tech, NIT/ Govt. ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept./ 1.30 Lakhs. PM/5'11"ఎత్తు/38 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-15077]

ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ Govt. Asst. ఇంజినీర్/ట్రాన్స్‌కో/1 Lakh. PM/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9550166072 [HA-15077]

SC హిందూ మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech / C.Govt. ట్రాక్ మెంటెనర్ / రైల్వే/ 82,000/-PM/5'11"ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15077]

యాదవ/M.Tech, IIT/ C.Govt. ఇన్స్‌పెక్టర్/కస్టమ్స్ & GST Dept/85000/-PM/ 6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15077]

కుల ప్రసక్తి లేదు/28/5'8"/SWE/ Working in Wells Fargo, 1 L PM, వెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్. Ph: 7032135461 [H-783627]

క్రిస్టియన్ మాల/32/ 5'10"/ B.Tech/ MS/SW Lead / MNC / Hyderabad/22L PA/Well Settled Family వరునికి తగిన వధువు కావలెను. Ph: 9618563492 [H-783627]

SC మాల & క్రిస్టియన్/M.Tech IT/ Govt. AEE/ట్రాన్స్‌కో/18 Lakhs PA/ 5'9"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-16060]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/35y/1L PM/Hyd లో సొంత ఇల్లు ఏలేటిలో 5ఎ. వ్యవసాయ భూమి గల వెల్ సెటిల్డ్ హైదరాబాద్ వరుడికి ఏపీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK. కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-782731]

45 సం॥లు, BC, ప్రభుత్వ టీచర్‌కు ప్రభుత్వ ఉద్యోగం చేయు BC/OC కి చెందిన 1వ, 2వ వధువు కావలెను. డైరెక్ట్ పర్సన్. సెల్ నెం. 9966311904 / 9441272470 [WA-6711]


★★

SC మాల/33/5'6"/M.Tech/SWE వరునికి సాంప్రదాయ కుటుంబం గల వధువు కావలెను. East/West గోదావరి వారికి ప్రాధాన్యత, డైరెక్ట్ సంప్ర : 9441286029 [H-783626]

Reddy/41 Yrs/5'.10"/ B.Sc (Comp.) / Fair / Own Business / 8 Lakhs Income /2 Crore Property/ అందమైన వరుడికి వధువు కావలెను. 9848230725. [T-2289]

ఆర్యవైశ్య డైరెక్ట్ కాంటాక్ట్: 42yrs 5.5 బిజినెస్, జాబ్, 30 కోట్ల స్థిరాస్తి గల అబ్బాయికి అందమైన 1వ, 2వ అమ్మాయి కావలెను (నో బ్రోకర్స్), Cont: 7995585722, 9848817137 [T-2481]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు / డిగ్రీ, Age: 31/సొంత బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం ఐన OK). 1st or 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9121516873 [H-783627]

రెడ్డి/Govt.ఎంప్లాయ్ 92K (PM), 37yr-B.Tech ఫెయిర్, సొంత ఇల్లు & వెల్ సెటిల్డ్ కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను (1వ, 2వ మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర : 9133672661 [H-783544]

క్రిస్టియన్ మాల/BE, CBIT/ C.Govt.Jr. ఇంజినీర్ /రైల్వే / 75000/-PM/ 5'4" ఎత్తు /26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15077]

రెడ్డి వధువు 5'4"/V.Fair, B.Tech, SWE, 15 ఎకరాల వ్యవసాయ భూమి, ఒక కూతురు మాత్రమే, తగిన వరుడు కావలెను. సంప్ర : ప్రభాకర్ రెడ్డి. 9391198332 [H-783627]

రెడ్డి/2nd మ్యారేజ్(కుల/ఆస్తి) పట్టింపు లేదు. 33Y/Q:B.Ed/Job-Own House & Property's/ గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం)OK. అన్ని వయస్సుల & కులాల వారికి 1st లేదా 2వ సంబంధాలు కలవు. Ph: 9573002847 [H-783627]

వైశ్య/50y/విడో/సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ / దాబా రెస్టారెంట్/40 Acres Land/7 Lac Income కోట్ల ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 7032770546 [H-783543]

కమ్మ/50y/విడో/Govt.Job/VRS/ఫర్నీచర్ షాప్/ గ్లాస్ షో రూం/మామిడి తోట/ 16Lac Income కోట్ల ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. CNB. 9100808546 [H-783543]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Divorcee / B.Tech(IIT)/ MS/ USA/Own-Company/300Cr worth/ 1986/6'/ * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/IIT/ B.Tech/(Dualdegee) / SWE/ USA/ H1/300K / 1997/5'6"/15Cr *IIT/ B.Tech/ MS/H1/USA/1996/6'/ 200K/ 10Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/BS/ MS/ H1/USA / 1998/5'11"/ 230K/30Cr *IIT/B.Tech / MS/USA / H1/ 94/5'11"/450K/30Cr* Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Business/Industrialist/1982 /5'8"/400Cr/ *M.Tech/ 94/ 6'/1000Cr *98/6'/400Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Business / BE /1990 /5'10"/ 30L/M/25Cr *BE/93/5'7"/50Cr *95/ 5'9"/250Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/ Business / B.Tech/MS/1991/ 5'11"/400Cr *94/5'11"/250Cr/10L/M-Rents/ *91/6'/75Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Doctors /USA- Citizen /1989/ 5'9" *92/6' *98/5'8" *94/5'9" *H1/ 95/ 5'8" *83/5'6"/50Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/ MBBS/ MD *1996/6'/50Cr *95/ 5'10"/200Cr * 93/5'10"/20Cr * MBBS/89/ 5'10"/100Cr * Cont: K.C. Reddy- Mar-Bureau-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/(Catholic)B.Tech/MS/H1 / USA/ 1994/5'8"/ 160K / 5Cr *90/6'/90K/15Cr (Canada)/USA/86/5'7"/200K/5Cr * Cont: K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Catholic / Royal Family / Hyd/ B.Tech/MBA/SWE /1987/5'11"/ Very Handsome Boy/Rich Family * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/Widower/B.Tech/Own Business/1989/5'3"/30L/M/100Cr-Needs - USA-Good Alliance * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/ Divorcee/ MBBS / MD / DM/ Govt-Job-Hyd-1986/5'4"/Rich Family- Needs any well settled * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/Divorcee/MBBS/MD/DM(USA Returned)Hyd-Job / 1992/5'3"/10Cr- Needs any good alliance * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech / MBA/MS/USA/2001/ 5'4"/Rich/ Needs- USA/India-Well Settled *98/5'5"/*97/5'4"/100Cr * Cont: K.C. Reddy- Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1994/ 5'8"/ 150K/8Cr *96/5'3"/15Cr/115K *97/5'5"/ 5Cr *99/5'2"/15Cr * Cont: K.C.Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1998/ 5'4"/ 10Cr *89/5'6"/170K/15Cr *97/5'5"/ 10Cr *95/5'6"/200K/5Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/USA-Citizen-Girls *MS/ 1999/ 5'6"/100Cr *2002/5'7" *96/5'3"/15Cr *98/5'3" * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech / Rich *1995 / 5'5"/100Cr *2000/5'5"/100Cr *99/5'7"/100Cr *94/ 5'3"/ 300Cr *96/5'5"/100Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/MBBS/MD/Rich *1998/5'5"/50Cr *2000/5'6"/100Cr *98/5'7"/70Cr *97/ 5'6"/ 500Cr *96/5'8"/50Cr *90/5'6"/100Cr * Cont: K.C. Reddy - Hyd-Ph:9849321309

Reddy/IIT/B.Tech/*2000/5'7" /45L/yr/10 Cr *97/5'4"/25L/yr *96/5'7" *99/5'6" *97/ 5'4"/200K *2000/5'5"/ * Cont: K.C. Reddy -Hyd-Ph: 9347807015/9849321309

[D-574]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D.V.Koti Reddy, 690,Road No:3,Banjara Hills (TV- 9, Opp: Colony)(Near The Leela Hotel) Hyd. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5PM. www.avinashreddy.com + 91 9848011818/ + 91 9393311818

వధువు కావలెను

రెడ్డి Bengaluru, BE (IIT), 27, 5' 9", Sr. SWE, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, M Arch, 33, 5' 11", Hyderabad, HandSome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, M Tech (IIT), 29, 5' 6", 50 L P/A, Hyderabad, HandSome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, Residency Doctor, 25, 5' 2", 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, M Tech (BITS), 26, 5' 7", Engineer, 20 L P/ A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 5", PG Doctor, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Business, MBA, 30, 5' 6", Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 9", Project Manager, H1, 50 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 29, 5' 10", PG Doctor, 70 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 10", Analyst, H1, USA, HandSome Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 27, 5' 6", 31 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE (NIT), MS, 29, 5' 6", SWE, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 3", PG Doctor, 100 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 34, 5' 4", SWE, 120 K, 3 Crores, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

నాయుడు/50y/Govt.ప్రిన్సిపాల్/సిమెంట్ ఇటుక ఫ్యాక్టరీ/మార్బుల్ షో రూం/25 Lac Income/కోట్ల ప్రాపర్టీ గల వధువుకు FC/BC వరుడు కావలెను. 9100808546 [H-783543]

OC/50y/విడో/డిగ్రీ / బెనారస్ బట్టల షోరూం / Online Business / 30Lac Income కోట్ల ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. 8522098546 [H-783543]

వైశ్య/45y / విడో /Govt. లెక్చరర్/ సొంత ఇల్లు/Car Rents 2L కోట్ల ప్రాపర్టీ గల వధువుకు FC/BC వరుడు కావలెను. 9515324063 [H-783543]

FC/విడో/50y/Very Fair/VRS/2 సొంత ఇల్లులు మంచి ఆర్థిక స్తోమత గల వధువుకు స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 6309688950 [H-783544]

రెడ్డి/విడో/తెల్లని ఛాయ/తక్కువ చదువు / ప్రైవేట్ జాబ్/రెండు చిన్న ఇల్లులు గల వధువుకు స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. 9052804378 [H-783544]

FC/ విడో / Govt. Employee/ సొంత ఇల్లు గల వధువుకు వరుడు కావలెను. ఫోన్ నెంబర్ : 6281849287 [H-783544]

ఆది-ఆంధ్రా/24/5'3"/ఫెయిర్/B.Tech (EEE) System Engineer MNC Hyd వెల్ సెటిల్డ్ వధువుకు Working in MNC Lead/Head గల వెల్ సెటిల్డ్ వరుడు కావలెను. Ph: 9948516705 [H-804895]

SC మాల/B.Tech/C.Govt.బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్/SBI/45000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16060]

రెండో పెళ్లి/24y & 25y 26y & 27y& 28y& 29y& 30y& 31y 33y& 34y& 35y& 36y& 37y& 39y& 40y& 41y& 42y& 43y& 44y& 45y& 47y&48y& 49y& 50y మా సేవా (Since: 1998) Ph: 9291503949 [HA-16060]

క్రిస్టియన్ మాల/B.Tech, MBA/ SWE/24 Lakhs. PA/5'1" ఎత్తు/33 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8919759359 [HA-16060]

యాదవ/ఎర్రగొల్ల/అప్పర్ మిడిల్ క్లాస్/ 37Y/ 5'4"ఎత్తు/M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన లక్ష రూ॥ PM ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్ : 9989597799 [H-783625]

Reddy/Divorcee / Most Beautiful/ Govt - Doctor-Hyd / Very-Rich-Family / MBBS/ MD/DM/ 1986/ 5'4"/ Needs any Well Settled. Cont. Sunder Reddy. Ph: 9515790337 [HA-16044]

★

మాల హిందూ, 2nd మ్యారేజ్, వయస్సు 40, 5'3"H, M.Tech., Software నెలకు లక్షరూపాయల జీతం వధువుకి సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి హిందూ/క్రిస్టియన్స్ వరుడు కావలెను. ✆ : 77949 11019 [R-1256872]

పద్మశాలి Age: 22, 5'3", 1st మ్యారేజ్, డిగ్రీ, మిడిల్ క్లాస్ వధువుకి Any Job, బిజినెస్ చేసే వరుడు కావలెను. 2nd మ్యారేజ్ అయినా OK. Cell: 8142334036. [SCA25005307]

వేదికలు



శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-783544]

రెడ్డి వధూవరుల పరిచయవేదిక : 06-07-25న 10am to 5 pm సెంట్రల్ బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్ LB నగర్, హైదరాబాద్. రిజిస్ట్రేషన్ ఫ్రీ. వధువులకు. సంప్ర : 9391198332 [HA-16060]

Brahmin పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16060]

Kamma, Kapu, Reddy పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16060]

Christian పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16060]

Madiga - Mala పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16060]

Divorcee & Widowed పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16060]

శ్రీరామ-అన్ని కులములకు, సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, VIP, అబ్రాడ్, 1st, 2nd వారికి పెళ్లి సంబంధాలు వ్యక్తిగత శ్రద్ధతో చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, ✆ 70937 22724. [T-3274]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 13.07.2025వ తేదీ ఉ॥ 10 గం॥లకు 67వ ఆర్య వైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 22వ పునర్వివాహ పరిచయ వేదిక విజయవాడ KBN కాలేజీలో జరుగును. ✆ 99895 00130, 81064 54284 [B-333]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1549]

Free Register. పద్మశాలి వధూ- వరుల స్వయంవరం (online) 29 June/ 2025న bhavanimatrimony, Hyd. వాట్సాప్ No. 9704656103, 9533608887 [HA-1512]

వినియోగదారుల హక్కుల రక్షణకు కొత్త విధానం

పౌరసరఫరాల శాఖ కమిషనర్ వెల్లడి



సమావేశంలో చౌహాన్

సాక్షి, హైదరాబాద్: వివిధ రకాల మోసాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు కొత్త మార్గదర్శకాలు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యక్ష విక్రయ రంగంపై ప్రత్యేక నిబంధనలు రూపొందించేందుకు చర్యలు ప్రారంభించింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ కొత్త విధానం రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం 2021లో తీసుకొచ్చిన 'కన్స్యూమర్ ప్రొటెక్షన్ (డైరెక్ట్ సెల్లింగ్) రూల్స్'ఆధారంగా రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆయన పరిశ్రమలు, వాణిజ్య శాఖ, వాణిజ్య పన్నుల విభాగం, లీగల్ మెట్రాలజీ, డ్రగ్స్ కంట్రోల్, ఎక్సైజ్, ప్రివెంటివ్ మెడిసిన్, పోలీస్ శాఖల ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమయ్యారు. అసోసియేషన్ ఆఫ్ డైరెక్ట్ సెల్లింగ్ ఎంటిటీస్ ఆఫ్ ఇండియా (ఏడీఎస్ఈఐ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ డైరెక్ట్ సెల్లింగ్ ఇండస్ట్రీస్ (ఫిడ్స్), ఇండియన్ డైరెక్టర్ సెల్లింగ్ అసోసియేషన్ (ఐడీఎస్ఏ) ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఐటీ శాఖ కార్యదర్శి భవేష్ మిశ్రా, కమర్షియల్ టాక్స్ కమిషనర్ హరిత, సీఐడీ ఎస్పీ వెంకటలక్ష్మి సూచనలు చేశారు. పాలసీ రూపకల్పనలో పారదర్శకత ఉండేలా చూడాలని నిర్ణయించా రు. వినియోగదారుల హక్కులను కాపాడుతూ, పరిశ్రమలకు న్యాయమైన అవకాశాలు కల్పించేలా ఆయా శాఖల ప్రతినిధులు దిశా నిర్దేశం చేశారు.

హరికృష్ణ గ్రూప్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: హరికృష్ణ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా 7,300 మంది తమ సంస్థ ఉద్యోగుల భాగస్వామ్యంతో ఈ వేడుకను జరుపుకుంది. కార్యక్రమంలో సూరత్, ముంబైలలోని హెచ్‌కే ఆఫీసుల నుంచి 2,300 మంది ఉద్యోగులు, 18 రాష్ట్రాల్లో ఉన్న కిస్నా రిటైల్ స్టోర్స్ నుంచి 5,000 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే సూరత్ ప్రధాన కార్యాలయంలో 1,700 మందికి పైగా ఉద్యోగులు సమష్టిగా యోగా ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనగా.. ముంబై కార్యాలయంలో 600 మంది ఉద్యోగులు ఉత్సాహంగా యోగా ఆసనాలను వేశారు. కాగా, హరికృష్ణ గ్రూప్ జ్యువెల్లరీ బ్రాండ్ కిస్నా.. 18 రాష్ట్రాల్లో 25 ప్రాంతాల్లో సామూహిక యోగా దినోత్సవాలను నిర్వహించింది.

రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
- సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి రైతులకు ఎందుకు ఇవ్వరు?
- ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు



సంగారెడ్డి జిల్లా జిన్నారంలో జరిగిన రైతు ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/జిన్నారం (పటాన్‌చెరు): 'ఆసరా పింఛన్లలో కోత.., ఫీజు రీయింబర్స్‌మెంట్, కేసీఆర్ కిట్‌లో కోత, ఇప్పుడు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని రెండు లక్షల మంది రైతులకు రైతుబంధు పథకం కోత.. సీఎం రేవంత్‌రెడ్డి కోతల రేవంత్‌రెడ్డిగా మారిపోయారు'అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ రైతుబంధు పథకం అమలు చేసిన ప్రభుత్వం.. సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఈ రైతులకు కూడా రైతుబంధు ఆర్థిక సాయం అందించాలని, లేనిపక్షంలో ఔటర్ రింగ్ రోడ్డును దిగ్బంధిస్తామని హెచ్చరించారు. శనివారం సంగారెడ్డి జిల్లా జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన రైతుల మహాధర్నాలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్న తనపై కేసులు పెట్టించారని, ఇప్పుడు కోతల రేవంత్‌రెడ్డి అంటే కూడా కేసులు పెట్టించినా.. ప్రభుత్వాన్ని నిలదీయడం ఆపబోమని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని తేల్చి చెప్పారు.

బీఆర్ఎస్ హయాంలో నాట్లప్పుడు.. ఇప్పుడు ఓట్లప్పుడు

'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాట్లు వేసిన ప్రతిసారీ రైతుబంధు ఆర్థిక సాయం అందించాం. కానీ ఈ ప్రభుత్వంలో కేవలం ఓట్లు వచ్చినప్పుడే రైతుబంధు ఇస్తున్నారు. ఎంపీ ఎన్నికలప్పుడు రైతుబంధు ఇచ్చారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయని మళ్లీ రైతుబంధు ఇస్తున్నారు'అని హరీశ్‌రావు విమర్శించారు.

బేడీల రాజ్యం నడుస్తోంది

'రాష్ట్రంలో ప్రజాపాలన సాగడం లేదు. బేడీలు, కేడీల రాజ్యం నడుస్తోంది. లగచర్ల రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం. ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దని నిరసన తెలిపిన రైతులను కూడా జైలులో పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి తరచూ తెలంగాణ పరువు తీసున్నారు. దేవాదుల ప్రాజెక్టు ఏ బేసిన్‌లో ఉందని అడుగుతున్నారు. బనకచర్ల ఎక్కడ ఉందో తెలియదంటున్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపుతున్న కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ-కార్ రేసు ప్రాజెక్టు రాష్ట్రానికి తెచ్చిన కేటీఆర్‌పై కూడా కేసు పెట్టారు' అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

రప్పా.. రప్పా 3.0 లోడింగ్

జిన్నారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కన్వీనర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రైతు మహాధర్నా కార్యక్రమంలో '2028లో రప్పా..రప్పా 3.0 లోడింగ్'అనే నినాదంతో కార్యకర్తలు ప్రదర్శించిన ప్లకార్డులు అందరి దృష్టిని ఆకర్షించాయి.

డబ్బుల్లేవు.. కొత్త పథకాలెట్లా?

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తం రాబడులు రూ.16,473 కోట్లు మాత్రమే.

ప్రతి నెలా ఖర్చు ఇలా..

ఖర్చుల విషయానికి వస్తే ప్రతి నెలా సగటున రూ.6 వేల కోట్ల వరకు రెవెన్యూ పద్దు కింద ఖర్చు చేయాల్సి వస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో పాటు రూ.2 వేల కోట్ల వరకు అప్పులకు వడ్డీల కింద, దాదాపు రూ.4 వేల కోట్లు (తాజాగా ప్రకటించిన డీఏతో కలిపి) ఉద్యోగులకు వేతనాల కింద, రూ.1,500 కోట్లు పింఛన్ల కింద, రూ.2,500 కోట్ల వరకు సబ్సిడీల కింద, రూ.1000-1500 కోట్లు మూలధన వ్యయం కింద ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇవన్నీ అనివార్యంగా చెల్లించాల్సినవే. ఇవన్నీ కలిపి రూ.17 వేల కోట్లు దాటుతున్నాయి. అయితే ప్రభుత్వ రాబడులు (అప్పులతో కలిపి) ఇంతకంటే తక్కువే ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో కొంచెం అటుఇటుగా ఈ చేత్తో తీసుకుని ఆ చేత్తో ఇచ్చేటట్టే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉండటం గమనార్హం. కాగా రూపాయి అదనంగా ఖర్చు పెట్టాలన్నా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చెప్పినట్టు కడుపు కట్టుకోవాల్సిందేనని, ఎప్పటికప్పుడు సర్దుబాటుకు మాత్రమే నిధులు సరిపోతున్నాయని, ఏదైనా పథకానికి డబ్బులు కావాలంటే రూపాయి రూపాయి పోగేయాల్సి వస్తోందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

హెచ్ఎండీఏపై ఆశలు..'నియోపొలిస్'పై కన్ను

ప్రస్తుత పరిస్థితుల్లో భూముల అమ్మకాల ద్వారా మాత్రమే అదనపు ఆదాయం వస్తుందనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో అప్పుడే లోటు రూ.9 వేల కోట్లకు చేరినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కంచ గచ్చిబౌలి భూముల అమ్మకాల ద్వారా రూ.20 వేల కోట్లు సమకూర్చుకుని రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టాలన్న ఆలోచన కార్యరూపం దాల్చకపోవడంతో ఇక, హెచ్ఎండీఏ మీదనే ప్రభుత్వం ఆశలు పెట్టుకున్నట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా కోకాపేట్ నియోపొలిస్ భూముల అమ్మకాలను త్వరలోనే తెరపైకి తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ దాదాపు ఐదు ప్రాంతాల్లో భూముల అమ్మకాలకు అవకాశాలున్నట్టు ప్రభుత్వం అంచనా వేస్తోంది. మరోవైపు 18 హెచ్ఎండీఏ లేఅవుట్లలోని 2,414 ప్లాట్లు, ఉప్పల్ భగాయత్, తుర్కయంజాల్, ఇన్ముల్ నర్వలతో పాటు లేమూరు, కుర్మాల్‌గూడ, బాచుపల్లి, మేడిపల్లి, మోకిల, ప్రతాప సింగారం, బహదూర్‌పల్లి, పెద్ద కంజర్ల తదితర ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లు అమ్మడానికి కూడా సర్కారు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. మొత్తం మీద 18 నెలల కాలంలో కనీసం రూ.12 వేల కోట్లను హెచ్ఎండీఏ భూముల అమ్మకాల ద్వారా రాబట్టుకోవాలని, నియోపోలిస్ భూముల అమ్మకాల ద్వారా మరో రూ.3 వేల కోట్ల వరకు సమకూర్చుకోవాలనే ఆలోచనలో ప్రభుత్వ వర్గాలున్నట్టు సమాచారం.

పెరుగుతున్న బడ్జెట్ అంతరం

ప్రస్తుత (2025-26) ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.3.05 లక్షల కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అంటే సగటున నెలకు రూ.25 వేల కోట్లు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. కానీ మొదటి రెండు నెలల ఆదాయ గణాంకాలను పరిశీలిస్తే అది రూ.16,500 కోట్లు దాటలేదు. అంటే రాష్ట్ర ప్రభుత్వ అంచనాలకు, వాస్తవ రాబడులకు మధ్య దాదాపు రూ.8,500 కోట్ల మేర తేడా వస్తోందన్న మాట. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది ఎక్కువే. 2024-25లో ప్రతిపాదించిన బడ్జెట్ ప్రకారం ప్రతినెలా సగటున రూ 23,500 కోట్ల వరకు సమకూర్చుకోవాలి. కానీ సగటున రూ.17 వేల కోట్ల నుంచి రూ.18 వేల కోట్ల వరకే రాబడులు వచ్చాయి. అంటే ప్రతినెలా సుమారు రూ.6 వేల కోట్లు తక్కువ వచ్చింది. ఇప్పుడు ఆ తేడా ఏకంగా రూ.8,500 కోట్లకు చేరడం గమనార్హం.

గత రెండేళ్లలో వచ్చిన రెవెన్యూ రాబడి (పన్ను ఆదాయం) రూ.కోట్లలో

నెల	2024-25	2023-24
ఏప్రిల్	11464.17	9698.65
మే	10954.96	10399.08
జూన్	12190.37	11627.37
జూలై	9965.89	10987.16
ఆగస్టు	13146.14	12729.50
సెప్టెంబర్	11183.78	11249.73
అక్టోబర్	13229.56	10691.20
నవంబర్	11418.14	9701.25
డిసెంబర్	8494.47	12609.37
జనవరి	10724.50	10748.96
ఫిబ్రవరి	11281.90	13703.92
మార్చి	12229.09	11393.98


(ఇవి కాక, పన్నేతర ఆదాయం, కేంద్రం ఇచ్చే గ్రాంట్లు, వివిధ రూపాల్లో తీసుకునే అప్పులు అదనపు ఆదాయంగా ఉంటుంది. 2025-26లో ఏప్రిల్‌లో రెవెన్యూ రాబడులు రూ.10,916.68 కోట్లు రాగా, పన్నేతర ఆదాయం రూ.253 కోట్లు, అప్పులు రూ.5,230 కోట్లు తదితరాలు కలిపి మొత్తం రాబడి రూ.16,473.99 కోట్లకు చేరింది.)

ఎన్నికల సమయంలో అలా...

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తి అవగాహన ఉన్నట్లు చెప్పి పలు పథకాలను ప్రకటించిన కాంగ్రెస్ పెద్దలు.. ఇప్పుడు అమలు చేయాల్సి వచ్చేసరికి ఆదాయం పెరిగితే తప్ప అమలు చేయడం సాధ్యం కాదని, అప్పుల కిందే నెలకు రూ.6 వేల కోట్లు చెల్లించాల్సి రావడం వల్ల సంక్షేమ పథకాలకు నిధులు చాలడం లేదని అంటుండంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెన్షన్ల పెంపు, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏడాదిన్నర అయినా అమలు కాకపోగా... రైతుభరోసా కింద ఎకరాకు ఏటా ఇస్తామన్న మొత్తాన్ని రూ.15 వేల నుంచి రూ.12 వేలకు కుదించడాన్ని ప్రతిపక్షాలు ఎత్తిచూపుతున్నాయి. అది కూడా సక్రమంగా చెల్లించలేదని ఆరోపిస్తున్నాయి. అలాగే ఉద్యోగులకు ఐదు డీఏలు చెల్లించాల్సి ఉండగా, రెండింటికి ఆమోదం తెలిపి.. ఒక డీఏ ఇప్పుడు చెల్లిస్తామని, మరో డీఏ ఆరునెలల తరవాత చెల్లిస్తామని చెప్పడం కూడా ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమయ్యింది. ఇక వేతన సవరణ ఊసే ప్రభుత్వం ఎత్తడం లేదని ఉద్యోగులు వాపోతుండగా.. ఆదాయం పెరిగితే తప్ప ఏమీ చేయలేని పరిస్థితి ఉందంటూ ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఓఆర్ఆర్ లోపలి భూములకూ రైతు భరోసా

- ఔటర్ లోపల 1.18 లక్షల ఎకరాలు సాగులో ఉన్నట్లు గుర్తింపు
- సోమవారం తర్వాత వాటికీ రైతు భరోసా పెట్టుబడిసాయం
- రైతు భరోసాను ఓర్వలేకనే బీఆర్ఎస్ నాటకాలు: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి సాగు భూములకు సైతం రైతు భరోసా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలోని 1.53 కోట్ల ఎకరాలకు రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాగు యోగ్యమైన భూములకు మాత్రమే పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో 1.49 కోట్ల ఎకరాల సాగు యోగ్యమైన భూములు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. అందులో ఓఆర్ఆర్ లోపల ఉన్న 2.18 లక్షల ఎకరాల భూములను పథకం నుంచి మినహాయించారు. వానకాలం సీజన్‌కు సంబంధించి ఈ నెల 16 నుంచి రైతుభరోసా డబ్బులు రైతులుకు అందిస్తున్న ప్రభుత్వం.. శనివారం వరకు 9 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులందరికీ రూ.7,770.83 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న 2.18 లక్షల ఎకరాల భూములకు రైతుభరోసా ఇవ్వలేదు.


సాగుయోగ్యం కాని భూములు 93 వేల ఎకరాలే..

ఓఆర్ఆర్ లోపలి భూములకు కూడా రైతు భరోసా ఇవ్వాలని పలువురు స్థానిక ఎమ్మెల్యేలు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరారు. వాణిజ్య అవసరాలకు వాడుతున్న భూమిని వదిలేసి.. కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తున్న భూములకు రైతుభరోసా అమలు చేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య విన్నవించారు. దీంతో వ్యవసాయ శాఖ జరిపిన సర్వేలను పరిశీలించగా, ఓఆర్ఆర్ లోపల ఉన్న 2.18 లక్షల ఎకరాల భూముల్లో సుమారు 93 లక్షల ఎకరాలే రియల్ వెంచర్లు, ఇతర వాణిజ్య అవసరాలకు వాడుతున్నట్లు తేలింది. అవి పోను సాగులో ఉన్న 1.20 లక్షల ఎకరాలకు రైతుభరోసా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు రైతుల పాస్ పుస్తకాల ఆధారంగా అర్హులను ఎంపిక చేసినట్లు తెలిసింది. సోమవారం తరువాత ఈ భూములకు సైతం రైతుభరోసా డబ్బులు అందించనున్నారు.

ఓర్వలేక బీఆర్ఎస్ డ్రామాలు: మంత్రి తుమ్మల

రాష్ట్ర చరిత్రలో మొదటిసారి 6 రోజుల్లోనే రైతు భరోసా సహాయం కోసం రూ.7,770.83 కోట్లు ఖర్చు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఇది చూసి బీఆర్ఎస్ నాయకులు కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. సాగుచేసే భూములకే రైతుభరోసా ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఓఆర్ఆర్ లోపలి భూములకు పథకాన్ని వర్తింపచేయడంలో ఆలస్యం జరిగిందని తెలిపారు.

ఎస్టీపీపీకి బెస్ట్ ఎన్విరాన్‌మెంటల్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకున్న డీజీఎం వీరబ్రహ్మం

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో కౌన్సిల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 4వ జాతీయ పవర్ జనరేషన్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025లో ఎస్టీపీపీ బెస్ట్ ఎన్విరాన్‌మెంటల్ ఎక్సలెన్స్ టీం ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది. సింగరేణి సంస్థ చేపడుతున్న పర్యావరణహిత చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డు అందుకున్నామని, భవిష్యత్‌లో సమర్థవంతంగా పర్యావరణహిత చర్యలతో ముందుకు సాగుతామని సంస్థ సీఎండీ బలరాం, డైరెక్టర్ సత్యనారాయణ రావు తెలిపారు.

ఎనీ ఎమర్జెన్సీ.. డయల్ 112

అన్ని రకాల అత్యవసర సేవలకూ ఒకటే టోల్‌ఫ్రీ నంబర్
- జీపీఎస్ ద్వారా బాధితుల లొకేషన్ ట్రాకింగ్
- బాధితులు ఉన్న చోటికే పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు

సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదమైనా.. రోడ్డు ప్రమాదమైనా.. వ్యక్తిగత భద్రతకు భంగం వాటిల్లినా.. అత్యవసరం ఏదైనా.. ఒక్కటే తారక మంత్రం.. అదే డయల్ 112. అత్యవసరంలో ఉన్న వారు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు సెల్ ఫోన్ లేదా ల్యాండ్ లైన్ ద్వారా సమాచారం ఇస్తే అవసరం మేరకు వారికి పోలీసు, అగ్నిమాపక, అంబులెన్స్ వంటి అత్యవసర సేవలను అందుబాటులోకి తెస్తామని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఈ సేవలు తెలంగాణలో అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్ కింద ఒక దేశం.. ఒకే అత్యవసర నంబర్‌గా 'డయల్ 112'ను నిర్ధారించినట్టు తెలిపారు.

ఇది 24×7 పనిచేస్తుంది...

పోలీసు సహాయం (నేరం, దొంగతనం, ప్రమాదాలు), అగ్నిమాపక అత్యవసర పరిస్థితులు, వైద్య అత్యవసర పరిస్థితులు, రోడ్డు ప్రమాదాలు, ఆపదలో ఉన్న మహిళలు/ పిల్లలు, ప్రకృతి వైపరీత్యాలు ఇలా ఏ అవసరంలో ఉన్నవారైనా డయల్ 112 ద్వారా సహాయం కోసం సమాచారం అందించవచ్చు. ఇది 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. బాధలో ఉన్న మహిళలు, పిల్లలకు అండగా నిలుస్తుంది. బాధితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను అత్యవసర ప్రతిస్పందన మద్దతు వ్యవస్థ (ఈఆర్ఎస్ఎస్) కాల్ సెంటర్ ద్వారా అనుసంధానం చేస్తారు. బాధితుల నుంచి ఫోన్ కాల్ వచ్చిన వెంటనే వారి లొకేషన్‌ను ట్రాక్ చేస్తారు. ఇది జీపీఎస్ ఆధారితంగా పని చేస్తుంది. బాధితుడి అవసరాన్ని బట్టి సమీపంలోని పోలీస్ పెట్రోలింగ్ వాహనం లేదా ఫైర్ టెండర్ లేదా అంబులెన్స్ పంపుతారు. అత్యవసర పరిస్థితి పరిష్కారమయ్యే వరకు డయల్ 112 అధికారులు పర్యవేక్షిస్తారు.

ఇతర మార్గాల్లోనూ ఫిర్యాదు

'112 ఇండియా'యాప్ ద్వారా కూడా ఈ అత్యవసర సేవలు పొందవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్ లేకపోయినా.. ఫోన్‌కాల్ చేసే అవకాశం లేకపోయినా.. ఆండ్రాయిడ్ ఫోన్లలో పవర్ బటన్‌ను వరుసగా మూడుసార్లు నొక్కినా... నేరుగా డయల్ 112కి ఫోన్‌కాల్ వెళ్తుంది. అలాగే, ఫీచర్ ఫోన్‌లలో 5 లేదా 9 ని ఎక్కువసేపు నొక్కి ఉంచినా 112 ఎమర్జెన్సీ సేవలకు కాల్ కనెక్ట్ అవుతుంది.




టుడేస్ గ్రాఫిక్

నిత్యం గంటల తరబడి నెట్టింట విహరించే మనోళ్లు.. సొంతంగా డిజిటల్ పనులను ఎంత మేరకు చక్కబెట్టుకోగలుగుతున్నారు? ఈ విషయంలో వారు ఎంత నమ్మకంగా ఉన్నారు? ఈ అంశంపై కేంద్ర గణాంక మంత్రిత్వశాఖ తాజాగా ఓ సర్వే చేపట్టింది. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్య దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో అధ్యయనం నిర్వహించింది. కాంప్రిహెన్సివ్ మాడ్యులర్ సర్వే: టెలికం–2025 పేరిట నిర్వహించిన ఈ సర్వేలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

డిజిటల్ కార్యకలాపాలు నిర్వహించడంలో భారతీయులు ఎంత నమ్మకంగా ఉన్నారు?

– సాక్షి, సెంట్రల్ డెస్క్

ఈ కింది డిజిటల్ టాస్కులు చేయగల 15 ఏళ్లు అంతకు పైబడిన భారతీయుల శాతం ఇలా..





అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైకోర్టు ఆవరణలో ఆసనాలు వేస్తున్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, ఇతర న్యాయమూర్తులు



యోగా ఆసనాలు చేస్తున్న కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్

యోగాతో సంపూర్ణ ఆరోగ్య జీవనం

కన్హాలో యోగా దినోత్సవంలో పాల్గొన్న కేంద్రమంత్రి వీరేంద్రకుమార్

నందిగామ: ప్రతిఒక్కరూ యోగాను అలవాటుగా మార్చుకోవాలని, దీనిద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కేంద్ర సామాజిక, న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో శనివారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. సమతుల జీవితం, సమగ్ర శ్రేయస్సుకు యోగా కేంద్ర బిందువుగా పనిచేస్తుందన్నారు. యోగా ద్వారా మన దేశం ప్రపంచానికి ఐక్యత, శాంతి, స్వీయ అవగాహన అనే సందేశాలను ఇచ్చిందని తెలిపారు. అనంతరం ఆశ్రమంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో 25 రాష్ట్రాలకు చెందిన 3,200 మంది దివ్యాంగులు, పలువురు అభ్యాసీలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల యోగాసనాలు

చిన్నశంకరంపేట(మెదక్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలో ఉపాధి కూలీలు తమ పని ప్రదేశంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆనంద్, ఈజీఎస్ ఏపీవో రాజేశ్వర్‌గౌడ్.. యోగావల్ల కలిగే ప్రయోజనాలను కూలీలకు వివరించారు.

విస్తృత ప్రచారంతోనే డ్రగ్స్ కట్టడి సాధ్యం: డీజీపీ జితేందర్

యాంటీ–డ్రగ్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: మత్తుపదార్థాల వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం కల్పించడం ద్వారానే డ్రగ్స్ కట్టడి సాధ్యమని డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. యువత భవిష్యత్తుకు పెను ముప్పుగా మారిన డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26న అంతర్జాతీయ డ్రగ్ డేను పురస్కరించుకుని శనివారం నుంచి టీజీ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో వివిధ ప్రభుత్వ విభాగాలతో కలసి యాంటీ–డ్రగ్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన యాంటీ–డ్రగ్ అవగాహన వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి డీజీపీ జితేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ కట్టడికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే చెడు ప్రభావాలను ప్రతి ఒక్కరు కనీసం పది మందికి తెలియజేయాలని, వారిని మరో పది మందికి ఈ విషయాలు వివరించేలా కోరాలని సూచించారు. ఈ విధంగా చేస్తేనే సమాచార వ్యాప్తి విస్తృతమవుతుందన్నారు. కార్యక్రమంలో టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్‌శాండిల్య, టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, హైదరాబాద్ కమిషనరేట్ శాంతిభద్రతల అడిషనల్ సీపీ విక్రంసింగ్ మాన్, టీజీఐసీసీసీ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, హైదరాబాద్ సిటీ అడ్మిన్ డీఐజీ పరిమల హన నూతన్, టీజీఏఎన్‌బీ డీఐజీ అభిషేక్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

టేకాఫ్‌కు ముందు సాంకేతిక సమస్య

భువనేశ్వర్ విమానం రద్దు

శంషాబాద్: మరికాసేపట్లో టేకాఫ్ తీసుకునేందుకు సిద్ధమైన విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించడంతో విమానం రద్దు అయింది. శనివారం ఉదయం 9.35 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి భువనేశ్వర్‌కు వెళ్లేందుకు అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 91779 విమానం సిద్ధమైంది. ప్రయాణికులు కూడా బోర్డింగ్ ప్రక్రియను పూర్తి చేసుకుని విమానంలో కూర్చున్నారు. మరికొద్ది క్షణాల్లో టేకాఫ్ తీసుకునేందుకు సిద్ధం కాగా పైలట్లు విమానంలో సాంకేతిక లోపం ఉన్నట్లు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. విమానాన్ని రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వేర్వేరు విమానాల్లో పంపినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

షిఫ్టింగ్.. ఫిట్టింగ్!

ఎస్సీ గురుకుల ఇంటర్ కాలేజీల్లో కొత్త పంచాయితీ
- కోర్సులను షిఫ్టు చేస్తూ సొసైటీ అనూహ్య నిర్ణయం
- కీలక జూనియర్ కాలేజీలు డెడికేటెడ్ కోర్సుకే పరిమితం
- దీంతో సెకండియర్ విద్యార్థుల షిఫ్టింగ్ అనివార్యం... కాలేజీ మారేది లేదంటూ విద్యార్థుల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని పలు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) కాలేజీల్లో అధికారులు తలపెట్టిన షిఫ్టింగ్ వ్యవహారం విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఒక కాలేజీలో చదివితే.. రెండో సంవత్సరం మరో కాలేజీకి బదిలీ చేయడం వారిలో గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఫస్టియర్‌లో ఒకచోట అలవాటు పడిన తర్వాత మరో కాలేజీకి మార్పు చేయడంతో బోధన, అభ్యాసన గాడి తప్పుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సొసైటీ పరిధిలో 39 సీఓఈ కాలేజీలున్నాయి. ప్రతి సీఓఈలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులున్నాయి. కొన్నిచోట్ల డిమాండ్‌కు తగినట్లుగా ఎంఈసీ, సీఈసీ కూడా ఉన్నాయి. తాజాగా ఈ కాలేజీలను ఏదైనా ఒక గ్రూపునకే పరిమితం చేస్తున్నారు. అంటే ఒక కాలేజీలో ఒక గ్రూప్‌లోనే విద్యార్థులను చేర్చుకుంటారు. సెకండియర్‌లోని ఇతర గ్రూప్ విద్యార్థులను మరో కాలేజీకి షిఫ్ట్ చేయడం... దీంతో ఖాళీ అయిన సెకండ్ ఇయర్ విద్యార్థుల స్థానంలో ఇతర కాలేజీలోని డెడికేటెడ్ గ్రూప్ విద్యార్థులను రప్పించడం జరుగుతోంది. దీంతో చాలా సీఓఈ కాలేజీలు ఒక్క కోర్సుకే పరిమితమయ్యాయి.

విద్యార్థుల్లో ఆగ్రహజ్వాలలు

సీఓఈ కాలేజీల్లో మెరిట్ ఉన్న విద్యార్థులకే ప్రాధాన్యం ఉంటుంది. ప్రవేశాల సమయంలో పదో తరగతి మెరిట్‌తో ఆయా కాలేజీలను ఎంపిక చేసుకుంటారు. అలా ఇష్టపడి ఎంపిక చేసుకున్న కాలేజీల నుంచి ఇప్పుడు సొసైటీ అధికారులు విద్యార్థులను షిఫ్ట్ చేస్తున్నారు. ఈ షిఫ్ట్ విధానంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలాదూరంలో ఉన్న కాలేజీలకు పంపడంపై మండిపడుతున్నారు. కరీంనగర్‌లోని సెకండియర్ విద్యార్థులను రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డి, చిల్కూర్, హైదరాబాద్, సికింద్రాబాద్ కాలేజీలకు షిఫ్ట్ చేశారు. దీంతో ఎక్కడివారిని అక్కడే కొనసాగించాలంటూ విద్యార్థులు సొసైటీ కార్యదర్శి కార్యాలయం ఎదుట ఆందోళనలు చేశారు.



సీఓఈ కాలేజీల్లోని విద్యార్థుల తరలింపు ఇలా...

- గౌలిదొడ్డి బాలుర జూనియర్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ ఉన్నాయి. ఈ కాలేజీలోని సెకండియర్ బైపీసీలోని 3 సెక్షన్లను చిల్కూరు బాలుర కాలేజీకి షిఫ్ట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా చిల్కూరులోని సెకండియర్ ఎంపీసీ ఒక సెక్షన్‌ను గౌలిదొడ్డికి షిఫ్ట్ చేశారు.
- కరీంనగర్ బాలుర కాలేజీలోని సెకండియర్ ఎంపీసీ ఒక సెక్షన్‌ను గౌలిదొడ్డి బాలుర కళాశాలకు తరలించారు. అదేవిధంగా ఇక్కడున్న సెకండియర్ బైపీసీ విద్యార్థులను చిల్కూరుకు పంపించారు.
- కరీంనగర్ బాలికల కాలేజీలోని సెకండియర్ బైపీసీని మహేంద్రహిల్స్ కాలేజీకి తరలించారు.
- గౌలిదొడ్డి బాలికల కాలేజీలోని సెకండియర్ బైపీసీ 3 సెక్షన్లను మహేంద్రహిల్స్ బాలికల కాలేజీకి, సెకండియర్ ఎంఈసీ రెండు సెక్షన్లను సరూర్‌నగర్ బాలికల కాలేజీకి పంపించారు.
- మహేంద్రహిల్స్ బాలికల కాలేజీలోని సెకండియర్ ఎంపీసీ ఒక సెక్షన్‌ను గౌలిదొడ్డికి షిఫ్ట్ చేశారు.
- ఫలక్‌నుమా బాలికల కాలేజీలోని రెండోసంవత్సరం ఎంపీసీ ఒక సెక్షన్ విద్యార్థులను నార్సింగి బాలికల కాలేజీకి పంపారు.
- సరూర్‌నగర్ బాలికల కాలేజీలోని సెకండియర్ ఎంపీసీ ఒక సెక్షన్ విద్యార్థులను నార్సింగి కాలేజీకి, బైపీసీ ఒక సెక్షన్ విద్యార్థులను ఫలక్‌నుమా కాలేజీకి తరలించారు.
- మేడ్చల్ బాలికల కాలేజీలోని సెకండియర్‌లోని ఎంఈసీ ఒక సెక్షన్, సీఈసీ ఒక సెక్షన్ విద్యార్థులను సరూర్‌నగర్ కాలేజీకి తరలించారు.

'కోర్'కూ మంచి అవకాశాలు

- విద్యార్థులు వాస్తవ పరిస్థితిని గమనించాలి
- సంప్రదాయ కోర్సులతో ఆధునిక సాంకేతికత మేళవింపు
- ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌పై జేఎన్‌టీయూహెచ్‌లో అవగాహన కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: వేలం వెర్రిగా ఎమర్జింగ్ కోర్సుల వైపు పరుగులు పెట్టే విద్యార్థులు మార్కెట్‌లో వాస్తవ పరిస్థితిని ఒక్కసారి గమనించాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సుల స్వరూపం మారుతోందని, భవిష్యత్‌లో వీటికి మంచి ఉపాధి అవకాశాలుంటాయని స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) నేతృత్వంలో 'టీఎస్ ఈఏపీసెట్–2025'అవగాహన సదస్సు శనివారం హైదరాబాద్‌లో జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌పై అధికారులు అవగాహన కల్పించారు. ఎక్కువ మంది కంప్యూటర్ కోర్సులే చేయడం, అందులో నైపుణ్యం కొరవడటం, ఉద్యోగాల్లో తీవ్రమైన పోటీ.. ఇలాంటి సమస్యలను పరిగణనలోనికి తీసుకోవాలని సూచించారు.

ఆప్షన్లు ఇచ్చే ముందే ఆలోచించాలి

కౌన్సెలింగ్‌కు ఆప్షన్లు ఇచ్చే ముందే ప్రతి విద్యార్థి ఇంజనీరింగ్ బ్రాంచీలపై అధ్యయనం చేయాలని జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి సూచించారు. నూతన సాంకేతిక పరిణామాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఏఐ, వివిధ పరిశ్రమల్లో వస్తున్న మార్పులను గుర్తించాలని, కోర్ గ్రూపుల్లో చేరినా ఏఐ వంటి సమ్మిళిత ఉద్యోగాలు సాధించే వీలుందని తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వి.బాలకిష్టారెడ్డి, టి. కిషన్‌కుమార్‌రెడ్డి తదితరులు

మార్పులను తెలుసుకోండి

కంప్యూటర్ గ్రూపులకే కాకుండా కోర్ గ్రూపులకూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో డిమాండ్ పెరుగుతోందని జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ డాక్టర్ కె.విజయకుమార్ రెడ్డి చెప్పారు. సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లోనూ ఏఐ టెక్నాలజీ బోధన ప్రణాళిక అందుబాటులోకి వచ్చిందని, కోర్సుల నిర్వహణ పూర్తిగా మారిందని తెలిపారు. ఈసీఈ, సీఎస్ఈ, బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచీలకు కూడా మంచి భవిష్యత్ ఉందని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు.

భిన్నంగా ఆలోచించాలి: ఉన్నత విద్యా మండలి చైర్మన్

'నౌకాశ్రయ రంగంలోకి భారీ పెట్టుబడులు వస్తున్నాయి. ఈ రంగంలో 20 లక్షల ఉద్యోగాలకు అవకాశం ఉంది. మన దేశంలో 800 విమానాలు, 100 కొత్త విమానాశ్రయాలు వచ్చే వీలుంది. కానీ సంబంధిత కోర్సులను విద్యార్థులు విస్మరిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ఎక్కువ ప్రవేశాలు, తక్కువ ఉపాధి అవకాశాలు ఉంటున్నాయి. భిన్నమైన ఆలోచన ధోరణి కొరవడటమే ఈ పరిస్థితి కారణం..'అని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి చెప్పారు. ఉద్యోగాల కోసం వెతుక్కోవడం కాకుండా.. ఉద్యోగాలు తెచ్చే నైపుణ్యం గురించి యువత ఆలోచించాలని సూచించారు. ఇప్పుడు అన్ని బ్రాంచీలూ సమానమేనని, కేవలం కంప్యూటర్ కోర్సుల వైపే యువత పరుగులు పెట్టడం అవగాహన రాహిత్యమని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ పేర్కొన్నారు.

ఎడ్‌సెట్-2025 ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్–2025 పరీక్ష ఫలితాలను శనివారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి ఎడ్‌సెట్–2025 చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఎడ్‌సెట్–2025 నోటిఫికేషన్ ఈ ఏడాది మార్చి 10న విడుదల కాగా... జూన్ 1న రెండు సెషన్లలో సీబీటీ పద్ధతిలో అర్హత పరీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 15 నగరాల్లో 74 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా.. 38,754 మంది అభ్యర్థులకు 32,106 మంది పరీక్ష రాశారు. వీరిలో 30,944 మంది అర్హత సాధించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

యూరియా ఉత్పత్తి షురూ

- ఆర్ఎఫ్‌సీఎల్‌లో తిరిగి ప్రారంభమైన ఉత్పత్తి
- రాష్ట్రానికి, రైతులకు ఊరట
- 38రోజులుగా కొనసాగిన షట్‌డౌన్ పనులు
- మరోపక్క జోరుగా ఖరీఫ్ సీజన్ పనులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): తెలంగాణ రాష్ట్రంలోని రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం ప్లాంట్ రోజుకి 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియాను ఉత్పత్తి చేస్తుంది. తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేయాలని కేంద్ర ఎరువులు రసాయనాల శాఖ లక్ష్యాన్ని విధించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 11,94,921.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేశారు. కర్మాగారంలో వార్షిక మరమ్మతుల కారణంగా మే నెల 6న ప్లాంటును షట్‌డౌన్ చేశారు. దీంతో కర్మాగారంలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తి కావడానికి 38 రోజుల సమయం పట్టింది. ప్లాంట్ వార్షిక మరమ్మతుల అనంతరం జూన్ 13వ తేదీన ప్లాంట్‌ను పునరుద్ధరించారు. సోమవారం కర్మాగారంలో యూరియా ఉత్పత్తి ప్రారంభమైంది. సీజన్‌కు ముందు ప్లాంట్ షట్‌డౌన్ చేయడంతో ఖరీఫ్ రైతులపై ప్రభావం పడింది. జిల్లాల వారీగా ఉన్న బఫర్ స్టాక్‌పైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు రసాయనాల శాఖపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఒత్తిడి తెస్తున్నారు.



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం

2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రాష్ట్రాలకు కేటాయించిన యూరియా

ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 11,94,921.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పతి చేశారు. రాష్ట్రాల వారీగా వివరాలిలా ఉన్నాయి..

తెలంగాణ	4,68,954.76 మెట్రిక్ టన్నులు
ఆంధ్రప్రదేశ్	1,78,363.39 మెట్రిక్ టన్నులు
కర్ణాటక	1,91,288.07 మెట్రిక్ టన్నులు
మహారాష్ట్ర	82,986.39 మెట్రిక్ టన్నులు
ఛత్తీస్‌గఢ్	60,640.38 మెట్రిక్ టన్నులు
తమిళనాడు	1,01,520.99మెట్రిక్ టన్నులు
మధ్యప్రదేశ్	1,11,167.19 మెట్రిక్ టన్నులు

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి ఇలా..

ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో ఏప్రిల్‌లో 1,08,006.93 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరిగింది. ఆయా రాష్ట్రాలకు కేటాయింపులు ఇలా ఉన్నాయి..

తెలంగాణ	39,852.27 మెట్రిక్ టన్నులు
ఆంధ్రప్రదేశ్	21,120.12 మెట్రిక్ టన్నులు
కర్ణాటక	19,450.71 మెట్రిక్ టన్నులు
మహారాష్ట్ర	9,051.48 మెట్రిక్ టన్నులు
ఛత్తీస్‌గఢ్	5,259.06 మెట్రిక్ టన్నులు
తమిళనాడు	7,837.64 మెట్రిక్ టన్నులు
మధ్యప్రదేశ్	5,435.64 మెట్రిక్ టన్నులు

ప్రారంభమైన ఖరీఫ్ సీజన్ పనులు

తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో రాష్ట్రానికి చేరుకోవడంతో చిరుజల్లులు కురిశాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. జూన్ చివరి నాటికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలలో వరి నాట్లు ప్రారంభమవుతాయి. రైతులకు యూరియా డిమాండ్ అధికంగా ఉంటుంది. రామగుండం ఎరువుల కర్మాగారంలో మరో వారం రోజులలో రేక్ ద్వారా ఉమ్మడి జిల్లాలకు యూరియా సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మరమ్మతులతో ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత

రామగుండం ఎరువుల కర్మాగారంలో వార్షిక మరమ్మతులు పూర్తి కావడానికి 38 రోజుల సమయం పట్టింది. ఖరీఫ్ సీజన్‌కు ముందు ప్లాంట్ వార్షిక మరమ్మత్తులతో షట్‌డౌన్ చేయడంతో యూరియా ఉత్పత్తికి భారీగా అంతరాయం ఏర్పడింది. తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాలపై ప్రభావం పడింది. తెలంగాణ రాష్ట్రానికి రబీ సీజన్‌కు కేంద్ర ఎరువులు రసాయనాల శాఖ 9.80 లక్షల యూరియాను కేటాయించింది. అందులో ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నుండి 4.68 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశారు. ప్రస్తుత కర్మాగారంలో ఉత్పత్తి అయిన యూరియాను రాష్ట్రానికి కేటాయించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ కేంద్ర ఎరువులు రసాయనాల శాఖపై ఒత్తిడి తెస్తుంది.

కౌశిక్‌రెడ్డిది బ్లాక్‌మెయిల్ చరిత్ర: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిది బ్లాక్‌మెయిల్ చరిత్ర అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వ్యాఖ్యానించారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసిన కౌశిక్ రెడ్డి స్టోన్ క్రషర్ యజమానులను డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేశాడని, వాళ్లు పెట్టిన కేసులో అరెస్టు చేశారని తెలిపారు. ఇలాంటి దొంగకి మద్దతివ్వడానికి, ఆయన అరెస్టును ఖండించడానికి కేటీఆర్, హరీశ్‌రావులకు సిగ్గుండాలని దుయ్యబట్టారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్‌ట్యాపింగ్ దొంగలను ఇతర దేశాలకు పంపినట్టు కౌశిక్‌రెడ్డిని కూడా దేశం దాటించాలని ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ప్రజలను కోకొల్లలుగా కౌశిక్‌రెడ్డి మోసం చేశాడని, ఇలాంటి వ్యక్తినా తమ ఎమ్మెల్యే అని హుజూరాబాద్ ప్రజలు బాధపడుతున్నారని వెంకట్ తెలిపారు.

‘దాసోజు’ రాజకీయ అజ్ఞాని

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ రాజకీయ అజ్ఞాని అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్వీ సుభాష్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాజకీయాల్లో ఆయన ఒక ఐరన్‌లెగ్ అని వ్యాఖ్యానించారు. శ్రవణ్ ఏ పార్టీలో చేరితే.. ఆ పార్టీ అధికారానికి దూరమైపోతుందని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను తిడితే పెద్ద నేత అయిపోతాననుకోవడం దాసోజు మూర్ఖత్వమని పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద దాసోజుకు గ్రూప్–1 అభ్యర్థులు చేసిన సత్కారం గుర్తు తెచ్చుకుంటే మంచిదని సూచించారు. నిత్యం పార్టీలు మారుతూ ఏ రోటికాడ పాట ఆ రోటికాడ పాడే నైజం ఆయనదని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి ప్రెస్‌మీట్ పెట్టి నాలుగు ముక్కలు ఇంగ్లిష్‌లో మాట్లాడితే.. ప్రజలంతా తమను నమ్ముతారని భావించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు.

జ్యోతిబా పూలేకు భారతరత్న ప్రతిపాదించండి

సీఎంకు మాజీ ఎంపీ వీహెచ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: భారతరత్న పురస్కారానికి మహాత్మా జ్యోతిబా పూలేను ప్రతిపాదించాలని, ఇందుకోసం కేంద్రంతో మాట్లాడాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి శనివారం ఆయన లేఖ రాశారు. దీంతో పాటు రాష్ట్రంలో సావిత్రీ బాయి పూలే పేరిట విశ్వవిద్యాలయం, కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. మహాత్మా జ్యోతిబా పూలే సినిమాను మండల స్థాయిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చూపించాలని, పన్ను రాయితీ కల్పించాలని కూడా ఆ లేఖలో మాజీ ఎంపీ వీహెచ్ కోరారు.

గిరులు.. సంప్రదాయాల సిరులు

- గిరిజన గ్రామాల్లో వన భోజనాల సందడి
- ప్రకృతి ఒడిలో ఆత్మీయులతో సహపంక్తి భోజనాలు
- అడవిలో రోజంతా ఆటపాటలు, ముచ్చట్లు నిలుస్తున్నాయి. అక్కడి



కరకగూడెం: గిరిజన గ్రామాల ప్రజల జీవితం ప్రకృతి, సంప్రదాయాలు, ఆచారాలతో ముడిపడి ఉంటోంది. ఏటా వానాకాలం ఆరంభానికి ముందు నిర్వహించే వన భోజనాలు గిరిజనుల నమ్మకాలు, ఆశలు, ప్రకృతిపై భక్తిని చాటిచెబుతాయి. వర్షాకాలం ప్రారంభమయ్యే ముందు.. గిరిజన గ్రామాల్లో బోనాల పండుగ నిర్వహించి గ్రామ దేవతలను పూజిస్తారు. ఆపై బోనాల సందడి మొదలవుతుంది.

భోజనాలు.. ఆటపాటల సందడి

వన భోజనాలకు వెళ్లినప్పుడు, ప్రతీ కుటుంబం తమ వంతు ఆహార పదార్థాలు తీసుకెళ్తారు. కొందరు అక్కడే వంటలు చేసుకుంటారు. ఆతర్వాత ఒకేచోట కూర్చుని సహపంక్తి భోజనం చేస్తారు. ఆపై పెద్దలు కబుర్లు చెప్పుకుంటూ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటారు. ఇక పిల్లాపాపలు ఆటపాటలతో సందడి చేస్తారు.



వనంలోకి వెళ్లి పూజలు..

బోనాల పండుగ ముగిశాక గిరిజనులు వన భోజనాలకు బయలుదేరుతారు. నిర్ణీత రోజు.. ఊరంతా కలిసి సామూహికంగా సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్తారు. వన భోజనాలు అంటే కేవలం భోజనం చేయడమే కాక.. ప్రత్యేకించి వృక్షాలు, ప్రకృతికి పూజలు నిర్వహిస్తారు. అక్కడి వేపచెట్టు, రావిచెట్ల మొదట్లో అటవీ దేవతలను ప్రతిష్ఠిస్తారు. వాటికి పూజలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ క్రతువు ద్వారా వారు భూమి, వర్షం, అటవీ సంపదకు కృతజ్ఞతలు చెబుతారు.

పాడిపంటల కోసం ప్రార్థన



బోనాలు, వన భోజనాల వెనుక ప్రధాన ఉద్దేశం పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రకృతి, దైవాలను వేడుకోవడమే. గిరిజనుల జీవనం పూర్తిగా వ్యవసాయం, అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి ఉంటుంది. వర్షాలు సరిగ్గా కురవకపోతే వారికి ఇక్కట్లు ఎదురవుతాయి. అందుకే ఏటా వానాకాలం ప్రారంభానికి ముందు పంటలు సమృద్ధిగా పండాలని, పాడి పెరగాలని ప్రకృతి దేవతలను ప్రసన్నం చేసుకునేలా పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

మా కాలంలో వేరు..



“ మా కాలంలో టీవీలు, ఫోన్లు లేవు. వనభోజనాలంటే సరదాగా ఉండేది. వానలు బాగా పడి పంటలు పండాలని గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి ఆ తర్వాత అడవికి వెళ్తాం. తొలుత ఉమ్మడిగా కలిసి కుండల్లో వంటకాలు సిద్ధం చేసుకునేవాళ్లం.

– పోలెబోయిన రామచంద్రయ్య, వెంకటాపురం

“

బంధాలను కలిపే పండుగ..



వన భోజనాలు అనగానే.. ఉదయమే సామగ్రి సర్దుకుని వెళ్తాం. పచ్చని చెట్ల కింద రోజంతా బంధువులతో గడపడం ఆనందంగా ఉంటుంది. అమ్మాయిలం కోలాటం ఆడుతూ పాడతాం. ఇది మా మధ్య బంధాన్ని మరింత పెంచుతుంది. – ఈసం అమృత, పద్మాపురం

ప్రకృతికి కృతజ్ఞతలు చెప్పడానికి..



వన భోజనాలంటే మాకు ఊరు పండుగ. వానలు పడాలి, పంటలు బాగా పండాలని దేవుడిని మొక్కుకుని ప్రకృతికి కృతజ్ఞతలు చెబుతాం. ఇదంతా వేడుక మాదిరి సాగుతుంది. మా తాత, తండ్రి తర్వాత వారసత్వంగా ఏటా కొనసాగిస్తున్నాం.

– చందా రామకృష్ణ, చిరుమళ్ల

దివ్యమైన దిగుడు మెట్లబావి

- 40 అడుగుల లోతు దీర్ఘచతురస్రాకారంలో నిర్మాణం
- బావి అంచుల మీద సుందరమైన స్తంభాల పందిరి
- బావిలోపల ఎక్కడా లేని గజ వినాయకుడి శిల్పం
- అభివృద్ధి చేస్తే పర్యాటకుల సందడి


తుర్కపల్లిలోని మెట్లబావి స్తంభాల పందిరి

సాక్షి, యాదాద్రి: అద్భుతమైన కట్టడాలకు నిలయమైన యాదాద్రి భువనగిరి జిల్లాలో దిగుడు మెట్ల బావుల చారిత్రక నేపథ్యం ఆసక్తి కలిగిస్తోంది. అద్భుతమైన శిల్ప సంపదతో మెట్ల బావుల ఆనవాళ్లు ఆకర్షిస్తున్నాయి. దీనిపై పాలకులు దృష్టి సారించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం కేంద్రంలో అద్భుతమైన మెట్లబావి నిర్మాణం ఉంది. ‘లంబడోళ్ళ బావి’గా పిలిచే ఈ బావి ఊరికి నైరుతిలో భువనగిరి రోడ్డుకు దగ్గరలో పడమటి వైపున ఉంది. ఈ బావిని ఒకసారే కట్టినట్లుగా లేదు. మొదట ఈ బావిని తవ్వించాక తర్వాత దానిచుట్టూ ప్రాకారం చాలా అందంగా కట్టారు. 30 నుంచి 40 అడుగుల లోతున్న ఈ బావి దీర్ఘచతురస్రాకారంలో ఉంది. బావి తిన్నెలమీద రాతి స్తంభాలతో కట్టిన వరండాలున్నాయి. పైన పరిచిన రాతి దూలాలు, వాటి మీద శిల్పాలు, బావి లోనికి దిగడానికి మూడు వైపుల నుంచి దిగుడుమెట్లు ఏర్పాటు చేశారు. ఉత్తరం మెట్లు మొదటి అంతస్తుకు, దక్షిణం మెట్లు బావి అంచుకు, తూర్పు మెట్లు మొత్తం బావిలోకి కట్టి ఉన్నాయి.

ఏపుగా పెరిగిన కంప చెట్లు

ఎంతో విలువైన చారిత్రక సంపద కంపచెట్ల మధ్యన కనుమరుగవుతోంది. గతంలో కొత్త తెలంగాణ చారిత్రక పరిశోధక బృందం ప్రతినిధి శ్రీరామోజు హరగోపాల్ స్థానికుల సహకారంతో కంపచెట్లను తొలగించి బావి చరిత్రను వెలికి తీశారు. కానీ, మళ్లీ ఎవరూ దాన్ని పట్టించుకోలేదు. యాదగిరిగుట్ట–హైదరాబాద్ మార్గంలో తుర్కపల్లి వద్ద గల ఈ దిగుడుబావిని ప్రభుత్వం అభివృద్ధి చేస్తే పర్యాటకులకు కనువిందు చేసినట్లే.

అద్భుతమైన స్తంభాల పందిరి

బావి అంచులమీద కట్టిన ఈ స్తంభాల పందిరి రాతి దూలాల మీద ఏనుగులు, గుర్రాలు, సింహాలు, ఆవుల చిత్రాలను చెక్కారు. తూర్పునుంచి లోపలికి దిగుతున్నప్పుడు కూడా దక్షిణం రాతిగోడల మీద ఆవు–దూడల వరుస వెనక కాపరి శిల్పాలు ఉన్నాయి. మధ్య రాతి దూలాల మీద తూర్పు ముఖంగా చెక్కిఉన్న తిరునామాలు, ఇరువైపులా చక్రశంఖాలు వాటికి ఇరువైపులా కుండలు, దక్షిణం వైపు హనుమంతుడు, పూజారి, ఉత్తరం వైపు గరుత్మంతుడిని చెక్కారు. ఇంకో రాతి దూలం మీద రెండు కోతులు, రెండు హంసలు చెక్కి ఉన్నాయి. మరో రాతి దూలం మీద శృంగార శిల్పాలున్నాయి. చల్లచేసే గొల్లభామ మీద చేతులేసిన పురుషుడు (కృష్ణమూర్తేమో), అతని వెనక ఒక భామ, దాని వెనక ప్రత్యేకంగా శృంగార భంగిమ, ఆవలివైపు పురుషుల సందడి శిల్పాలు కనువిందు చేస్తాయి. ఈ బావిలోని శిల్పాలు రాష్ట్ర కూటుల కాలం నాటివని పరిశోధకులు చెబుతున్నారు. 300 సంవత్సరాల లోపలివే. నైజాం పాలనా కాలంనాటివే అయినప్పటికీ అవి ఏ నిజాం రాజు కాలం నాటివన్నది పురావస్తు శాఖ పరిశోధనలో తెలియాల్సి ఉంది.

బావిలో గజ వినాయకుడు

ఈ ప్రాంతంలో ఎక్కడా కనపడని గజ వినాయకుడి శిల్పం బావికి పడమటివైపు అంచున రాతిగుండుకు చెక్కారు. ఈ ప్రాంతమంతటా బాదామి చాళుక్యుల నుంచి కాకతీయులు ఆలయాలలో ఎక్కడైనా గుళ్లలో గర్భగుడుల ద్వారాలపై లలాటబింబాలుగా గజలక్ష్మిలను చెక్కారు. ఇక్కడ గుళ్లలో కనిపించే వినాయకులలో గజాలు ఆరాధిస్తున్న వినాయకుడిని ఈ మెట్లబావిలో చెక్కారు. ఉత్తరం వైపు బావి అంచున చేపలను చెక్కారు. అదే వైపు పైనున్న రాతి దూలం మీద ‘మత్స్య మిథునం’చెక్కి వుంది. తూర్పు నుంచి లోపలికి దిగే మెట్లు పూర్తయ్యే చోట రాతి ఆర్చి ఉంది. దాని మీదున్న చిహ్నం ‘నైజాం రాజ్యలాంఛనం’రూమీ టోపిలాగా ఉంది. ఈ చిహ్నాన్ని బావిలోని రెండు ఆర్చీల మీద చెక్కించారు. ఇది అరుదైనది.


చెట్లమధ్య మూసుకుపోయిన మెట్లబావి


శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నటి దివి


అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో యోగాసనాలు వేస్తున్న లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్త బి.ఎస్.జగ్జీవన్ కుమార్

క్లుప్తంగా...

ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై చర్య తీసుకోవాలి

సాక్షి, అమరావతి: ఈ నెల 16వ తేదీన కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం డాణాపురం సభలో దళిత సర్పంచ్‌ను ఎమ్మెల్యే పార్థసారథి అవమానించడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తప్పుబట్టారు. ప్రొటోకాల్ ప్రకారం సర్పంచ్‌ను ప్రభుత్వ కార్యక్రమంలో ఆహ్వానించకుండా, కులం, మతం ప్రాతిపదికగా వేదికపైకి పిలవాలా? వద్దా? అని నిర్ణయించడం సరికాదన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పార్థసారథి రాజ్యాంగంపై చేసిన ప్రమాణానికి మచ్చతేచ్చేలా వ్యవహరించారన్నారు. ఈ వ్యవహారంపై విమర్శలు వెల్లువెత్తడంతో ఎమ్మెల్యే చెప్పిన క్షమాపణలోనూ చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలని శ్రీనివాసరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు.

ముందు హంద్రీనీవా, వంశధార ప్రాజెక్టులు పూర్తి చేయాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

సాక్షి, హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టు కంటే ముందు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా, వంశధార లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పర అభ్యంతరాలు లేకుండా ప్రాజెక్టులు కట్టుకుంటే మంచిదని శనివారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో తెలిపారు. కేంద్రంతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. వెనకబడిన ప్రాంతాలకు నీరు అందేలా రెండు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్రం సహాయం తీసుకోవాలన్న రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు నారాయణ చెప్పారు.

బాబూ..మీకు గిరిజన విద్యార్థులంటే అంత అలుసా?

జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

సాక్షి, అమరావతి: గిరిజన విద్యార్థులు మీకంత అలుసుగా కనిపిస్తున్నారా? మీ పబ్లిసిటీ కోసం వారిని ఇబ్బందులకు గురిచేస్తారా? అంటూ సీఎం చంద్రబాబుపై ఏపీ గిరిజన సహకార సంస్థ(జీసీసీ) మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. విశాఖలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన యోగా కార్యక్రమానికి గిరిజన విద్యార్థులను పెద్ద సంఖ్యలో తరలించి వారికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. గిన్నిస్‌బుక్ రికార్డు పేరుతో హంగు ఆర్భాటంతో నిర్వహించిన పబ్లిసిటీ స్టంట్‌కు రూ.300 కోట్లు ప్రజాధనాన్ని దుబారా చేయడం దారుణమన్నారు. అంత ఖర్చుపెట్టినా గిరిజన విద్యార్థులకు వసతులు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇటువంటి పబ్లిసిటీ స్టంట్‌లు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

నేడు శ్రీవారి దర్శించుకోనున్న అజిత్ దోవల్

తిరుమల: భారత జాతీయ రక్షణ శాఖ సలహాదారు అజిత్ దోవల్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. శనివారం రాత్రి తిరుమల చేరుకున్న ఆయనకు టీటీడీ ఉన్నతాధికారులు పద్మావతి అతిథి గృహం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు.

కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఆగమేఘాలపై చేపడుతున్న హంద్రీ–నీవా లైనింగ్ పనులు తెలుగు తమ్ముళ్లకు ఆదాయ వనరుగా మారాయి. తమకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నా సీఎం చంద్రబాబు నిధుల పందేరానికి తెరలేపారు. అసలు లైనింగే వద్దంటుంటే ఆపై నాసిరకంగా పనులు చేస్తూ రూ. కోట్లు కొట్టేస్తున్నారు.



పంపనూరు వద్ద కార్మికులతో లైనింగ్ పనులు చేపడుతున్న దృశ్యం

నాణ్యతకు తూట్లు.. జేబుల్లోకి కోట్లు

- నాసిరకంగా హంద్రీ-నీవా లైనింగ్
- ఇష్టారాజ్యంగా పనులు
- అప్పుడే పలుచోట్ల కంకర తేలిన వైనం
- రైతులు వ్యతిరేకిస్తున్నా లైనింగ్‌కు తెరలేపిన బాబు సర్కారు
- కాంట్రాక్టర్లందరూ టీడీపీ నేతలే

సాక్షి ప్రతినిధి, అనంతపురం/ఆత్మకూరు: కరువు పీడిత రాయలసీమను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో దివంగత నేత వైఎస్సార్ హంద్రీ–నీవా ప్రాజెక్టును చేపట్టి దాదాపు 90 శాతం పనులను తన హయాంలోనే పూర్తి చేయించారు. కాలువలో జలాలు పారడంతో ఆ మార్గంలోని భూముల్లో నీటి లభ్యత పెరిగి బోరు బావుల్లో నీరు సమృద్ధిగా లభించేవి. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ హంద్రీ–నీవా కాలువ సామర్థ్యాన్ని 83 టీఎంసీలకు పెంచుతూ అనుమతులు ఇచ్చారు. కానీ ఎన్నికల కోడ్ వచ్చే సరికి ఆ పనులు ముందుకు సాగలేదు.

నాసిరకంగా పనులు..

కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పానికి కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు కాలువ లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. లైనింగ్ వల్ల బోరు బావుల్లో నీటి లభ్యత తగ్గి భూములు బీళ్లుగా మారే అవకాశం ఉంది. ఈ క్రమంలో లైనింగ్ చేయకూడదని ఒక వైపు రైతులు వాపోతుంటే... కూటమి ప్రభుత్వం మాత్రం 'తమ్ముళ్ల' జేబులు నింపడానికి పనులకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 183 కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన పనులను 7 ప్యాకేజీలుగా విభజించింది. 1 నుంచి 5వ ప్యాకేజీ వరకు రూ.936.70 కోట్లు, 6,7 ప్యాకేజీలకు రూ.319 కోట్ల ఖర్చుతో పనులు అప్పగించింది. 1,2,3 ప్యాకేజీలు ఆర్‌వీఆర్ కంపెనీ, 4,5 ప్యాకేజీలు బీఎస్ఆర్ కంపెనీ, 6,7 ప్యాకేజీల పనులు ఎస్ఆర్‌సీ కంపెనీ వాళ్లు దక్కించుకున్నారు.



కాలువ పక్కన అటవీ ప్రాంతంలో కొండను తవ్వి కంకరకు రాళ్లు తీసిన దృశ్యం

ఇష్టారాజ్యంగా పనులు..

హంద్రీ–నీవా లైనింగ్ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. సిమెంట్ తక్కువగా వేయడంతో అప్పుడే ఇసుక, కంకర తేలి కనిపిస్తోంది. పూర్తిగా మిషన్లతో పనులు చేపట్టాల్సి ఉన్నా.. దీనికి విరుద్ధంగా కార్మికులతో చేయిస్తున్నారు. ఇక.. లైనింగ్ పనులకు కాంక్రీట్ వేయాలంటే కంకర తప్పనిసరిగా ఉండాలి. కానీ ఆత్మకూరు మండలంలోని పంపనూరు తండా గ్రామం వద్ద హంద్రీ–నీవా కాలువ పక్కనే మొబైల్ క్రషర్ ఏర్పాటు చేసి కాలువలో ఉన్న రాళ్లతో పాటు పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోని కొండ నుంచి రాళ్లను తరలించి కంకర మిషన్‌లోకి వేస్తున్నట్లు తెలిసింది. దీనికితోడు మొబైల్ క్రషర్‌కు అధికారులు అనుమతి ఇచ్చారా అనేది కూడా తెలియడం లేదు. కొండలోని రాళ్లను ఎలా కంకరగా తయారు చేసి వినియోగిస్తారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.



నాసిరకంగా లైనింగ్ వేయడంతో కంకర తేలిన దృశ్యం

జేబులు నింపుకోవడానికే..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించ తలపెట్టిన గండికోట– గాలేరు నగరి, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు బ్రాంచ్‌కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపడితే హంద్రీ–నీవా లైనింగ్‌తో పనే ఉండదు. అయినా.. ఆ ప్రాజెక్టులను రద్దు చేసి కేవలం తమ్ముళ్ల జేబులు నింపడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి. హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయకుండా, పిల్ల కాలువలు ఏర్పాటు చేసి నీరు ఇవ్వకుండా లైనింగ్ పనులకు తెరలేపిన చంద్రబాబు ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తమకు అన్యాయం చేస్తూ ఎవరి జేబులు నింపడానికి ఇలా చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో తమకు కష్టాలు తప్పవేమో అంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూమి బీడుగా మారుతుంది



నాకు కాలువ పక్కన ఐదెకరాల పొలం ఉంది. ప్రస్తుతం రెండు బోర్లు వేసి పంట సాగు చేస్తున్నా. కాలువకు లైనింగ్ వేస్తే భూమి లోపలికి నీరు ఇంకే అవకాశం ఉండదు. బోర్లు ఎండిపోతాయని భయంగా ఉంది. గతంలో పంటలు పండక వలస వెళ్లేవాళ్లం. వైఎస్సార్ చలువతో కాలువ నీటితో పంటలు పండించుకుంటున్నాం. చంద్రబాబు లైనింగ్ వేసి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు.

– వెంకట నాయక్, పంపనూరు తండా, ఆత్మకూరు మండలం

మళ్లీ వలసలు తప్పవేమో?



గతంలో సాగునీరు లేక వలసలు వెళ్లేవాళ్లం. వైఎస్సార్ పుణ్యమా అని నీరు వచ్చాక ఉన్న ఊర్లోనే వ్యవసాయం చేసుకుంటున్నాం. తాజాగా కాలువకు లైనింగ్ వేస్తున్నారు. లైనింగ్ వేస్తే బోర్లలో నీటి లభ్యత తగ్గుతుంది. ఈ క్రమంలో మళ్లీ వలసలు తప్పవేమో అని భయమేస్తోంది.

– పోలన్న, సింగంపల్లి, ఆత్మకూరు మండలం

రైతులకు అన్యాయం



మా గ్రామస్తులంతా దాదాపు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నాం. మాకు పంటల సాగు తప్ప ఇంకేమీ తెలియదు. ఇప్పుడు బోర్లు ఎండిపోతే పంటలు పండవు. రైతులకు అన్యాయం చేయడానికే చంద్రబాబు ప్రభుత్వం కాలువకు కాంక్రీట్ వేస్తోంది.

– మన్నల లక్ష్మిదేవి, సింగంపల్లి, ఆత్మకూరు మండలం

విభిన్నంగా ఆలోచించేవారు ఏ రంగంలోనైనా రాణిస్తారు. ధైర్యంగా చొరవతో అడుగేసేవారు విజయతీరానికి చేరుతారు. రసాయన ఎరువులకు స్వస్తి పలుకుతూ ప్రకృతి వ్యవసాయ బాటలో నడుస్తూ లాభాలు ఆర్జించవచ్చు. సేంద్రియ పద్ధతుల్లో డ్రాగన్ ఫ్రూట్ పండ్లు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఎ.కోడూరుకు చెందిన రైతు లెక్కల కోటేశ్వరరావు.





సేంద్రియ బాటలో డ్రాగన్ సిరులు

- అనకాపల్లి జిల్లా ఎ.కోడూరులో ఐదెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు
- స్థానికంగానే మంచి డిమాండ్
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు కోటేశ్వరరావు

కె.కోటపాడు: అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో ఐదెకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్ సాగును రైతు కోటేశ్వరరావు మూడేళ్ల క్రితం ప్రారంభించారు. మొదటి ఏడాది సాగు ప్రారంభంలో దుక్కులు, డ్రాగన్ మొక్కల కొనుగోలు, సిమెంట్ స్తంభాలు, వైర్లుతో పాటు ఇతర కూలి ఖర్చులకు ఎకరానికి రూ.6 లక్షల నుంచి రూ.7లక్షల వరకూ ఖర్చు అవుతుంది. 8 నుంచి 12 నెలల మధ్య పంట చేతికొస్తుంది. ప్రతి ఏడాది డ్రాగన్ ఫ్రూట్ పంట దిగుబడి జూన్‌లో ప్రారంభమై నవంబర్ వరకూ ఉంటుంది. మొదటి ఏడాది 5 ఎకరాల్లోను 3 టన్నుల దిగుబడి, రెండో ఏడాది 15 టన్నుల దిగుబడి వచ్చిందని రైతు కోటేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది చెట్లకు డ్రాగన్ ఫ్రూట్ కాపు బాగుండడంతో 35 టన్నుల వరకూ దిగుబడి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలకు జీవామృతంతో ఊపిరి

కోటేశ్వరరావు సేంద్రియ విధానంలో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో మంచి డిమాండ్, మద్దతు ధర పలుకుతోంది. ఆవు పేడ, కోడి గెత్తంను డ్రాగన్ ఫ్రూట్ మొక్కల మొదళ్ల వద్ద వేయడంతో మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతున్నాయి. గోమూత్రం, బెల్లం, శనగపిండి, ఆవు పేడ, పుట్టమన్నును వారం రోజుల పాటు నిల్వ ఉంచి తయారు చేసిన జీవామృతంను డ్రిప్ విధానం ద్వారా డ్రాగన్ ఫ్రూట్ మొక్కలకు అందిస్తున్నారు. తద్వారా పంటకు తెగుళ్ల బెడద తప్పింది. రసాయన ఎరువులకయ్యే ఖర్చు చాలా వరకు తగ్గింది.



పంటకు అందించేందుకు సిద్ధంగా ఉన్న సేంద్రియ ఎరువు



ఎ.కోడూరులో సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ పంట

స్థానికంగానే అమ్మకాలు

డ్రాగన్ ఫ్రూట్ ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా దొరుకుతుంది. ఎక్కడ పండించినా పట్టణాలకు తెచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఈ పంట ఎ.కోడూరులో సాగు చేయడంతో పాటు సేంద్రియ విధానంలో పండించడంతో కొనుగోలు చేసేందుకు స్థానిక ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్న నేపథ్యంలో మండలానికి చెందిన ప్రజలతో పాటు సమీప మండలాలైన దేవరాపల్లి, వేపాడకు చెందిన వారు వచ్చి ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

ఆసక్తి ఉంటే సాగు సూచనలు



డ్రాగన్ ఫ్రూట్ పంటను సేంద్రియ విధానంలో చేపడుతున్నా. సేంద్రియ ఎరువులు, జీవామృతం వాడడం వల్ల పంట దిగుబడి బాగుంది. పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పొలం వద్దకే వస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుపై ఆసక్తి ఉన్న వారికి సలహాలు, సూచనలు చేస్తా. సాగు ప్రారంభంలో పెట్టుబడి ఖర్చులు ఎక్కువగా అయినా.. తదుపరి దిగుబడి ప్రారంభమైతే తరువాత ఏడాది నుంచి ఆదాయం పొందవచ్చును. కిలో డ్రాగన్‌ఫ్రూట్ రూ.150కు విక్రయిస్తున్నా. ఫోన్ నంబర్ 98663 81817లో సంప్రదిస్తే సాగుకు అవసరమైన సూచనలు చేస్తా.

–లెక్కల కోటేశ్వరరావు, సాగు రైతు, ఎ.కోడూరు

గ్రా'నైట్'..రైట్‌రైట్!

ఫ్యాక్టరీల వద్ద కూటమి నేతల రౌడీ మామూళ్లు

- ఒక్కో బ్లేడ్‌కు రూ.35 వేల చొప్పున.. నెలకు రూ.10 కోట్లు వసూలు
- కప్పం కట్టకుంటే.. మైన్స్, విజిలెన్స్ దాడులు
- అంతా తెలిసినా పట్టనట్టు వ్యవహరిస్తున్న యంత్రాంగం



అర్ధరాత్రి ఒంటి గంటకు చిత్తూరు గాంధీ విగ్రహం మీదుగా స్మగ్లింగ్ చేస్తున్న గ్రానైట్ దిమ్మె

చిత్తూరు అర్బన్: భూగర్భ గనులశాఖ (మైన్స్) పరిపాలన చిత్తూరు జిల్లాలో పూర్తిగా గాడి తప్పింది. సహజ ఖనిజాలను తవ్వుకున్నప్పుడు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజ్ (ఖనిజాల రాయల్టీ) రుసుములను వసూలు చేయాల్సిన గనులశాఖ చేతులు పైకెత్తేసింది. అధికార పార్టీకి చెందిన నాయకులు గత ఐదు నెలలుగా ఫ్యాక్టరీల నుంచి దౌర్జన్యంగా సీనరేజ్ వసూలు చేసుకుంటుంటే వేడుక చూస్తోంది. కూటమి నేతలు వేసే బిస్కట్లకు ఆశపడ్డ కొందరు అధికారులు.. ప్రభుత్వ ఖజానాకు జమకావాల్సిన రూ.కోట్ల సొమ్మును నేతల జేబుల్లోకి మళ్లిం చేయడం విమర్శలకు తావిస్తోంది.

రౌడీ మామూళ్లు

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లో గ్రానైట్ ఖనిజాలు విస్తారంగా ఉన్నాయి. క్వారీల రూపంలో వీటిని దక్కించుకున్న వ్యక్తులు భూగర్భ గనులశాఖ పర్యవేక్షణలో గ్రానైట్ రాళ్లను తవ్వి, వాటిని ఫ్యాక్టరీల్లో కట్ చేయించి, పాలిష్ వేసి, ఆపై విక్రయిస్తుంటారు. ఈ వ్యాపారం చేయడానికి వ్యాపారులు క్యూబిక్ మీటరు గ్రానైట్‌కు వాటి రంగు ఆధారంగా స్లాబ్ పద్ధతుల్లో ప్రభుత్వానికి సీనరేజ్ రుసుములను చెల్లించాలి. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అనే కంపెనీ ఫ్యాక్టరీల నుంచి రుసుములు చెల్లించే కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీతో ఈ కంపెనీకి రుసుములు వసూలు చేసుకునే కాల పరిమితి ముగిసింది. ప్రైవేటు కంపెనీ స్థానంలో మైన్స్ శాఖ, ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను వ్యాపారుల నుంచి వసూలు చేయాల్సి ఉంది. కానీ గత ఐదు నెలలుగా రుసుముల వసూళ్ల నుంచి మైన్స్ అధికారులను పక్కకు తోసేసిన కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు.. ఫ్యాక్టరీల నుంచి నెల నెలా బెదిరించి, బలవంతంగా రౌడీ మామూళ్లు వసూలుచేసి వారి జేబుల్లో వేసుకుంటున్నారు.

ఇష్టారాజ్యం

కొందరు క్వారీ యజమానులు గ్రానైట్ ఖనిజాన్ని దోచుకుంటున్నారు. భారీ మొత్తంలో గ్రానైట్ వెలికితీసి, అక్రమంగా సరిహద్దులు దాటిస్తున్నారు. ప్రధానంగా రాత్రి 11 గంటలు దాటితే చిత్తూరు, కుప్పం, గంగాధరనెల్లూరు ప్రాంతాల నుంచి భారీ వాహనాల్లో గ్రానైట్ స్మగ్లింగ్ జరుగుతోంది. చిత్తూరుకు చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకులు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

ఒక్కో బ్లేడ్‌కు ఒక్కో రేటు

క్వారీల్లో తవ్విన గ్రానైట్ రాయిని ఫ్యాక్టరీలను తీసుకెళ్లి, అక్కడ పెద్దపాటి బ్లేడు ద్వారా కటింగ్ చేసి, వాటిని విక్రయిస్తుంటారు. కొన్ని ఫ్యాక్టరీల్లో సింగిల్ బ్లేడు ఉంటే, మరికొన్ని వాటిల్లో తొమ్మిది వరకు మల్టీబ్లేళ్లు ఉంటాయి. ప్రైవేటు కంపెనీకి ఇచ్చిన టెండరు గడువు ముగియడంతో రంగంలోకి దిగిన కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులతో భేటీ అయ్యారు. ఒక్కో బ్లేడుకు నెలకు రూ.35 వేల చొప్పున.. ఎన్ని బ్లేళ్లు ఉంటే అంత మొత్తం నెలవారీగా మామూళ్లు వసూళ్లచేస్తున్నారు. జిల్లాలో దాదాపు 3 వేల గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉంటే, 1500 ఫ్యాక్టరీల వరకు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఈ లెక్కన సగటున ఒక్కో ఫ్యాక్టరీలో రెండు బ్లేళ్లు ఉన్నాయనుకున్నా.. నెలకు రూ.70 వేల చొప్పున ఏకంగా రూ.10 కోట్ల మేర అక్రమంగా దిగమింగుతున్నారు. ఎవరైనా ఫ్యాక్టరీ నిర్వాహకులు ఈ మొత్తం ఎందుకు చెల్లించాలి..? అని ప్రశ్నిస్తే వెంటనే మైన్స్ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఆ ఫ్యాక్టరీతో పాటు గ్రానైట్ వచ్చిన క్వారీపై దాడులకు దిగుతున్నారు. భారీ మొత్తంలో అపరాధ రుసుములు విధిస్తున్నారు.

ఎల్‌పీజీ సబ్సిడీ మాకు అక్కర్లేదు

- రాష్ట్రంలో సబ్సిడీ వద్దన్న వారి సంఖ్య 2.41 లక్షలు
- దేశ వ్యాప్తంగా 1.14 కోట్లు
- ఐదేళ్ల గణాంకాలు వెల్లడించిన కేంద్రం

సాక్షి, అమరావతి: దేశంలో గత ఐదేళ్లలో 1.14 కోట్ల మంది ఎల్‌పీజీ సబ్సిడీని వదులుకున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తద్వారా కేంద్రానికి రూ.31,942 కోట్లు సబ్సిడీ పొదుపు అయినట్లు తెలిపింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో 2,41,400 మంది సబ్సిడీని వదులుకున్నారు. మంత్రిత్వశాఖ తెలిపిన అంశాల్లో కొన్ని ముఖ్యమైనవి.

- సబ్సిడీల నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు కేంద్రం కొన్ని సంవత్సరాలుగా తీసుకుంటున్న పలు చర్యలు ఫలితాలను ఇచ్చాయి.
- 'గివ్ ఇట్ అప్' ప్రచారం ద్వారా సంపన్న వినియోగదారులు స్వచ్ఛందంగా తమ సబ్సిడీని వదులుకునేలా ప్రోత్సహించడం జరిగింది.
- బహుళ, నకిలీ వినియోగదారుల ఖాతాలను సమర్థవంతంగా గుర్తించి చర్యలు తీసుకోవడం జరుగుతోంది.
- అధిక ఆదాయం కలిగిన వినియోగదారులకు సబ్సిడీలను నిలిపివేయడంతో పాటు, సబ్సిడీ రీఫిల్ సంఖ్యను పరిమితం చేయడం జరిగింది.
- వినియోగదారులకు బయో మెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణతో పారదర్శకంగా సబ్సిడీ బదలాయింపులు జరుగుతున్నాయి.
- గత ఐదేళ్లలో ఎల్‌పీజీ సబ్సిడీని వదులుకున్న రాష్ట్రాల్లో 19.65 లక్షల మందితో మహారాష్ట్ర తొలి స్థానంలో నిలిచింది. తరువాతి స్థానాల్లో ఉత్తరప్రదేశ్ (14.08 లక్షలు), ఢిల్లీ (9.23 లక్షలు), కర్నాటక (7.75 లక్షలు), రాజస్థాన్(7.57 లక్షలు), తమిళనాడు (6.92 లక్షలు), గుజరాత్ (5.46 లక్షలు) ఉన్నాయి.



గత ఐదేళ్లలో కేంద్రానికి సబ్సిడీ పొదుపు ఇలా..

ఆర్థిక సంవత్సరం	పొదుపు (రూ.కోట్లలో)
2018-19	17,324
2019-20	11,702
2020-21	1,608
2022-23	533
2023-24	775
మొత్తం	31,942

సబ్సిడీలను క్రమంగా తగ్గించడం.. ఏ ఏడాదికాయేడాది ఈ గణాంకాల్లో భారీ తగ్గుదలకు కారణం.

విద్యార్థులకు సదుపాయాల కల్పనలో ఘోర వైఫల్యం

కూటమి ప్రభుత్వ తీరుపై ఎస్ఎఫ్ఐ మండిపాటు

సాక్షి, అమరావతి: యోగాంధ్ర పేరుతో గిరిజన ప్రాంతాల నుంచి 25,000 మంది విద్యార్థులను తరలించి వారికి కనీస సౌకర్యాలు అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కూటమి ప్రభుత్వ తీరుపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మండిపడింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ శనివారం ప్రకటన విడుదల చేశారు. గిన్నిస్ రికార్డు కోసం విశాఖలో యోగాంధ్ర చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. గిరిజన విద్యార్థులను జూన్ 20న తెల్లవారుజామున ప్రత్యేక బస్సుల్లో ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌కు తరలించారని, వచ్చిన వారికి సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు.

61,266 పాఠశాలల్లో యోగాంధ్ర

60 లక్షల మంది భాగస్వామ్యం: ఎస్పీడీ

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో యోగాంధ్ర నిర్వహించినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 61,266 పాఠశాలల్లో దాదాపు 60 లక్షల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నట్టు వివరించారు. నెల రోజులుగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వారికి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు కృతజ్ఞతలు తెలిపారు.

సూక్ష్మ పరికరాల ధరల పునశ్చరణకు కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: 2025–26 సీజన్‌లో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(ఏపీఎంఐపీ) కింద బిందు, తుంపర సేద్య పరికరాల ధరల పునశ్చరణ కోసం రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద ఇచ్చే పరికరాలకు గతంలో నిర్ణయించిన ధరలను ఈ కమిటీ పునఃపరిశీలన చేసి ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణమైన ధరలను సిఫార్సు చేస్తుంది. ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లును కన్వీనర్‌గా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఉద్యాన, వ్యవసాయ శాఖలతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులతో కూడిన 13 మందిని సభ్యులుగా నియమించారు. 30 రోజుల్లో ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నాన్నకు ప్రేమతో...

• ఫాదర్ ఎమోషన్‌తో సినిమాలు చేస్తున్న స్టార్ హీరోలు

ఓ తండ్రిది బాధ్యత... మరో నాన్నది పగ. ఇంకో ఫాదర్‌ది ప్రేమ... ఇలా ఫాదర్ సెంటిమెంట్, ఎమోషన్‌లతో సిల్వర్ స్క్రీన్‌పై సినిమాలొస్తే ఆ సినిమాలు ఎక్కువగా ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి. మంచి కలెక్షన్స్ రాబడుతున్నాయి. పైగా ఈ తరహా సినిమాల్లో తండ్రి-కొడుకు ఈ రెండు పాత్రలనూ తమ అభిమాన హీరో చేస్తే అభిమానులు ఖుష్ అవుతారు. ఇలా తండ్రీ కొడుకుల ద్విపాత్రాభినయంతో కొందరు హీరోలు, తండ్రిగానో, కొడుకుగానో మరికొందరు హీరోలు 'నాన్నకు ప్రేమతో..' అంటూ ఫాదర్ ఎమోషన్‌తో సినిమాలు చేసున్నారు. ఆ హీరోలపై ఓ లుక్ వేద్దాం...

ధారా.. ఫాదర్ ఆఫ్ దేవా

తండ్రీకొడకుల కథలంటే ప్రభాస్‌కు బాగా ఇష్టం ఉన్నట్లుగా తెలుస్తోంది. తండ్రి ఎమోషన్‌తో ప్రభాస్ హీరోగా ఆల్రెడీ చేసిన 'మిర్చి, బాహుబలి' వంటి సినిమాలు బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. తాజాగా ప్రభాస్ కమిటైన చిత్రాల్లో 'సలార్' కూడా ఒకటి. ఈ సినిమాలో కూడా ఫాదర్ ఎమోషన్ గట్టిగా ఉన్నట్లుగా తెలుస్తోంది. 'సలార్' ఫ్రాంచైజీ నుంచి ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రంలో దేవా పాత్రలో ప్రభాస్ కనిపించారు. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాల్లో ప్రభాస్ తండ్రి పేరు ధారాగా వినిపించింది. కాగా 'సలార్: సీజ్‌ఫైర్' ఎండింగ్‌లో 'సలార్: శౌర్యాంగ పర్వం' సినిమా ఉన్నట్లుగా మేకర్స్ స్పష్టం చేశారు. దీంతో 'సలార్: శౌర్యాంగ పర్వం'లో దేవా, ధారాల మధ్య మరింత ఎమోషనల్ కనెక్టివిటీ ఉన్న సన్నివేశాలు ఉండే అవకాశం ఉందనిపిస్తోంది. అంతే కాదు... దేవా తండ్రి ధారా పాత్రలోనూ ప్రభాసే కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. పైగా 'సలార్' సినిమా అనౌన్స్‌మెంట్ సమయంలో ప్రభాస్‌కు చెందిన రెండు డిఫరెంట్ లుక్స్ వచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది. వాటిలోని ఒక పోస్టర్‌లో ప్రభాస్ కాస్త ఏజ్డ్‌గా కనిపిస్తారు. ఈ పాత్రే ధారా అనే ఊహాగానాలు ఉన్నాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించనున్న 'సలార్: శౌర్యాంగపర్వం' చిత్రం ఇంకా పూర్తి స్థాయిలో సెట్స్‌కు వెళ్లలేదు. ఇక ప్రభాస్ హీరోగా చేస్తున్న మరో చిత్రం 'ది రాజాసాబ్'. ఈ సినిమాకు మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం సైతం ఓ కుటుంబానికి చెందిన మూడు తరాల నేపథ్యంలో సాగుతుందని, తాత-మనవళ్ల ఎమోషన్, ఫాదర్ ఎమోషన్ కూడా కాస్త ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. డిసెంబరు 5న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఇంకా... రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'బాహుబలి'లో తండ్రీకొడుకులు అమరేంద్ర బాహుబలి, మహేంద్ర బాహుబలి పాత్రల్లో ప్రభాస్ నటించిన సంగతి తెలిసిందే. అమరేంద్ర బాహుబలి, మహేంద్ర బాహుబలి మధ్య 'బాహుబలి' సినిమాలో కాంబినేషన్ సీన్స్ లేనప్పటికీ మాహిష్మతి రాజ్యంలో తండ్రి అమరేంద్ర బాహుబలికి జరిగిన అన్యాయానికి తల్లి దేవసేన ప్రోత్సాహం, ప్రతీకారంతో.. మహేంద్ర బాహుబలి రివెంజ్ తీర్చుకోవడం ఆడియన్స్‌ను మెప్పించింది. ఇక ఇక్కడ 'బాహుబలి' ప్రస్తావన తీసుకు రావడానికి ఓ కారణం ఉంది. శోభు యార్లగడ్డ, దేవినేని ప్రసాద్ నిర్మించిన 'బాహుబలి' ఈ ఏడాది అక్టోబరులో రీ రిలీజ్ కానుంది. అయితే 'బాహుబలి' రెండు భాగాలను (బాహుబలి: ది బిగినింగ్, బాహుబలి: ది కన్‌క్లూజన్) కలిపి ఒకే సినిమాగా ఎడిట్ చేసి, రీ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

వర... సన్నాఫ్ దేవర

దేవర చనిపోయినప్పుడు అతని కొడుకు వర చేతిలో కత్తి ఎందుకు ఉంది? తండ్రి దేవరను, అతని కొడుకు వరనే చంపాడా? అసలు ఏం జరిగింది? అనేది 'దేవర 2' సినిమాలో చూడాలి. తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'దేవర'. ఈ చిత్రంలో తండ్రి పేరు దేవర. కొడుకు పేరు వర. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'దేవర'. 2024 సెప్టెంబరు 24న 'దేవర పార్ట్ 1' విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. 'దేవర 2' చిత్రం కూడా ఉంటుందని, 'మ్యాడ్ 2' సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఈ 'దేవర 2' చిత్రంలో తండ్రీకొడుకుల మధ్య ఉన్న ఎమోషనల్ సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయని సమాచారం. అసలు దేవర, అతని కొడుకు వరల మధ్య ఏం జరిగింది? దేవర నిజంగానే చనిపోయాడా? అన్న ఆసక్తికరమైన అంశాలను 'దేవర 2'లో చూడొచ్చని 'వార్ 2' ప్రమోషన్స్‌లో భాగంగా ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ప్రస్తుతం ఎన్టీఆర్ చేతిలో రెండు మూడు సినిమాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'దేవర 2' సినిమా చిత్రీకరణ ఎప్పుడు మొదలవుతుందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఇటు పోలీస్... అటు ఖైదీ

తండ్రంటే ఎవరికి ప్రేమ ఉండదు. కానీ విజయ్‌ప్రకాశ్‌కు ఇష్టం లేదు. ఈ విజయ్‌ప్రకాశ్ ఎవరంటే... 'సర్దార్' సినిమాలో పోలీసాఫీసర్. హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో 2022లో వచ్చిన చిత్రం 'సర్దార్'. ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు కార్తీ. తండ్రి సర్దార్‌పై దేశ ద్రోహి అనే అభియోగం ఉంటుంది.

కానీ తన తండ్రి దేశద్రోహి కాదని, అసలు సిసలైన దేశభక్తుడని ప్రకాశ్ తెలుసుకుంటాడు. ఆ సమయంలో ఎంతో ఎమోషనల్ అవుతాడు. కానీ.. 'సర్దార్' సినిమాలో తండ్రీకొడుకులు మధ్య ఉన్న సన్నివేశాల నిడివి తక్కువే. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'సర్దార్ 2' రానుంది. ఈ చిత్రంలోనూ కార్తీ తండ్రీ కొడుకుగా ద్విపాత్రాభినయం చేశారు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఎస్. లక్ష్మణ్‌కుమార్ నిర్మించారు. ఇటీవలే బ్యాంకాక్‌లో జరిగిన ఓ భారీ షెడ్యూల్ చిత్రీకరణతో 'సర్దార్ 2' పూర్తయింది. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా కార్తీ సన్నివేశాలు ఎక్కువగానే ఉంటాయని కోలీవుడ్ సమాచారం. ముఖ్యంగా ఈ సినిమాలోని ఎమోషనల్ సీన్స్ ఆడియన్స్ హృదయాలను హత్తుకునేలా ఉంటాయట. 'సర్దార్ 2' సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించారు. మరోవైపు కార్తీ హీరోగా చేస్తున్న మరో సినిమా 'ఖైదీ 2'. ఈ సినిమాలో కూతురి కోసం తపన పడే దిల్లీ అనే ఖైదీ పాత్రలో కనిపిస్తారు కార్తీ. 'ఖైదీ'లో తన కుమార్తెను కలవడంతో సినిమా ముగుస్తుంది. మరి... దిల్లీ ఎందుకు జైలుకు వెళ్లాడు? తన కుమార్తెకు దూరమై ఓ తండ్రిగా ఎంత ఆవేదన చెందాడు? అసలు దిల్లీ భార్యకు ఏం జరిగింది? అన్న విషయాలు 'ఖైదీ 2'లో ఉండొచ్చు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న 'ఖైదీ 2'లో ఖైదీ దిల్లీ భార్య పాత్రలో అనుష్కా శెట్టి నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ సెప్టెంబరులో చిత్రీకరణ ఆరంభించి, వచ్చే ఏడాది ఈ సినిమా రిలీజ్‌ను ప్లాన్ చేశారు. 'ఖైదీ' సినిమాను నిర్మించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థనే 'ఖైదీ 2'నూ నిర్మించనుందట.

తొలిసారి ద్విపాత్రాభినయం

'టాక్సీవాలా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో మరో మూవీ రానున్న సంగతి తెలిసిందే. విజయ్ దేవరకొండ కెరీర్‌లోని ఈ 14వ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది చివర్లో ప్రారంభించాలనుకుంటున్నారు. బ్రిటిష్ పరిపాలన కాలం నేపథ్యంలో 1854-1878ల టైమ్ పీరియడ్ నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రీ లుక్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. కాగా ఈ సినిమాలో విజయ్ దేవరకొండ తండ్రీ కొడుకుగా ద్విపాత్రాభినయం చేస్తారనే టాక్ వినిపిస్తోంది. స్క్రీన్‌పై ఇప్పటివరకు విజయ్ దేవరకొండ ద్విపాత్రాభినయం చేయలేదు. సో... తొలిసారి విజయ్ ఈ తరహా ప్రయత్నం చేస్తుండటంతో, ఈ సినిమాపై ఆయన ఫ్యాన్స్‌లో అంచనాలు ఉన్నాయి. ఇంకా 'గీత గోవిందం, డియర్ కామ్రేడ్' వంటి సినిమాల తర్వాత హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మికా మందన్నా ఈ సినిమా కోసం మరోసారి కలిసి పని చేయనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. కొన్ని వాస్తవ చారిత్రక సంఘటనల నేపథ్యంలో సాగే ఈ సినిమాను నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్ నిర్మించనున్నారు. ఆల్రెడీ ప్రీ ప్రొడక్షన్ వర్క్ తుది దశకు చేరుకుంది. సెట్ వర్క్స్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఇక విజయ్ సెట్స్‌కి వచ్చి, రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొనడమే ఆలస్యం. 2026 చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉంది.

మధ్యతరగతి తండ్రి కథ

పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'చౌకీదార్'. ఈ చిత్రంలో సాయికుమార్ ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. పృథ్వీ అంబర్, సాయికుమార్ తండ్రీ కొడుకులుగా నటిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా నుంచి 'నాన్న అంటేనే దైవం' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటను బట్టి ఈ సినిమాలో తండ్రికొడుకుల ఎమోషన్, ఓ మధ్య తరగతి తండ్రి తన కుటుంబం కోసం పోరాడే తీరు వంటి అంశాలను ప్రస్తావిస్తున్నట్లుగా తెలుస్తోంది. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో కల్లహల్లి చంద్రశేఖర్ ఈ సినిమాను నిర్మించారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది.

ఇలా ఫాదర్ ఎమోషన్‌తో మరికొన్ని సినిమాలు రానున్నాయి.

- ముసిమి శివాంజనేయులు

గతం నిశ్శబ్దంగా ఉండదు

జార్జి కుట్టి గుర్తున్నాడుగా..! అదేనండీ... తన కుమార్తెల రక్షణ కోసం, తన కుటుంబం కోసం పోలీసులనే ముప్పుతిప్పలు పెట్టిన వ్యక్తి. మలయాళ బ్లాక్‌బస్టర్ సినిమా 'దృశ్యం' ఫ్రాంచైజీలో మోహన్‌లాల్ పాత్ర పేరు జార్జి కుట్టి. ఈ సినిమాలో ఓ తండ్రిగా మోహన్‌లాల్ నటన అద్భుతమని ప్రేక్షకులు కితాబులు ఇచ్చారు. అందుకే 'దృశ్యం' సిరీస్ నుంచి ఇప్పటివరకు 'దృశ్యం, దృశ్యం 2' సినిమాలు రాగా ఈ రెండు చిత్రాలూ సూపర్ హిట్స్‌గా నిలిచాయి. ఇప్పుడు 'దృశ్యం' సినిమాలో మూడో భాగంగా 'దృశ్యం 3' రానుంది. 'దృశ్యం, దృశ్యం 2' సినిమాలకు దర్శకత్వం వహించిన జీతూ జోసెఫ్ 'దృశ్యం 3' సినిమాకూ దర్శకత్వం వహించనున్నారు. 'గతం ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండదు... దృశ్యం 3 సినిమా ఉంది' అంటూ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ సినిమాను ఖరారు చేశారు మోహన్‌లాల్. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభం కానుందని శనివారం మోహన్‌లాల్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. మరి... ఈ సారి ఓ తండ్రిగా మోహన్‌లాల్ తన కుటుంబాన్ని, కుమార్తెలను ఏ విధంగా సంరక్షించుకుంటారో చూడాలి. అయితే ఈసారి తండ్రి-కుమార్తెల మధ్య ఉన్న ఎమోషనల్ మోతాదును పెంచాలని జీతూ జోసెఫ్ అనుకుంటున్నారట. ఈ సినిమాను ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించనున్నారు. మోహన్‌లాల్ త్వరితగతిన సినిమాలు పూర్తి చేస్తుంటారు కాబట్టి, 'దృశ్యం 3' సినిమా ఈ ఏడాదే థియేటర్లలో రిలీజైనా ఆశ్చర్యపోవడానికి లేదు.

మూడు తరాల కథ

శర్వానంద్ హీరోగా 'లూజర్' ఫేమ్ అభిలాష్ కంకర దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ ఫిల్మ్ రానుంది. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్. విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మూడు తరాల నేపథ్యంలో సాగే ఈ కథలో ఫాదర్ అండ్ సన్‌ల మధ్య ఉండే ఎమోషన్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందట. మూడు తరాల నేపథ్యం కాబట్టి ఈ చిత్రం డిఫరెంట్ టైమ్ లైన్స్‌లో ఉంటుందనుకోవచ్చు. ఈ సినిమాలో శర్వానంద్ బైక్ రైడర్‌గా కనిపిస్తారని, 'రేస్ రాజా' టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని సమాచారం.

హిట్ ఫార్ములా

ఇటీవలి కాలంలో తండ్రీ కొడుకుల వినోదం, ఎమోషన్ నేపథ్యం ఉన్న కొన్ని చిత్రాలు ఆడియన్స్‌ను బాగా అలరించి, హిట్ ఫార్ములా అనిపించాయి. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో తండ్రి పాత్రలో వెంకటేశ్, కొడుకు రుత్విక్ ఉన్న సన్నివేశాలు ఆడియన్స్‌ను అలరించాయి. బాక్సాఫీస్ వద్ద కాస్త నిరాశపరిచిన రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' మూవీ మెయిన్ పాయింట్ ఫాదర్ ఎమోషనే. సముద్రఖని -ధన్‌రాజ్‌ల 'రామం రాఘవం', బ్రహ్మాజీ 'బాపు', సందీప్ కిషన్-రావు రమేశ్‌ల 'మజాకా' వంటి తెలుగు చిత్రాలతో పాటు తమిళ నటుడు శశికుమార్ 'టూరిస్ట్ ఫ్యామిలీ', మోహన్ లాల్ 'తుడరుమ్', అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమాల్లో ఫాదర్ ఎమోషన్‌నే మెయిన్ పాయింట్‌గా తెరకెక్కిన చిత్రాలూ తెలుగులో అనువాదమై, తెలుగు ప్రేక్షకులను మెప్పించాయి.



రిచా గంగోపాధ్యాయ, రవితేజ

రిషికేశ ఈజ్ బ్యాక్

ఐబీ (ఇంటెలిజెన్స్ బ్యూరో) ఆఫీసర్ రిషికేశ మళ్లీ థియేటర్స్‌లోకి వస్తున్నాడు. రవితేజ కెరీర్‌లోని వన్నాఫ్ ది హిట్ ఫిల్మ్ 'మిరపకాయ్'. ఈ చిత్రంలో రిచా గంగోపాధ్యాయ, దీక్షా సేథ్ హీరోయిన్లుగా నటించగా, ప్రకాశ్‌రాజ్ విలన్ పాత్రలో, మరో ఐబీ ఆఫీసర్‌గా బ్రహ్మాజీ నటించారు. రమేష్ పుప్పాల నిర్మించిన ఈ సినిమాను జూలై 11న రీ-రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రంలో ఐబీ ఆఫీసర్ రిషికేశ పాత్రలో రవితేజ నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. రిషికేశ ఓ అండర్ కవర్ ఆపరేషన్‌తో మాఫియా డాన్ కిట్టు (ప్రకాశ్‌రాజ్) ఆటను ఎలా కట్టించాడన్నదే ఈ సినిమా కథనం. ఇక రవితేజ హీరోగా నటించిన మరో చిత్రం 'నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్' ఇటీవల రీ-రిలీజైన విషయం గుర్తుండే ఉంటుంది. మరోవైపు ప్రస్తుతం 'అనార్కలి' (వర్కింగ్ టైటిల్) సినిమాతో బిజీగా ఉన్నారు రవితేజ. కిశోర్ తిరుమల ఈ సినిమాకు దర్శకుడు. అలాగే రవితేజ నటించిన ఇంకో చిత్రం 'మాస్ జాతర' ఈ ఏడాది ఆగస్టు 27న విడుదల కానుంది.

భార్యాభర్తల అనుబంధం



లావణ్యా త్రిపాఠి, దేవ్ మోహన్

లావణ్యా త్రిపాఠి, దేవ్ మోహన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'సతీ లీలావతి'. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో తాతినేని సత్య దర్శకత్వంలో నాగమోహన్ నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదలైంది. ''భార్య, భర్త మధ్య ఉండే అనుబంధాన్ని ఎమోషనల్‌గానే కాకుండా ఎంటర్‌టైనింగ్‌గా చెప్పే ప్రయత్నమే ఈ చిత్రం. కుటుంబ వ్యవస్థ బలహీన పడుతోన్న ప్రస్తుత కాలంలో రెండు వేర్వేరు కుటుంబాలు, నేపథ్యాల నుంచి వచ్చిన వ్యక్తులు కలిసి ప్రయాణించాలంటే వారి మధ్య ఎమోషన్స్ ఇంకెంత బలంగా ఉండాలో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇలాంటి సున్నితమైన అంశాన్ని హృద్యంగా తెరకెక్కించారు తాతినేని సత్య. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫీల్ గుడ్ మూవీగా మా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, కెమెరా: బినేంద్ర మీనన్.

ఆకాశమంత ప్రేమ పుడితే..!



మురళీ కృష్ణంరాజు, శ్రుతీ శెట్టి

మురళీ కృష్ణంరాజు, శ్రుతీ శెట్టి జంటగా నటించిన సినిమా 'సైకి'. 'అగాధమంత బాధ నుంచి ఆకాశమంత ప్రేమ పుడితే..' అన్నది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వంలో నాగిరెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీ లక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మించారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'తపనే తెలుపగ..' అనే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. హీరో హీరోయిన్స్ మురళీ కృష్ణంరాజు, శృతీ శెట్టిపై కూల్ మెలోడీగా ఈ పాటను చిత్రీకరించారు. పృథ్వీ పెరిచెర్ల లిరిక్స్ అందించగా, వైష్ణవి పాడారు. ఈ సినిమాకు శివ ప్రసాద్ సంగీతం అందించారు. ఆనంద్ భారతి, రాకేశ్ మాస్టర్, ఎంఎస్, కేఎల్ కే మణి బమ్మ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు.

ఐపీవో స్ట్రీట్

వివో నుంచి వై400 ప్రో

ధర రూ. 24,999



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ వివో కొత్తగా వై సిరీస్‌లో వై400 ప్రో ఫోన్‌ను ఆవిష్కరించింది. దీని ధర రూ. 24,999 (8జీబీ, 128 జీబీ) నుంచి ప్రారంభమై రూ. 26,999 వరకు (8 జీబీ, 256 జీబీ) వరకు ఉంటుంది. ఈ సెగ్మెంట్లోనే అత్యంత పల్చని 3డీ కర్వ్‌డ్ డిస్‌ప్లే, 6.78 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ, అమోలెడ్ డిస్‌ప్లే, 90వాట్ ఫ్లాష్‌చార్జ్, సోనీ మల్టీఫోకల్ పోర్ట్రెయిట్, ముందు.. వెనుక కెమెరాలతో 4కే వీడియో రికార్డింగ్ సామర్థ్యాలు మొదలైన ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. ఇది ఫ్రీస్టైల్ వైట్, నెబ్యులా పర్పుల్, ఫెస్ట్ గోల్డ్ అనే మూడు రంగుల్లో లభిస్తుంది.

కొత్త లుక్‌తో హోండా సిటీ స్పోర్ట్

ధర రూ. 14.88 లక్షలు



న్యూఢిల్లీ: హోండా కార్స్ ఇండియా సంస్థ న్యూ సిటీ స్పోర్ట్ కారును ఆవిష్కరించింది. దీని ధర రూ. 14,88,900గా (ఢిల్లీ ఎక్స్ షోరూం) ఉంటుంది. లైఫ్ ఈజ్ ఏ స్పోర్ట్ ట్యాగ్‌లైన్‌తో ప్రవేశ పెట్టిన ఈ కార్లు పరిమిత సంఖ్యలోనే అందుబాటులో ఉంటాయని సంస్థ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ తెలిపారు. వెలుపల స్పోర్టీ బ్లాక్ గ్రిల్, అలాయ్ వీల్స్, అలాగే లోపల ప్రీమియం లెదర్ బ్లాక్ సీట్లు, రూఫ్ లైనింగ్‌తో ఇంటీరియర్స్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు వివరించారు.

ఐఏ, ఆర్‌ఏలకు నిబంధనల్లో వెసులుబాటు

డిపాజిట్లతోపాటు లిక్విడ్ ఫండ్స్‌కు అనుమతి



న్యూఢిల్లీ: పెట్టుబడి సలహాదారులు (ఐఏలు), పరిశోధన విశ్లేషకులకు (ఆర్‌ఏలు) సెబీ నిబంధనల్లో వెసులుబాటు కల్పించింది. తమ డిపాజిట్ అవసరాలకు అనుగుణంగా వారు ఇప్పటి వరకు నిబంధనల ప్రకారం బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో నిర్దిష్ట మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఎఫ్‌డీలకు అదనంగా లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్, ఓవర్‌నైట్ మ్యూచువల్ ఫండ్స్‌కు సైతం సెబీ అనుమతించింది. ఏదేనీ షెడ్యూల్డ్ బ్యాంకులో ఎఫ్‌డీ చేసి, అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఏఎస్‌బీ) పేరిట లీన్‌మార్క్‌డ్ (హక్కులు కల్పించడం) చేయాల్సి వచ్చేది. ఎఫ్‌డీ ఖాతాల ప్రారంభం విషయంలో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వారు సెబీ దృష్టికి తీసుకెళ్లారు.

మార్కెట్లోకి మహీంద్రా ఫ్యూరియో 8 ట్రక్



ముంబై: మహీంద్రా ట్రక్ అండ్ బస్ బిజినెస్ తాజాగా అత్యధిక మైలేజీ గ్యారంటీతో ఫ్యూరియో 8 పేరిట తేలికపాటి వాణిజ్య వాహన ట్రక్కులను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. సెగ్మెంట్లో అత్యుత్తమ మైలేజీనివ్వకుంటే ట్రక్కును వాపసు చేయొచ్చనే ఆఫరుతో దీన్ని అందిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. ఈ వాహనం 4, 6 టైర్ల కార్గో వేరియంట్స్‌లో లభిస్తుంది. కొనుగోలుదారుకు అధిక ఆదాయాలు, కనిష్ట స్థాయిలో నిర్వహణ వ్యయాలతో అన్ని రకాల ప్రయోజనకరంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దినట్లు సంస్థ ప్రెసిడెంట్ వినోద్ సహాయ్ పేర్కొన్నారు. అలాగే, సర్వీసింగ్ విషయానికొస్తే 36 గంటల టర్నెరౌండ్ సమయం లేదా జాప్యం జరిగిన ప్రతి అదనపు రోజుకు రూ. 3,000 చొప్పున చెల్లించేలా సర్వీస్ హామీ ఉంటుందని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-6-2025

విశాఖ	565-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

కోడింగ్ పోరులో కంపెనీలు..

- ఏఐ కోడింగ్ టూల్స్ మార్కెట్ ఏటా 28 శాతం వృద్ధి
- 2028 నాటికి 12.6 బిలియన్ డాలర్లకు చేరొచ్చని అంచనా
- టూల్స్ వినియోగాన్ని 80 శాతానికి పెంచుకునే ప్రయత్నాల్లో సంస్థలు

సాంకేతికత పెరిగే కొద్దీ కృత్రిమ మేథ (ఏఐ) రంగంలో కొత్త రకం యుద్ధాలు మొదలవుతున్నాయి. పైథాన్, రస్ట్‌లాంటి ప్రోగ్రామింగ్ ల్యాంగ్వేజ్‌లతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో వాటాల కోసం అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలు, అంకుర సంస్థలు ఒకదానితో మరొకటి పోటీపడుతూ కత్తులు దూసుకుంటున్నాయి. ఏఐ టెక్ దిగ్గజాలు ఇటీవలే పోటాపోటీగా కొత్త సాధనాలను ఆవిష్కరించాయి. గూగుల్ తమ గోడింగ్ ఏజెంట్ జ్యూల్స్‌ను, మైక్రోసాఫ్ట్ గిట్‌హబ్ ఏఐ ఏజెంటును, కోడింగ్ స్టార్టప్ విండ్‌సర్ఫ్‌ను 3 బిలియన్ డాలర్లతో కొన్న ఊపులో ఓపెన్‌ఏఐ సంస్థ కోడెక్స్‌ను ప్రవేశపెట్టాయి. వీటన్నింటి లక్ష్యం ఏమిటంటే, కోడింగ్ రాయడంలో డెవలపర్లకు సహాయం చేయడం, బగ్‌లను ఫిక్స్ చేయడం, అలాగే కర్సర్, లవబుల్, బోల్ట్‌లాంటి స్టార్టప్‌లతో నేరుగా పోటీపడటం. డెవలపర్లు, అంకుర సంస్థలు ఈ పరిణామాలపై పెద్దగా ఆశ్చర్యపోవడం లేదు. జెన్‌ఏఐ రేసుతో ముందుగా ప్రభావం పడేది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విభాగమేనని పరిశీలకులు చెబుతున్నారు. కంపెనీలు ఇప్పటికే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోసం కోడింగ్ టూల్స్‌ను విరివిగా ఉపయోగిస్తుండటం ఇందుకు నిదర్శనమంటున్నారు.

టూల్స్ వాడకం ఒక్కటే ఆప్షన్..

ఏఐ టూల్స్‌ను ఉపయోగించడాన్ని నేర్చుకోవడం తప్ప ప్రస్తుతం వేరే ఆప్షన్ లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్ కంపెనీల్లో ఇప్పటికే కోడింగ్ 30 శాతం ఏఐ ద్వారానే జరుగుతోంది. అటు ఇన్‌మొబీ సంస్థ కోడింగ్‌లో దాదాపు 50 శాతం ఏఐతోనే జరుగుతోంది. దీన్ని 80 శాతానికి పెంచుకునే ప్రయత్నాల్లో కంపెనీ ఉంది. మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాం మార్కెట్స్‌అండ్‌మార్కెట్స్ గణాంకాల ప్రకారం ఏఐ కోడింగ్ టూల్ మార్కెట్ ఏటా 28 శాతం వృద్ధి చెందుతూ 2028 నాటికి 12.6 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. ఉత్పాదకత పెరగడంపరంగా ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉండటం, మార్కెటింగ్ .. సేల్స్‌లాంటి నాన్–టెక్నికల్ టీమ్‌లు కూడా ఉపయోగించడానికి సులువుగా ఉండటం వంటి అంశాల కారణంగా కోడింగ్ టూల్స్ వినియోగం పెరుగుతోంది. దీంతో ఈ విభాగంపై భారీగా ఇన్వెస్ట్ చేసిన టెక్ దిగ్గజాలకు ఆదాయార్జనకు ఇదొక కొత్త మార్గంగా నిలుస్తోంది.

కొత్త ఆదాయ మార్గం..

ఫౌండేషనల్ మోడల్స్‌పై కోట్ల కొద్దీ డాలర్లు కుమ్మరించిన కంపెనీలు ఇప్పుడు వాటిపై రాబడులు అందుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నాయని ఎల్‌ఎల్‌ఎం ఎవాల్యుయేషన్ ప్లాట్‌ఫాం అయిన నోవియం వర్గాలు తెలిపాయి. ఎల్‌ఎల్‌ఎంలకు కోడ్ జనరేట్ చేయడమనేది ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోందని వివరించాయి. కర్సర్ అనే సంస్థ గత రెండేళ్లుగా ఏటా 300 మిలియన్ డాలర్ల మేర ఆదాయాలను ఆర్జిస్తోందని పేర్కొన్నాయి. ఇక బోల్ట్, లవబుల్‌లాంటి సంస్థలు కూడా ఊహించని స్థాయిలో ఆదాయాలు ఆర్జిస్తున్నాయి. తమ ఇంజినీర్ల ఉత్పాదకత కనీసం 10–20 శాతమైన పెరుగుతుందంటే ఈ టూల్స్‌పై ఇన్వెస్ట్ చేసేందుకు కంపెనీలు ముందుకొస్తున్నాయి. ప్రస్తుతం కోడింగ్ ఆటోమేషన్ అనేది ప్రస్తుతం హాట్ సెక్టార్‌గా మారిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టెక్నికల్‌యేతర నేపథ్యాలున్న వారు కూడా సులభంగా, సరళంగా వెబ్‌సైట్‌లు, చాట్‌బాట్లను రూపొందించడానికి ఇది ఉపయోగపడుతోందని వివరించాయి. సాధారణంగా పెద్ద కంపెనీల్లో ఏఐ టూల్స్‌ను మిగతా అవసరాల కోసం పెద్దగా ఉపయోగించకపోయినా ఉత్పాదకతను పెంచుకునేందుకు ఉపయోగించుకుంటున్నాయి.



సవాళ్లూ ఉన్నాయి..

కోడింగ్ పని 70 శాతం వేగవంతమవడానికి ఏఐ టూల్స్ ఉపయోగపడుతున్నాయి. కోడింగ్ చేయడానికి టూల్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నప్పటికీ, వీటితో సవాళ్లు కూడా ఉన్నాయని నిపుణులు తెలిపారు. పని వేగవంతమవుతోంది కాబట్టి ఏఐని ఉపయోగించి ప్రతి ఒక్కరూ కోడింగ్ చేసేయొచ్చనే అపోహలు ఉంటున్నాయని పేర్కొన్నారు. 70 శాతం పూర్తయితే సరిపోదు, దాన్ని 100 శాతం వరకు తీసుకెళ్లేందుకు నిపుణుల అవసరం అవుతుందని వివరించారు. అంతేగాదు, కోడింగ్ టూల్స్ వినియోగం పెరిగే కొద్దీ రివ్యూ చేయాల్సిన కోడ్స్ సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు. తమ కస్టమర్లపై ప్రభావం పడకుండా రివ్యూ ప్రక్రియలను కూడా కంపెనీలు ఆటోమేట్ చేస్తున్నాయి. తాము ఏకకాలంలో వివిధ సిస్టమ్‌లను అభివృద్ధి చేస్తూనే, వాటి అమలు తీరుతెన్నులను కూడా పర్యవేక్షించే ప్రయత్నాల్లో ఉన్నామని ఇన్‌మొబి వర్గాలు తెలిపాయి. ఎప్పటికప్పుడు తప్పొప్పులను పరీక్షించుకుంటూ ముందుకెళ్తుండటం వల్ల తమ దగ్గర కోడింగ్‌లో ఏఐ వినియోగం ప్రస్తుతానికి యాభై శాతం స్థాయిలోనే ఉందని వివరించాయి.

హెచ్‌డీఎఫ్‌సీ కొనుగోలుకు

ఐసీఐసీఐ బ్యాంకు ఆఫర్

సీనియర్ బ్యాంకర్ పరేఖ్ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ కొన్నాళ్ల క్రితం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌ను కొనుగోలుపై ఆసక్తి చూపింది. అందుకోసం ఆఫర్ కూడా ఇచ్చింది. కానీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ ఎండీ చందా కొచర్‌తో నిర్వహించిన చర్చాగోష్టి సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ మాజీ చైర్మన్, సీనియర్ బ్యాంకర్ దీపక్ పరేఖ్ ఈ విషయాలు వెల్లడించారు. 'ఐసీఐసీఐతోనే హెచ్‌డీఎఫ్‌సీ ప్రారంభమైంది. అలాంటప్పుడు సొంతింటికి తిరిగి రావచ్చు కదా, అని ఒకసారి మీరు ఆఫర్ ఇచ్చిన సంగతి నాకు గుర్తుంది. కానీ దాన్ని నేను తిరస్కరించాను. అది సముచితం కాదని చెప్పాను' అని పరేఖ్ గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత నియంత్రణ నిబంధనల ఒత్తిడి కారణంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సంస్థను విలీనం చేశామని, ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ తమకు కొంత తోడ్పాటు అందించిందని ఆయన చెప్పారు. విలీనమనేది సంస్థకు మేలు చేసేది కాగా, భారీ స్థాయి బ్యాంకులు ఉండటమనేది దేశానికే మంచి చేస్తుందని పరేఖ్ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ భారతీయ బ్యాంకులు ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా మరింత బలోపేతం కావడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. 44 ఏళ్ల చరిత్ర గల హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ సంస్థ రివర్స్ మెర్జర్ ద్వారా అనుబంధ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విలీనమైన సంగతి తెలిసిందే. ఈ రివర్స్ మెర్జర్‌కి ముందు దాన్ని కొనుగోలు చేసేందుకు ఐసీఐసీఐ బ్యాంకు ప్రతిపాదన చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ఏర్పాటుకు ఐసీఐసీఐ బ్యాంక్ మాతృ సంస్థ ఐసీఐసీఐ లిమిటెడ్ ఆర్థికంగా తోడ్పాటు అందించింది.



వాణిజ్యంపై యుద్ధ ప్రభావం ఎంత?

- పరిస్థితులను సమీక్షించిన వాణిజ్య శాఖ
- భాగస్వాముల అభిప్రాయాలు తెలుసుకునే ప్రయత్నం

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఘర్షణలు మరింత తీవ్రమైతే మనదేశ వాణిజ్యంపై ఏ మేరకు ప్రభావం పడుతుందన్న దానిపై కేంద్ర వాణిజ్య శాఖ కీలక సమావేశం నిర్వహించింది. షిప్పింగ్ సంస్థలు, ఎగుమతిదారులు, కంటెయినర్ కంపెనీలు, ఇతర శాఖలు, భాగస్వాముల అభిప్రాయాలు తెలుసుకున్నట్టు ఓ అధికారి వెల్లడించారు. వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భర్త్వాల్ దీనికి నేతృత్వం వహించారు. హర్మూజ్ జలసంధిలో ప్రస్తుతానికి తటస్థ పరిస్థితులే నెలకొన్నట్టు, ఓడల రవాణాలకు ఎలాంటి ఆటంకాల్లేనట్టు ప్రతినిధులు వెల్లడించారు. అభివృద్ధి చెందుతున్న పరిణామాలు, వాణిజ్యంపై వాటి ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాల్సి ఉంటుందని వాణిజ్య శాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. పరిస్థితులకు అనుగుణంగా అన్ని ప్రత్యామ్నాయాలను గుర్తించాల్సిన ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పారు. యుద్ధం తీవ్రతరమైతే అది ప్రపంచ వాణిజ్యాన్ని ప్రభావితం చేస్తుందని.. హర్మూజ్ జలసంధి, రెడ్‌సీ ద్వారా ఓడల రవాణాకు ఆటంకాలు ఏర్పడతాయని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలతో సముద్ర, వాయు రవాణా చార్జీలు పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. హర్మూజ్ జలసంధిని మూసేస్తామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించడం గమనార్హం. కేవలం 21 కిలోమీటర్ల వెడల్పుతో ఉండే ఈ జలసంధి ద్వారానే ప్రపంచంలో 20 శాతం మేర ముడి చమురు రవాణా అవుతోంది. అంతేకాదు మన చమురు దిగుమతుల్లో మూడింట రెండొంతులు, ఎల్‌ఎన్‌జీ దిగుమతుల్లో సగం మేర హర్మూజ్ జలసంధి ద్వారానే వస్తున్నాయి. వీటికి ఆటంకాలు ఏర్పడితే చమురు ధరలు, రవాణా, బీమా చార్జీల పెరుగుదలకు దారితీస్తుంది. ఈ ప్రభావం మన దేశ వాణిజ్యంపై గణనీయంగా ఉంటుందనడంలో సందేహం లేదు. అందుకే వాణిజ్య శాఖ ఈ సమావేశం నిర్వహించింది.



నికర పన్ను వసూళ్లు డౌన్..

- ఇప్పటివరకు రూ. 4.59 లక్షల కోట్లే వసూలు
- అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు తగ్గడం, రిఫండ్‌లు పెరగడం కారణం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నికర పన్ను వసూళ్లు రూ. 4.59 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధితో పోలిస్తే 1.39 శాతం తగ్గాయి. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు నెమ్మదించడం, రిఫండ్‌లు అధిక స్థాయిలో ఉండటం ఇందుకు కారణం. రిఫండ్‌లు 58 శాతం పెరిగి రూ. 86,385 కోట్లకు చేరాయి. కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. కార్పొరేట్ల లాభదాయకత, వ్యక్తుల ఆదాయాలను ప్రతిబింబించే అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూన్ 19 మధ్యకాలంలో సుమారు 4 శాతం పెరిగి రూ. 1.56 లక్షల కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో ఇది 27 శాతం వృద్ధి నమోదు చేసింది. కార్పొరేట్లు చెల్లించిన అడ్వాన్స్ ట్యాక్స్ సుమారు 6 శాతం వృద్ధితో రూ. 1.22 లక్షల కోట్లకు చేరగా, వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు సహా కార్పొరేట్‌యేతరుల చెల్లింపులు 2.68 శాతం క్షీణించి రూ. 33,928 కోట్లకు పరిమితమయ్యాయి. సాధారణంగా అడ్వాన్స్ ట్యాక్స్‌ను నాలుగు విడతల్లో (జూన్, సెప్టెంబర్, డిసెంబర్, మార్చి) చెల్లిస్తారు. మరోవైపు, స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు సుమారు 5 శాతం పెరిగి రూ. 5.45 లక్షల కోట్లకు పెరిగాయి. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) 12 శాతం పెరిగి రూ. 13,013 కోట్లకు చేరింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ. 25.20 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లను లక్ష్యంగా పెట్టుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 12.7 శాతం అధికం. జూన్ 19 వరకు నిర్దేశించుకున్న టార్గెట్‌లో 18.21 శాతం వసూళ్లను ప్రభుత్వం సాధించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌టీటీ ద్వారా రూ. 78,000 కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యంగా పెట్టుకుంది.



విమానయాన రంగంలో

ఈ ఏడాదీ జోష్..!

2025-26లో ప్రయాణికుల్లో 7-10 శాతం వృద్ధి

- అయినా నష్టాల్లోనే ఏవియేషన్ సెక్టార్
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విమాన ప్రయాణికుల రద్దీ (ఎయిర్ ట్రాఫిక్) 7–10 శాతం మేర పెరగొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. 17.5–18.1 కోట్ల మంది ప్రయాణించొచ్చని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో (2024–25)లో 7.6 శాతం అధికంగా 16.54 కోట్ల మంది ప్రయాణించడం గమనార్హం. 2019–20 సంవత్సరంలో నమోదైన విమాన ప్రయాణికుల రద్దీతో పోల్చితే ఇది 16.8 శాతం వృద్ధికి సమానమని పేర్కొంది. ప్రయాణికుల రద్దీ పెరిగినప్పటికీ విమానయాన రంగం రూ.2,000 కోట్ల నుంచి రూ.3,000 కోట్ల వరకు నికర నష్టాలను మూటగట్టుకోవచ్చని అంచనా వేసింది. 2024–25లో ఈ రంగం నమోదు చేసిన నష్టాల స్థాయిలోనే ఈ ఏడాదీ ఉండొచ్చని.. 2023–24లో రూ.1,600 కోట్ల నికర లాభాలతో పోల్చి చూస్తే పూర్తి వైరుధ్యమని వివరించింది. అధిక ఇంధన ధరలు, పెరుగుతున్న వ్యయాలు, నూతన ఎయిర్‌క్రాఫ్ట్‌లకు సంబంధించి లీజు వ్యయాల పెరుగుదల వంటి పరిణామాలను నష్టాలకు కారణాలుగా తెలిపింది. పరిశ్రమ వడ్డీ చెల్లింపుల నిష్పత్తి (ఇంటరెస్ట్ కవరేజీ) 1.5–2 శాతం స్థాయిలో ఉంటుందని పేర్కొంది. ఎన్నో సవాళ్ల మధ్య ఆర్థిక స్థిరత్వంలో మెరుగుదల కనిపిస్తున్నట్టు వివరించింది.

మే నెలలో ప్రయాణాల జోరు

మే నెలలో 1.43 కోట్ల మంది ప్రయాణికులు విమానయాన సేవలను వినియోగించుకున్నారు. 2024 మే నెల డేటాతో పోల్చి చూస్తే ఇది 4 % అధికమని ఇక్రా నివేదిక తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలతో పోల్చి చూసినప్పుడు వృద్ధి ఫ్లాట్‌గా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్–మే నెలల్లో కలిపి 2.86 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారు. గత ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల కంటే 6.2% ఎక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీ ప్రయాణికుల్లో వృద్ధి 7–10% మేర, అంతర్జాతీయ ప్రయాణికుల్లో వృద్ధి 15–20% మేర నమోదవుతుందని ఇక్రా అంచనా వేసింది. వ్యయాలు పెరిగిపోయిన నేపథ్యంలో మెరుగైన పీఎల్‌ఎఫ్‌పై ఎయిర్‌లైన్స్ దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొంది.

గిగ్ ఉద్యోగాలకు భారీ డిమాండ్

- గతేడాదిలో 92% పెరుగుదల
- వర్క్ ఇండియా సర్వే



ముంబై: గతేడాది బ్లూ–కాలర్(ఆఫీసేతర) విభాగంలో గిగ్ ఉద్యోగాలు 92% పెరిగినట్లు బ్లూ, గ్రే కాలర్ రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ వర్క్ ఇండియా నివేదిక పేర్కొంది. వేగంగా విస్తరిస్తున్న ఈ–కామర్స్, ఫుడ్ డెలివరీ, రైడింగ్ ప్లాట్‌ఫామ్‌ల్లో కార్మికులకు పెరుగుతున్న డిమాండ్‌కు ఇది సంకేతమని సర్వే తెలిపింది. "క్విక్ కామర్స్ కంపెనీలు కేవలం డిమాండ్ సృష్టించడమే కాదు. నమ్మకమైన ఆదాయ వనరులుగా మారాయి. చాలా మంది అభ్యర్థులకు ముఖ్యంగా చిన్న పట్టణాల్లో డెలివరీ ఉద్యోగం కేవలం పార్ట్‌టైం జాబ్ మాత్రమే కాకుండా కెరీర్ ఎంపికగా మారింది'' అని వర్క్ ఇండియా సీఈవో, వ్యవస్థాపకులు నీలేష్ దుంగర్వాల్ తెలిపారు. గిగ్ రోల్స్ ఉద్యోగాలకు ఇప్పటికీ డిమాండ్ బలంగా ఉంది. మొత్తం దరఖాస్తుల పెరుగుదల 63 శాతంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. లాస్ట్ మైల్ లాజిస్టిక్ ఉద్యోగాలకు కేంద్రాలైన ఢిల్లీ, అహ్మదాబాద్, కోల్‌కత్తా నగరాల్లో ఈ సర్వే నిర్వహించారు.

కార్పొరేట్ యోగా!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. దేశీయ కార్పొరేట్ సంస్థల చైర్మన్‌లు, ఎండీలు 'యోగా డే'ను జరుపుకున్నారు. ప్రతిరోజూ యోగా సాధనతో సత్యాన్ని అన్వేషిస్తున్నాను. శ్వాసపై నియంత్రణతో భావోద్వేగాలపై పట్టు సాధించవచ్చు. యోగా మార్గం పూర్తి క్రమశిక్షణతో కూడుకున్నది. స్వీయ ఆవిష్కరణకు దిక్సూచి లాంటిది'' అని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ సంగీతా రెడ్డి అన్నారు. ''యోగా ద్వారా పది నిమిషాల ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో, పరుగులు పెడుతున్న ప్రపంచంలోనూ ప్రశాంతతను పొందవచ్చు'' అని వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్ తెలిపారు. భారతదేశం నుంచి ప్రపంచ దేశాలకు లభించిన అమూల్యమైన బహుమతి యోగా. ఇది క్రమశిక్షణ, సాధన, జీవన మార్గం'' అని జిందాల్ స్టీల్ అండ్ పవర్ చైర్మన్, బీజేపీ ఎంపీ నవీన్ జిందాల్ తెలిపారు. యోగా గురువు రామ్‌దేవ్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.


అనిల్ అగర్వాల్


బాబా రామ్‌దేవ్ నవీన్ జిందాల్


సంగీతా రెడ్డి

జువెంటస్‌లో మిగతా వాటాలపై ఎంక్యూర్ దృష్టి

న్యూఢిల్లీ: జువెంటస్ హెల్త్‌కేర్ సంస్థలో మిగతా 20.42 శాతం వాటాలను మైనారిటీ షేర్‌హోల్డర్ల నుంచి కొనుగోలు చేయనున్నట్లు ఎంక్యూర్ ఫార్మా తెలిపింది. ఇందుకోసం రూ. 724.9 కోట్లు వెచ్చించనున్నట్లు వివరించింది. దీనికి సంబంధించి మైనారిటీ షేర్‌హోల్డర్లతో ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదనకు డైరెక్టర్ల బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2లో డీల్ పూర్తి కావచ్చని కంపెనీ అంచనా. ప్రస్తుతం జువెంటస్‌లో ఎంక్యూర్‌కి 79.58 శాతం వాటాలు ఉన్నాయి.



నీరజ్ ‘టాప్’ త్రో

పారిస్ డైమండ్ లీగ్ టైటిల్ కైవసం

- ఈటెను 88.16 మీటర్ల దూరం విసిరిన భారత అథ్లెట్
- వెబర్‌కు రెండో స్థానం

పారిస్: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పారిస్ డైమండ్ లీగ్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ మీట్‌లో నీరజ్ జావెలిన్‌ను 88.16 మీటర్ల దూరం అగ్ర స్థానంలో నిలిచాడు. రెండేళ్లలో నీరజ్‌కు ఇదే తొలి డైమండ్ లీగ్ టైటిల్ కాగా... 90 మీటర్ల మార్క్ దాటకుండానే భారత స్టార్ నంబర్‌వన్‌గా నిలవడం విశేషం. జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ 87.88 మీటర్ల దూరంతో రెండో స్థానంలో నిలిచాడు. బ్రెజిల్‌కు చెందిన లూయిజ్ మారిసియో డా సిల్వా 86.62 మీటర్ల దూరంతో మూడో స్థానం దక్కించుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే అత్యుత్తమ ప్రదర్శన చేసిన నీరజ్... ఆ తర్వాత రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 85.10 మీటర్లు విసిరాడు... ఆ తర్వాత మూడు సార్లు ఫౌల్ చేసిన భారత అథ్లెట్... ఆఖరి ప్రయత్నంలో 82.89 మీటర్ల దూరం నమోదు చేసుకున్నాడు. కేషార్న్ వాల్‌కాట్ (81.66 మీటర్లు; ట్రినిడాడ్, టొబాగో) నాలుగో స్థానం దక్కించుకోగా... రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (80.29 మీటర్లు; గ్రెనడా), జూలియన్ యెగో (80.26 మీటర్లు; కెన్యా) వరుసగా ఐదో, ఆరో స్థానాల్లో నిలిచారు.

సీజన్‌లో తొలి టైటిల్...

భారత అథ్లెటిక్స్ గతిని మార్చిన నీరజ్ ఈ సీజన్‌లో తొలి టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. చివరిసారిగా 2023లో లుసానే డైమండ్ లీగ్‌లో విజేతగా నిలిచిన నీరజ్... ఆ తర్వాత ఈ రెండేళ్లలో బరిలోకి దిగిన ఆరు డైమండ్ లీగ్‌ల్లో రెండో స్థానానికే పరిమితమయ్యాడు. పారిస్ డైమండ్ లీగ్‌లో చివరిసారిగా 2017లో పోటీపడిన నీరజ్... జూనియర్ ప్రపంచ చాంపియన్‌గా బరిలోకి దిగి ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన భారత జావెలిన్ త్రోయర్... 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం గెలుచుకున్నాడు. గత నెలలో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల మార్క్ దాటిన ఈ హర్యానా త్రోయర్... దూరంతో పాటు ఫిట్‌నెస్‌పై కూడా దృష్టి పెట్టాడు. ఈ నెల 24 నుంచి జరగనున్న గోల్డెన్ స్పైక్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొననున్న 27 ఏళ్ల నీరజ్... ఆ తర్వాత భారత్‌లో తొలిసారి నిర్వహిస్తున్న అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ ‘నీరజ్ చోప్రా క్లాసిక్’లో పాల్గొననున్నాడు. బెంగళూరు వేదికగా వచ్చే నెల 5న ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య ‘ఎ’ కేటగిరీ గుర్తింపునిచ్చింది.

“నా ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా. జావెలిన్ విసరడానికి ముందు నా రనప్ వేగంగా ఉంది. దాన్ని అదుపు చేయలేకపోయా. అయినా ఫలితం ఆనందాన్నిచ్చింది. మరో నాలుగు రోజుల్లో జరగనున్న ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొననున్నా. అందుకే కాస్త విశ్రాంతి అవసరం. 90 మీటర్ల మార్క్ దాటిన తర్వాత సగం ఒత్తిడి దూరమైనట్లు అనిపించింది. ఇక నిలకడగా అదే దూరాన్ని కొనసాగించడంపై దృష్టి పెడతా. అయితే పోటీ జరిగే రోజు పరిస్థితులు, వాతావరణం, శరీర తీరును బట్టి ప్రదర్శనలో మార్పులు రావడం సహజం. అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా 90 మీటర్ల దూరాన్ని కొనసాగించాలంటే మరింత దృఢంగా ఉండాలి. దాని కోసం సాధన కొనసాగిస్తా. జావెలిన్ విసిరే సమయంలో నియంత్రణ ముఖ్యం. శిక్షణ సమయంలో దానిపై దృష్టి సారిస్తా. ప్రదర్శనలో చిన్న చిన్న లోపాలు జరుగుతూ ఉంటాయి. వాటిని సరిదిద్దుకోవాల్సిన అవసరముంది. ఈ సీజన్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొననున్నా. అందుకే నిలకడగా మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటున్నా. టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకం సాధించినప్పటి నుంచి దేశంలో జావెలిన్ త్రోకు ఆదరణ మరింత పెరిగింది. ఇప్పుడు నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్ నిర్వహిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ఇది మరింత పెద్ద స్థాయికి చేరడం ఖాయం. - నీరజ్ చోప్రా

ఇంగ్లండ్ కౌంటీల్లో ఇషాన్ కిషన్



న్యూఢిల్లీ: భారత వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ తొలిసారి ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఇషాన్ కిషన్‌తో కౌంటీ జట్టు నాటింగ్‌హామ్‌షైర్ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఈ సీజన్‌లో అతను రెండు మ్యాచ్‌లలో బరిలోకి దిగుతాడు. వాస్తవానికి ఇప్పటి వరకు నాటింగ్‌హామ్‌షైర్‌తో దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ కైల్ వెరీన్ ఉన్నాడు. అయితే అతను స్వదేశంలో జింబాబ్వేతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో ఆడేందుకు వెళుతున్నాడు. దాంతో వెరీన్ స్థానంలో కిషన్‌కు అవకాశం లభించింది. నేటి నుంచి ట్రెంట్‌బ్రిడ్జ్‌లో యార్క్‌షైర్‌తో, ఈ నెల 29 నుంచి టాంటన్‌లో సోమర్సెట్‌తో జరిగే మ్యాచ్‌లలో నాటింగ్‌హామ్‌షైర్ జట్టుకు అతను ప్రాతినిధ్యం వహిస్తాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ ద్వారానే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇషాన్ కిషన్ 58 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 37.87 సగటుతో 3447 పరుగులు చేశాడు. ఇందులో 8 సెంచరీలు, 17 అర్ధ సెంచరీలు ఉన్నాయి. భారత్ తరఫున కిషన్ 2 టెస్టులు ఆడాడు. ఇప్పటికే ఈ సీజన్‌లో మరో ముగ్గురు భారత ఆటగాళ్లు కౌంటీల్లో ఆడుతున్నారు. తిలక్ వర్మ (హాంప్‌షైర్), రుతురాజ్ గైక్వాడ్ (యార్క్‌షైర్), యుజువేంద్ర చహల్ (నార్తాంప్టన్‌షైర్) బరిలో ఉన్నారు. కౌంటీ చాంపియన్‌షిప్ డివిజన్ 1లో ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడిన నాటింగ్‌హామ్‌షైర్ నాలుగు మ్యాచ్‌లు గెలిచి ప్రస్తుతం అగ్ర స్థానంలో ఉంది.

భారత మహిళలకు టీమ్ టైటిల్

4 స్వర్ణాలు సహా 10 పతకాలు కైవసం



అండర్-23 ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ఆసియా అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు అదరగొట్టారు. బరిలోకి దిగిన 10 విభాగాల్లోనూ పతకాలు కొల్లగొట్టడం ద్వారా టీమ్ టైటిల్ ఖాతాలో వేసుకున్నారు. వియత్నాం వేదికగా జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో భారత్ 4 స్వర్ణాలు, 5 రజతాలు, ఒక కాంస్యం దక్కించుకున్నారు. ప్రియాంశి ప్రజాపత్ (50 కేజీలు), రీనా (55 కేజీలు), సృష్టి (68 కేజీలు), ప్రియా (76 కేజీలు) పసిడి పతకాలు గెలుచుకోగా... నేహ శర్మ (57 కేజీలు), తన్వీ (59 కేజీలు), ప్రగతి (62 కేజీలు), శిక్ష (65 కేజీలు), జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) ఫైనల్లో పరాజయం చెంది రజత పతకాలు కైవసం చేసుకున్నారు. 53 కేజీల విభాగంలో హీనా బెన్ ఖలీఫా కాంస్యం దక్కించుకుంది. గ్రీకో రోమన్ విభాగంలో సుమిత్ (63 కేజీలు) స్వర్ణం గెలుచుకోగా... నితీశ్ (97 కేజీలు), అంకిత్ గులియా (72 కేజీలు) కాంస్య పతకాలు నెగ్గారు. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో విక్కీ (97 కేజీలు) పసిడి పతకం కైవసం చేసుకోగా... సాగర్ జగ్లాన్ (86 కేజీలు) కాంస్యం గెలుచుకున్నాడు. సుజీత్ (65 కేజీలు), జైదీప్ (74 కేజీలు), చంద్రమోహన్ (79 కేజీలు), సచిన్ (92 కేజీలు) పసిడి పతక రేసులో ఉండగా... జస్‌పూరన్ సింగ్ (125 కేజీలు) కాంస్యం కోసం పోటీపడనున్నాడు.

బంగ్లా, శ్రీలంక టెస్టు ‘డ్రా’

నజ్ముల్ మరో సెంచరీ


నజ్ముల్

గాలె: బ్యాటర్లు పరుగుల పండగ చేసుకున్న బంగ్లాదేశ్, శ్రీలంక తొలి టెస్టు చివరకు ‘డ్రా’గా ముగిసింది. శనివారం వర్షం కారణంగా మ్యాచ్‌కు అంతరాయం వాటిల్లడంతో... రసవత్తర ఫలితానికి అవకాశం లేకుండా పోయింది. ఓవర్‌నైట్ స్కోరు 177/3తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్... 87 ఓవర్లలో 285/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. కెప్టెన్ నజ్ముల్ హసన్ షంటో (199 బంతుల్లో 125 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఈ మ్యాచ్‌లో రెండో సెంచరీని తన పేరిట రాసుకున్నాడు. ముష్ఫికర్ రహీమ్ (102 బంతుల్లో 49; 4 ఫోర్లు) రాణించాడు. అయితే బంగ్లా కెప్టెన్ సెంచరీ పూర్తి చేసుకునే క్రమంలో... నిదానంగా ఆడటంతో మ్యాచ్ ఆసక్తికర మలుపు వైపు మొగ్గు చూపలేదు. శ్రీలంక బౌలర్లలో తిరిందు రత్ననాయకే 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 296 పరుగుల లక్ష్యఛేదన కోసం బరిలోకి దిగిన శ్రీలంక ఆట నిలిచిపోయే సమయానికి 32 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. తైజుల్ ఇస్లామ్ 3 వికెట్లు తీసి భయపెట్టినా... తగినంత సమయం లేకపోవడంతో శ్రీలంక ‘డ్రా’తో గట్టెక్కింది. అంతకుముందు బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 495 పరుగులు చేయగా... శ్రీలంక 485 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసిన బంగ్లాదేశ్ సారథి నజ్ముల్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య బుధవారం నుంచి కొలంబో వేదికగా రెండో టెస్టు ప్రారంభం కానుంది.

మాథ్యూస్‌కు వీడ్కోలు



ఈ మ్యాచ్‌తో శ్రీలంక ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. జాతీయ జట్టు తరఫున 119 టెస్టులు ఆడిన మాథ్యూస్ 44.40 సగటుతో 8214 పరుగులు చేశాడు. బంతితోనూ ఫర్వాలేదనిపించిన అతడు 33 వికెట్లు సైతం పడగొట్టాడు. 2014లో ఇంగ్లండ్ గడ్డపై ఏకైక టెస్టు సిరీస్ గెలిచిన శ్రీలంక జట్టుకు మాథ్యూస్ కెప్టెన్‌గానూ వ్యవహరించాడు.

సంయుక్త ఆధిక్యంలో లలిత్‌బాబు

ముంబై: భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లలిత్‌బాబు ఇంటర్నేషనల్ జీఎం అండ్ జూనియర్ చెస్ టోర్నమెంట్‌లో సంయుక్తంగా అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. ఐదో రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ ఎన్‌గుయెన్ డక్ హొవా (వియత్నాం)పై లలిత్ బాబు విజయం సాధించాడు. అన్ని రౌండ్‌లలోనూ విజయాలు సాధించిన లలిత్ 5 పాయింట్లతో ఉన్నాడు. మరో వైపు ఆర్సన్ డావ్‌టిన్ (ఆర్మేనియా) కూడా ఐదు రౌండ్‌లు గెలిచి 5/5తో లలిత్‌తో కలిసి ముందంజలో ఉన్నాడు. ఆర్సన్ ఐదో రౌండ్‌లో నికిటెంకో మిహైల్ (బెలారస్)ను ఓడించాడు. జూనియర్ విభాగంలో భారత ఆటగాళ్లు అన్ష్ నెరుర్కర్, మధేశ్ చెరో 5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

డోపింగ్... ప్రమాద ఘంటికలు!


- దేశంలో నానాటికీ పెరుగుతున్న పాజిటివ్ కేసులు
- 2023 పరీక్షల్లో పట్టుబడిన 214 మంది అథ్లెట్లు



న్యూఢిల్లీ: క్రీడల నుంచి డోపింగ్‌ను రూపుమాపాలని ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా... సత్ఫలితాలు మాత్రం రావడం లేదు. వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (వాడా) పరీక్షల ఫలితాల్లో భారత్ ప్రమాదకర స్థాయిలో నిలుస్తోంది. 2023 సంవత్సరానికి గానూ ‘వాడా’ నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో భారత్ 3.8 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. 5,606 నమూనాలు సేకరించగా... అందులో 3.8 శాతం అంటే 214 మంది అథ్లెట్లు నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. అంతకముందు సంవత్సరంలో 3,865 నమూనాల్లో భారత డోపింగ్ రేటు 3.2గా ఉంది. 5,606 నమూనాల్లో 2,748 నమూనాలు పోటీలు జరుగుతున్న సమయంలో తీసుకున్నవి కావడం గమనార్హం. నిషేధిత ఉత్ప్రేరకాలు వాడిన జాబితాలో చైనా (28,197 నమూనాల్లో 0.2శాతం), అమెరికా (6798 నమూనాల్లో 1.0 శాతం), ఫ్రాన్స్ (11,368 నమూనాల్లో 0.9 శాతం), జర్మనీ (15,153 నమూనాల్లో 0.4 శాతం), రష్యా (10,395 నమూనాల్లో 1.0 శాతం) మెరుగ్గా ఉండగా... భారత్ ప్రమాదకర స్థాయిలో ఉంది. సేకరించిన నమూనాల్లో భారత్ నుంచి 214 మంది పాజిటివ్‌గా తేలగా... ఫ్రాన్స్ నుంచి 105 మంది, రష్యా నుంచి 99 మంది, అమెరికా నుంచి 66 మంది, చైనా నుంచి 60 మంది, జర్మనీ నుంచి 57 మంది అథ్లెట్లు డోపింగ్‌లో దొరికారు.

భారత్‌కు ఏడో పరాజయం

బెల్జియంతో చేతిలో 3-6 గోల్స్ తేడాతో ఓటమి • ప్రొ హాకీ లీగ్



దిల్‌ప్రీత్ సింగ్



దీపిక

ఆంట్‌వర్ప్ (బెల్జియం): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) యూరోపియన్ అంచె ప్రొ లీగ్‌లో భారత జట్ల పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వరుసగా ఆరు మ్యాచ్‌లు ఓడిన భారత పురుషుల జట్టు ... ఆతిథ్య బెల్జియంతో ఆడిన ఏడో మ్యాచ్‌లోనూ ఓటమి పాలైంది. శనివారం జరిగిన పోరులో భారత్ 3-6 గోల్స్ తేడాతో బెల్జియం చేతిలో ఓడింది. మ్యాచ్ ఆరంభంలోనే ప్రత్యర్థికి ఆధిక్యం సమర్పించుకున్న భారత్... ఆ తర్వాత కోలుకోలేకపోయింది. భారత్ తరఫున దిల్‌ప్రీత్ సింగ్ (36వ నిమిషంలో), మన్‌దీప్ సింగ్ (38వ నిమిషంలో), అమిత్ రోహిదాస్ (56వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. బెల్జియం తరఫున ఆర్థర్ వాన్ డోరెన్ (1వ నిమిషంలో), అలెగ్జాండర్ హెండ్రిక్స్ (28వ నిమిషంలో), రోమన్ డ్యుకోట్ (49వ నిమిషంలో), థైబ్యూ స్టాక్‌బ్రోక్స్ (53వ నిమిషంలో), వాన్ డొరెన్ (54వ నిమిషంలో), టామ్ బూన్ (59వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్‌లో భారత్‌కు 9 పెనాల్టీ కార్నర్ అవకాశాలు దక్కినా అందులో కేవలం రెండింటిని మాత్రమే గోల్స్‌గా మలచగలిగింది. అదే సమయంలో ఆఖరి క్వార్టర్‌లో దుమ్మురేపిన ప్రపంచ మూడో ర్యాంకర్ బెల్జియం నాలుగు గోల్స్‌తో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చి మ్యాచ్‌ను ముగించింది. వచ్చే ఏడాది జరగనున్న హాకీ ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించేందుకు ఈ లీగ్ ఉపయోగపడనుండగా... టీమిండియా దాన్ని సద్వినియోగ పర్చుకోలేకపోయింది. నెదర్లాండ్స్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా చేతిలో రెండేసి మ్యాచ్‌లు ఓడిన భారత్... ఆదివారం తమ చివరి మ్యాచ్‌లో మరోసారి బెల్జియంతో తలపడనుంది. ఇప్పటి వరకు 15 మ్యాచ్‌లు ఆడిన భారత్ 5 విజయాలు, 10 పరాజయాలతో 15 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది.

మహిళల జట్టు కూడా...

యూరప్ అంచె పోటీల్లో ఏమాత్రం ఆకట్టుకోలేకపోతున్న భారత మహిళల హాకీ జట్టు మరో పరాజయం మూటగట్టుకుంది. శనివారం సలీమా టెటె సారథ్యంలోని భారత్ 1-5 గోల్స్ తేడాతో బెల్జియం చేతిలో ఓడింది. ఈ పర్యటనలో మన అమ్మాయిలకు ఇది ఐదో ఓటమి. భారత్ తరఫున దీపిక (6వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించగా... బెల్జియం తరఫున బ్రైసర్ (37వ, 55వ నిమిషాల్లో) డబుల్స్ గోల్స్‌తో పాటు లూసీ బ్రైన్ (41వ నిమిషంలో), బెల్లాంగిన్ (54వ నిమిషంలో), చార్లొట్ ఎంజెల్‌బెర్ట్ (58వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడైన ఆట ప్రదర్శించిన బెల్జియం పదే పదే దాడులకు దిగినా... మన రక్షణ శ్రేణి వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంది. దీంతో పాటు లీగ్‌లో చక్కటి ఫామ్‌లో ఉన్న దీపిక గోల్‌తో భారత్‌కు శుభారంభం దక్కింది. తొలి రెండు క్వార్టర్‌లలో బెల్జియం దాడులను మన డిఫెన్స్ అడ్డుకోవడంతో ఒక దశలో టీమిండియా 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇదే జోరు కొనసాగిస్తే... యూరప్ అంచె పోటీల్లో తొలి విజయం ఖాతాలో పడ్డట్లే అనుకుంటున్న తరుణంలో బెల్జియం అనూహ్యంగా రెచ్చిపోయింది. మనవాళ్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా పదే పదే దాడులు చేస్తూ విజృంభించింది. ఫలితంగా రెండు క్వార్టర్స్‌ల్లోనే ఐదు గోల్స్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేసింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, అర్జెంటీనా చేతుల్లో రెండేసి మ్యాచ్‌లు ఓడిన భారత అమ్మాయిలు... ఆదివారం మరోసారి బెల్జియంతో తలపడనున్నారు.


యోగా డే సందర్భంగా టోక్యోలోని భారత ఎంబసీలో..


బ్రెజిల్‌లోని రియో డీ జనీరోలోని అర్పోడోర్ బీచ్‌లో ఔత్సాహికులు..


ముంబైలోని మెట్రో రైలులో మహిళా ప్రయాణికుల యోగా


ఒడిశా రాష్ట్రం సంబాల్‌పూర్‌లో సమలేశ్వరి ఆలయం సముదాయంలో జరిగిన యోగా ఉత్సవాల్లో భారీగా పాల్గొన్న జనం


ఫరీదాబాద్‌లోని ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్


ఇండోనేసియాలోని బాలి ద్వీపం నుసా దువాలో ఔత్సాహికుల యోగా సెషన్


ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన యుద్ధ క్షేత్రం సియాచిన్‌లో భారత జవాన్ల యోగా విన్యాసాలు

భార్య పాస్‌పోర్ట్ దరఖాస్తుపై భర్త సంతకం అక్కర్లేదు

- మద్రాస్ హైకోర్టు స్పష్టీకరణ

చెన్నై: పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకునే మహిళలకు భర్త అనుమతి, వారి సంతకం తీసుకోవాల్సిన అవసరం లేదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. తన భర్త సంతకం లేకుండా కొత్త పాస్‌పోర్ట్ జారీ చేసేలా అధికారులను ఆదేశించాలంటూ రేవతి అనే మహిళ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ ఎన్. ఆనంద్ వెంకటేశ్ ఈ మేరకు తీర్పు వెలువరించారు. 2023లో వివాహం కాగా, తన భర్త విడాకుల కోసం కోర్టులో పిటిషన్ వేశారని, అది పెండింగ్‌లో ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ విషయం తెలిపిన తర్వాత కూడా రీజినల్ పాస్‌పోర్టు ఆఫీస్(ఆర్‌పీవో) భర్త అనుమతి, సంతకం తప్పనిసరని చెబుతున్నారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 'పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకునే మహిళలకు భర్త అనుమతి, సంతకం కావాలన్న వాదన పురుషాధిక్య ధోరణిని చాటుతోంది. భార్యను భర్త సొంత ఆస్తిగా సమాజం భావిస్తుండటం సరికాదు. వివాహంతో మహిళ తన వ్యక్తిత్వాన్ని కోల్పోదు. మహిళా సాధికారిత దిశగా అడుగు వేస్తున్న సమాజానికి ఈ ధోరణి మంచిది కాదు'అని పేర్కొన్నారు. పిటిషనర్ అర్హతలను పరిశీలించి, ఆమెకు నాలుగు వారాల్లోగా పాస్‌పోర్టును మంజూరు చేయాలని పీఆర్‌వోను న్యాయమూర్తి ఆదేశించారు.

మహమ్మద్ ఖలీల్‌కు విముక్తి

ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ నిర్బంధం నుంచి విడుదల

చాలా ఆలస్యంగా న్యాయం గెలిచిందన్న ఖలీల్



జెనా: అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల నిరసన కార్యక్రమాలు చేపట్టినందుకు అరెస్టయిన సామాజిక కార్యకర్త, గ్రాడ్యుయేట్ విద్యార్థి మహమ్మద్ ఖలీల్(30)కు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఆయనను విడుదల చేయాలని యూఎస్ జిల్లా జడ్జి మైఖేల్ ఫార్బియార్జ్ ఆదేశించడంతో శుక్రవారం లూసియానాలో ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ నిర్బంధం నుంచి బయటకు వచ్చారు. వలసదారుల విషయంలో దూకుడుగా ముందుకెళ్తున్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి ఈ పరిణామంతో ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. విద్యాసంస్థల్లో నిరసన వ్యక్తం చేస్తే అదుపులోకి తీసుకోవడం, బలవంతంగా దేశం నుంచి బయటకు వెళ్లగొట్టాలని చూడడం చట్టవిరుద్ధమని సాక్షాత్తూ న్యాయస్థానమే తేల్చిచెప్పింది. మహమ్మద్ ఖలీల్ న్యూయార్క్‌లోని తన కుటుంబం వద్దకు వెళ్లనున్నారు. అమెరికా పౌరసత్వం కలిగిన తన భార్యతోపాటు ఇటీవలే జన్మించిన తన బిడ్డను చూడబోతున్నారు. ''చివరకు న్యాయమే గెలిచింది. కానీ, అందుకు చాలా సమయం పట్టింది''అని ఖలీల్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, ఖలీల కేసు విచారణ సమయంలో న్యాయమూర్తి మైఖేల్ ఫార్బియార్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ''చట్టబద్ధంగా అమెరికాలో ఉంటున్న విద్యార్థిని ఇలా నిర్బంధించడం అసాధారణం. హింసకు పాల్పడినట్లు ఖలీల్‌పై ఎలాంటి ఆరోపణలు లేవు. అతడు పారిపోయే అవకాశం లేదు. అయినా ఎందుకు నిర్బంధించారు? అతడి వల్ల అమెరికా సమాజానికి వచ్చిన ముప్పేమీ లేదు. ఒక వ్యక్తిని నిర్బంధించే విషయంలో అమల్లో ఉన్న ప్రమాణాలను ప్రభుత్వం పాటించలేదు. ఖలీల్‌ను వెంటనే విడుదల చేయండి''అని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో ఖలీల్‌ను విడుదల చేస్తూ శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. నిబంధనల ప్రకారం.. ఖలీల్ తన పాస్‌పోర్టును ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు. అమెరికాలో పరిమితంగానే సంచరించవచ్చు.

ఎవరీ మహమ్మద్ ఖలీల్?

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే తొలుత విదేశీ విద్యార్థులపై దృష్టి పెట్టారు. వారిని బయటకు పంపించడమే లక్ష్యంగా పావులు కదిపారు. ఇందు కోసం లేనిపోని నిబంధనలు తీసుకొచ్చారు. చట్టాలు ఉల్లంఘించినా, విద్యాసంస్థల్లో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నా స్వదేశాలకు పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు. చాలామంది బలవంతంగా బయటకు వెళ్లగొట్టారు. అమెరికాలో పాలస్తీనా అనుకూల ప్రదర్శనల్లో పాల్గొన్నందుకు అరెస్టయిన మొట్టమొదటి విదేశీ విద్యార్థి మహమ్మద్ ఖలీల్. ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లు ఈ ఏడాది మార్చి 8న అతడిని అదుపులోకి తీసుకున్నారు. లూసియాలోని మారుమూల ప్రాంతమైన జెనాలో అతడిని నిర్బంధించారు. దాంతో ఖలీల్ న్యాయపోరాటం ప్రారంభించాడు. తనను విడుదల చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. న్యాయస్థానం అతడి వాదనను సమర్థించడంతో 104 రోజుల తర్వాత విడుదలయ్యాడు. ఖలీల్ అరెస్టు వ్యవహారం అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విదేశీయులపై ట్రంప్ దాష్టీకానికి ఈ ఘటన ఒక ప్రతీకగా నిలిచింది. ఖలీల్ 1995లో సిరియాలోని డెమాస్కస్‌లో శరణార్థి శిబిరంలో పాలస్తీనా దంపతులకు జన్మించాడు.

అసలు సినిమా ముందుంది..!

- 2029 ఎన్నికల్లో తన పాత్రపై గడ్కరీ వ్యాఖ్య

నాగ్‌పూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో 11 ఏళ్ల పాలనలో తన పాత్రపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి వరకు జరిగింది న్యూస్‌రీల్ మాత్రమే, అసలు సినిమా ముందుందని పేర్కొన్నారు. అయితే, నాయకులకు ఎలాంటి బాధ్యతలు అప్పగించాలని అంశాన్ని పార్టీయే చూసుకుంటుందని, పార్టీ నిర్ణయాన్ని అనుసరించి పనిచేస్తానని తెలిపారు. 'ఇప్పటి వరకు మీరు చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా మొదలు కావాల్సి ఉంది'అని గడ్కరీ శనివారం నరేంద్ర మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనపై పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. తన రాజకీయ జీవితాన్ని గురించి ఎన్నడూ చెప్పుకోలేదని, విమానాశ్రయాలలో తనకు అట్టహాస స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని మద్దతుదారులను ఎప్పుడూ కోరలేదని ఆయన నొక్కి చెప్పారు. విదర్భ ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలను ఆపాలన్న వ్యక్తిగత లక్ష్యం మేరకు పనిచేస్తున్నానన్నారు. రహదారుల అభివృద్ధి కంటే వ్యవసాయం, సామాజిక కార్యక్రమాలపైనే ఆసక్తి ఎక్కువని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి అయిన గడ్కరీ వివరించారు. తలసరి ఆదాయం లెక్కన మన దేశం టాప్ 10లో లేకపోవడానికి అధిక జనాభాయే కారణమని అభిప్రాయపడ్డారు. అందుకే, జనాభా నియంత్రణకు బిల్లు తేవాల్సిన అవసరం ఉందన్నారు. 'ఇది మతానికో, భాషకో సంబంధించిన అంశం కాదు. ఇది ఆర్థిక పరమైన అంశం. అభివృద్ధి ఎంత జరిగినా, ఫలాలు కనిపించడం లేదు. జనాభా అధికంగా పెరగడమే ఇందుకు కారణం'అని వివరించారు.

వేరే కులం వ్యక్తిని పెళ్లి చేసుకుందని కుటుంబంలోని 40 మందికి గుండు గీయించారు

రాయగఢ: దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ కులాచారాలు, కట్టుబాట్లు ఎంతగా వేళ్లూనుకున్నాయనేందుకు తాజా ఉదాహరణ. ఒడిశాలోని రాయగఢ జిల్లాలో ఇటీవల జరిగిన ఉదంతమిది. కాశీపూర్ బ్లాక్‌లోని బైగనగూడ గ్రామానికి చెందిన గిరిజన యువతి, పారుగూరులోని ఎస్సీ వర్గానికి చెందిన యువకుడిని పెళ్లి చేసుకుంది. ఇది తెలిసిన గ్రామ పెద్దలు ప్రాయశ్చితం చేయాల్సిందేనంటూ ఆమె కుటుంబంపై ఒత్తిడి తెచ్చారు. లేకుంటే కులం నుంచి శాశ్వతంగా వెలి వేస్తామని బెదిరించారు. వారు చెప్పిన విధంగానే, ఆ యువతి కుటుంబంలోని చిన్నాపెద్దా అంతా కలిపి సుమారు 40 మంది గుండు గీయించుకున్నారు. గ్రామ దేవతకు జంతు బలి ఇచ్చారు. వీటితో సంతృప్తి చెందిన గ్రామ పెద్దలు వారందరినీ తిరిగి కులంలో కలుపుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే, గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో 40 మంది గుండ్లు గీయించుకుని కూర్చున్నప్పటి ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడంతో అధికార యంత్రాంగం కదిలింది. ఈ విషయమై దర్యాప్తు జరిపి బాధితులపై చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించారు. కాగా, ఒడిశాలో కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.2.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుండటం గమనార్హం.

బిహార్‌లో పెన్షన్ మరో రూ.700 పెంపు

- రూ.1,100 చేరిన మొత్తం పెన్షన్

పాట్నా: బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ రూ.700 పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శనివారం ప్రకటించారు. వచ్చే నెల నుంచి ఇది అమల్లోకి వస్తుందని, ఒక్కో లబ్ధిదారులకు పెన్షన్ కింద రూ.1,100 చొప్పున అందుతుందని తెలిపారు. ప్రతినెలా పదో తేదీన పెన్షన్ సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని వెల్లడించారు. బిహార్‌లో సామాజిక భద్రత పెన్షన్ పథకం కింద ప్రస్తుతం పెన్షన్ నెలకు రూ.400 చొప్పున ఇస్తున్నారు. రాష్ట్రంలో 1.09 కోట్ల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. రూ.700 పెంపుతో వీరందరికీ ప్రయోజనం చేకూరనుంది. ఈ పెంపుతో ప్రభుత్వ ఖజానాపై ప్రతిఏటా అదనంగా రూ.3,594 కోట్ల భారం పడనుంది. ఇదిలా ఉండగా, 'జీవిక దీదీ'పథకం కింద మహిళలకు ఇచ్చిన రుణాలపై వడ్డీ రేటును 3 శాతం తగ్గిస్తున్నట్లు బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తెలిపారు.

ఉగ్రవాదాన్ని సహించేది లేదని పాక్‌కు తేల్చిచెప్పాం

- ఆపరేషన్ సిందూర్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఉధంపూర్(జమ్మూకశ్మీర్): ఆపరేషన్ సిందూర్ పూర్తి కాలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌ను హెచ్చరించారు. భారత భూభాగంపై దాడులు చేసేందుకు యత్నిస్తే తీవ్ర పరిణామాలుంటాయన్నారు. ఉగ్రవాదంపై ఎలాంటి చర్యలనయినా తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉధంపూర్‌లోని నార్తర్న్ కమాండ్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరిగిన యోగా సెషన్‌లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి జవాన్లనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ కూడా ఉన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్ కేవలం ప్రతిచర్య మాత్రమే కాదు, 2016నాటి సర్జికల్ స్ట్రైక్‌కు, 2019లో చేపట్టిన బాలాకోట్ దాడికి సహజమైన కొనసాగింపు అని ఆయన వ్యాఖ్యానించారు. 'ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత బలగాలు సరిహద్దు వెంబడి ఉన్న ఉగ్ర స్థావరాలను గురి చూసి కొట్టాయి. ఇతర లక్ష్యాలను సైతం మన సేనలు ధ్వంసం చేయగలవు. కానీ, మనం అలా చేయలేదు. సంయమనం పాటించాం'అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. పహల్గాం దారుణం కేవలం ఉగ్రదాడి మాత్రమే కాదు, దేశంలో సామాజిక, మత ఐక్యతను దెబ్బతీయడమే లక్ష్యంగా చేపట్టిన దాడి అని ఆయన తెలిపారు. 'మనం పాక్ దుష్ట పన్నాగాలను భగ్నం చేయడమే కాదు, ఆ దేశ సైన్యాన్ని మోకరిల్లేలా చేశాం. ఆ తర్వాతే ఆపరేషన్ సిందూర్‌కు విరామమిచ్చాం'అని రాజ్‌నాథ్ తెలిపారు.

73 ఏళ్ల వయసులో 51 పుషప్స్

- అబ్బురపర్చిన తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి

చెన్నై: తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి వయసు 73 ఏళ్లు. ఈ వయసులోనూ ఆయన తన శరీరాన్ని దృఢంగా ఉంచుకుంటున్నారు. ఆరోగ్యాన్ని చక్కగా కాపాడుకుంటున్నారు. శనివారం ఉదయం మదురైలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రకరకాల యోగాసనాలు వేశారు. అనంతరం నవ యువకుడి తరహాలో ఏకబిగిన 51 పుషప్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఫిట్‌నెస్‌కు వయసుతో సంబంధం లేదని నిరూపించారు. గవర్నర్ పుషప్స్ చూసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారంతా ప్రశంసల వర్షం కురిపించారు. చప్పట్లతో ఆయనను అభినందించారు. గవర్నర్ వయసు 73 ఏళ్లా? లేక 30 ఏళ్లా? అని చర్చించుకోవడం కనిపించింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మాజీ ఐపీఎస్ అధికారి అయిన ఆర్.ఎన్.రవి ఆరోగ్యపరిరక్షణ కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటారు. ప్రతిరోజూ యోగా, వ్యాయామం చేయడం ఆయనకు అలవాటు. వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే అని చెప్పడానికి గవర్నర్ ఒక ఉదాహరణగా నిలిచారు.

మేకిన్ ఇండియాతో చైనాకే లాభం.. మనకు నష్టం

- పదేళ్లలో చైనా నుంచి రెట్టింపైన దిగుమతులు
- నినాదాలు ఇవ్వడంలో మోదీ హిట్
- పరిష్కారాలు చూపడంలో ఫట్
- రాహుల్ గాంధీ ధ్వజం


శనివారం ఢిల్లీలో ఎలక్ట్రానిక్స్ దుకాణదారునితో రాహుల్

సాక్షి, న్యూఢిల్లీ: భారత్‌లో చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా'తో మన దేశానికి ఎలాంటి లాభం లేకపోగా చైనాయే ఎక్కువగా లాభపడిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. 2014 తర్వాత భారత్‌లో తయారీ రంగం జీడీపీలో 14 శాతానికి పడిపోవడం, చైనా నుంచి దిగుమతులు రెట్టింపు కావడాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రధాని మోదీ నినాదాలు ఇవ్వడంలో మాస్టర్ అని.. పరిష్కారాలు చూపడంలో కాదని రాహుల్ ఎద్దేవా చేశారు. శనివారం రాహుల్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. 'మేక్ ఇన్ ఇండియా పరిశ్రమల బూమ్‌కి మోదీ సర్కార్ హామీ ఇచ్చింది. అయితే తయారీరంగం ఎందుకు చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయికి దిగజారింది? యువత అత్యధిక స్థాయిలో నిరుద్యోగాన్ని ఎదుర్కొంటోంది. చైనా నుంచి దిగుమతులు రెట్టింపయ్యాయి. నినాదాలు ఇచ్చే కళలో మోదీ విపరీతమైన నైపుణ్యం సాధించారు. కానీ పరిష్కారాలు చూపడంలో ఘోరంగా విఫలమయ్యారు'' అని రాహుల్ విమర్శించారు.

అంతా అసెంబ్లింగ్

ఢిల్లీలో ప్రముఖమైన ఎలక్ట్రానిక్స్ విక్రయ దుకాణ సముదాయం అయిన నెహ్రూ ప్లేస్‌ను రాహుల్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి మొబైల్ రిపేర్ టెక్నీషియన్స్ అయిన సైఫ్, శివమ్‌లతో కొద్దిసేపు మాట్లాడారు. సంబంధిత వీడియోనూ 'ఎక్స్'లో రాహుల్ షేర్‌చేశారు. '''నిజం ఏంటంటే.. ఇతర దేశాల నుంచి విడిభాగాలను దిగుమతి చేసుకుంటున్నాం. వాటికి బిగించే అసెంబ్లింగ్ పనిచేస్తున్నాం. అంతేగానీ ఇక్కడ ఉత్పత్తిచేయట్లేము. అందుకే మన కారణంగా చైనా లాభపడుతోంది. చైనా ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్ మార్కెట్‌గా వెలుగొందుతోంది. ఇంతపెద్ద మార్కెట్ మరేచోటా లేదు. మనం ఐఫోన్ విడిభాగాలను దిగుమతిచేసుకుని అసెంబ్లింగ్ చేస్తున్నాం. ఇది అతికొద్ది మంది పారిశ్రామికవేత్తల కనుసన్నల్లో జరుగుతోంది. ఇకపై మనమే ఐఫోన్లను తయారుచేసే స్థాయికి ఎదుగుదాం. అప్పుడే ఈ పరిశ్రమ పురోగతి సాధిస్తుంది. ఇతర దేశాల వస్తువులకు భారత్ అనేది మార్కెట్‌గా ఉండకూడదు. స్థానికంగా ఉత్పత్తులను తయారుచేసి ఎగుమతి చేసే మార్కెట్‌గా భారత్ అవతరించాలి. ఇందుకోసం ప్రాథమిక స్థాయిలోనే సంస్కరణలు రావాలి. లక్షల కొద్దీ తయారీదారులు తయారుకావాలి. ఇందుకు ఎంతో నిజాయతీతో కూడిన సంస్కరణలు, ఆర్థిక దన్ను అవసరం. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ) ప్రయోజనాలనూ ప్రభుత్వం గుట్టుచప్పుడుకాకుండా నెమ్మదిగా ఉపసంహరించుకుంటోంది. ఇది కూడా ప్రభుత్వ వైఫల్యమే'అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

విమర్శించిన బీజేపీ

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. ''దేశంలో భారీ సంస్కరణలు, దేశ పురోగతిని అందరూ కళ్లారా చూస్తున్నారు ఒక్క రాహుల్ తప్ప. దేశ ప్రగతిని తక్కువ అంచనా వేయంలో రాహుల్ బిజీగా మారారు. భారత స్వావలంభనకు ఆపరేషన్ సిందూర్ తాజా తార్కాణం. చైనా తయారీ డ్రోన్లను భారత తయారీ డ్రోన్లు నేలకూల్చాయి'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అన్నారు.

10-15 ఏళ్లు దాటిన వాహనాలకు నో పెట్రోల్, నో డీజిల్..!

- దేశ రాజధానిలో 1 నుంచి అమల్లోకి కొత్త రూల్
- ఎన్‌సీఆర్ పరిధిలో పెట్రోల్ బంక్‌ల వద్ద కెమెరాలు
- వాహనాల డేటాబేస్‌తో నంబర్ ప్లేట్ల గుర్తింపు



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తీవ్రరూపం దాల్చుతున్న వాయు కాలుష్యం సమస్యకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో నిబంధనను అమల్లోకి తేనున్నాయి. పదేళ్లు దాటిన వాహనాలకు బంక్‌ల్లో డీజిల్, పెట్రోల్ నిరాకరించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. పదేళ్లు దాటిన డీజిల్ వాహనాలకు, 15 ఏళ్లు దాటిన పెట్రోల్‌తో నడిచే వాహనాలకు జూలై ఒకతో తేదీ నుంచి బంకుల్లో పెట్రోల్, డీజిల్ పోయవద్దంటూ మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ విధానం మిగతా ప్రాంతాల్లోనూ విడతల వారీగా అమల్లోకి రానుందని సమాచారం. ఇందులో భాగంగా వాహనాలను గుర్తించేందుకు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాల నెట్‌వర్క్‌ను ఢిల్లీలో ఉన్న 520 బంకుల్లో ఏర్పాటయ్యాయి. వాహన డేటాబేస్‌తో అనుసంధానించిన ఈ వ్యవస్థలు, పాతబడిన, నిబంధనలను పాటించని వాహనాలను అప్పటికప్పుడు గుర్తిస్తాయి. జూలై 1వ తేదీ నుంచి ఈ కెమెరాలు బంకుల్లోకి వచ్చే వాహనాలను గుర్తించి సిబ్బందిని అప్రమత్తం చేస్తాయి. వాహన రిజిస్ట్రేషన్ నంబర్ సాయంతో ఇతర వివరాలను తక్షణమే క్రాస్ చెక్ చేస్తాయి. వాహనం ఈఎల్‌వీ(ఎండ్ ఆఫ్ లైఫ్ వెహికల్)గా గుర్తించినా లేదా చెల్లుబాటయ్యే పొల్యూషన్ సర్టిఫికెట్ లేకున్నా సిస్టమ్ ఆపరేటర్‌కు ఆడియో హెచ్చరికను జారీ చేస్తాయి. అక్టోబర్ 31 నుంచి గుర్గావ్, ఫరీదాబాద్, ఘాజియాబాద్, గౌతమ్ బుద్ధనగర్, సోనిపట్ ప్రాంతాల్లో ఈ విధానం అమల్లోకి వస్తుంది. ఇక వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఎన్‌సీఆర్ పరిధిలోని మిగిలిన ప్రాంతాల్లోనూ అమలులోకి రానుంది. ఢిల్లీలో 10–15 ఏళ్లు దాటిన వాహనాలు 62 లక్షల వరకు ఉన్నట్లు రవాణా శాఖ గుర్తించింది.

హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులకు అడ్డంకులు వద్దు

- వారికి ప్రవేశాలు కల్పించాలి
- బోస్టన్‌లోని యూఎస్ జిల్లా కోర్టు జడ్జి స్పష్టీకరణ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకోవద్దంటూ ట్రంప్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను బోస్టన్‌లోని యూఎస్ జిల్లా కోర్టు న్యాయమూర్తి అలీసన్ బరోస్ తప్పుపట్టారు. హార్వర్డ్ వర్సిటీకి దేశ విదేశాల్లో ఘనమైన పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, విదేశీ విద్యార్థులను చేర్చుకోవద్దన్న నిర్ణయం సరైంది కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. ట్రంప్ ప్రభుత్వంపై సాగిస్తున్న న్యాయపోరాటంలో హార్వర్డ్ వర్సిటీకి పెద్ద విజయం దక్కినట్లయ్యింది. అయితే, ఈ విద్యాసంస్థలో విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించే విషయంలో అమల్లో ఉన్న విధానాలను పునఃసమీక్షించే అధికారం ప్రభుత్వానికి ఇప్పటికీ ఉందని న్యాయమూర్తి అలీసన్ బరోస్ పేర్కొన్నారు. అయితే, ఆ ప్రక్రియ చట్టానికి లోబడి నిబంధనల మేరకే జరగాలని స్పష్టంచేశారు. అంతేతప్ప విదేశీ విద్యార్థుల ప్రవేశాలను దురుద్దేశపూర్వకంగా అడ్డుకోవడానికి వీల్లేదని తేల్చిచెప్పారు.

గాజా, ఇరాన్‌లపై మౌనమెందుకు?

- మోదీ ప్రభుత్వం ఇకనైనా నోరువిప్పాలి
- కాంగ్రెస్ నేత సోనియా గాంధీ డిమాండ్

న్యూఢిల్లీ: గాజా స్ట్రిప్, ఇరాన్‌లలో ఇజ్రాయెల్ సాగిస్తున్న విధ్వంసకాండపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు నోరువిప్పడం లేదని కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ప్రశ్నించారు. ఆయా దేశాల్లో నిత్యం రక్తపాతం జరుగుతున్నా, వేలాది మంది సాధారణ ప్రజలు బలైపోతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని నిలదీశారు. దీనివల్ల అంతర్జాతీయంగామన గొంతుకను బలహీన పర్చుకోవడంతోపాటు విలువలను పణంగా పెట్టినట్లే అవుతుందని తేల్చిచెప్పారు. ఆ వైఖరి మానుకోవాలని స్పష్టంచేశారు. ఈ మేరకు తాజాగా ఓ ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసంలో సోనియా గాంధీ తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారు. ''2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడిని ఖండిస్తున్నాం. అలాగే గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని వ్యతిరేకిస్తున్నాం. గాజా, ఇరాన్‌ల విషయంలో భారత్ గళం విప్పేందుకు ఇంకా అవకాశం ఉంది. ఆలస్యమేం జరగలేదు. పాలస్తీనా, ఇజ్రాయెల్ విషయంలో భారత వైఖరి చాలాఏళ్లుగా స్పష్టంగా ఉంది. అవి రెండు వేర్వేరు స్వతంత్ర దేశాలుగా శాంతియుతంగా మనుగడ సాగించాలన్న విధానానికి కట్టుబడి ఉంది. ఇప్పుడు ఈ విధానాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం పక్కనపెట్టినట్లు కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియాలో విధ్వంసకర పంథా అనుసరిస్తున్నారు. యుద్ధాలకు వ్యతిరేకం అని చెబుతూనే గాజా, ఇరాన్‌లలో యుద్ధాలను ప్రేరేపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నోరుమెదపకపోవడం సరైంది కాదు. నైతిక, దౌత్యపరమైన సంప్రదాయాల నుంచి పక్కకు తప్పుకోవడం తగదు. దీని వల్ల మనకే నష్టం. మన విలువల్ని పోగొట్టుకోవద్దు. భారత ప్రభుత్వం ఇప్పటికైనా బలంగా గొంతు విప్పాలి. బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పశ్చిమాసియాలో శాంతి సాధన కోసం అన్ని రకాల ప్రయత్నాలూ చేయాలి. అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్నీ వాడుకోవాలి. ఘర్షణలకు తెరదించడానికి వీలుగా చర్చల కోసం ఆయా దేశాలపై దౌత్యమార్గాల్లో ఒత్తిడి పెంచాలి.

భారత పార్లమెంట్ సమావేశాలు దేనితో ప్రారంభమవుతాయి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత పార్లమెంట్

1. లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో-ఇండియన్ల రిజర్వేషన్లను ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 2030 సంవత్సరం వరకు పొడిగించారు?
   1) 101 2) 102 3) 103 4) 104

జ. 4;
వివరణ: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 330, 331, 332, 333 ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో ఇండియన్లకు రిజర్వేషన్లను కల్పిస్తూ, ఇవి 10 సంవత్సరాల పాటు అంటే 1960 వరకు ఉంటాయని ఆర్టికల్-334లో పేర్కొన్నారు. కానీ దీన్ని ఇప్పటికి 7సార్లు పొడిగించారు.

ఇటీవల మోడీ ప్రభుత్వం 126వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టగా పార్లమెంట్ ఆమోదం అనంతరం రాష్ట్రపతి సంతకంతో 2019 డిసెంబర్ 12న 104వ రాజ్యాంగ సవరణ చట్టంగా అమలులోకి వచ్చింది. ప్రస్తుతం ఆర్టికల్ 334 ప్రకారం ఈ రిజర్వేషన్లు 80 సంవత్సరాలపాటు (రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 సంవత్సరం నుంచి) అంటే 2030 వరకు అమలులో ఉంటాయి. ప్రస్తుతం లోక్‌సభలో ఎస్సీలకు 84 స్థానాలు, ఎస్టీలకు 47 స్థానాలు రిజర్వ్ చేశారు.

2. భారత పార్లమెంట్ తొలిసారిగా ఎప్పుడు సమావేశం అయింది?
   1) 1952 మార్చి 13 2) 1952 మే 13
   3) 1953 మార్చి 13 4) 1953 మే 13

జ. 2;
వివరణ: భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పడింది. లోక్‌సభ 1952 ఏప్రిల్ 17న ఏర్పడింది. ఈ రెండు సభలతో కూడిన భారత పార్లమెంట్ తొలిసారిగా 1952 మే 13న సమావేశం అయింది. భారత పార్లమెంట్ 2002 మే 13న స్వర్ణోత్సవాలు జరుపుకోగా, 2012 మే 13న వజ్రోత్సవ ఉత్సవాలు జరుపుకుంది.

3. లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య ఎంత?
   1) 545 2) 550 3) 552 4) 543

జ. 3;
వివరణ: లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 552. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి ఎన్నిక కాగా, 20 మంది కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికవుతారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో-ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. కానీ ప్రస్తుతం లోక్‌సభలో 545 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి, 13 మంది కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో-ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తాడు.

4. లోక్‌సభలో అతి తక్కువగా అంటే ఒక్కొక్క స్థానం ఉన్న రాష్ట్రాలు ఏవి?
   1) సిక్కిం, నాగాలాండ్, గోవా
   2) సిక్కిం, గోవా, మణిపూర్
   3) సిక్కిం, నాగాలాండ్, మిజోరాం
   4) సిక్కిం, మిజోరాం, మణిపూర్

జ. 3;
వివరణ: సిక్కిం, నాగాలాండ్, మిజోరాం రాష్ట్రాల నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం ఒక్క సీటు మాత్రమే ఉంది. అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల నుంచి ఇద్దరు సభ్యుల చొప్పున ఉన్నారు. లోక్‌సభలో ఎక్కువ సభ్యులు ఉన్న మొదటి మూడు రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్ (80), మహారాష్ట్ర (48), పశ్చిమ బెంగాల్ (42).

5. రాజ్యసభకు 233 మంది ఎన్నిక ద్వారా వచ్చే సభ్యుల ఎన్నిక విధానం ఏ విధంగా ఉంటుంది?
   1) సాధారణ మెజారిటీ పద్ధతి, రహస్య ఓటు పద్ధతి
   2) సాధారణ మెజారిటీ పద్ధతి, బహిరంగ ఓటు పద్ధతి
   3) నైష్పత్తిక ప్రాతినిధ్య, రహస్య ఓటు పద్ధతి
   4) నైష్పత్తిక ప్రాతినిధ్య, బహిరంగ ఓటు పద్ధతి

జ. 4;
వివరణ: రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉండగా, 233 మంది సభ్యులు రాష్ట్రాల అసెంబ్లీ సభ్యులు ఎన్నుకోగా మిగిలిన 12 మంది సభ్యులను వివిధ రంగాల్లో ప్రముఖులను రాష్ట్రపతి నియమిస్తాడు. వీరి ఎన్నిక నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదిలీ పద్ధతిలో బహిరంగ ఓటు విధానం ద్వారా జరుగుతుంది. రాజ్యసభ సభ్యుని ఎన్నికల్లో ఓటువేసే ఎం.ఎల్.ఎ. తాను వేసిన ఓటును పార్టీ నియమించిన ఏజెంట్‌కు చూపవలసి ఉంటుంది. క్రాస్ ఓటింగ్‌ను నిరోధించటానికి రాజ్యసభకు 2003 సంవత్సరం నుంచి బహిరంగ ఓటు విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యసభ సభ్యుని ఎన్నిక విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

6. పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థి చెల్లించవలసిన డిపాజిట్ ఎంత?
   1) 10,000 2) 15,000
   3) 20,000 4) 25,000

జ. 4;
వివరణ: లోక్‌సభ లేదా రాజ్యసభకు పోటీచేసే అభ్యర్థి రూ.25,000 డిపాజిట్ చెల్లించాలి. లోక్‌సభ విషయంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం రూ.12,500 చెల్లిస్తే సరిపోతుంది. రాజ్యసభలో ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి డిపాజిట్ చెల్లింపులో ఎటువంటి మినహాయింపు ఉండదు. పోలై చెల్లిన ఓట్లలో 1/6వ వంతు ఓట్లు వస్తే డిపాజిట్ వాపస్ వస్తుంది. లేనిచో డిపాజిట్ గల్లంతు అవుతుంది.

7. భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం ఎన్నిసార్లు సమావేశం కావాలి?
   1) ఒకసారి
   2) రెండుసార్లు 3) మూడుసార్లు
   4) నిర్ణీత కనీస పరిమితి లేదు

జ. 2;
వివరణ: రాజ్యాంగం ప్రకారం భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం రెండుసార్లు సమావేశం కావాలి. ఒక సమావేశానికి మరొక సమావేశానికి మధ్య 6 నెలల వ్యవధి ఉండరాదు. కానీ ప్రస్తుతం భారత పార్లమెంట్ సంవత్సరానికి మూడుసార్లు సమావేశం అవుతుంది. అవి



1) బడ్జెట్ సమావేశాలు(ఫిబ్రవరి నుంచి ఏప్రిల్)
2) వర్షాకాల సమావేశాలు (జూలై నుంచి సెప్టెంబర్)
3) శీతాకాల సమావేశాలు(నవంబర్ నుంచి డిసెంబర్)

అదే విధంగా భారత పార్లమెంట్ సంవత్సరానికి గరిష్ఠంగా ఎన్నిసార్లు అయినా సమావేశం కావచ్చు.

8. కింది ఏ బిల్లుల విషయంలో పార్లమెంట్ ఉభయ సభలకు సమాన అధికారం ఉంది?
   ఎ) సాధారణ బిల్లు
   బి) రాజ్యాంగ సవరణ బిల్లు
   సి) నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లు
   డి) ద్రవ్యబిల్లు
   1) ఎ, బి 2) ఎ, సి
   3) ఎ, బి,సి 4) ఎ, బి, సి, డి

జ. 3;
వివరణ: సాధారణ బిల్లు, రాజ్యాంగ సవరణ బిల్లు నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లులను పార్లమెంట్ ఉభయసభల్లో దేనిలోనైనా ప్రవేశపెట్టవచ్చు. వీటి విషయంలో రెండు సభల ఆమోదం అవసరం. అదే విధంగా రెండు సభలకు సమాన అధికారాలు ఉన్నాయి.

కానీ ద్రవ్యబిల్లు విషయంలో లోక్‌సభకే ఎక్కువ అధికారాలు ఉన్నాయి. స్పీకర్ ఒక బిల్లుని ద్రవ్యబిల్లు అని నిర్ణయించాక రాష్ట్రపతి అనుమతితో దానిని ముందుగా లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టాలి. లోక్‌సభ ఆమోదించిన ద్రవ్యబిల్లుని రాజ్యసభ 14 రోజుల లోపు ఆమోదించాలి లేనిచో అది ఆమోదించినట్లుగా భావించి రాష్ట్రపతి ఆమోదానికై పంపబడును.

9. సభలో సభ్యుడు కాకున్న సభకు అధ్యక్షతవహించే వ్యక్తి?
   1) లోక్‌సభ స్పీకర్
   2) లోక్‌సభ డిప్యూటీ స్పీకర్
   3) రాజ్యసభ చైర్మన్ 4) పై ముగ్గురూ

జ. 3;
వివరణ: భారత ఉపరాష్ట్రపతి పదవీ రీత్యా రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. వాస్తవానికి ఇతను రాజ్యసభ సభ్యుడు కాకున్నప్పటికీ సభకు అధ్యక్షత వహించి బిల్లుల ఆమోదానికి, సభ సజావుగా సాగటానికి కృషి చేస్తాడు. ఇతనికి మామూలు సందర్భంతో ఓటు హక్కు ఉండదు. కానీ ఒక బిల్లుకి అనుకూలంగా, వ్యతిరేకంగా సమాన ఓట్లు వచ్చినప్పుడు ఓటు హక్కు ఉంటుంది. దీనినే 'కాస్టింగ్ ఓటు' లేదా 'నిర్ణాయక ఓటు' అని అంటారు.

10. లోక్‌సభలో అధికారికంగా గుర్తింపు పొందిన తొలి ప్రతిపక్ష నేత ఎవరు?
    1) జె.బి. కృపలానీ 2) మొరార్జీ దేశాయ్
    3) చరణ్‌సింగ్ 4) వై.బి. చవాన్

జ. 4;
వివరణ: పార్లమెంట్‌లో ఒక పార్టీకి ప్రతిపక్ష హోదా లభించాలంటే ఆయా సభలో 10 శాతం సీట్లను గెలుచుకోవాలి. తొలిసారిగా 1977లో జనతాపార్టీ మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా 154 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ప్రతిపక్షంగా గుర్తించబడింది. కాంగ్రెస్ నేత వై.బి.చవాన్ అధికారికంగా ప్రతిపక్షనేతగా గుర్తింపు పొందాడు. అదే సంవత్సరం (1977)లో కమలాపాటి త్రిపాఠి రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాడు.

11. లోక్‌సభకు తొలిసారిగా మధ్యంతర ఎన్నిక ఎప్పుడు జరిగింది?
    1) 1967 2) 1971
    3) 1977 4) 1980

జ. 2;
వివరణ: సాధారణంగా లోక్‌సభ కాల పరిమితి 5 సంవత్సరాలు. కానీ ప్రధాని సలహా ప్రకారం దానిని ముందే రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఆ సందర్భంలో నిర్వహించే ఎన్నికను మధ్యంతర ఎన్నికలు అంటారు. 1967లో జరిగిన నాలుగో లోక్‌సభను ఒక సంవత్సరం ముందు 1971లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ సలహాపై రాష్ట్రపతి వి.వి. గిరి రద్దు చేశాడు. ఈ విధంగా తొలిసారిగా 1971లో మధ్యంతర ఎన్నిక జరిగింది. అనంతరం 1980లో రెండోసారి మధ్యంతర ఎన్నిక జరిగింది. లోక్‌సభకు 17 సార్లు ఎన్నికలు జరిగితే ఇందులో 7 సార్లు మధ్యంతర ఎన్నికలు (1971, 1980, 1984, 1991, 1998, 1999, 2004) జరిగాయి.

12. ఎంపీల్యాడ్స్ స్కీమ్ కింద ఒక్కొక్క ఎం.పి.కి సంవత్సరానికి నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని కోట్లు ఇస్తున్నారు?
    1) 1 2) 3 3) 5 4) 10

జ. 3;
వివరణ: పీవీ నరసింహారావు భారత ప్రధానిగా ఉన్నప్పుడు 1993లో ఎంపీల్యాడ్స్ స్కీమ్‌ను ప్రారంభించారు. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్‌గా పిలిచే దీని కింద 1993లో ఒక్కొక్క ఎంపీకి నియోజవర్గ అభివృద్ధికి సంవత్సరానికి 5 లక్షలు కేటాయించారు. దీనిని 1994లో 1 కోటి, 1998లో 2 కోట్లు, 2011 నుంచి 5 కోట్లకు పెంచారు.

13. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన భారత ప్రధానులు ఎంతమంది ఉన్నారు?
    1) 2 2) 3 3) 4 4) 5

జ. 2;
వివరణ: పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పార్లమెంట్ విలువలను పెంపొందించిన వ్యక్తులకు మాజీ హోంశాఖ మంత్రి పండిత్ గోవింద్ వల్లభ్ పంత్ పేరు మీద ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును 1993 నుంచి ఇస్తున్నారు. ఈ అవార్డును 1993లో ఇంద్రజిత్ గుప్తా పొందగా చివరగా 2017 సంవత్సరానికి భర్తృహరి మహతాబ్‌కు లభించింది.

ఈ అవార్డును ముగ్గురు ప్రధానమంత్రులు పొందారు. వారు అటల్ బిహారీ వాజ్‌పాయ్ (1994), చంద్రశేఖర్ (1995), మన్మోహన్ సింగ్ (2002).

14. ఇప్పటి వరకు లోక్‌సభకు 18 సార్లు ఎన్నికలు జరగ్గా అతి ఎక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ ఎన్నోది?
    1) 3 2) 5 3) 7 4) 9

జ. 2;
వివరణ: ఐదో లోక్‌సభ 1971లో ఏర్పడింది. దీని పదవీ కాలం 1976 వరకు ఉంది. కానీ ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975లో ఎమర్జెన్సీ విధించాక, 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా 5వ లోక్‌సభ కాల పరిమితిని ఒక సంవత్సరం అంటే 1977 వరకు పొడిగించారు.

అదే విధంగా అతి తక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ 12వ లోక్‌సభ. ఇది కేవలం 13 నెలలు(1998-99) మాత్రమే కొనసాగింది. లోక్‌సభ కాల పరిమితిని పెంచే అధికారం పార్లమెంట్‌కు ఉండగా, దానిని ముందే రద్దుచేసే అధికారం రాష్ట్రపతికి ఉంది.

15. పార్లమెంట్ సభ్యులు ఎన్ని రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలకు హాజరు కాకుంటే సభ్యత్వం రద్దు అవుతుంది?
    1) 30 రోజులు 2) 60 రోజులు
    3) 3 నెలలు 4) 6 నెలలు

జ. 2;
వివరణ: పార్లమెంట్ సభ్యుడు 60 రోజుల పాటు సభాధ్యక్షుని అనుమతి లేకుండా సభకు గైర్హాజరు అయితే సభ్యత్వం కోల్పోతాడు. 1976-77లో తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్య స్వామి ఈ విధంగానే రాజ్యసభ సభ్యత్వం కోల్పోయాడు.

అదే విధంగా పార్లమెంట్ సభ్యుడు పార్టీ ఫిరాయింపుకు పాల్పడితే సభాధ్యక్షుడు అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు. అతని ఎన్నిక చెల్లదు అని హైకోర్టు లేదా సుప్రీంకోర్టు తీర్పునిస్తే రాష్ట్రపతి అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు.

16. రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా పార్లమెంట్ ఏ సందర్భంలో శాసనాలు రూపొందించవచ్చు?
    1) జాతీయ ప్రయోజనం
    2) రెండు రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనం కోసం
    3) అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు
    4) పై అన్నీ సందర్భాల్లో

జ. 4;
వివరణ: ఆర్టికల్-249 ప్రకారం జాతీయ ప్రయోజనం దృష్ట్యా రాష్ట్ర జాబితాలోని అంశంపై శాసనం చేయాలని రాజ్యసభ 2/3వ వంతు మెజారిటీతో తీర్మానం చేసినప్పుడు పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశంపై కూడా శాసనం చేయవచ్చు.

ఆర్టికల్-250 ప్రకారం అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు కూడా రాష్ట్ర జాబితాలోని అంశంపై కూడా పార్లమెంట్ చట్టం చేయవచ్చు.

ఆర్టికల్-252 ప్రకారం రెండు లేదా ఎక్కువ రాష్ట్రాలు తమ ఉమ్మడి ప్రయోజనం కోసం రాష్ట్ర జాబితాలోని అంశంపై చట్టం చేయాలని కోరితే పార్లమెంట్ చట్టం చేస్తుంది.

17. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్యను ఏ సంవత్సరం వరకు మార్చకూడదు?
    1) 2025 2) 2026
    3) 2030 4) 2035

జ. 2;
వివరణ: 84వ రాజ్యాంగ సవరణ చట్టం (2001) ద్వారా ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను 2026 వరకు మార్చకూడదని పేర్కొన్నారు. నియోజక వర్గాలను పునర్విభజించటానికి పై సవరణ ద్వారా 4వ డీలిమిటేషన్ కమిషన్‌ను జస్టిస్ కుల్‌దీప్ సింగ్ నేతృత్వంలో వేసినప్పుడు ఈ అంశాన్ని చేర్చారు. వాస్తవానికి ప్రారంభంలో లోక్‌సభ సభ్యుల సంఖ్య 489 ఉండేది. దానిని 1956లో 525కి, 1973లో 552కి పెంచారు. ఇది 2026 వరకు కొనసాగుతుంది.

18. భారత పార్లమెంట్ సమావేశాలు దేనితో ప్రారంభమవుతాయి?
    1) శూన్య సమయం
    2) ప్రశ్నోత్తరాలు సమయం
    3) అరగంట చర్చ 4) సావధాన తీర్మానం

జ. 2;
వివరణ: పార్లమెంట్ సమావేశాలు ప్రతిరోజూ ప్రశ్నోత్తరాల సమయంతో ప్రారంభమవుతాయి. ఇది ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో ఉంటుంది. ప్రశ్నలు 3 రకాలు.

1. నక్షత్రపు గుర్తు ప్రశ్నలు: వీటికి 10 రోజుల ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. దీనికి మంత్రులు మౌఖికంగా సమాధానం చెప్పాలి.

2. నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలు: వీటికి కూడా 10 రోజుల ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. దీనికి మంత్రులు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి.

3. స్వల్ప వ్యవధి ప్రశ్నలు: అతి ముఖ్య విషయాలపై 3 నుంచి 10 రోజుల లోపు ముందస్తు అనుమతితో సభ్యులు ప్రశ్నలు అడగవచ్చు.

శివాజీ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?



బోధనా పద్ధతులు

1. కుదించిన బోధనా ఉద్యమం అని దేనికి పేరు?
   1) పరిహార బోధన 2) సూక్ష్మబోధన
   3) స్థూల బోధన 4) జట్టు బోధన
2. డేవిడ్ వార్విక్ ప్రకారం జట్టు బోధనకు అవసరమైన నాలుగు ఉపగమాల్లో రెండోది?
   1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
   2) సంచయన క్రమానుగతం
   3) ఏకకేంద్ర ఉపగమం
   4) సమవర్తిత విషయాలు
3. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి జూన్‌లో కురిసిన వర్షపాతానికి సంబంధించిన వివరాలను సేకరించాడు. వాటిని సుదీర్ఘంగా పరిశీలించి యథార్థాలను చెప్పగల్గడం అనేది ఏ రకమైన దృక్పథం?
   1) నిగమనాత్మక 2) సంశ్లేషణాత్మక
   3) విశ్లేషణాత్మక 4) ఆగమనాత్మక
4. 'గోల్కొండ కోట' అనే మూలాధారం ఏ రకానికి సంబంధించింది?
   1) వాఙ్మయ 2) సాంప్రదాయ
   3) పురావస్తు 4) శాసన
5. 'బిల్లు చట్టంగా మారడం' అనే పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉత్తమ పద్ధతి?
   1) పానెల్ చర్చ 2) సింపోజియం
   3) స్వయం అధ్యయనం
   4) అనుకరణ పార్లమెంట్
6. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
   1) చర్చ 2) సంశ్లేషణ
   3) విశ్లేషణ 4) వాగ్వాదం
7. ప్రత్యక్ష, పరోక్ష సమాచారాన్ని పొందడానికి అవకాశమిచ్చే దృక్పథాలు వరుసగా?
   1) ఆగమన, నిగమన దృక్పథాలు
   2) ఆగమన, విశ్లేషణ దృక్పథాలు
   3) నిగమన, సంశ్లేషణ దృక్పథాలు
   4) నిగమన, ఆగమన దృక్పథాలు
8. సమస్యా పరిష్కారంలో సమస్యను నిర్వచించిన తర్వాత చేయాల్సిన పని?
   1) సమస్యను విశ్లేషించి పరిష్కారం కనుగొనడం
   2) సమాచారాన్ని సేకరించి, సమస్యను విశ్లేషించడం
   3) సమాచారాన్ని సేకరించి, అన్వయించడం
   4) సమస్యను విశ్లేషించి, సమాచారాన్ని సేకరించడం
9. 'బ్రౌడి' ప్రకారం బోధనా పద్ధతి అంటే?
   1) కృత్యాలను తరగతి గదిలో నిర్వహించే విధానం
   2) సామాన్యంగా పిలిచే వరస క్రమ చర్యల లాంఛన స్వరూపం
   3) అభ్యసన ప్రక్రియను నిర్దేశించడానికి ఉపాధ్యాయుడు అనుసరించే విధానం
   4) విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేయడానికి ఉపాధ్యాయుడు అనుసరించే మార్గం
10. విషయ సామగ్రి సేకరణలో ద్వితీయ ఆకారానికి చెందినవి?
    1) దస్తావేజులు 2) పాఠ్యపుస్తకాలు
    3) పత్రికలు 4) నాణేలు
11. విద్యార్థులతో పంచదార ఫ్యాక్టరీని సందర్శింపజేయడం అనే ప్రక్రియ ఏ బోధనా పద్ధతిలో ఒక భాగం?
    1) సమస్యా పరిష్కార పద్ధతి
    2) సాంఘిక ఉద్గార పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
12. కిందివాటిలో 'నాటకీకరణ' ద్వారా బోధించడానికి అత్యంత అనువైన పాఠ్యాంశం ఏది?
    1) వేములవాడ 2) ఆకాశవాణి
    3) మనదేశం 4) ఉత్తరాల బట్వాడ
13. 'ప్రాజెక్టు పద్ధతి' సోపానాల్లో మూడోది?
    1) ప్రాజెక్టు నిర్వహణ
    2) ప్రాజెక్టు ప్రణాళికా రచన
    3) నమోదు చేయడం
    4) ప్రాజెక్టు ఎంపిక, ఉద్దేశ వివరణ
14. ఏ పాఠాన్ని బోధించడానికి పరిసరాన్ని ఒక ఉపగమంగా ఉపయోగించవచ్చు?
    1) సేవాసంస్థలు 2) శీతోష్ణస్థితి
    3) ఆర్యుల నాగరికత
    4) హక్కులు బాధ్యతలు
15. 'రామాయణం' ఏ రకానికి చెందిన ఆధారం?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
16. జట్టు బోధన రూపకల్పనకు డేవిడ్ వార్విక్ సూచించిన ఉపగమాలేవి?
    1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, పరిసర ఉపగమం, క్రమానుగత ఉపగమం, సమవర్తిత విషయాలు
    2) యూనిట్ ఉపగమం, వర్తులాకార ఉపగమం, క్రమానుగత ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం
    3) వర్తులాకార ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం, సమవర్తిత విషయాలు, క్రమానుగత ఉపగమం
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, సమవర్తిత విషయాలు, సంచయన క్రమానుగతం, ఏకకేంద్ర ఉపగమం
17. సూక్ష్మ బోధనా ప్రక్రియలోని సోపానాల క్రమం?
    1) పరిపుష్టి, నియోజనం, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    2) నియోజనం, పరిపుష్టి, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    3) పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి, నియోజనం, బోధించడం, పరి పుష్టి
    4) నియోజనం, బోధించడం, పరిపుష్టి, పునఃయోజన, పునఃబోధన, పునః పరిపుష్టి
18. 'బెల్లార్డ్' అభిప్రాయంలో ప్రాజెక్టు పద్ధతి అంటే?
    1) పాఠశాల వాతావరణంలోకి తీసుకు వచ్చిన జీవితాశయమే ప్రాజెక్టు
    2) సహజ పరిస్థితిలో ఒక సమస్యాత్మక క్రియను జయప్రదంగా పూర్తిచేయడమే ప్రాజెక్టు
    3) నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు
    4) సాంఘిక పరిసరాల్లో, హృదయ పూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు
19. చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?
    1) సమస్య, విషయం, గ్రూపు
    2) సమస్య, విషయం
    3) నాయకుడు, గ్రూపు, విషయం
    4) సమస్య, విషయం, నాయకుడు, గ్రూపు
20. రాష్ట్ర మంత్రిమండలి బాధ్యతలను బోధించడానికి స్థానిక గ్రామ పంచాయతీ పనిచేసే విధానం గురించి చర్చించడం అనేది ఏ బోధనా సూత్రానికి సంబంధించింది?
    1) తెలిసినదాని నుంచి తెలియనిదానికి
    2) సంక్లిష్టత నుంచి సరళతకు
    3) అమూర్తం నుంచి మూర్తానికి
    4) భాగాల నుంచి మొత్తానికి
21. ట్రాఫిక్ ఐలాండ్ అనే పాఠాన్ని బోధించడానికి ఉత్తమ యుక్తి?
    1) చర్చ 2) క్షేత్ర పర్యటన
    3) పాత్రాభినయం 4) నాటకీకరణ
22. సమస్యా పరిష్కార పద్ధతిలో ఉన్న సోపానాల్లో రెండోది?
    1) సమస్య అధ్యయనం
    2) సమాచార సేకరణ
    3) సమస్యను గుర్తించడం
    4) సమస్య పరిష్కారం
23. 'నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు' అని నిర్వచించిన వ్యక్తి?
    1) స్టీవెన్సన్ 2) కిల్ పాట్రిక్
    3) అండర్సన్ 4) బైనింగ్ & బైనింగ్
24. 'అయిదో తరగతి పరిసరాల విజ్ఞానం' అనే పాఠ్యపుస్తకం ఏ ఆకారానికి ఉదాహరణ?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
25. శివాజీ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) అంశ పద్ధతి 2) కథనా పద్ధతి
    3) వివరణ 4) సంభాషణ
26. స్వయంగా విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం లేని పద్ధతి?
    1) ఉపన్యాస 2) చర్చా
    3) అంశాల పద్ధతి 4) జీవిత చరిత్ర
27. సాంఘికశాస్త్ర బోధనా పద్ధతుల్లో విద్యావేత్తలు దేన్ని ఉత్తమమైందిగా భావిస్తారు?
    1) ప్రణాళికా పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) ప్రశ్నోత్తర పద్ధతి 4) చర్చా పద్ధతి
28. బోధనా పద్ధతుల్లో అతి ప్రాచీనమైంది?
    1) లెక్చరు పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) సంఘీకీకృత ఉద్గార
    4) సమస్యా పద్ధతి
29. తక్కువ కాలంలో ఎక్కువ విషయాలను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సంఘీకీకృత ఉద్గార
    4) వనరుల పద్ధతి
30. విద్యార్థులకు స్వానుభవం ద్వారా విషయ జ్ఞాన సంపాదనకు తోడ్పడేది?
    1) సమస్యా పద్ధతి
    2) ఉపన్యాస పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి
    4) చర్చా పద్ధతి
31. బోధించిన విషయాలను తక్కువ సమయంలో సమీక్షించడానికి ఉపయోగపడే బోధనా పద్ధతి?
    1) ఉపన్యాస పద్ధతి
    2) వివరణ పద్ధతి
    3) కథనా పద్ధతి
    4) ప్రాకల్పనా పద్ధతి
32. బోధనలో ఉపన్యాస పద్ధతికి దేన్ని మేళవిస్తే బోధన మరింత మెరుగ్గా ఉంటుంది?
    1) వివరణ పద్ధతి
    2) ప్రదర్శనా పద్ధతి
    3) సమస్యా పద్ధతి
    4) వనరుల పద్ధతి
33. విద్యార్థికి ప్రాముఖ్యంలేని బోధనా పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సమస్యా పద్ధతి
    4) ప్రాకల్పనా పద్ధతి
34. సాంఘికశాస్త్ర బోధనలో విద్యార్థులకు కలిగే సంశయాలను తీరుస్తూ పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉపయోగించే పద్ధతి?
    1) ఉపన్యాస 2) పర్యవేక్షణ
    3) చర్చాపద్ధతి 4) సమస్యా పద్ధతి
35. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులందరూ శ్రమించి నేర్చుకోవడాన్ని ఏ బోధనా పద్ధతి అనవచ్చు?
    1) ప్రాజెక్టు 2) వనరుల పద్ధతి
    3) సంఘీకీకృత 4) పర్యవేక్షణాధ్యయన
36. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?
    1) తృతీయ 2) చతుర్థ
    3) ప్రాథమిక 4) ద్వితీయ
37. రెండు వరుస పీరియడ్ల పథకంలో బిల్ ఐ.సింప్సన్ ప్రకారం 'నియోజిత అధ్యయనం' అనే కార్యకలాపానికి కేటాయించిన వ్యవధి?
    1) 35 నిమిషాలు 2) 25 నిమిషాలు
    3) 20 నిమిషాలు 4) 30 నిమిషాలు
38. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
    1) వాగ్వాదం 2) చర్చ
    3) సంశ్లేషణ 4) విశ్లేషణ
39. ఏ బోధనా పద్ధతితో 'మోడరేటర్' ఆవశ్యకత ఉంది?
    1) జట్టుబోధన 2) సమస్యా పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
40. 'జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రం ఆధారంగా రూపొందించిన పద్ధతి?
    1) జట్టు బోధన 2) చర్చ
    3) సమస్యా పరిష్కారం
    4) ప్రాజెక్టు
41. జట్టు బోధన రూపకల్పనలో నాలుగు ఉపగమాలను సూచించినవారు?
    1) కిల్ పాట్రిక్ 2) మాక్స్‌వెల్
    3) కిల్లర్ 4) డెవిడ్ వార్విక్
42. ప్రాజెక్టుల రకాలను సూచించిన వారెవరు?
    1) జాన్ డ్యూయి 2) కిల్ పాట్రిక్
    3) బైనింగ్ 4) బెల్లార్డ్
43. ఒక అంశానికి ఉన్న పూర్వచరిత్ర చెప్పడానికి ఏ పద్ధతి ప్రయోజనకరంగా ఉంటుంది?
    1) ప్రాజెక్టు 2) సమస్యా పరిష్కార
    3) ఉపన్యాస 4) ప్రాకల్పనా
44. ఉపన్యాస పద్ధతిని ఎప్పుడు ఉపయోగించాలి?
    1) సింహావలోకనం చేయడానికి
    2) సారాంశాన్ని తయారుచేసి పాఠ్యాంశాన్ని సమీక్షించడానికి
    3) అభిమానులను ఉద్దేపించడానికి
    4) పైవన్నీ
45. విద్యార్థులు 'జీవించడానికి నేర్చుకోకుండా జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రంపై ఆధారపడే పద్ధతి ఏది?
    1) ప్రక్షేపణ పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) అన్వేషణా పద్ధతి 4) మూలాధార పద్ధతి
46. ప్రాకల్పనా పద్ధతిలోని ప్రధాన సూత్రాల్లో చివరిది?
    1) స్వేచ్ఛా సూత్రం
    2) వాస్తవికతా సూత్రం
    3) ఉద్దేశ సూత్రం
    4) ఉపయుక్తతా సూత్రం

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 3	5) 4
6) 1	7) 1	8) 2	9) 2	10) 3
11) 3	12) 4	13) 2	14) 2	15) 1
16) 4	17) 4	18) 1	19) 4	20) 1
21) 2	22) 2	23) 4	24) 2	25) 2
26) 1	27) 4	28) 1	29) 2	30) 3
31) 1	32) 2	33) 2	34) 2	35) 1
36) 3	37) 1	38) 2	39) 4	40) 4
41) 4	42) 2	43) 3	44) 4	45) 1
46) 4				

బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వానికి ముఖ్య సలహాదారు?

స్వతంత్ర భారతదేశంలో హైదరాబాద్ రాష్ట్రం

ఈ అంశానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. టీఎస్‌పీఎస్సీ గ్రూప్స్ సిలబస్‌లో ఈ అంశాన్ని ప్రముఖంగా పొందుపర్చారు. కాబట్టి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు ఈ అంశాన్ని మూడు భాగాలుగా విభజించుకొని ప్రిపేరవ్వాలి. బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో ఏర్పాటైన మంత్రి వర్గం గురించి ప్రధానంగా అధ్యయనం చేయాలి. 1952లో జరిగిన ముల్కీ ఆందోళనలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. వీటి గురించి తెలుసుకునే క్రమంలో మూడు విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.

అవి..

1. స్థానిక ఉద్యోగాలు – ఒక డిమాండ్.
2. సిటీ కాలేజ్ సంఘటన – ప్రాధాన్యం
3. జస్టిస్ జగన్‌మోహన్ రెడ్డి కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలు.


ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు, ప్రత్యేక తెలంగాణ డిమాండ్, చర్చలు, రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ కమిషన్ (ఎస్సార్సీ) ఆవిర్భావం, కారణాలు, ఎస్సార్సీలోని ప్రధానాంశాలు, సిఫారసుల గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి. వీటితోపాటు చిన్న రాష్ట్రాలు, ఎస్సార్సీపై రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను కూడా అధ్యయనం చేయాలి.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గం

స్వతంత్ర భారతదేశానికి సార్వత్రిక ఎన్నికలు తొలిసారిగా 1952లో జరిగాయి. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఈ ఎన్నికల్లో హైదరాబాద్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజక వర్గం నుంచి గెలుపొందారు. హైదరాబాద్ రాష్ట్ర రాజ్‌ప్రముఖ్ ఉస్మాన్ అలీ ఖాన్ 1952 మార్చి 6న కింగ్ కోఠిలోని తన నివాసంలో బూర్గులతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గం

1. బి.రామకృష్ణారావు – సీఎం
2. బిందు దిగంబర రావు – హోం శాఖ
3. గోపాలయ సుబ్బు క్రిష్ణ మెల్కోటె– ఆర్థిక శాఖ
4. మర్రి చెన్నారెడ్డి – వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ
5. దేవిసింగ్ చౌహాన్ – గ్రామీణాభివృద్ధి శాఖ
6. సి. జగన్నాథరావు – న్యాయశాఖ
7. అన్నారావు ఘనముఖి–పంచాయతీరాజ్
8. పూల్‌చంద్ గాంధీ – ఆరోగ్య, విద్యాశాఖ
9. నవాబ్‌జంగ్ బహదూర్ – పబ్లిక్ వర్క్స్
10. శంకర్ డియో – సామాజిక సేవలు
11. వి.బి.రాజు – సమాచార, ప్రణాళిక, కార్మిక
12. కె.వి.రంగారెడ్డి – అటవీ, కస్టమ్స్, ఎక్సైజ్
13. కొరటికర్ వినాయక రావు – వాణిజ్యం, పరిశ్రమల శాఖ



హైదరాబాద్ రాష్ట్ర మంత్రివర్గ నిర్మాణ, పరిపాలనాపరమైన ముఖ్యాంశాలు

- బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే వరంగల్‌లో గైర్ ముల్కీ(స్థానికేతరులు) ఉద్యమానికి అంకురార్పణ జరిగింది.
- హైదరాబాద్ రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు వి.డి. దేశ్‌ముఖ్ (మరాఠ్వాడ సుబా). ప్రతిపక్ష పార్టీ పేరు 'పీపుల్స్ డెమోక్రటిక్ ఫెడరేషన్'.
- బి. రామకృష్ణారావు కేబినెట్‌లో పనిచేసిన ఏకైక ఆంధ్ర నాయకుడు వి.బి.రాజు. ఆయన సికింద్రాబాద్ శాసనసభ స్థానానికి ఎన్నికయ్యారు.
- టి. హయగ్రీవాచారి అధ్యక్షతన వరంగల్‌లో మొదటి విశాలాంధ్ర మహాసభ 1950లో జరిగింది. హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్రను వెంటనే ఏర్పాటు చేయాలని ఈ మహాసభలో పట్టుబట్టారు.
- శ్రీశ్రీ అధ్యక్షతన 1954లో రెండో విశాలాంధ్ర మహాసభ హైదరాబాద్‌లో జరిగింది.
- 1956లో ఢిల్లీలో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందంలో హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో బి.రామకృష్ణారావు పాల్గొన్నారు. 1956 అక్టోబర్ 31 వరకు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగారు.
- పెద్ద మనుషుల ఒప్పందం తర్వాత 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. బి.రామకృష్ణారావు కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు.

స్థానికులకు ఉద్యోగాలు - ముల్కీ ఉద్యమం (1952)

1948లో పోలీసు చర్య అనంతరం హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. తర్వాత దాదాపు నాలుగేళ్లపాటు హైదరాబాద్ సంస్థానాన్ని స్థానికేతరులే పరిపాలించారు. రెండేళ్లపాటు సైనికపాలన ఉండగా, మరో రెండేళ్లు అధికారులు హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలించారు. ఇంగ్లిష్, తెలుగు స్పష్టంగా రావనే సాకుతో ఈ కాలంలో చాలామంది స్థానికులను ఉద్యోగాల నుంచి తొలగించారు. మద్రాసు నుంచి, బయటి ప్రాంతాల నుంచి చాలా మందిని రప్పించారు. తహశీల్దార్ల నుంచి కార్యదర్శుల వరకు అనేక ఉద్యోగాల్లో స్థానికేతరులనే నియమించారు. ఇలా ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకొని నాలుగేళ్లపాటు పరిపాలన సాగించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు దొంగ ముల్కీ సర్టిఫికెట్‌లను జారీ చేసి బయటి వారిని ఉద్యోగాల్లో నియమించుకున్నారు. ఇక్కడి ప్రజల పట్ల గైర్ ముల్కీలు(స్థానికేతరులు) అహంభావాన్ని ప్రదర్శించి, అవమానపర్చేవారు. ఇక్కడి వారితో అవహేళనగా మాట్లాడేవారు. ఉన్నతస్థాయి అధికారుల వల్ల అనేక అవమానాలకు గురైన స్థానికుల్లో చైతన్యం పెరిగింది. 1951లో ముల్కీల నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఈ సవరణ ప్రకారం వరసగా 15 ఏళ్లపాటు స్థానికంగా నివాసం ఉన్నవారంతా ముల్కీలవుతారు. దీనికి ఏవిధమైన ప్రమాణ పత్రం సమర్పించాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత కేంద్రం మళ్లీ ముల్కీ అర్హతను 12 ఏళ్లకు కుదించింది. దీంతో స్థానికుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

మొదటి సార్వత్రిక ఎన్నికల్లో తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ ప్రజలు భావించారు. 1952లో అధికారంలోకి వచ్చిన బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం సంయమనాన్ని పాటిస్తూ ముల్కీల సవరణల జోలికి పోలేదు. 1952 మార్చిలో బూర్గుల ముఖ్యమంత్రిగా బాధ్యతలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

చేపట్టాక.. ముల్కీ హక్కులను పునరుద్ధరించాలని, విద్యావంతులైన స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేశారు. గైర్ ముల్కీ ఉద్యమం క్రమంగా విస్తృతమైంది. ప్రజల్లో చైతన్యం పెరగడంతో హక్కుల సాధన కోసం ఉద్యమించారు.

గైర్ ముల్కీ ఉద్యమంలో ప్రధానంగా వినిపించిన నినాదం 'మద్రాసీ గో బ్యాక్, ఇడ్లీ సాంబర్–గో బ్యాక్'. 1952 జూన్ 26న వరంగల్‌లో విద్యార్థుల నాయకత్వంలో గైర్ ముల్కీ ఉద్యమం ప్రారంభమైంది. అయిదు రోజులపాటు నిరంతరంగా కొనసాగింది. 1952 జూలై 31న విద్యార్థులంతా కలిసి ఒక తీర్మాన పత్రాన్ని ఆమోదించి, ఆందోళన విరమించారు.

తీర్మాన పత్రంలోని అంశాలు

'దొంగ ముల్కీ పత్రాలతో ఉద్యోగాల్లో ప్రవేశించిన స్థానికేతరులపై విచారణ జరపాలి. ప్రభుత్వం వారిని తొలగించి స్థానికుల నిరుద్యోగ సమస్య తీర్చాలి. ఇక మీదట సరైన రుజువు లేనిదే ముల్కీ సర్టిఫికెట్లు ఇవ్వరాదు' అని ఐక్య విద్యార్థి సంఘం కోరింది.

ఈ తీర్మానాన్ని వరంగల్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ ఎ.బుచ్చయ్య ప్రవేశపెట్టారు. దానికి విద్యార్థులు అంగీకరించేలా కృషి చేశారు. ఆయన కృషి వల్లే హన్మకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఈ తీర్మానానికి అంగీకరించారు. ఈ విధంగా స్థానిక నిరుద్యోగ యువకులు చైతన్యవంతులై తమ హక్కుల సాధన కోసం ఉద్యమించారు. 1952 ఆగస్టు 7న ఖమ్మం ప్రాంతంలో కూడా గైర్ ముల్కీ ఉద్యమం తలెత్తింది. ఈ ఉద్యమాలన్నీ స్థానికులకు జరిగిన అన్యాయాలు, వారు ఎదుర్కొన్న అవమానాలకు వ్యతిరేకంగా జరిగినవే. నాటి తెలంగాణ సమాజంలో ఆవిర్భవించిన ఈ ఉద్యమాలన్నీ చైతన్య స్ఫూర్తితో వచ్చినవే. వీటి వెనుక ఎవరి ప్రోద్బలం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల వారికి, ఇతర రాష్ట్ర ఉద్యోగులకు అవకాశం ఇస్తున్నందుకు; ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇక్కడి పాఠశాలలు, కళాశాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నందుకు నిరసనగా స్థానిక విద్యార్థులు రెండు రోజులపాటు సమ్మె చేశారు. 1952 ఆగస్టు 8న వరంగల్ జిల్లా మానుకోట (మహబూబాబాద్)లో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లకుండా ప్రదర్శనలు చేస్తూ 'బే ముల్కీలు వాపసు పోవాలి' అని నినాదాలు చేశారు. విద్యార్థుల నాయకత్వంలో సంఘటితమై బలమైన ఉద్యమం రూపుదిద్దుకుంది. వరంగల్ విద్యార్థి సంఘం పిలుపు మేరకు ఈ ఉద్యమం పెద్ద ఎత్తున జరిగింది. దీంతో ముల్కీ నిబంధనలను సవరించి, కఠినతరం చేయడానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉందని 1952 ఆగస్టు 10న అన్ని పత్రికల్లో వార్త వచ్చింది.

మాదిరి ప్రశ్నలు

1. హైదరాబాద్ రాష్ట్రంలో తొలిసారిగా ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?
   ఎ) 1952 ఫిబ్రవరి బి) 1950 ఫిబ్రవరి
   సి) 1949 ఫిబ్రవరి డి) 1951 ఫిబ్రవరి
2. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుడు ఎవరు?
   ఎ) జె.ఎన్.చౌదరి బి) ఎం.కె.వెల్లోడి
   సి) నవాబ్‌జంగ్ బహదూర్
   డి) మీర్ అలీఖాన్
3. బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో ఆంధ్రుడైన వి.బి. రాజు ఏ శాఖకు మంత్రిగా వ్యవహరించారు?
   ఎ) కార్మిక, ప్రణాళిక బి) విద్య, ఆరోగ్యం
   సి) సాంఘిక సంక్షేమం డి) పరిశ్రమలు
4. హైదరాబాద్ రాష్ట్ర ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వారు?
   ఎ) బి. రామకృష్ణారావు
   బి) మెల్కోటే సి) రావి నారాయణరెడ్డి
   డి) మర్రి చెన్నారెడ్డి

సమాధానాలు

1) ఎ; 2) బి; 3) ఎ; 4) సి.

What is difference in time taken by flights..



Model Questions

Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below.

Eight persons of the family namely A, B, C, D, E, F, G and H are sitting around a circular table and are discussing about the coming festival for which they wish to bringing sweets to home. Each person wants to bring different-different sweets. Sweets are i.e. Kaju katti, Kalakand, Kheer, Double ka meetha, Rasmalai, Rava laddu, Mysor pak and Obbattu, but not necessarily in the same order. Also some of them facing outside and the remaining facing inside. Not more than two people facing same direction sits adjacent to each other. In family there are three generations. The one who want to bring Kaju katti sits second right of D's husband. D and her husband sit opposite to each other but facing opposite directions. Only one person sits between the one who wants to bring Double ka meetha and the one who wants to bring Kaju katti. A wants to bring Kaju katti and she is the mother of E. F sits immediate left of D's husband and facing outside whereas D's husband facing inside. G wants to bring Mysor pak and sits immediate left of A, who is the wife of B's father and she is also facing outside. G's mother is the wife of E, who sits immediate right of D's husband. C has three children, out of two sons and one daughter. C is grandfather of E's son. E is adjacent to the person, who wants to bring Kaju katti. B, who is the son of D's father, sits second right of F and faces inside. C's son-in-law wants to bring Kalakand. Three persons sit between the one who wants to bring Kaju katti and C, who wants to bring Kheer. D sits fifth right of the one, who wants to bring Rava laddu. C is not facing inside. E's wife wants to bring Obbattu.

1. Which of the following person wants to bring Rava laddu?
   a) A b) D's brother
   c) H d) G's father
   e) Both options (b) and (d)
2. Who is the brother-in-law of B?
   a) The one who wants to bring Rasmalai
   b) The one who wants to bring Kaju katti
   c) The one who sits third right of B
   d) F e) Both (b) and (c)
3. Who sits fourth left of the one, who wants to bring Obbattu?
   a) E b) A c) G
   d) H e) None of these
4. Four of the following five are alike in a certain way and hence they form a group. Which one of the following does not belong to that group?
   a) Obbattu b) Kheer
   c) Kaju katti d) Rasmalai
   e) Double ka meetha
5. Which of the following person sits opposite the one, who wants to bring Kaju katti?
   a) H b) G c) A
   d) E e) None of these

Directions (Q.No. 6-10): Study the following diagram and convert it into other diagrams by implementing the instructions which is given in each step to get next step.

INPUT:

I4	RS2	EK3
AC9	[arrow symbol]	MT7
F8	O5	UL

STEP: 1

Interchange the Alphabets to get step 1 as arrow mention in the above figure.

UL4	O2	F3
MT9		AC7
EK8	RS5	I

STEP: 2

i) If the alphabets contain one consonant and one vowel and the number with them is greater than 3, then subtract 3 from the given number.

ii) If the alphabets are two consonant and the number with them is greater than 5, then change the letters with the previous letter in English alphabetical series.

UL1	O2	F3
NS9		AC4
EK5	RS5	I

STEP: 3 This is coded in some special pattern

EK5	N2	I
UL1		F3
NS9	QR5	AC4

As per the rules followed in the above step, find out the input and answer the following questions.

INPUT:

A5	LM3	FT2
ZU8		BC6
G5	S7	MO

6. Which element comes in step-2 in the second column of third row?
   a) LM7 b) KL7 c) ZU3
   d) AB8 e) None of these
7. Which element replaces AB8 in step-3?
   a) PQ7 b) ZU3 c) FT5
   d) MO2 e) None of these
8. Which element replaces FT5 in step-3?
   a) PQ7 b) ZU3 c) AB8
   d) MO2 e) None of these
9. Which element replaces KL7 in step-3?
   a) JK7 b) ZU3 c) FT5
   d) MO2 e) None of these
10. Which element replaces S3 in step-3?
    a) Q3 b) U3 c) T5
    d) R3 e) None of these

Directions (Q.No.11-15): Study the following information carefully and answer the questions given below:

Six flights of different companies Emirates, Jet - Airways, Indigo, Spicejet, Air - India and Vistara are to be scheduled to fly from Khajuraho to Bangalore starting from 2nd August and ending on 8th August with Sunday being an off day. Each of the flight take different time to reach Bangalore: 40 minutes, 50 minutes, 60 minutes, 75 minutes, 90 minutes and 100 minutes, again not necessarily in the same order. 8th August is not Sunday and a flight which take 40 minutes is scheduled on that day. Emirates take less than 60 minutes and is scheduled immediately before Air -India flight. Indigo flight is scheduled before Spicejet flight. There are two flights scheduled between Vistara which take 100 minutes and Indigo which is for 60 minutes. Air - India is before Sunday and there are two days between Sunday and Emirates flight to fly. Spicejet flight which take 75 minutes is not scheduled on 2nd August. Emirates is not scheduled on even numbered date. The flight scheduled on Saturday takes 100 minutes.

11. Which flight is scheduled on 7th August?
    a) Spice jet b) Indigo
    c) Jet - Airways d) No Flight
    e) None of these
12. How much time a flight take which is scheduled on 4th of August to reach Bangalore?
    a) 60 Minutes b) 90 Minutes
    c) 50 Minutes d) 40 Minutes
    e) 75 Minutes
13. What is difference in time taken by flights which scheduled on Saturday and Monday?
    a) 40 Minutes b) 60 Minutes
    c) 50 Minutes d) 10 Minutes
    e) 25 Minutes
14. Which of the following combination is false?
    I. Friday - Air India - 90 minutes - 4th August
    II. Sunday - Off day - 6th august
    III. Tuesday - Indigo - 60 minutes - 7th August
    a) Only I b) Only II
    c) Only III d) Both II and III
    e) Both I and II
15. Tej's flight is scheduled from Bangalore to Delhi on 3rd August which take 50 minutes to reach Delhi from Bangalore and there are 10 minute to change flight in Bangalore except that there are no delay, then what is minimum time that Tej will take to reach Delhi from Khajuraho?
    a) 120 Minutes b) 150 Minutes
    c) 110 Minutes d) 135 Minutes
    e) None of these

Directions (Q.No.16-20): Study the following information carefully and answer the questions given below:

In a certain code

'SMART LOGIC' is written as '2025 0325',

'BASE MATERIAL IS AVAILABLE' is written as '0516 1904 0581 1264',


'ALMOST ALL QUESTIONS' is written as '1209 2036 1981' and

'PEOPLE ARE EATING MONEY' is written as '0536 0509 0736 2525'.

16. Which of the following is the code for 'MATERIAL'?
    a) 1264 b) 0516
    c) 1204 d) 1281
    e) None of these
17. Which of the following can be coded as '2525'?
    a) PEOPLE b) ARE
    c) EATING d) MONEY
    e) None of these
18. Which of the following is the code for 'basic good enough'?
    a) 0325 0416 0836
    b) 0316 0425 0836
    c) 0352 0466 0864
    d) 0425 0516 0836
    e) None of these
19. What can be the code of 'HARI'?
    a) 0916 b) 0816 c) 1816
    d) 1016 e) None of these
20. What can be the code of 'VISHNU'?
    a) 1916 b) 2036
    c) 2136 d) 1036
    e) None of these

Key with Solutions

(1-5):



1) e; 2) c; 3) c; 4) d; 5) e;

(6-10):

INPUT:

A5	LM3	FT2
ZU8		BC6
G5	S7	MO

STEP: 1

MO5	S3	G2
BC8		ZU6
FT5	LM7	A

STEP: 2

MO2	S3	G2
AB8		ZU3
FT5	KL7	A

For obtaining step 3, we need to rotate Columns 1 and 3 by 1 position, which means that row I in columns 1 and 3 would be new row 2 and row 2 in columns 1 and 3 would be new row 3 and row 3 in columns 1 and 3 would be new row1.

The alphabet of first row second column and third row second column is replaced with the previous alphabet in alphabetical series.

STEP: 3

FT5	R3	A
MO2		G2
AB8	JK7	ZU3

6) b; 7) d; 8) c;
9) a; 10) d;

(11-15):

Date	Days	Flight	Time
2	Wed	Indigo	60
3	Thu	Emirates	50
4	Fri	Air India	90
5	Sat	Vistara	100
6	Sun	Off Day	Off day
7	Mon	Spicejet	75
8	Tue	Jet-Airways	40

11) a; 12) b; 13) e;
14) c; 15) c;

(16-20):

In the code there are four digits in which the first two indicates the numerical value of the last letter of the given word and last two digits indicate the square of the number of letters in the given word.

Ex: SMART

Last letter T=20

Number of letters 5 Þ $5^2 = 25$, so the code is 2025.

16) a; 17) d; 18) a;
19) a; 20) c